www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ఆదివారం | 25-3-2018 | పేజీలు: 20 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: రూ. 6.00 | సంపుటి: 14 సంచిక: 254 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి ఉ. 8.03 తదుపరి నవమి తె 5.54; నక్షత్రం: ఆరుద్ర మ. 2.21 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా. 1.38-3.08; దుర్ముహూర్తం: సా. 4.48-5.36; అమృతఘడియలు: తె. ఉ. 6.25; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.20; సూర్యాస్తమయం: 6.24 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

18 ఏళ్ల వయసులో ఫస్ట్‌క్లాస్ అరంగ్రేటం చేశాడు. తన రెండో మ్యాచ్‌లోనే ట్రిపుల్ సెంచరీతో దేశవాళీల్లో ప్రకంపనలు సృష్టించాడు. 22 ఏళ్ల వయసులోనే తొలి టెస్టు ఆడాడు. సచిన్, ద్రావిడ్, గంగూలీ, లక్ష్మణ్ వంటి దిగ్గజాలు జట్టులో ఉన్నప్పుడే క్లాసిక్ ఆటతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. కానీ, ఎనిమిదేళ్లలోనే అతని అంతర్జాతీయ కెరీర్ ముగిసింది. తనను భారత జట్టు నుంచి దూరం చేసినా.. అతను మాత్రం ఆటకు దూరం కాలేదు. అంతర్జాతీయ క్రికెట్‌లో చోటు దక్కకున్నా.. దేశవాళీల్లో 'ఫస్ట్‌క్లాస్' ఆటతో పరుగుల మోతెక్కిస్తూనే ఉన్నాడు. ఏళ్లు గడుస్తున్నా.. తన అనుభవం కంటే తక్కువ వయసున్న కుర్రాళ్లతోనూ పోటీ పడుతున్న ఆ పోరాట యోధుడు మరెవరో కాదు భారత మాజీ ఓపెనర్ వసీం జాఫర్. గతవారం ఇరానీ కప్‌లో అద్భుత డబుల్ సెంచరీ కొట్టిన జాఫర్.. నలభై ఏళ్ల వయసులోనూ తనలో సత్తా తగ్గలేదని చాటుకున్నాడు.

మిస్టర్ ఫస్ట్‌క్లాస్!



అలుపెరగని కెరటం

మైదాన్
MYDAN
నిజామాబాద్ • ఆదివారం 25 మార్చి 2018

ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం

ముంబై నుంచి టీమిండియాకు చాలా మంది క్రికెటర్లు ప్రాతినిధ్యం వహించారు.. వహిస్తున్నారు. సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్ వంటి వారు దిగ్గజాలుగా ఎదిగారు. దేశ క్రికెట్‌కు అడ్డా వంటి ముంబై నుంచి వచ్చిన మేటి ఓపెనర్లలో ఒకడు వసీం జాఫర్. ఆడింది 31 టెస్టులే అయినా.. నాణ్యమైన ఓపెనర్‌గా అతను తక్కువ కాలంలోనే ఎంతో పేరు సంపాదించుకున్నాడు. అయితే, దాన్ని కాపాడుకోలేక జాతీయ జట్టుకు దూరమైనా దేశవాళీల్లో మాత్రం మెరుపులు మెరిపిస్తూనే ఉన్నాడు. తానున్నాననే విషయాన్ని ఎప్పటికప్పుడు చాటి చెబుతున్నాడు. గతవారం జరిగిన ఇరానీ కప్‌లో విదర్భ తరఫున రెస్టాఫ్ ఇండియాపై 286 పరుగుల క్లాసిక్ ఇన్నింగ్స్‌తో చెలరేగి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు...! 40 ఏళ్ల వయసులోనూ.. అలుపెరగని కెరటంలా దూసుకెళ్తున్న జాఫర్ ఇలాంటి ఆటతీరును కనబరచడం చూస్తే క్రికెట్‌పై అతనికి ఎంత వ్యామోహం ఉన్నదో తెలుస్తుంది..! ఫస్ట్‌క్లాస్ అరంగేట్రం చేసిన 23 ఏళ్ల తర్వాత ఇంతటి అద్భుత ఇన్నింగ్స్‌ను ఆవిష్కరించడం కుర్రాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు..! రెండు రోజులపాటు సాగిన జాఫర్ ఇన్నింగ్స్ క్రికెట్ ప్రేమికులకు విందుభోజనం వడ్డించింది. దీన్ని చూసిన వారికి వసీం కెరీర్ ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు అతని ఆటను గుర్తుకుతెచ్చింది.

పోరాట యోధుడు

నిజానికి కాలి గాయం కారణంగా జాఫర్ గత సీజన్ మొత్తం ఆటకు దూరమయ్యాడు. ఈ వయసులో ఇంకొకరైతే కెరీర్‌ను ముగించే వారే. కానీ, పోరాటయోధుడైన వసీం రెట్టించిన వేగంతో తిరిగొచ్చాడు. తానేంటో మరోసారి చూపించాడు. జాఫర్ అసమాన ఆటను చూశాక.. ముంబై ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా అతని అడుగు జాడల్లో నడవాలంటే ఎలా ఆడాలన్న విషయం యువ ఆటగాడు పృథ్వీషాకి అర్థమై ఉంటుంది. జాఫర్ కెరీర్ మొదలెట్టిన మూడేళ్ల తర్వాత పుట్టిన పృథ్వీషాకు అతనితో కలిసి ఆడడం అదృష్టమనే చెప్పాలి.

ఎట్టి పరిస్థితుల్లోనూ పోరాటాన్ని ఆపని నైజమే నాలుగు పదుల వయసులో జాఫర్‌ను ఇంకా కుర్రాడిలా ఆడేలా చేస్తోంది. 2008లో భారత జట్టు నుంచి ఉద్వాసనకు గురైన తర్వాతి రంజీ సీజన్‌లో జాఫర్ 1260 పరుగులు చేశాడు. అయినా సెలెక్టర్లు అతణ్ణి పట్టించుకోలేదు. అయినా దేశవాళీల్లో తన పరుగుల ప్రవాహాన్ని కొనసాగించాడు. ఒక దశలో తానిక భారత జట్టులోకి తిరిగి రాలేనని కూడా అతనికి అర్థమైంది. అయినా సరే తనను తాను చైతన్యపరుచుకుంటూ..సుదీర్ఘ కాలంగా ఆడుతూనే ఉన్నాడు. క్రికెట్టే అతని లోకం.. ఆటతోనే అతనికి ఆనందం.

నాడు ఫిట్‌నెస్ అడ్డంకి..

నాగ్‌పూర్‌లో జాఫర్ ఇన్నింగ్స్‌ను చూసిన వారికి మునుపటి తరం మరోసారి గుర్తుకొచ్చింది. సంప్రదాయ టెక్నిక్‌ను నమ్ముకొని.. పుస్తకాల్లో ఉన్న షాట్లనే ఆడుతూ.. దుర్భేద్యమైన డిఫెన్స్ చూపుతూ.. చెక్కుచెదరని ఏకాగ్రత, పట్టుదలతో గంటల తరబడి క్రీజులో నిలవడం నాటి తరం క్రికెటర్ల ఆటతీరు. ఇలాంటి గొప్ప నైపుణ్యాలు ఉన్న ఆటగాడిగా టీమిండియాలోకి వచ్చిన జాఫర్... ఎక్కువ కాలం కొనసాగకపోవడం విశ్లేషకులను కూడా ఆశ్చర్యపరిచింది. 18వ ఏట ఆడిన రెండో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లోనే ట్రిపుల్ సెంచరీ చేసిన వసీం కొద్దికాలంలోనే జాతీయ జట్టులోకి వచ్చాడు. 2000లో సౌతాఫ్రికాపై టెస్టు అరంగేట్రం చేశాడు. కానీ, ఎనిమిదేళ్లలోనే అతని అంతర్జాతీయ కెరీర్ ముగిసింది. మొత్తంగా 31 టెస్టుల్లో 34.10 సగటుతో 1944 పరుగులు చేశాడు. దేశవాళీల్లో మెప్పిస్తున్నా, మళ్లీ జాతీయ జట్టులోకి రాకపోవడానికి ప్రధాన కారణం అతని ఫిట్‌నెస్. బ్యాటుతో ఆకట్టుకుంటున్నా.. పేలవ ఫీల్డింగ్ కారణంగా క్రమంగా అతని కెరీర్ మసకబారింది. సెహ్వాగ్, గంభీర్ ఓపెనర్లుగా జట్టులో పాతుకుపోవడం కూడా మరో కారణం. కానీ, కాస్త ఫిట్‌నెస్ మెరుగుపరుచుకొని ఉంటే జాఫర్ మరికొంత కాలం కొనసాగేవాడన్నది విశ్లేషకుల అభిప్రాయం. ఈ విషయంలో ముంబై క్రికెట్‌లో ఒకప్పటి సంప్రదాయాన్ని నిందించాల్సి ఉంటుంది. నాడు బ్యాట్స్‌మెన్ అంటే సెంచరీలు కొట్టడం మీదే దృష్టంతా.. ఫిట్‌నెస్‌కు రెండో ప్రాధాన్యం ఇచ్చేవారు. దీనికి జాఫర్ కూడా మినహాయింపు కాదు. కాకపోతే.. మారిన పరిస్థితులకు తగ్గట్టు తమను తాము మార్చుకున్న క్రికెటర్లు ముందుకెళ్లారు. అయితే... మొక్కై వంగనిదే.. అన్నట్టు అంతర్జాతీయ స్థాయికి వచ్చాక కూడా ఫిట్‌నెస్ మెరుగుపరుచుకోలేకపోయాడు వసీం. ఫలితమే తక్కువ కాలంలోనే కెరీర్ ముగింపు.

జాఫర్ కెరీర్

	మ్యా.	ప.	సెం.	టా.స్కో
టెస్టులు	31	1944	5	212
వన్డేలు	2	10	0	10
ఫస్ట్‌క్లాస్	242	18110	53	314*
లిస్ట్-ఎ	100	4289	10	178*
టీ-20	23	616	0	95



గమనిక- మ్యా:మ్యాచ్‌లు; ప:పరుగులు; సెం:సెంచరీలు; టా.స్కో: టాప్‌స్కోరు

ఇక ఆడించాలి..

జాఫర్ 242 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 50.84 సగటుతో 18,100 పరుగులు చేశాడు. అందులో 53 సెంచరీలు, 86 అర్ధ శతకాలు ఉన్నాయంటే అతనెంత నాణ్యమైన ఆటగాడో తెలుస్తుంది. దేశవాళీల్లో దాదాపు అన్ని ప్రధాన టోర్నీల్లోనూ అత్యధిక పరుగులు చేశాడతను. దూరదృష్టి కలిగిన జాఫర్...ప్రతీసారి మెరుగైన ప్రదర్శన చేయాలని కోరుకుంటాడు. మరీ ముఖ్యంగా ఇతర ఆటగాళ్లకు సాయం చేయడం కోసం ఎక్కువ సమయం కేటాయిస్తాడతను. అంతెందుకు ఇరానీ కప్ మాత్రమే కాదు విదర్భ రంజీ ట్రోఫీ నెగ్గడంలోనూ జాఫర్‌ది కీలక పాత్ర. సుదీర్ఘ కాలం జాఫర్ ఆటను చూసిన అతని అభిమానులు ఇకపై అతను కుర్రాళ్లను ఆడిస్తుంటే వీక్షించాలని కోరుకుంటున్నారు. ఆటనే శ్వాసించే వసీంకు.. క్రికెట్ తప్ప వేరే వ్యాపకమే లేదు. రెండో ఇన్నింగ్స్‌లోనూ క్రికెట్‌తో మమేకం కావాలని అతనూ కోరుకుంటున్నాడు. ఎందుకంటే జాఫర్ అంటే క్రికెట్ మరి!

- జాఫర్ తన కెరీర్‌లో 53 ఫస్ట్‌క్లాస్ సెంచరీలు చేశాడు. అందులో తొమ్మిది డబుల్ సెంచరీలు ఉన్నాయి. 2009లో ఎనిమిదో డబుల్ సెంచరీ చేసిన అతను.. 9 ఏళ్ల విరామం తర్వాత చివరి డబుల్ సాధించాడు.
- విదర్భ రంజీ ట్రోఫీ నెగ్గడంలో జాఫర్‌ది కీలక పాత్ర. ఈ సీజన్‌లో అతను 9 మ్యాచ్‌లు ఆడి 595 పరుగులు చేశాడు. సగటు 54.09.
- కొన్నేళ్ల కిందట విదర్భకు తరలిరాక ముందు జాఫర్ సుదర్ఘీ కాలం ముంబై జట్టుకు ఆడాడు. ఆ జట్టు తరపున 130 మ్యాచ్‌ల్లో 10,585 పరుగులు చేశాడు.
- కేవలం రంజీ ట్రోఫీలోనే అతను రికార్డు స్థాయిలో 10,665 పరుగులు సాధించాడు. అందులో 36 సెంచరీలు ఉన్నాయి.
- మొత్తం 31 టెస్టులాడిన జాఫర్.. 34.10 సగటుతో 1944 పరుగులు చేశాడు. అతని ఖాతాలో ఐదు సెంచరీలు, రెండు డబుల్ సెంచరీలు ఉన్నాయి.

గెలుపు కోసం చివరి వరకు పోరాడేతత్వం అతనిది. అదే అతణ్ణి ఆసియా పవర్ లిఫ్టింగ్ టోర్నీలో రికార్డులు నెలకొల్పేలా చేసింది. ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ గేమ్స్‌లోనూ దేశానికి బంగారు పతకాన్ని అందించేందుకు స్ఫూర్తినిచ్చింది. 1999 నుంచి 2007 వరకు సీనియర్ నేషనల్స్, ఫెడరేషన్ కప్ టోర్నీల్లో వరుసగా తొమ్మిది సార్లు విజేత టైటిల్ సొంతం చేసుకున్న ఆ 'పవర్' లిఫ్టర్... సకల కోటేశ్వరరావు. ఆటగాడిగా అనేక విజయాలు ఖాతాలో వేసుకున్న కోటేశ్వరరావు ఇప్పుడు కోచ్‌గానూ ఈ ఆటలో తనదైన ముద్ర వేస్తున్నాడు.

పవర్‌ఫుల్ కోటేశ్వరరావు!

◆ నాడు పవర్ లిఫ్టర్‌గా మెరుపులు ◆ నేడు కోచ్‌గా విజయాలు



శిష్యురాలు చంద్రికతో...

ఏదీ ప్రోత్సాహం?

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు తగిన ప్రోత్సాహమే లేదు. లిఫ్టర్లు సొంత ఖర్చులతో పోటీల్లో పాల్గొనాల్సిన పరిస్థితి. క్రీడాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఐరన్ స్పోర్ట్స్‌గా పేరొందిన ఈ క్రీడలో రాణించాలంటే మెరుగైన శిక్షణతో పాటు శారీరక దృఢత్వం ముఖ్యం. అందుకు, మంచి పౌష్టికాహారం తీసుకోవాలి. దానికి చాలా ఖర్చవుతుంది. ప్రతిభ ఉన్నప్పటికీ ఖర్చు భరించే స్థోమత లేక చాలామంది లిఫ్టర్లు వెనకడుగు వేస్తున్నారు. ఇక, ఇతర దేశాలతో పోల్చితే మనకు మౌలిక సదుపాయాలు, అధునాతన పరికరాలు లేవు. అలాగే చీఫ్ కోచ్‌తో పాటు డెడ్ లిఫ్టు, బెంచ్‌ప్రెస్, స్నాచ్ ఈవెంట్లకు వేర్వేరుగా విదేశాల్లో వేర్వేరు కోచ్‌లను నియమిస్తారు. దీంతో లిఫ్టర్లను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దడంలో ఫలితాలు సాధిస్తున్నారు. ఇక్కడ కూడా ఆ విధానాన్ని అమలు చేయడంతో పాటు క్రీడాకారులకు ఆర్థిక చేయూతనిచ్చి, సదుపాయాలు కల్పిస్తే పతకాలు వస్తాయి.


-కోటేశ్వరరావు

(విశాఖపట్నం-స్పోర్ట్స్)

విశాఖపట్నం టౌన్ కొత్తరోడ్డు ప్రాంతానికి చెందిన కోటేశ్వరరావుకు చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి. 17 ఏళ్ల వయసులో ఇంటికి సమీపంలోని విజయాంధ్ర వ్యాయామ మండలిలో చేరి వెయిట్ లిఫ్టింగ్ సాధన మొదలుపెట్టాడు. కోచ్ తరచూ గైర్హాజరు కావడంతో నిరాశ చెంది అదే వ్యాయామ మండలిలోని పవర్ లిఫ్టింగ్ క్రీడకు బదిలీ అయ్యాడు. అదే అతని జీవితాన్ని మలుపు తిప్పింది. కోచ్ సంజీవి వద్ద రోజుకు నాలుగు గంటలపాటు పట్టుదలతో సాధన చేసిన అతను పవర్ లిఫ్టింగ్‌లో మెళకువలు నేర్చుకున్నాడు. తల్లిదండ్రులు నారాయణమ్మ, శంకరరావుల ప్రోత్సాహం తోడవడంతో ఈ ఆటనే కెరీర్‌గా ఎంచుకున్నాడు. అలా, తొలిసారిగా ప్రాతినిధ్యం వహించిన రాష్ట్ర స్థాయి (హైదరాబాద్), జాతీయ స్థాయి (లక్నో) పోటీల్లోనే పసిడి పతకాలు సాధించడంతో కోటేశ్వరరావు వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. 1997లో పోస్టల్ శాఖలో క్రీడా కోటాలో ఉద్యోగం పొందిన అతను 1999 నుంచి 2007 వరకు వరుసగా జాతీయ చాంపియన్‌గా నిలవడం విశేషం. 2004, ఉజ్బెకిస్థాన్‌లో జరిగిన ఆసియా పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో డెడ్ లిఫ్టులో 336 కిలోల బరువెత్తి అప్పటివరకు కజికిస్థాన్ లిఫ్టర్ డిమిత్రి పేరిట ఉన్న రికార్డును తిరగరాశాడు. 2005, కేరళలో జరిగిన ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల డెడ్ లిఫ్టులో 345 కిలోల బరువెత్తి తన రికార్డును తానే బద్దలు కొట్టడం విశేషం.

గురువుగానూ ముద్ర

క్రీడాకారుడిగా దేశానికి ఎన్నో పతకాలు అందించిన కోటేశ్వరరావు అనంతరం కోచ్‌గా మారి వర్ధమాన క్రీడాకారులను తీర్చిదిద్దే పనిలో నిమగ్నమయ్యాడు. 2008లో కోచింగ్ బాధ్యతలు తీసుకున్న అతను.. హనుమంతు గణేష్, శివకుమార్ వంటి అనేక మంది జాతీయ లిఫ్టర్లను తయారుచేస్తున్నాడు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో రాణిస్తున్న అనేక మంది పవర్ లిఫ్టర్లు కోటేశ్వరరావు శిష్యులే కావడం గమనార్హం. ప్రస్తుతం విశాఖలో పోస్టల్ అసిస్టెంట్‌గా ఉద్యోగ విధులు నిర్వహిస్తున్న కోటేశ్వరరావు.. మరోవైపు భారత పవర్ లిఫ్టింగ్ జట్టు చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. న్యూజిలాండ్‌లో 2016లో జరిగిన ఆసియా/ఓసియానియా పవర్ లిఫ్టింగ్ టోర్నీలో పాల్గొన్న భారత జట్టుకు కోచ్‌గా వ్యవహరించాడు. గతేడాది సెప్టెంబరులో దక్షిణాఫ్రికాలో జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో కోటేశ్వరరావు ఆధ్వర్యంలోనే భారత జట్టు పాల్గొనడం విశేషం. ఇందులో భారత లిఫ్టర్లు పది పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొల్లినేని చంద్రిక 84 కిలోల విభాగంలో నాలుగు పసిడి పతకాలు, ఘట్టమనేని సాయి రేవతి 63 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సొంతం చేసుకున్నారు.



గజరాజుతో బంతాట..



పోలో అంటే చాలామందికి తెలిసిన ఆటే. గుర్రాలపై స్వారీ చేస్తూ.. బంతిని గోల్ పోస్టులోకి పంపేందుకు ఆటగాళ్లు పోటీపడడం చాలా ఆసక్తికరంగా కనిపిస్తుంది. అయితే, సర్రున దూసుకెళ్లే గుర్రాలతోనే కాదు.. నెమ్మదిగా ఒక్కో అడుగు వేసే ఏనుగులపై కూర్చొని కూడా ఆడే ఆట ఉంది. దాన్నే ఎలిఫెంట్ పోలో అంటారు. అయితే, సాధారణ పోలోలో అశ్వాలపై ఒకే వ్యక్తి ఉంటే.. గజరాజుపై ఇద్దరు ఉంటారు. ఒకరు ఏనుగుకు మార్గనిర్దేశం చేస్తే.. వెనకాల ఉన్న వ్యక్తి బంతిని ఆడుతుంటాడు. ఇక్కడ కనిపిస్తున్న ఫొటో బ్యాంకాక్‌లో జరుగుతున్న కింగ్ కప్ ఎలిఫెంట్ పోలో టోర్నమెంట్ సందర్భంగా తీసినది. ఈ ఆటను థాయ్‌లాండ్, నేపాల్‌తో పాటు భారత్‌లోనూ ఆడతారు. కాకపోతే మన దేశంలో ఒక్క రాజస్థాన్‌కే పరిమితం.

'ది ఐడియల్ బాస్'

రఫెల్ నడాల్. టెన్నిస్‌కే కాదు క్రీడా ప్రపంచానికే పరిచయం అక్కర్లేని పేరు. ఈ స్పెయిన్ బుల్ తన ఆటతో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానుల్ని సంపాదించుకున్నాడు. స్వదేశం స్పెయిన్‌లో అయితే అతనికి ఫ్యాన్ ఫాలోయింగ్ మామూలుగా ఉండదు. రఫా అంటే ఆ దేశంలో పడి ఛస్తారు. వారి అంచనాలకు తగ్గట్టుగా 31 ఏళ్ల లేటు వయసులోనూ ఘాటైన ఆటతో దూసుకెళ్తున్నాడు. ప్రస్తుతం ఏటీపీ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్నాడు. ఆటే కాకుండా వివాదాలకు దూరంగా ఉండే మంచి మనిషిగా నడాల్‌కు పేరుంది. అందుకే.. అతని లాంటి బాస్ తమకు కావాలని స్పెయిన్‌లో చాలా మంది కోరుకుంటున్నారట. 'ఐడియల్ బాస్'గా ఎవరిని కోరుకుంటున్నారని... ఆ దేశంలో ప్రతీ ఏటా ఒక మానవ వనరుల కంపెనీ సర్వే చేయిస్తుంటుంది. ఇందులో దేశంలో మిగతా క్రీడాకారులను పక్కకు నెట్టి వరుసగా నాలుగోసారి రఫాయే మొదటి స్థానం సాధించడం విశేషం. ఈ సర్వేలో ఏకంగా 34.4 శాతం ఓట్లతో రఫాకు పట్టం కట్టారట. బార్సిలోనా ఫుట్‌బాలర్ ఆండ్రిస్ ఇనిస్టా 21.5 శాతం ఓట్లతో రెండో స్థానం దక్కించుకోగా.. బాస్కెట్ బాల్ స్టార్ పాగాసోల్ 21.2 శాతంతో మూడో స్థానంలో నిలిచాడు. మొత్తానికి, కెరీర్ చరమాంకంలో ఉన్న రఫా.. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత వ్యాపారంపై దృష్టి సారిస్తే అందులోనూ విజయవంతం కాగలడనే అనుకోవాలి మరి.



నడాల్

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

వెల: రూ. 6.00

నిజామాబాద్ సిటీ*

పేజీలు: 20 + 16 + 32
పేజీల ఆదివారం అనుబంధం

సంపుటి: 14
సంచిక: 254

ఆదివారం | 25-3-2018

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



మను భాకర్ 'గోల్డెన్' షూట్

జూనియర్ షూటింగ్ వరల్డ్‌కప్‌లో రెండు స్వర్ణాలు సొంతం 13



లాలూకు జైలు మరో 14 ఏళ్లు 12

దాణా కేసులో 2 వేర్వేరు శిక్షలు

అప్పు పుట్టడం లేదు..

చిన్న సంస్థలకు చుక్కలు చూపిస్తున్న బ్యాంకులు

8 బడా కార్పొరేట్ సంస్థలకే చకచకా రుణాలు 10



14

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే

జీఎస్టీలో ఒకటే శ్లాబు

28 శాతం శ్లాబు రద్దుచేస్తాం

తరతమ భేదాలు అనాదిగా వస్తున్నవే

రాజ్యాంగంపై బీజేపీ దాడి: రాహుల్

కర్ణాటకలో నాలుగో విడత పర్యటన



భద్రాచలానికి కళ్యాణ శోభ

నేడు ఎదుర్కోలు... రేపు కల్యాణం... ఎల్లుండి పట్టాభిషేకం

కల్యాణానికి సీఎం... పట్టాభిషేకానికి గవర్నర్ 8



సభా వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

సకల ఉద్యోగుల మహాసభ నేడే

సమస్యలు నాలుగేళ్లుగా పరిష్కారం కాలేదు

ఎనిమిదేళ్లుగా బదిలీల్లేవు..

పదోన్నతుల్లేవు

స్పందించకపోతే ఏం చేయాలో నిర్ణయిస్తాం


టీఎన్జీవో నేత రవీందర్ రెడ్డి 7

గురుకుల మ్యాథ్స్ టీజీటీ అభ్యర్థుల ఎంపిక 9

805 మందితో జాబితా

ఎక్సైజ్ వెరిఫికేషన్ 28న

పసివాళ్లు.. పాపం



2014 నుంచి వివాహేతర సంబంధాల కారణంగా జరుగుతున్న హత్యల సంఖ్య వేగంగా పెరుగుతోంది.

కుటుంబాల్లో వివాహేతర సంబంధాలు, అనుమానాల చిచ్చు

తల్లిదండ్రుల తప్పులకు బలవుతున్న పిల్లలు

తమ ప్రమేయం లేకుండానే అనాథలవుతున్న అభాగ్యులు

మా డాడీ అంటే నాకు చాలా ఇష్టం. రోజూ నాతో బాగా ఆడుకునేవారు. ఇప్పుడు హైదరాబాద్‌లో హాస్పిటల్‌లో ఉన్నారంకుల్. జ్వరం తగ్గగానే నా కోసం వచ్చేస్తారు.



..వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ భార్య తన భర్తను చంపి జైలుకెళ్తే అమ్మానాన్నల ప్రేమను కోల్పోయి నాయనమ్మ, తాతయ్యల దగ్గర పెరుగుతున్న నాలుగేళ్ల చిన్నారి చెప్పిన మాటలివి! అమ్మ జైలు నుంచి ఎప్పుడొస్తుందో తెలియదు. నాన్న ఇక శాశ్వతంగా రాడన్న నిజమూ తెలియదు. ఈ రోజు కాకపోతే రేపటికైనా.. ఎప్పటికైనా తన కోసం తండ్రి వస్తాడన్న ఆశతో, నమ్మకంతో అమాయకంగా ఆడుకుంటున్న ఆ పాపను చూస్తే ఎంతటి పాషాణ హృదయమైనా కరిగి కన్నీరవుతుంది!!

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ప్రియుడితో కలిసి భర్త సుధాకర్‌రెడ్డిని దారుణంగా చంపింది ఇద్దరు పిల్లలున్న స్వాతి. ప్రియుడి ముఖాన్ని భర్త ముఖంలా తీర్చిదిద్ది, అతణ్ని ఇంటికి తెచ్చుకునేందుకు.. అత్తమామల ఖర్చుతోనే ప్లాస్టిక్ సర్జరీ చేయించబోయి అడ్డంగా దొరికి జైలుపాలైంది. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల సంచలనం సృష్టించిన కేసు ఇది. మధు అనే ప్రబుద్ధుడు తనకు పెళ్లయినా.. మరో మహిళతో సంబంధం పెట్టుకుని, ఆమె ద్వారా ఒక పాపను

మిగతా 8వ పేజీలో...

20 మార్కులకే పాస్

తెలుగులో

స్కూలు ఏదైనా తెలుగు తప్పనిసరి

తెలుగు బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

మూడు దశల పుస్తకాల రూపకల్పన

తెలుగు మాధ్యమేతర బడులపై దృష్టి



హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు మాధ్యమేతర పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు ద్వితీయ భాషగా తెలుగును తప్పనిసరి చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. రాష్ట్రంలోని ఉర్దూ, బెంగాలీ, తమిళం, కన్నడ, హిందీ, మరాఠీ మాధ్యమ పాఠశాలలు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, కేంబ్రిడ్జి సిలబస్ పాఠశాలల్లో సులభతరమైన తెలుగును బోధించేందుకు చర్యలు తీసుకున్నారు. విద్యార్థులకు పెద్ద కష్టం లేకుండా ఉత్తీర్ణతను 20 మార్కులకి పరిమితం చేశారు. మూడు దశల్లో ఓనమాలు, పదాలు, వాక్యాలు రాయడం, చదవడం వచ్చే విధంగా పుస్తకాలు రూపొందించారు. బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతిలో, ప్రాథమికోన్నత

మిగతా 9వ పేజీలో...



కొత్తగా 119 బీసీ గురుకులాలు

వచ్చే విద్యా సంవత్సరం నుంచే

5, 6, 7 తరగతుల్లో ప్రవేశం

బడుల్లో 4 వేల పోస్టులు మంజూరు

సభలో ప్రకటించనున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా 119 బీసీ గురుకుల పాఠశాలల్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం బీసీ సంక్షేమశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించింది. బడ్జెట్‌లో కొత్త గురుకులాల కోసం నిధులు కేటాయించనప్పటికీ అవసరమయ్యే నిధులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త గురుకులాల ఏర్పాటుకు సంబంధించి సీఎం కేసీఆర్ శాసనసభలో ప్రకటన చేసే అవకాశం ఉంది. మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ

మిగతా 9వ పేజీలో...

అసైన్డ్ గొడవలకు చెల్లు!

కొన్నవారికే భూముల క్రమబద్ధీకరణ.. కొనుగోలుదార్లు పేదలైతేనే అవకాశం 11

క్రమబద్ధీకరణ అధికారం కలెక్టర్‌కే.. రీఅసైన్డ్ చట్టానికి శాసనసభ ఆమోదం

డాక్టర్లకు ఏడాది నిర్బంధ సేవ ఎత్తివేత.. డీజీపీల నియామక అధికారం రాష్ట్రానిదే

విత్తన దందా

గ్లైసిల్ విత్తనాల్లో అక్రమార్కుల కొత్తదారులు

ఫిబ్రవరిలోనే గ్రామాలకు నకిలీలు

జోరుగా నకిలీ విత్తనాల విక్రయాలు

అన్నదాతకు అన్నీ కష్టాలే



మంచిర్యాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పంటలో కలుపు బాధలు తప్పుతాయని రైతులు గ్లైసిల్ పత్తి విత్తనాలను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇదే అదనుగా చేసుకొన్న వ్యాపారులు నకిలీ విత్తనాలతో వారిని నట్టేట ముంచుతున్నారు. నకిలీలను నియంత్రించాల్సిన వ్యవసాయశాఖ అధికారులు ఫిర్యాదులు వస్తే తప్ప స్పందించడం లేదు. దీంతో కొందరు వ్యాపారులు బ్రాండెడ్ విత్తనాల ముసుగులో రైతులకు నకిలీలను అంటగడుతున్నారు. గత ఖరీఫ్‌లో జిల్లాలో 80 శాతం మంది రైతులు గ్లైసిల్ విత్తనాలే సాగు చేసినట్లు ప్రభుత్వానికి నివేదికలు అందాయి. ఈ సంవత్సరం మిగతా రైతులు కూడా సాగు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో నిఘా పెంచి గ్లైసిల్ నకిలీలను నియంత్రించకపోతే రైతులు నష్టపోవడంతో పాటు పర్యావరణానికి చేటు జరగడం ఖాయం. ఇక మంచిర్యాల జిల్లాలో గ్లైసిల్ విత్తన దందా జోరుగా కొనసాగుతోంది. ప్రభుత్వ అనుమతి లేని బీటీ-3 పత్తి విత్తనాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన పోలీసులు దాడులు చేసి పట్టుకొని వ్యాపారులపై కేసులు పెడుతున్నారు. అయినా అక్రమ సంపాదనకు అలవాటుపడిన వ్యాపారులు కొత్తదారులు వెతుకుతున్నారు. ఏటా మేలో విత్తన విక్రయాలు ప్రారంభమవుతాయి. కానీ, ఈ సారి ఫిబ్రవరి నుంచే విత్తనాలను పల్లెలకు చేరుస్తున్నారు. ఫిబ్రవరి 28న బెల్లంపల్లిలో కార్లలో తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల నకిలీ విత్తనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. తాజాగా ఈ నెల 15న రాత్రి తాండూర్‌లో ఉప్పు బస్తాల మాటున తరలిస్తున్న 51 క్వింటాళ్ల

మిగతా 5వ పేజీలో...

ఐఐటీకి భరోసా ఏదీ?

సీటు కొట్టిన పేదలకు అందని ఫీజు సాయం

బీటెక్ విద్యార్థులకు మాత్రం ఫీజుల్లో రాయితీ

ఐఐటీ, ఎన్ఐటీల్లో చేరిన వారికి మొండిచెయ్యి

ఉత్తమ ర్యాంకులు సాధించడమే శాపమా?

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకూ దక్కని స్కాలర్‌షిప్‌లు

ఏటా 3 వేల మంది విద్యార్థులకు నష్టం



హైదరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాంత్, ప్రశాంత్ అన్నాదమ్ములు. నల్లగొండకు చెందిన వీరిది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం! ఇద్దరూ జేఈఈలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. శ్రీకాంత్.. ట్రిపుల్ఐటీ-గువహటిలో, ప్రశాంత్.. ఐఐటీ-గాంధీనగర్‌లో చదువుతున్నారు. ఏడాది ట్యూషన్ ఫీజు కోసం ఇద్దరికీ కలిపి ఏడాదికి రూ.3.5 లక్షలు అవుతోంది.! వీరికి అటు కేంద్ర ప్రభుత్వం నుంచి గానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 12వ పేజీలో...



■ ఆర్కే RK

కొత్తపలుకు

సం'కుల' రాజకీయం

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా వస్తుందో లేదో తెలియదు గానీ, అక్కడి రాజకీయాలు సెగలు– పొగలు కక్కుతున్నాయి. అవిశ్వాస తీర్మానం పేరిట ఆయా పార్టీలు తమ తమ పాత్రలను రసవత్తరంగా పోషించాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకువచ్చేందుకు రాజకీయ పార్టీలన్నీ ఏకం కావాలని కోరుతున్న ప్రజలు కూడా పార్టీలవారీగా చీలిపోయారు. 'అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టండి– మీకు కావలసిన ఎంపీల మద్దతును నేను సమీకరిస్తాను' అని ప్రకటించిన జన సేనాని పవన్ కల్యాణ్ ప్రస్తుతానికి మౌనంగా ఉండిపోయారు. ఫైనల్‌గా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగి అవిశ్వాస తీర్మానం నోటీసును అందజేసింది. దీంతో లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చకు అవసరమైన సభ్యుల మద్దతు చేకూరింది. వచ్చే మంగళవారంనాడు సభ సమావేశమైనప్పుడు అవిశ్వాస తీర్మానంపై చర్చను చేపట్టక తప్పని పరిస్థితి! చర్చ జరిగి ఓటింగ్ చేపట్టినంత మాత్రాన నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏమీ పడిపోదు. 'అయినను పోయిరావలె హస్తినకు' అన్నట్టు ప్రజలను ఆకర్షించడానికై ఆయా పార్టీలు శక్తివంచన లేకుండా శ్రమపడుతున్నాయి. ప్రజలలో ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. అవిశ్వాస తీర్మానం చర్చకు వచ్చినంత మాత్రాన ప్రత్యేక హోదా వస్తుందా? అంటే రాదనే చెప్పాలి. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేయలేదని ప్రధాని నరేంద్ర మోదీ సందర్భం వచ్చినప్పుడల్లా చెబుతున్నారంటే ఇక చేయడానికి ఏమీ లేదనే కదా? తాజాగా కొత్త అంశాలు తెర మీదకు వచ్చాయి. అధికార తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా మహా కుట్ర జరుగుతోందనీ, దానికి 'ఆపరేషన్ గరుడ' అని పేరు పెట్టారనీ జరిగిన ప్రచారాన్ని మెజారిటీ ప్రజలు నమ్ముతున్నారు. మిత్రపక్షాలతో సహా ప్రాంతీయ పార్టీలను బలహీనపరచడమే లక్ష్యంగా మోదీ– షా ద్వయం వ్యవహరిస్తున్నందున ఈ ప్రచారాన్ని ప్రజలు కూడా నమ్ముతున్నారు. మహారాష్ట్రలో మిత్రపక్షమైన శివసేనకు ఊపిరి ఆడకుండా చేసే ప్రయత్నం చేశారు. ఇప్పుడు నిన్నటివరకు మిత్రపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీ వంతు వచ్చింది. దీంతో ఎవరు ఎవరితో చేతులు

> **ప్రస్తుతానికి ప్రజలలో చంద్రబాబుపై ఎంతో కొంత సానుభూతి ఉంది. ఒక్కడిని చేసి ఏడిపిస్తున్నారన్న అభిప్రాయాన్ని కూడా పలువురు వ్యక్తంచేస్తున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా ఏడాది వ్యవధి ఉన్నందున అప్పటివరకు ప్రజలలో ఇదే అభిప్రాయం ఉంటుందా? అన్నది ఇప్పుడే చెప్పలేం! ప్రచారం జరుగుతున్నట్టుగా చంద్రబాబుపై కేసులు నమోదైతే ఆయనపై ప్రజలలో మరింత సానుభూతి ఏర్పడే అవకాశం లేకపోలేదు.**

కలుపుతున్నారు? కుట్రలంటూ జరుగుతుంటే అందులో ఎవరి పాత్ర ఎంత? ఎన్నికల నాటికి ఎవరెవరు కలవబోతున్నారు? తనకు వ్యతిరేకంగా మోహరించిన శక్తులను తట్టుకుని చంద్రబాబునాయుడు నిలబడగలరా? లేదా? వంటి విషయాలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. వాటితో పాటు అసలు భారతీయ జనతా పార్టీకి –తెలుగుదేశం పార్టీకి ఎందుకు చెడింది? జన సేనాని పవన్ కల్యాణ్‌కు, తెలుగుదేశం పార్టీకి మధ్య బెడిసికొట్టడానికి కారణమేమిటి? అన్న ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించే పనిలో ప్రజలు కూడా బిజీగా ఉన్నారు.

లక్ష్మీనారాయణకు పగ్గాలు?

ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం తెలుగుదేశం పార్టీకి, బీజేపీకి మధ్య విభేదాలు రావడానికి చాలా కారణాలు ఉన్నాయి. దక్షిణాదిన ముఖ్యమంత్రి చంద్రబాబు బలంగా ఉండటం కమలనాథులకు సహజంగానే ఇష్టం ఉండదు. ఈ కారణంగానే వచ్చే ఎన్నికలలో తమకు 10 లోక్‌సభ స్థానాలు, 50 వరకు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని కాషాయదళం నుంచి తెలుగుదేశం పార్టీపై ఒత్తిడి వచ్చింది. క్షేత్రస్థాయిలో అంతగా బలం లేని బీజేపీకి అన్ని సీట్లు కేటాయిస్తే అవన్నీ వైసీపీ ఖాతాలోకి వెళ్లడం ఖాయమన్న ఉద్దేశంతో ఈ ప్రతిపాదనను చంద్రబాబు నిర్ద్వంద్వంగా తిరస్కరించారని చెబుతున్నారు. దీంతో కేంద్ర పెద్దలు చంద్రబాబును పట్టించుకోవడం మానేశారు. ఇది గ్రహించిన చంద్రబాబు, అసెంబ్లీ స్థానాల పెంపు గురించి కోరకుండా, రాష్ట్రానికి ఇస్తామన్న ప్యాకేజీని అమలుచేయాలని ఒత్తిడి తేవడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం, అందులో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్న అభిప్రాయం ప్రజలలో కలగడంతో చంద్రబాబు రాజకీయ నిర్ణయం తీసుకున్నారు. చంద్రబాబుతో ఎప్పటికైనా ఇటువంటి ప్రమాదం ఉంటుందన్న అభిప్రాయంతో ఉన్న మోదీ– షా ద్వయం ప్రత్యామ్నాయ వ్యూహాలకు పదునుపెట్టింది. ఇందులో భాగంగానే ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డికి కేసుల విషయంలో భరోసా ఇచ్చారని చెబుతున్నారు. అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కూడా అవినీతిపరుడిగా ముద్ర వేయడానికి వ్యూహ రచన చేశారు. ఇలా చేయడం వల్ల జగన్మోహన్‌రెడ్డి మాత్రమే కాదు– చంద్రబాబు కూడా అవినీతిపరుడే అన్న అభిప్రాయానికి ప్రజలు వస్తారనీ, దీంతో దొందూ– దొందే అని ప్రచారం చేసుకోవచ్చునన్నది కమలదళం ఆలోచనగా చెబుతున్నారు. ఈ క్రమంలోనే వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి అడిగినప్పుడల్లా ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ ఇస్తూ వచ్చారు. విజయసాయిరెడ్డి ఎంపీగా ఉన్నందున ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ ఇస్తే తప్పు ఏమిటని కమలనాథులు ప్రశ్నిస్తున్నారు గానీ, బ్యాంకులకు వేల కోట్లు ఎగవేసి లండన్‌లో తలదాచుకుంటున్న విజయ్ మాల్యాకు ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ ఇస్తారా? అంతెందుకు బ్యాంకులకు బకాయిపడి పారిపోయినందుకు మాల్యా రాజ్యసభ సభ్యత్వాన్ని కూడా రద్దు చేశారు కదా? అలాంటప్పుడు పలు కేసుల్లో ఎ–2గా ఉన్న విజయసాయిరెడ్డిని ప్రధానమంత్రి తరచుగా కలుసుకోవడం వల్ల సభ్య సమాజానికి ఏ సందేశం పంపుతున్నట్టు? అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంధిస్తున్న ప్రశ్నలో హేతుబద్ధత ఉంది. ప్రధానమంత్రి అండ ఉందన్న నమ్మకంతోనో ఏమో గానీ చంద్రబాబునాయుడిని బోను ఎక్కించేవరకు తాను ప్రధానమంత్రిని కలుస్తూనే ఉంటానని విజయసాయిరెడ్డి ప్రకటించారు. తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి తాత్సారం చేస్తూ వచ్చిన నరేంద్ర మోదీ ఎప్పుడు పడితే అప్పుడు విజయసాయిరెడ్డిని కలుస్తూ ఉండటంతో తనకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందన్న అభిప్రాయానికి చంద్రబాబు వచ్చారు. అదే సమయంలో జన సేనాని పవన్ కల్యాణ్ తెరపైకి వచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌పై నోటికొచ్చినన్ని ఆరోపణలు చేశారు. దీని వెనుక కూడా మోదీ– షా ద్వయం ఉందని చంద్రబాబు అండ్ కో నిర్ధారణకు వచ్చారు. పవన్ కల్యాణ్.. చంద్రబాబు వ్యతిరేక వైఖరి తీసుకోవడానికి గవర్నర్ నరసింహన్ కారణమనీ, కేంద్ర పెద్దలు గవర్నర్ ద్వారా ఈ ఆపరేషన్ నిర్వహించారనీ తెలుగుదేశం పార్టీ నాయకత్వం భావిస్తోంది. పవన్ కల్యాణ్‌ను ప్రభావితం చేయడం చాలా సులువు అనీ, ఈ విషయం తెలిసిన బీజేపీ పెద్దలు రంగంలోకి దిగి జన సేనాని బ్రెయిన్ వాష్ చేయడానికి పావులు కదిపారన్నది తెలుగుదేశం నాయకుల అభిప్రాయం. పవన్ కల్యాణ్ వెంట ఉండేవారు ఎక్కువ కాలం ఆయనతో కలిసి ప్రయాణం చేయలేరు. 2014 ఎన్నికలలో ఆయనతో ఉన్న ఒక వ్యాపారవేత్తను ఇప్పుడు కదిలిస్తే, పవన్ కంటే జగన్ బెటర్ అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ వ్యాఖ్య చేసిన వ్యక్తికి ఆనాటి ఎన్నికలలో విజయవాడ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడానికి తెలుగుదేశం టికెట్ కేటాయించాలని పవన్ కల్యాణ్ ఒత్తిడి తేవడం గమనార్హం. కాగా, రాష్ట్ర నాయకత్వాన్ని రాజకీయంగా బలహీనపరిస్తే రాష్ట్రానికి అది కావాలని, ఇది కావాలని బేరమాడే శక్తి చంద్రబాబు కోల్పోతారనీ, ఫలితంగా ఆయనను తమ చెప్పుచేతల్లో పెట్టుకోవచ్చునన్నది బీజేపీ నాయకుల ఆలోచనగా తెలుగుదేశం నాయకులు విశ్లేషిస్తున్నారు. అయితే 'డ్యామిట్! కథ అడ్డం తిరిగింది' అన్నట్టుగా జరగబోయే నష్టాన్ని ముందే పసిగట్టిన చంద్రబాబునాయుడు, ప్రతివ్యూహాన్ని రచించి రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని ఆత్మరక్షణలో పడేశారు. ఈ కారణంగానే రాష్ట్రానికి న్యాయం చేశాం– ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ చేశామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెబుతున్నా ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఒక్క శాతం కూడా విశ్వసించడం లేదు. నిజానికి ఇప్పుడు రాష్ట్ర ప్రజలు బీజేపీపై కంటే నరేంద్ర మోదీపై ఎక్కువ కోపంగా ఉన్నారు. చంద్రబాబునాయుడు తమను ధిక్కరించడాన్ని మోదీ– షా ద్వయం జీర్ణించుకోలేకపోతోంది. మిత్రపక్షాలైనప్పటికీ తమకు సామంతులుగా పడి ఉండాలన్నది ఈ ఇరువురు నాయకుల అభిమతంగా ఉంటోంది. అలాంటిది చంద్రబాబు నుంచి ఎదురైన ఈ ప్రతిఘటనతో కంగుతిన్న మోదీ– షా ద్వయం, ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రతివ్యూహ రచన చేపట్టింది. ఈ క్రమంలో జగన్మోహన్‌రెడ్డి కేసులను దర్యాప్తు చేసిన సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ వారి దృష్టిలో పడ్డారట! ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన రాజకీయ పోరు కమ్మ, రెడ్డి సామాజికవర్గాల మధ్య కేంద్రీకృతమై ఉంది. జనాభాపరంగా ఈ రెండు వర్గాల కంటే అధిక సంఖ్యలో ఉన్న కాపులు కూడా రాజ్యాధికారం కోరుకుంటున్నారు. చిరంజీవి రూపంలో గతంలో జరిగిన ప్రయోగం విఫలమయ్యింది. ఇప్పుడు చిరంజీవి తమ్ముడైన పవన్ కల్యాణ్ జనసేనానిగా రంగంలో ఉన్నారు. అయితే చంద్రబాబు– జగన్మోహన్‌రెడ్డిలను ఢీకొట్టి నిలబడటానికి పవన్ కల్యాణ్ బలం సరిపోదన్నది కమలనాథుల అంచనా! వ్యక్తిగతంగా ప్రధాని మోదీని ఇష్టపడే పవన్ కల్యాణ్‌పై మాత్రమే ఆధారపడితే లాభం లేదనుకున్నారో ఏమోగానీ సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణపై కన్నేశారు. ఆయనకు రాష్ట్రంలో మంచి పేరు ఉంది. రానున్న ఎన్నికలలో చంద్రబాబుకు చెక్ పెట్టాలంటే కాపులను చేరదీయాలన్నది బీజేపీ అగ్ర నేతల ఆలోచనగా ఉంది. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ ఈ విషయాన్ని దాచుకోకుండా చెప్పేశారు. లక్ష్మీనారాయణ కూడా కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. లక్ష్మీనారాయణ స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకోగానే ఆయన జనసేన పార్టీలో చేరతారని చాలామంది భావించారు. అయితే పవన్ కల్యాణ్ కింద తాను ఎలా పనిచేస్తానని అనుకున్నారని ఒక మిత్రుడి వద్ద లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. రాజకీయాలలోకి రావాలని లక్ష్మీనారాయణకు ఎప్పటి నుంచో ఉంది. 2014 ఎన్నికలలోనే ఆయన తెలుగుదేశం పార్టీలో చేరి ఎన్నికలలో పోటీ చేయాలనుకున్నారు. అయితే అప్పటి వరకు జగన్మోహన్‌రెడ్డిపై కేసులను దర్యాప్తు చేసి, ఆ వెంటనే తెలుగుదేశం పార్టీలో చేరితే కేసులు బలహీనపడి వీగిపోతాయని మిత్రులు సలహా ఇవ్వడంతో ఆయన తన ఆలోచనను విరమించుకున్నారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ నాయకత్వం ఆయనపై వల వేసిందని చెబుతున్నారు. లక్ష్మీనారాయణను పార్టీలో చేర్చుకుని పార్టీ పగ్గాలు ఆయనకు అప్పగించాలన్నది అమిత్ షా వ్యూహంగా చెబుతున్నారు. బీజేపీపై ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు ఆగ్రహంగా ఉన్నప్పటికీ, పవన్ కల్యాణ్ దీక్ష తర్వాతో, మరో సందర్భంలోనో రాష్ట్రానికి కొన్ని వరాలు ప్రకటించి ప్రజలను ప్రసన్నం చేసుకోవాలన్నది బీజేపీ నాయకత్వం ఆలోచనగా కనిపిస్తున్నది. ఈ క్రమంలో నిజాయితీపరుడు, ధైర్యవంతుడిగా ప్రజలలో గుర్తింపు ఉన్న లక్ష్మీనారాయణకు పార్టీ నాయకత్వం అప్పగించి ఎన్నికల నాటికి జనసేన పార్టీతో పొత్తు పెట్టుకుంటే కాపు సామాజికవర్గం మద్దతు ఏకపక్షంగా లభిస్తుందన్నది కమలదళం వ్యూహం అని చెబుతున్నారు. వైసీపీతో నేరుగా పొత్తుపెట్టుకునే పరిస్థితి లేకపోయినప్పటికీ, జగన్మోహన్‌రెడ్డిపై ఉన్న కేసుల కారణంగా ఎన్నికల తర్వాతైనా ఆయన తమకు మద్దతు ఇవ్వక తప్పదని బీజేపీ నేతల అంచనాగా చెబుతున్నారు. మొత్తంమీద తమను ధిక్కరించిన చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ నాయకత్వం అందుబాటులో ఉన్న అన్ని పాచికలనూ విసురుతోందన్నమాట!

> **వచ్చే ఎన్నికలలో తమకు 10 లోక్‌సభ స్థానాలు, 50 వరకు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని కాషాయదళం నుంచి తెలుగుదేశం పార్టీపై ఒత్తిడి వచ్చింది. క్షేత్రస్థాయిలో అంతగా బలం లేని బీజేపీకి అన్ని సీట్లు కేటాయిస్తే అవన్నీ వైసీపీ ఖాతాలోకి వెళ్లడం ఖాయమన్న ఉద్దేశంతో ఈ ప్రతిపాదనను చంద్రబాబు నిర్ద్వంద్వంగా తిరస్కరించారని చెబుతున్నారు. దీంతో కేంద్ర పెద్దలు చంద్రబాబును పట్టించుకోవడం మానేశారు. ఇది గ్రహించిన చంద్రబాబు, అసెంబ్లీ స్థానాల పెంపు గురించి కోరకుండా, రాష్ట్రానికి ఇస్తామన్న ప్యాకేజీని అమలుచేయాలని ఒత్తిడి తేవడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం, అందులో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్న అభిప్రాయం ప్రజలలో కలగడంతో చంద్రబాబు రాజకీయ నిర్ణయం తీసుకున్నారు.**



> **పవన్ కల్యాణ్‌పై మాత్రమే ఆధారపడితే లాభం లేదనుకున్నారో ఏమోగానీ సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణపై కమలనాథులు కన్నేశారు. ఆయనకు రాష్ట్రంలో మంచి పేరు ఉంది. రానున్న ఎన్నికలలో చంద్రబాబుకు చెక్ పెట్టాలంటే కాపులను చేరదీయాలన్నది బీజేపీ అగ్రనేతల ఆలోచన. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ ఈ విషయాన్ని దాచుకోకుండా చెప్పేశారు. లక్ష్మీనారాయణ కూడా కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. లక్ష్మీనారాయణను పార్టీలో చేర్చుకుని పార్టీ పగ్గాలు ఆయనకు అప్పగించాలన్నది అమిత్ షా వ్యూహంగా చెబుతున్నారు.**

దెబ్బ ప్రజలకే!

భారతీయ జనతా పార్టీ రూపొందించిందని చెబుతున్న ఈ వ్యూహం నిజమై అమలు జరిగితే ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాప్రయోజనాలు గాలికిపోయి, కులాల కుంపట్లు రగులుకుంటాయి. అధికారం కోసం కమ్మ– కాపు– రెడ్డి సామాజికవర్గాల మధ్య పోరు కేంద్రీకృతమవుతుంది. ఎన్నికలకు ఇంకా ఏడాది వ్యవధి ఉన్నందున ఈలోపు ఏమి జరుగుతుందో తెలియదు. తమను ధిక్కరించిన చంద్రబాబుకు వ్యతిరేకంగా అన్ని శక్తులనూ సమీకరిస్తున్న భారతీయ జనతా పార్టీ ముందుముందు ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోబోతోందన్నది కూడా తేలవలసి ఉంది. భారతీయ జనతా పార్టీ నాయకత్వంతో గానీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో గానీ తనకు వ్యక్తిగతంగా విరోధం లేదనీ, రాష్ట్ర ప్రయోజనాల కోసమే విభేదించవలసి వస్తున్నదని చంద్రబాబు వివరణ ఇస్తున్నప్పటికీ, మోదీ– షాల మనస్తత్వం తెలిసినవారెవ్వరూ వారు మౌనంగా ఉంటారని అనుకోరు. సీపీఐ నాయకుడు నారాయణ వ్యాఖ్యానించినట్టుగా ముఖ్యమంత్రి చంద్రబాబుపై కేసులు పెట్టి జైలుకు పంపడానికి కూడా వెనుకాడకపోవచ్చునన్నది బలమైన అభిప్రాయంగా ఉంది. జనసేన నాయకులు, భారతీయ జనతా పార్టీ నాయకులు ఈ రకమైన ప్రచారాన్ని గత కొద్ది రోజులుగా ఉధృతంగా ప్రజలలోకి తీసుకెళుతున్నారు. తమిళనాడు చీఫ్ సెక్రటరీగా పనిచేసిన రామ్మోహన్‌రావుపై నమోదైన కేసులో మంత్రి లోకేశ్ పేరు కూడా ఉందనీ, జగన్మోహన్‌రెడ్డి విషయంలో జరిగినట్టుగానే చంద్రబాబుపై కూడా హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలుచేసి, సీబీఐ విచారణకు ఆదేశాలు పొందడం ఖాయమని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు వేయబోయే అడుగులు ఎలా ఉండబోతున్నాయన్న విషయమై రాజకీయ వర్గాలలో ఆసక్తి ఏర్పడింది. ప్రస్తుతానికి అయితే రాష్ట్రంలో చంద్రబాబుది పైచేయిగా ఉంది. చంద్రబాబుకు వ్యతిరేకంగా అందరూ ఒక్కటవుతున్నారన్న అభిప్రాయం బలపడుతోంది. జగన్మోహన్‌రెడ్డి, పవన్ కల్యాణ్‌లకు భారతీయ జనతా పార్టీతో ప్రత్యక్ష లేదా పరోక్ష సంబంధాలు ఉన్నాయని అత్యధికులు నమ్ముతున్నారు. బీజేపీ ప్రయోగం సఫలమై వచ్చే ఎన్నికలలో త్రిముఖ పోటీ జరిగితే జగన్మోహన్‌రెడ్డి రాజకీయంగా నష్టపోయే ప్రమాదం లేకపోలేదు. దీనికితోడు చంద్రబాబును బోనెక్కించాలన్న ఆలోచనతో విజయసాయిరెడ్డి తరచుగా ప్రధానమంత్రి మోదీని కలవడం తమకు రాజకీయంగా నష్టం చేస్తున్నదని వైసీపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆందోళన చెందుతున్నారు. 'బీజేపీకి, మాకు పరోక్ష సంబంధాలు ఉన్నాయని ముస్లింలు అనుమానిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే ఎన్నికల నాటికి ముస్లింలు, క్రైస్తవులు మాకు దూరమయ్యే ప్రమాదం ఉంది' అని ఆ పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తంచేశారు. బీజేపీకి ఇప్పుడు టార్గెట్‌గా మారిన చంద్రబాబునాయుడికి అపార అనుభవం ఉండటంతో పాటు 2004 ఎన్నికలలో చేసిన తప్పులను మర్చిపోలేదు కనుక ఇప్పటికే తగు జాగ్రత్తలు తీసుకోవడం మొదలుపెట్టారు. ప్రస్తుతానికి ప్రజలలో ఆయనపై ఎంతో కొంత సానుభూతి ఉంది. ఒక్కడిని చేసి ఏడిపిస్తున్నారన్న అభిప్రాయాన్ని కూడా పలువురు వ్యక్తంచేస్తున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా ఏడాది వ్యవధి ఉన్నందున అప్పటివరకు ప్రజలలో ఇదే అభిప్రాయం ఉంటుందా? అన్నది ఇప్పుడే చెప్పలేం! ప్రచారం జరుగుతున్నట్టుగా చంద్రబాబుపై కేసులు నమోదైతే ఆయనపై ప్రజలలో మరింత సానుభూతి ఏర్పడే అవకాశం లేకపోలేదు. అవినీతి విషయంలో జగన్మోహన్‌రెడ్డి, చంద్రబాబు దొందూ– దొందే అన్న అభిప్రాయానికి ప్రజలు రాలేదనే చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో జాతీయ స్థాయి రాజకీయాలలో చోటు చేసుకునే పరిణామాలు కూడా రాష్ట్రంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. నరేంద్రమోదీ నాయకత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రధాన ప్రాంతీయ పార్టీలన్నీ జతకట్టనున్నాయి. ఈ

> **ఇతర పత్రికల గురించి, జర్నలిజం ఎలా ఉండాలో చెబుతూ వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు, ఉద్బోధలు విన్నవారికి, చదివినవారికి కంపరం పుట్టింది. మీకు పచ్చకామెర్ల వ్యాధి సోకితే ఇతరులను మందు వేసుకోమనడం ఏమిటి? అలా చేయడం వల్ల మీకున్న వ్యాధి మరింత ముదురుతుంది. జర్నలిజం విలువల గురించి జగన్మోహన్‌రెడ్డి అండ్ కో ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది!**

క్రమంలో కాంగ్రెస్ ఏర్పాటుచేసిన సమావేశానికి పలు పార్టీలు హాజరయ్యాయి. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ కూడా జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక ఫ్రంట్ ఏర్పాటుకు నడుం బిగించారు. తనపై వ్యక్తిగత కక్ష సాధింపులు మరింత పెరిగితే చంద్రబాబునాయుడు కూడా ఈ కూటమితో జతకట్టక తప్పని పరిస్థితి. ప్రత్యామ్నాయ ఫ్రంట్‌కు ఎవరు నాయకత్వం వహిస్తారన్నది తేలవలసి ఉన్నప్పటికీ, అందరికీ ఉమ్మడి శత్రువు మాత్రం నరేంద్ర మోదీనే! ఈ కారణంగానే తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రతిపాదించిన కాంగ్రెస్–బీజేపీ లేని ఫెడరల్ ఫ్రంట్ అడుగులు ముందుకు పడటం లేదు. కోల్‌కతా వెళ్లి ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో ఆయన చర్చలు జరిపి వచ్చారు. అయితే కేసీఆర్ చేసిన ప్రతిపాదన పట్ల ఆమె మౌనంగా ఉండిపోయారని టెలిగ్రాఫ్ వంటి పత్రికలు కథనాలు ప్రచురించాయి. రాష్ట్రాల అవసరాలు, ప్రజల అవసరాలు ప్రాతిపదికగా ఫెడరల్ ఫ్రంట్ ఉండాలన్నది కేసీఆర్ ఆలోచన అయితే, రాజకీయ అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఫ్రంట్ ఉండాలని ఇతర పార్టీలు కోరుకుంటున్నాయి. ప్రతిపాదిత ఫెడరల్ ఫ్రంట్ గురించి ఢిల్లీలో తమను ఎవరూ సంప్రదించడం లేదని తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన ఒక ఎంపీ నిస్పృహ వ్యక్తంచేశారు. ఈ పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకోబోయే పరిణామాలు, బీజేపీ నాయకత్వం వ్యవహరించబోయే తీరు ప్రభావం జాతీయ రాజకీయాలపై కచ్చితంగా ఉంటుంది. అంతే కాదు దాని ప్రభావం వచ్చే ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు– దేశవ్యాప్తంగా కూడా ఉంటుంది. 'శత్రువు దెబ్బకొడితే ప్రజలకు తగలాలి. మనం దెబ్బకొడితే శత్రువుకు నేరుగా తగలాలి' అని మహాభారతంలో తన సోదరులతో ధర్మరాజు అంటాడు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబును దెబ్బకొట్టడానికి భారతీయ జనతాపార్టీ చేసే ప్రయత్నాలు, వేసే ఎత్తుగడలతో రాష్ట్ర ప్రజలు నష్టపోతున్నారు. చంద్రబాబుకు జరుగుతున్న నష్టం కంటే ప్రజలకు జరుగుతున్న నష్టమే ఎక్కువగా ఉంటున్నది. ఫలితంగా కమలనాథులు ఎన్ని వ్యూహాలు రచించినా ఆంధ్రప్రదేశ్‌లో ఫలితం ఉండకపోవచ్చు. అయినా రాజకీయాలలో సిద్ధాంత రాద్ధాంతాలే ఉండాలి గానీ, వ్యక్తిగత కక్షలు కూడదు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి విషయంలో వ్యక్తిగత కక్షతో వ్యవహరిస్తే ప్రయోజనం దక్కకపోగా ఉభయభ్రష్టత్వం ప్రాప్తించవచ్చు. అయినా మబ్బులను చూసుకుని చెంబులోని నీళ్లు ఒలకబోసుకున్నట్టు కొత్త మిత్రుల మోజులో ఉన్న మిత్రులను వదలుకుంటూ పోవడం ఏమి తెలివో భారతీయ జనతా పార్టీ నాయకులకే తెలియాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సొంతంగా నిలబడాలంటే ఈ ఏడాదే కాదు, ఎన్నికల తర్వాత కూడా మరో అయిదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. ఇప్పుడున్న పరిస్థితులలో ఎన్నికల తర్వాత మోదీ ప్రభుత్వం తిరిగి ఏర్పాటయ్యే అవకాశాలు బహు స్వల్పం. కాంగ్రెస్ లేదా ప్రత్యామ్నాయ కూటమి నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడవచ్చు. ప్రభుత్వం ఎవరిదైనా రాష్ట్రానికి మద్దతు అవసరం కనుక వచ్చే ఎన్నికలలో ప్రజల తీర్పు కూడా ఆ దిశగానే ఉండే అవకాశం ఉంది. వచ్చే ఎన్నికలలో బీజేపీ వ్యూహాలు ఫలిస్తాయో? ప్రజల విజ్ఞత నెగ్గుతుందో? వేచి చూద్దాం. ఈ విషయం అలా ఉంచితే ఇతర పత్రికల గురించి, జర్నలిజం ఎలా ఉండాలో చెబుతూ వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు, ఉద్బోధలు విన్నవారికి, చదివినవారికి కంపరం పుట్టింది. మీకు పచ్చకామెర్ల వ్యాధి సోకితే ఇతరులను మందు వేసుకోమనడం ఏమిటి? అలా చేయడం వల్ల మీకున్న వ్యాధి మరింత ముదురుతుంది. జర్నలిజం విలువల గురించి జగన్మోహన్‌రెడ్డి అండ్ కో ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది! ■

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం
http://www.youtube.com/abntelugutv

నిశ్శబ్ద విప్లవ గాత్రం

> **లోకం అంతా ఎమ్.ఎస్. చుట్టూ సదాశివం దట్టమైన కోటకట్టి ఆ కోటలో ఉంచాడనుకుంది. ఎమ్.ఎస్. అనుకోనిచ్చింది. సుబ్బులక్ష్మి మాత్రం తన గాత్ర జీవితం అనే అభేద్యమైన కోటను తన చుట్టూ తాను నిర్మించుకుంది. అక్కడ సదాశివానికి సైతం నో ఎంట్రీయే. ఆచరణలో ఎమ్.ఎస్. జీవితాన్ని తనకు ఇష్టమైనట్టుగా మలుచుకోగలిగింది. ఎమ్.ఎస్. అనగానే మన కళ్ళముందు మెదిలే ఓ కోమల స్త్రీ మూర్తి రూపం వెనక ఆమె మానసిక దృఢత ఇప్పటి తరం స్త్రీలకు ఆదర్శమే కాదు ఆచరణీయం కూడా. అది ఒక ధిక్కార వ్యాకరణం.**

వందేళ్ళ క్రితం పుట్టి, తనదైన నిర్దిష్ట స్థానాన్ని తనకు తానుగా ఎంచుకొని జీవించిన జగత్ విఖ్యాత గాన విదుషి ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి. పండితులను, సామాన్యులను ఏకతాటి మీదికి తేగల గాత్ర శైలిని స్వంతం చేసికొని తన లోకం తాను సృష్టించుకున్న అసమాన, అరుదైన స్త్రీ మూర్తి. ఆమె బ్రతికి ఉండగా ఆవిడ గాన నైపుణ్యానికి సంబంధించిన వార్తలు, అదీ ఆమె భర్త సదాశివం ఆమోదంతో వెలువడే వార్తలు మాత్రమే జన సామాన్యానికి తెలిసేవి. ప్రజలు కూడా ఆమెకి సంబంధించిన వార్తల కన్నా ఆమె గాత్రం విలువైంది కాబట్టి దాని మీదే దృష్టి పెట్టేవారు.

అయితే ఇటీవల ఈ ఉదాత్త గాయని ఎమ్.ఎస్. జీవితం మీద వచ్చిన నాలుగు పుస్తకాలు పాఠకులని, ఆమె అభిమానులను లోతుగా ఆలోచింప చేసేవిగా ఉన్నాయి. ఒకటి టి.జె.ఎస్.జార్జ్ ఆంగ్లంలో రచించిన 'ఎమ్.ఎస్.సుబ్బులక్ష్మి, ద డెఫినిటివ్ బయోగ్రఫీ', రెండవది గార్లపాటి పల్లవి తెలుగులో రాసిన వాస్తవాధారిత రచన 'సుస్వరాల లక్ష్మి ఎమ్.ఎస్.సుబ్బులక్ష్మి', మూడవ పుస్తకం సుబ్బలక్ష్మి స్నేహితురాలు అలమేలు విశ్వనాథన్ కూతురు లక్ష్మీ విశ్వనాథన్ రాసిన 'కుంజమ్మ-ఓడ్ టు ఎ నైటింగేల్'.ఇదే క్రమంలో 'ది హిందూ' దిన పత్రిక సౌజన్యంతో ఎన్.రాం పర్యవేక్షణలో సంగీత ప్రముఖులు, ఇతర రంగాల ప్రముఖులు ఎమ్.ఎస్. గాన ప్రతిభ మీద రాసిన వ్యాసాలను (1980ల నుండి 2006 వరకు) క్రోడీకరించి 'ఎమ్.ఎస్. రీ విజిటెడ్, ట్రేసింగ్ ద నైటింగేల్స్ మ్యూజిక్ జర్నీ' పుస్తకం ఒకటి. ఇవి అన్నీ ఎమ్.ఎస్. అద్వితీయమైన గాన వ్యక్తిత్వాన్ని, ఆమె గాయనంలోని విశిష్టతలను ఎత్తి చూపుతాయి. సంప్రదాయం, ఆధునికతల మధ్య పితృస్వామ్య కట్టుబాట్లు, సామాజిక లొంగుబాట్ల నడుమ అపురూపంగా వెలిగిన ఆ గాన పిపాసను పట్టుకున్నారు రచయితలు.

తల్లి గారాబంగా కుంజమ్మా అని పిల్చుకునే 'మధురై షణ్ముగ వడివు సుబ్బులక్ష్మి' దక్షిణ భారతదేశంలోని దేవదాసీ సంప్రదాయ నేపథ్యానికి చెందుతారు. తండ్రి (సుబ్రహ్మణ్యం అయ్యర్) బ్రాహ్మణ సమాజానికి చెందుతారు. సుబ్బులక్ష్మిని అర్థం చేసుకోవడానికి ఈ చారిత్రాత్మక గౌరవ పరంపర తెలుసుకోవడం అనివార్యం. దక్షిణ భారత ప్రాంతపు మత సాంప్రదాయ తత్వానికి దేవదాసీ సాంప్రదాయం సమాంతరంగా నడిచింది. అద్భుతమైన దేవాలయాల కట్టడాలతో పాటు వాటికి సంబందించిన మహత్తర కళావిభాగాన్ని చూసుకునేందుకు గాను స్త్రీలను భాగస్వాములను చేయడం జరిగింది. వాళ్ళకి ఆర్థిక పరమైన ప్రతిపత్తి ఉండేది. ఎమ్.ఎస్. ముత్తవ్వ (పేరు నమోదు కాలేదు) నృత్య కళాకారిణి. అమ్మమ్మ అక్కతూర్ వయోలిన్ విద్వాంసురాలు. తల్లి షణ్ముగవడివు వీణ వాయిస్తూ పాట పాడుతుంది. ఈ మూడు తరాల కళా వారసత్వాన్ని తన గళంతో, గాత్రంతో, తన ఆత్మలో నిలుపుకున్నది సుబ్బులక్ష్మి. అయితే ఈ సాంప్రదాయం క్రమంగా ఎలా



కులంగా మారుతూ వచ్చిందో జార్జ్ తన పుస్తకంలో చాలా వివరంగా రాస్తారు. ఈ మార్పులు కళాకారుల గౌరవ మర్యాదలని భంగపరిచాయి. భూములు దేవదాసీల నుండి లాగి బ్రాహ్మణ పూజారులకు, ఇతర ఆలయకర్తలకు ఇవ్వడం జరిగింది. ఇది దేవదాసీల జీవితాల మీద పెద్ద దెబ్బ తీసిన మార్పు. సమాజపు ఆమోదముద్ర క్రమంగా తొలుగుతూ వచ్చింది. పరంపరాగతమైన దేవదాసీ సాంప్రదాయం గురించి అస్సలు అవగాహన లేని తెల్ల దొరలు వాళ్ళ చేతి కింది నల్ల దొరలు దేవదాసీ విధానాన్ని తప్పుపట్టడం జరిగింది. జాతీయోద్యమ కాలంలో వెల్లువలో వీరిని ఎవరూ పట్టించుకోలేదు. తమని వేశ్యలుగా పరిగణించినప్పుడు తల్లడిల్లిన దేవదాసీలు ఒక మహాజరు తయారు చేస్తారు. ఈ మహాజరు రాయబడుతున్నప్పుడు పన్నెండేళ్ళ కుంజమ్మ ఆ సమావేశంలో ఉంది. పన్నెండేళ్ళ బిడ్డకి సమాజ పరిస్థితులు అందించిన కటువైన చేదు ఇది. కుంజమ్మ సుబ్బులక్ష్మిగా ఎదుగుతున్న సమయంలో పడిన గట్టి దెబ్బ. తల్లి పేరు పెట్టుకోవడం అంటే దేవదాసి అని చెప్పుకోవడం. అందుకే దానిని దాచి ఎం.ఎస్. అని పొట్టి అక్షరాలతో పేరు మారింది.తల్లి అతి ప్రయాసతో రికార్డు చేయించిన ప్లేటు (గ్రామఫోన్ రికార్డు) పై తన పేరుని 'మధురై షణ్ముగ వడివు సుబ్బులక్ష్మి'గా నమోదు చేసినప్పటికీ, ఆ రికార్డింగు సిబ్బంది పేరు ఆధారంగా వాళ్ళ సమాజ నేపథ్యాన్ని అర్థం చేసికొని ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మిగా రాసినప్పుడు మధురై షణ్ముగ వడివు సుబ్బలక్ష్మి తన అస్తిత్వపు గోప్యతను గరళం మింగినట్లుగా తనలో తాను ఇముడ్చుకుంటుంది. తక్కువదా ఆ కోమల శరీరంలోని ధారుడ్యం? ముందుకెళ్ళి 'పద్మ విభూషణ్' కోసం తన పేరుని అదే 'మధురై షణ్ముగవడివు సుబ్బులక్ష్మి'గా రాసి నమోదు చేసింది.

ఎమ్.ఎస్.లోని ఈ మౌన ధిక్కారం చాలా తక్కువ మంది కళాకారిణులకు అబ్బింది. సమాజాన్ని ఎదిరించి నిలుద్దామని పోరాడిన బెంగుళూరు నాగరత్నమ్మ, బాల సరస్వతులలోని అలసటని సుబ్బులక్ష్మి దరికి చేరనీయ లేదు. తన పోరాటం దారి తాను నిర్ణయించుకుంది. సమాజానికి ఎదురుదెబ్బ తన గానం ద్వారానే అని భావించింది ఎమ్.ఎస్. అలా తన పోరాటాన్ని కూడా సంగీత రంగంలోంచే ఎక్కుపెట్టింది. దేవదాసీల ఒక్కొక్క కళ అభ్యుదీకరింపబడుతున్నప్పటి సమయంలో దాసి అట్టం, పదిర్‌లు 'భరత నాట్యం' అయి, పదాలు జావళీలు సంస్కరింపబడ్డాయి. దేవాలయాల నుండి కళలు కచేరీలకు, వేదికల మీదికి వచ్చాయి. దేవదాసీల అమోఘమైన సంగీత, నృత్యాలు బ్రాహ్మణీకరింపబడ్డాయి. కళలు ఒక వర్గం సంపాదించుకున్న ఆస్తులయిపోయాయి అంటాడు ఎమ్.ఎస్. జీవిత చరిత్రకారుడు జార్జ్. ఈ ఫౌండేషనల్ షిఫ్ట్‌ని ఒక సామాజిక వర్గం తమ నుండి తమ సర్వస్వాన్ని సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక బలాలన్నింటిని ఒక్కొక్కటిగా లాక్కోవడం దేవదాసీలందరితో పాటు సుబ్బులక్ష్మి అచేతనంగా గమనిస్తూ వచ్చింది. కళా నేపథ్యంలో ఆ వారసత్వానికి తల వంచి గౌరవించింది. అక్కడే స్త్రీగా తనని కించపరిచే సామాజిక నేపథ్యాన్ని అధిగమించడానికి అదే సమాజపు లోపాలను, పురుష ప్రవృత్తిని కవచంగా ఎన్నుకొని 'కల్కి' పత్రిక సంపాదకుడు త్యాగరాజ సదాశివంని పెళ్ళాడడానికే నిర్ణయించుకుంది. తన గానంతో అదే కళను, గాత్రాన్ని సమాజం ఆమోదించేట్టుగా చేసింది. అందుకే ఆమెది విప్లవ గాత్రం. సంప్రదాయక కట్టూ బొట్టూ వేషధారణ, వెంకటేశ్వర సుప్రభాతం నేపథ్యంతో కేవలం సంగీతాన్నే తన శస్త్రంగా వాడింది. తన నిర్ణయాల్లో భావ నిశ్చలత, ఏకచిత్రం ఎమ్.ఎస్.కి అండగా నిలిచాయి.

సుబ్బులక్ష్మి పరిస్థితులు, ఆమెపై సదాశివం ఇష్టత, వాళ్ళ పెళ్ళికి దారి తీస్తాయి. పెళ్ళి పేరుతో తనకు లభించే సామాజిక భద్రత ముందు సదాశివం పెత్తనం, హుకుందారీతనం, పురుషాహంకారం, కులాధిపత్యం చాలా చిన్న విషయాలుగా తోస్తాయి సుబ్బులక్ష్మికి. తన కట్టు, బొట్టు సదాశివం మార్చినప్పుడు పట్టించుకోలేదు. కానీ తను ఏ పాట ఎలా ఎప్పుడు, ఏ భాషలో పాడాలో నిర్ణయిస్తున్నప్పుడు అలానే పాడుతూ పోయింది. మామూలుగా బయట పడడానికి సుబ్బలక్ష్మి సామాన్య స్త్రీ కాదు, అసామాన్యమయిన స్త్రీ మూర్తి. బయటికి సబ్‌మిసివ్‌గా కన్పించే సుబ్బలక్ష్మిలోని గాన పిపాసని ఏ సమాజ బంధనం ఆపలేకపోయింది. ఆపుదామని కుంజమ్మా అనుకోలేదు. సుబ్బలక్ష్మిలోని ఈ నిర్ణయాత్మకతని జార్జ్ బాగా ఫోకస్ చేస్తారు. స్త్రీగా సుబ్బులక్ష్మి వినయ విధేయతలు, నమ్ర ప్రవర్తన వెనక వొట్టివోని గట్టి నిర్ణయాన్ని జార్జ్ చూడగలుగుతారు. దేశీయమైన తనదైన సంప్రదాయాగత గానాన్ని రీతులను ఒక స్థాయికి చేరిన గాయని పాడడం ఒక విప్లవమే. ఆమె అలవోకగా పాడి సదాశివం అమర్చిన కట్టుబాట్లు ఇనుపగొలుసులను పటాపంచలు చేసింది.

ఎప్పుడూ పుస్తకం చూడకుండా రెండు వేల ఐదు వందలకు పైగా కీర్తనలు, పాటలు కంఠస్తం చేసుకున్న అపురూప ధారణాశక్తి ఆమెది. జీవితాంతం తనని తాను నియంత్రించుకున్న మధురై షణ్ముగ వడివు సుబ్బులక్ష్మి చివరికి తన మధురై జీవితపు దట్టమైన పొరల్లోకి తననుతాను తరలించుకుపోతుంది. అదీ అతి సహజంగా. లోకం అంతా సదాశివం ఎమ్.ఎస్. చుట్టూ దట్టమైన కోట కట్టి ఆ కోటలో ఉంచాడనుకుంది. ఎమ్.ఎస్. అనుకోనిచ్చింది. సుబ్బులక్ష్మి మాత్రం తన గాత్ర జీవితం అనే అభేద్యమైన కోట తన చుట్టూ తాను నిర్మించుకుంది. అక్కడ సదాశివానికి సైతం నో ఎంట్రీయే. ఆచరణలో ఎమ్.ఎస్. జీవితాన్ని తనకు ఇష్టమైనట్టుగా మలుచుకోగలిగింది. ఆ కృషి మాత్రమే సమాజానికి దీటుగా కుంజమ్మని నిలిపింది. ఈ స్త్రీ వ్యక్తిమత్వాన్ని వర్ణించడానికి మరో నాలుగు గ్రంథాలు రావలసి ఉంటుంది. ఎం.ఎస్. అనగానే కళ్ళముందు మెదిలే ఓ కోమల స్త్రీ మూర్తి రూపం వెనక ఆమె మానసిక దృఢత ఇప్పటి తరం స్త్రీలకు ఆదర్శమే కాదు ఆచరణీయం కూడా. అది ఒక ధిక్కార వ్యాకరణం.

■ గూడూరు మనోజ

వడదెబ్బతో కమ్యూనిస్టు
యోధురాలు మృతి

చుంచుపల్లి (పోస్టాఫీస్), మార్చి 24: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీకి చెందిన కమ్యూనిస్టు నాయకురాలు వాసిరెడ్డి సువర్చల (82) వడ దెబ్బతో శనివారం మృతి చెందారు. ఏడాది క్రితం ఆమె అనారోగ్యానికి గురై ప్రస్తుతం కోలుకొన్నారు. శనివారం వడదెబ్బతో మరణించారు. ఆమెకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న జేఏసీ నాయకులు

ఎమ్మెల్సీ పల్లా కనబడుట లేదు
▸▸ పోలీసు స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

మహబూబాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కనబడుట లేదని మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవిభక్త వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి 2014లో ఎమ్మెల్సీగా గెలుపొందిన ఆయన.. హైదరాబాద్‌కే పరిమితం అయ్యారని జేఏసీ కో ఆర్డినేటర్ పిల్లి సుధాకర్ విలేకరులతో అన్నారు. గత మూడేళ్ల నుంచి మహబూబాబాద్ జిల్లాలో పర్యటించక పోగా.. పట్టభద్రులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. అందుకే పట్టభద్రుల తరపున పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటికైనా పట్టభద్రుల విషయంలో స్పందించాలని డిమాండ్ చేశారు.

గ్లైసిల్ విత్తన దందా
అక్రమార్కుల కొత్తదారులు.. ఫిబ్రవరిలోనే గ్రామాలకు నకిలీలు

మంచిర్యాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పంటలో కలుపు బాధలు తప్పుతాయని రైతులు గ్లైసిల్ పత్తి విత్తనాలను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇదే అదనుగా చేసుకొన్న వ్యాపారులు నకిలీ విత్తనాలతో వారిని నట్టేట ముంచుతున్నారు. నకిలీలను నియంత్రించాల్సిన వ్యవసాయశాఖ అధికారులు ఫిర్యాదులు వస్తే తప్ప స్పందించడం లేదు. దీంతో కొందరు వ్యాపారులు బ్రాండెడ్ విత్తనాల ముసుగులో రైతులకు నకిలీలను అంటగడుతున్నారు. గత ఖరీఫ్‌లో జిల్లాలో 80 శాతం మంది రైతులు గ్లైసిల్ విత్తనాలే సాగు చేసినట్లు ప్రభుత్వానికి నివేదికలు అందాయి. ఈ సంవత్సరం మిగతా రైతులు కూడా సాగు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో నిఘా పెంచి గ్లైసిల్ నకిలీలను నియంత్రించక పోతే రైతులు నష్టపోవడంతో పాటు పర్యావరణానికి చేటు జరగడం ఖాయం. ఇక మంచిర్యాల జిల్లాలో గ్లైసిల్ విత్తన దందా జోరుగా కొనసాగుతోంది. ప్రభుత్వ అనుమతి లేని బీటీ-3 పత్తి విత్తనాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన పోలీసులు దాడులు చేసి పట్టుకొని వ్యాపారులపై కేసులు పెడుతున్నారు. అయినా అక్రమ సంపాదనకు అలవాటుపడిన వ్యాపారులు కొత్తదారులు వెతుకుతున్నారు. ఏటా మేలో విత్తన విక్రయాలు ప్రారంభమవుతాయి. కానీ, ఈ సారి ఫిబ్రవరి నుంచే విత్తనాలను పల్లెలకు చేరుస్తున్నారు. ఫిబ్రవరి 28న బెల్లంపల్లిలో కార్లలో తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల నకిలీ విత్తనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. తాజాగా ఈ నెల 15న రాత్రి తాండూర్‌లో ఉప్పు బస్తాల మాటున తరలిస్తున్న 51 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయి. అంతకంటే ముందు కన్నెపల్లి, నెన్నెల, భీమిని మండలాల్లో గ్లైసిల్ విత్తనాలను పట్టుకొని కేసులు పెట్టారు. ప్రభుత్వం వద్దంటున్నా రైతులు మాత్రం పత్తి పంటవైపే మొగ్గు చూపుతున్నారు. మార్కెట్‌లో బ్రాండెడ్ పత్తి విత్తనం ప్యాకెట్ రూ.1000 వరకు అమ్ముతున్నారు. గ్లైసిల్ విత్తనాలతో సాగు చేసిన పంటలో కలుపు నివారణ సులభమవుతుందన్న ఆలోచనతో రైతులు బ్రాండెడ్ విత్తనాలను కాదని బీటీ-3 వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ విత్తనాలను ఆకర్షణీయమైన ప్యాకెట్లలో విక్రయించడంతో పాటు లూజు విత్తనాలను కిలో రూ.1,500ల నుంచి 2,000 చొప్పున అమ్ముతున్నారు.


ఇటీవల పట్టుబడిన నకిలీ విత్తనాల ప్యాకెట్లు, బస్తాలు

పత్తిచేల నుంచి నేరుగా..

గుర్తింపు పొందిన కొన్ని విత్తన కంపెనీలు గ్రామాల్లోని రైతులతో ఒప్పందం కుదుర్చుకుని పత్తి విత్తనాలను ఆంధ్ర ప్రాంతంలో పండిస్తున్నారు. అన్నదాతల నుంచి కంపెనీలు తక్కువ ధరకే కొనుగోలు చేస్తుండడంతో సాగుదారులు వచ్చిన దిగుబడిని కొంత దాచుకుని వాటిని స్వయంగా అమ్ముకుంటున్నారని సమాచారం. వాటిని వ్యాపారులు కొనుగోలు చేసి వాటిలో గ్లైఫోసెట్ జన్యువును ప్రవేశపెట్టి గ్లైసిల్ పేరిట అంటగడుతున్నారని తెలిసింది. సరిగ్గా క్రాసింగ్ చేయకపోవడం, వచ్చిన విత్తనాలను శుద్ధి చేయకపోవడం, మిల్లుల్లోని విత్తులు కలపడంతో దిగుబడిపై ప్రభావం చూపుతుంది.

విత్తన చట్టం ఏది..?

నకిలీ విత్తనాలు అరికట్టేందుకు చట్టం తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట పడుతుందని రైతులు భావిస్తున్నారు. ధ్రువీకరించిన విత్తనాలను విక్రయించాలనే నిబంధనను కఠినంగా అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ, ఆ ప్రక్రియ సరిగ్గా జరగడం లేదు.

అరుపులు.. తోపులాటలు
▸▸ అడ్డుపడిన అధికార పార్టీ సభ్యులు
▸▸ రామగుండం బడ్జెట్ సమావేశం రసాభాస

కోల్‌సిటీ, మార్చి 24: పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికార టీఆర్ఎస్ కార్పొరేటర్లే వార్షిక బడ్జెట్‌కు అడ్డు తగిలారు. ఎమ్మెల్యే సత్యనారాయణ, మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ గ్రూపుల మధ్య గొడవలు తీవ్రమయ్యాయి. శనివారం బడ్జెట్ సమావేశం ప్రారంభం కాగానే ఎమ్మెల్యే వర్గానికి చెందిన టీఆర్ఎస్ కార్పొరేటర్లు సత్యప్రసాద్, ప్రవీణ్, పిడుగు కృష్ణ, సోమారపు లావణ్య, కందుల స్వరూప తదితరులు నినాదాలు చేస్తూ పోడియం ఎదుట బైఠాయించారు. ప్రజా సమస్యలు పరిష్కారమైన తరువాతే బడ్జెట్ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లు కూడా ప్లకార్డులు పట్టుకుని పోడియం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, టీఆర్ఎస్‌లోని ఎమ్మెల్యే వర్గానికి చెందిన కార్పొరేటర్లు పోటాపోటీగా నినాదాలు చేశారు. టీఆర్ఎస్ కార్పొరేటర్లు ఎజెండా కాపీలను చించివేశారు. సమావేశాన్ని మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ రెండు సార్లు వాయిదా వేశారు. భోజన విరామం సమయం తరువాత సమావేశం ప్రారంభం కాగానే టీఆర్ఎస్‌కు చెందిన స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పాముకుంట్ల లలితభాస్కర్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఎమ్మెల్యే వర్గానికి చెందిన టీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆమె చుట్టూ చేరి నినాదాలు చేస్తూ బడ్జెట్ ప్రతులను చించివేశారు. మరో టీఆర్ఎస్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు నాయిని భాగ్యలక్ష్మి బడ్జెట్‌ను బలపరుస్తున్నట్టు చెబుతుండగానే ఎమ్మెల్యే వర్గంలోని మహిళా కార్పొరేటర్లు ఆమె చేతిలో బడ్జెట్ ప్రతులు లాక్కునే ప్రయత్నం చేయగా మేయర్ వర్గానికి చెందిన పలువురు మహిళా కార్పొరేటర్లు అడ్డుకున్నారు. మహిళా కార్పొరేటర్ల మధ్య తోపులాట జరిగింది. దీంతో మేయర్ మాట్లాడుతూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని, తర్వాతి సమావేశంలో చర్చ జరుపుతామంటూ సమావేశాన్ని వాయిదా వేశారు.


కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం


ఎల్ఎల్ఎం పరీక్ష రాసిన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



సుబేదారి(హన్మకొండ), మార్చి 24: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ సుబేదారిలోని న్యాయ కళాశాలలో జరిగిన పీజీ ఎల్ఎల్ఎం పరీక్షలకు శనివారం హాజరయ్యారు. ప్రథమ సంవత్సరం ప్రథమ సెమిస్టర్‌లో భాగంగా జనరల్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ కాంట్రాక్ట్స్ అనే చివరి పరీక్షను రాశారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. రాజకీయాలకు సమయాన్ని కేటాయిస్తూనే వృత్తిని కొనసాగిస్తానని పేర్కొన్నారు. ఓయూలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశాక హైకోర్టులో న్యాయవాదిగా 7 సంవత్సరాలు ప్రాక్టీస్ చేశానన్నారు.

రైతు వద్దే లంచమా.. 'సిగ్గు.. సిగ్గు'

భూ ప్రక్షాళన కోసం రైతుల వద్ద లంచం తీసుకోవడం సిగ్గుచేటు అంటూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లిలో పోస్టర్ ప్రత్యక్షం కావడం కలకలం సృష్టించింది. "సిగ్గు.. సిగ్గు. రెవెన్యూ అవినీతి అధికారులూ ఆత్మ పరిశీలన చేసుకోండి! శ్రమ నా ఆయుధం, కృషి నా కర్తవ్యమైతే.. దోపిడీ నా ఆయుధం అంటూ రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడటం సిగ్గుచేటు. దేశానికి అన్నం పెడుతున్న నావద్దే ఎకరాకు రూ.4వేలు లంచం తీసుకుంటే సమాజంలో మార్పు ఎలా సాధ్యం?" అని రైతన్న ప్రశ్నిస్తున్నట్లు పోస్టర్ అంటించారు.



- ఆంధ్రజ్యోతి, మహబూబాబాద్


మాట్లాడుతున్న గద్వాల ఎమ్మెల్యే డీకే అరుణ

సోనియా రుణం తీర్చుకునేందుకు
ఎదురుచూస్తున్న ప్రజలు : డీకే అరుణ

అచ్చంపేట, మార్చి 24: కేసీఆర్ కుటుంబ పాలనలో విసిగిపోయిన ప్రజలు తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు 2019 కోసం ఎదురుచూస్తున్నారని గద్వాల ఎమ్మెల్యే డీకే అరుణ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరైన ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మాటల గారడీతో ప్రజలను మభ్యపెడుతున్నారని, అభివృద్ధి కాగితాలకే పరిమితమవుతోందని అన్నారు. బంగారు తెలంగాణ సాధించాలని ఎంతో మంది టీఆర్ఎస్ పార్టీలో చేరి.. ఎన్నో అవమానాలకు గురై తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే సుదీర్ఘ అనుభవం ఉన్న కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని తమ పార్టీలో చేరుతున్నారని ఆమె తెలిపారు. అచ్చంపేట నగర పంచాయతీ ఎన్నికల్లో ఒక రాష్ట్ర మంత్రి ఇంటింటికీ తిరిగి డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తులు తీసుకుని ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. కానీ ఏ ఒక్క పేదవానికి ఇంటి నిర్మాణం చేపట్టలేదన్నారు.

బీసీ కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు నిధులు
▸▸ ఆర్.కృష్ణయ్య డిమాండ్

రాంనగర్/హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే అన్ని చేతివృత్తులకూ ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీల అమలుకు సీఎం కేసీఆర్ వెంటనే చర్యలు చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు కావాల్సిన నిధులు మంజూరు చేసి రుణాలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం ఇక్కడ జరిగిన బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం బీసీ ఫెడరేషన్లు, కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు కానీ వాటికి నిధులు కేటాయించకపోవడం వల్ల ఆయా వర్గాల ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రతి కార్పొరేషన్‌కు కనీసం 500 నుంచి రూ. 1000 కోట్లను కేటాయించాలని అన్నారు. బీసీ, ఈబీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ,ఫీజులు చెల్లించలేక ఎంతోమంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు.

'బీజేపీతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యం'

భీమ్‌గల్, మార్చి 24: దేశ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధర్మపురి అర్వింద్ అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని భీమ్‌గల్ మండల కేంద్రంలోని శనివారం వివిధ వర్గాలకు చెందిన యువకులు బీజేపీలో చేరారు. వారికి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధర్మపురి అర్వింద్, జిల్లా అధ్యక్షుడు పల్లె గంగారెడ్డి, కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా యువకులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శివగార్డెన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేసిందని, రానున్న కాలంలో ప్రజలు కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారం కట్టబెట్టాలని కోరారు. సమావేశంలో జిల్లా బీజేపీ నాయకుడు బస్వ లక్ష్మీనర్సయ్య, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి రుయ్యాడి రాజేశ్వర్, బంటు రాము, సుమన్, చైతన్య, జగన్‌తో, కార్యకర్తలు పాల్గొన్నారు.


కూలిన ప్రాంతాన్ని చూస్తున్న గ్రామస్థులు

కుంగిన టన్నెల్ ప్రాంతం
▸▸ భయాందోళనలో రైతులు

సిరిసిల్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పదో ప్యాకేజీలో భాగంగా నిర్మాణంలో ఉన్న టన్నెల్ కుంగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెల్జీపూర్ వద్ద శుక్రవారం రాత్రి టన్నెల్ ప్రాంతంలో ఐదు మీటర్ల లోతు వరకు భూమి కుంగిపోవడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. సిరిసిల్ల మానేరు వాగుపై 25 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మిడ్ మానేరు నుంచి ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ సర్జిపూల్ (మహాబావి) వరకు 8 కిలో మీటర్ల వరకు నీటిని తరలించడానికి టన్నెల్ నిర్మాణం చేపట్టారు. వెల్జీపూర్ వద్ద దాదాపు 50 మీటర్ల వెడల్పుతో 5 మీటర్ల లోతుకు భూమి కుంగిపోయింది. టన్నెల్ పైభాగం కుంగిపోయిందని తెలవడంతోనే కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులు, ఇంజనీర్లు వచ్చి ఆ ప్రాంతానికి ఎవరూ వెళ్లకుండా ఏర్పాట్లు చేశారు.

జాతీయం

బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయవంతం



ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్‌ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. స్వదేశీ పరిజ్ఞానం జోడించి రష్యా సహకారంతో డీఆర్‌డీవో తయారు చేసిన ఈ క్షిపణి ప్రయోగాన్ని రాజస్థాన్‌లోని పోఖ్రాన్ అణు క్షిపణి పరీక్ష కేంద్రం నుంచి మార్చి 22న నిర్వహించారు. భారత్‌లోని బ్రహ్మపుత్ర, రష్యాలోని మాస్కోవా నదులకు గుర్తుగా ఈ క్షిపణికి బ్రహ్మోస్ పేరు పెట్టారు. బ్రహ్మోస్ 2006 నుంచి నేవీ, ఆర్మీకి సేవలందిస్తోంది. గతంలో ఈ క్షిపణి 2.8 మాక్ వేగంతో ప్రయాణించేది. ప్రస్తుతం దీని వేగాన్ని 5.0మాక్ (6125.220కిలోమీటర్ / గంట)కు పెంచారు. (1మాక్ = 1225.044 కిలోమీటర్ / గంట). భూమి, గాలి, నీటిపై నుంచి ప్రయోగించవచ్చు. దీని వార్‌హెడ్ బరువు 200 నుంచి 300 కిలోలు.

ప్రత్యేక మతంగా లింగాయత్

కర్ణాటకలో లింగాయత్‌లు, వీరశైవ లింగాయత్‌లను ప్రత్యేక మతంగా గుర్తిస్తూ.. మతపరమైన మైనారిటీ హోదాను కల్పించే ప్రతిపాదనకు ఆ రాష్ట్ర కేబినెట్ మార్చి 19న ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఆయా వర్గాలకు ప్రత్యేక మతంగా గుర్తిస్తూ.. వారికి మతపరమైన మైనారిటీ హోదా కల్పించాలన్న రిటైర్డ్ జస్టిస్ నాగమోహన్ దాస్ కమిటీ సిఫారసులను ఆమోదించింది. లింగాయత్‌లు తాము హిందువులం కాదని.. బౌద్ధులు, జైనులు, సిక్కుల్లాగా తామూ గురువులనే అనుసరిస్తామనీ, కాబట్టి తమను కూడా వారిలాగే మైనారిటీలుగా గుర్తించాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. కర్ణాటకలో వీరి జనాభా దాదాపు 20 శాతం. సంఘ సంస్కర్త బసవణ్ణను ఆరాధించి, ఆయన వచనాలను మత గ్రంథంగా తలిచేవారు లింగాయతులు. లింగాయతులలో ఉప వర్గం వీరశైవులు.

'ఆయుష్మాన్ భారత్'కు ఆమోదం

ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ పథకంగా భావిస్తున్న 'ఆయుష్మాన్ భారత్'ను ప్రారంభించడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇటీవల బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఈ పథకం ద్వారా ఏటా పది కోట్ల పేద కుటుంబాలకు రూ.అయిదు లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని సంకల్పించిన సంగతి తెలిసిందే. అలాగే, పట్టు పరిశ్రమ అభివృద్ధికి రూ.2,161 కోట్లు కేటాయించడానికి సమ్మతించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మార్చి 21న జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం కేంద్ర నిధులతో అమలవుతున్న రాష్ట్రీయ స్వస్థ్య బీమా యోజన (ఆర్ఎస్‌బీవై), సీనియర్ సిటిజన్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం (ఎస్‌సీహెచ్ఐఎస్) పథకాలను ఆయుష్మాన్ భారత్‌లో విలీనం చేయనున్నారు. దేశంలో సెరీకల్చర్‌ను ప్రోత్సహించడానికి పట్టు పరిశ్రమ అభివృద్ధికి వచ్చే రెండేళ్లలో రూ.2,161.68 కోట్లు వెచ్చించాలని కేంద్రం నిర్ణయించింది. ఓబీసీల ఉపవర్గీకరణపై ఏర్పాటైన జస్టిస్ జి.రోహిణి కమిటీ పదవీ కాలం జూన్ 20 వరకు పొడిగించడానికి, వాణిజ్య సరోగసీని నిషేధించి, షరతులకు లోబడి పిల్లలు లేని దంపతులకు నైతిక సరోగసీకి వీలుకల్పించేలా చట్టంలో సవరణ చేయడానికి కూడా ఆమోదం తెలిపారు.

నివాసయోగ్యమైన నగరాల్లో హైదరాబాద్‌కు మొదటిస్థానం



కరెంట్ అఫైర్స్

నివాసయోగ్యమైన నగరాల్లో హైదరాబాద్‌కు మొదటిస్థానం

దేశంలో నివాసయోగ్యమైన అత్యుత్తమ నగరాల్లో హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. వరుసగా నాలుగో ఏడాదీ ఈ ఘనత దక్కించుకుంది. మెర్సర్ క్వాలిటీ ఆఫ్ లివింగ్ సర్వే - 2018లో ఈ విషయం వెల్లడైంది. హైదరాబాద్‌తోపాటు పుణె కూడా సంయుక్తంగా ప్రథమ స్థానం పొందింది. ప్రపంచ నగరాల్లో వీటిది 142వ ర్యాంకు. ఈ జాబితాలోని మిగతా నగరాలు.. బెంగళూరు (149వ స్థానం), చెన్నై (151వ స్థానం), ముంబై (154వ స్థానం), కోల్‌కతా (160వ స్థానం), న్యూఢిల్లీ (162వ స్థానం) ప్రపంచ వ్యాప్తంగా 450 నగరాల్లో అధ్యయనం చేయగా వియన్నా మొదటి స్థానంలో నిలిచింది. జ్యూరిక్ రెండో, మ్యూనిక్, ఆక్లండ్ సంయుక్తంగా మూడో స్థానాల్లో నిలిచాయి. తరువాతి స్థానం వాంకోవర్. ఆసియాలో బెస్ట్ సిటీగా సింగపూర్ నిలిచింది.

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్

ఇంఫాల్‌లోని (మణిపూర్ రాజధాని) మణిపూర్ సెంట్రల్ యూనివర్సిటీలో 105వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ మార్చి 16 నుంచి 20 వరకు జరిగింది. 'శాస్త్ర సాంకేతికత ద్వారా నేటికీ చేరుకోలేని వర్గాలకు దగ్గరవ్వటం' అనే ఇతివృత్తంతో దీన్ని నిర్వహించారు. ఇదే సదస్సులో ఏరో స్పేస్ రంగంలో చేసిన కృషికిగాను డీఆర్‌డీఓ శాస్త్రవేత్త ప్రకాశ్‌చంద్ జైన్ ప్రతిష్ఠాత్మక హోమీ జహంగీర్ బాబా స్మారక అవార్డును అందుకున్నారు.

ఇంటర్నెట్ వేగంలో చెన్నై టాప్

దేశంలో ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్‌ను వాడుతున్న నగరాల్లో.. చెన్నై అత్యంత వేగవంతమైన నెట్ స్పీడ్ లభిస్తున్న నగరంగా నిలిచింది. వరుసగా తరవాతి స్థానాల్లో బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం నిలిచాయి. అమెరికాలోని సీటెల్ కేంద్రంగా పనిచేస్తున్న ఊక్లా సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ వేగాన్ని గణించింది. దీనికి సంబంధించిన నివేదికను మార్చి 13న విడుదల చేసింది.

క్రీడలు

నేపాల్‌కు వన్డే హోదా

నేపాల్ క్రికెట్ జట్టుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే హోదాను కల్పించింది. టెస్ట్ క్రికెట్ ఆడే 12 దేశాలకు శాశ్వత వన్డే హోదా ఉంది. 2022 వరకూ నేపాల్‌కు వన్డే హోదా ఉంటుంది. ఇప్పటి వరకూ ఆ హోదా అనుభవి స్తున్న పపువా న్యూగినియా వన్డే హోదాను కోల్పోయింది.

ఐఎస్ఎల్ విజేత చెన్నైయిన్

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) టైటిల్‌ను చెన్నైయిన్ ఎఫ్‌సీ కైవసం చేసుకుంది. నాలుగేళ్లలో చెన్నైయిన్‌కు ఇది రెండో టైటిల్. మార్చి 17న బెంగళూరులో జరిగిన ఫైనల్లో చెన్నై బెంగళూరు ఎఫ్‌సీపై విజయం సాధించింది.

తై జుదే ఆల్ ఇంగ్లండ్ ఓపెన్



ప్రపంచ బ్యాడ్మింటన్ మహిళల నంబర్‌వన్ చైనీస్ తైపీకి చెందిన తై జు యింగ్ ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. ఫైనల్లో జపాన్‌కు చెందిన ప్రపంచ రెండో ర్యాంకర్ అకానె యమగుచిని ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో చైనాకు చెందిన షి యుకి విజేతగా నిలిచాడు. ఫైనల్లో లిన్ డాన్ (చైనా)పై విజయం సాధించాడు.

ఇరానీ కప్ విజేత విదర్భ

రెస్టాఫ్ ఇండియా - విదర్భ క్రికెట్ జట్ల మధ్య మార్చి 14 నుంచి 18 వరకు జరిగిన విదర్భ ట్రోఫీని విదర్భ జట్టు గెలుచుకుంది. నాగ్‌పూర్‌లో నిర్వహించిన ఈ మ్యాచ్‌లో రంజీ చాంపియన్ విదర్భ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా విజయం సాధించింది. వసీం జాఫర్ (విదర్భ) 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

ఆసియా రెజ్లింగ్‌లో నవజ్యోత్ కౌర్‌కు స్వర్ణం

భారత మహిళా రెజ్లర్ నవజ్యోత్ కౌర్ కొత్త ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం నెగ్గిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా గుర్తింపు పొందింది. మార్చి 2న జరిగిన మహిళల ఫ్రీస్టయిల్ 65 కిలోల విభాగం ఫైనల్లో నవజ్యోత్ కౌర్, మియు ఇమాయ్ (జపాన్)పై విజయం సాధించింది.

నిదహాస్ ట్రోఫీ విజేత భారత్



భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్ల మధ్య శ్రీలంకలో నిర్వహించిన నిదహాస్ 20 - 20 టోర్నమెంట్‌ను భారత్ గెలుచుకుంది. మార్చి 18న కొలంబోలో జరిగిన ఫైనల్లో భారత్ బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా దినేశ్ కార్తీక్ (భారత్), మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా వాషింగ్టన్ సుందర్ (భారత్) ఎంపికయ్యారు.

సిరీస్ ఇంగ్లండ్ కైవసం

న్యూజిలాండ్ - ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన ఐదు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌ను ఇంగ్లండ్ 3 - 2 ఆధిక్యంతో కైవసం చేసుకుంది. ఇంగ్లండ్‌కు చెందిన క్రిస్ వోక్స్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికయ్యాడు.

అజ్లాన్‌షా విజేత ఆస్ట్రేలియా

అజ్లాన్‌షా హాకీ టోర్నమెంట్‌లో ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది. మార్చి 10న ఇపో (మలేషియా)లో జరిగిన ఫైనల్లో ఇంగ్లండ్‌ను ఓడించింది.

ఇండియన్‌వెల్స్ విజేతలు డెల్‌పొట్రొ, ఒసాకా



ఇండియన్‌వెల్స్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను అర్జెంటీనా ఆటగాడు జువాన్ మార్టిన్ డెల్‌పొట్రొ గెలుచుకున్నాడు. ఫైనల్లో స్విట్జర్లాండ్‌కు చెందిన రోజర్ ఫెడరర్‌పై విజయం సాధించాడు. ఇండియన్ వెల్స్ మహిళల సింగిల్స్‌లో జపాన్ క్రీడాకారిణి నవొమి ఒసాకా విజేతగా నిలిచింది. ఫైనల్లో రష్యా క్రీడాకారిణి డారియా కసట్కినాను ఓడించింది.

ఆర్థిక రంగం

నివాసానికి చౌక నగరాలు

ప్రపంచంలోనే నివాసానికి అత్యంత చౌకగా ఉండే 10 నగరాల జాబితాలను ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ విడుదల చేసింది. ఇందులో అత్యంత ఖరీదైన నగరంగా సింగపూర్ వరుసగా ఐదో ఏడాది అగ్రస్థానంలో నిలిచింది. జీవన వ్యయం అత్యంత తక్కువగా ఉన్న నగరంగా సిరియా రాజధాని డమస్కస్ తొలిస్థానంలో ఉంది. ఇందులో మూడు భారత నగరాలకు చోటు లభించింది. అవి.. బెంగళూరు (5వ స్థానం), చెన్నై (8వ స్థానం), న్యూఢిల్లీ (10వ స్థానం).

2018 - 19లో భారత వృద్ధి రేటు 7.3గా ఫిచ్ అంచనా

ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక రేటింగ్ సంస్థ ఫిచ్ భారత జీడీపీ వృద్ధి రేటు 2018 - 19 సంవత్సరంలో 7.3 శాతంగా ఉండగలదని అంచనా వేసింది. కేంద్ర గణక కార్యాలయం అంచనా వేసిన 6.6 శాతం కంటే ఇది తక్కువ. ఇది 2016 - 17లో 7.1 శాతం.

రాష్ట్రీయం

కల్యాణ లక్ష్మి సాయం పెంపు



తెలంగాణలో నిరుపేద అమ్మాయిల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి / షాదీ ముబారక్ పథకం కింద అందిస్తున్న ఆర్థికసాయాన్ని రూ.75,116 నుంచి రూ.1,00,116కు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మార్చి 19న శాసనసభలో ప్రకటించారు.

బెల్లంపల్లిలో కృషి విజ్ఞాన కేంద్రం

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని బూదాకలాన్ శివారులో ఏర్పాటు చేసిన కృషి విజ్ఞాన కేంద్రాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మార్చి 17న వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రారంభించారు. దేశంలో 25 కృషి విజ్ఞాన కేంద్రాలు మంజూరు కాగా, రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, బెల్లంపల్లికి కృషి విజ్ఞాన కేంద్రాలు మంజూరయ్యాయి. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని ఏకలవ్య ఫౌండేషన్ సంస్థను కూడా ఆన్‌లైన్ ద్వారా మోదీ అదేరోజు ప్రారంభించారు.

రాజ్యసభ ఎన్నికలు

తెలంగాణ నుంచి బడుగుల లింగయ్య యాదవ్, సంతోష్ కుమార్, బండా ప్రకాశ్, ఆంధ్రప్రదేశ్ నుంచి సీఎం రమేష్, కనకమేడల రవీంద్ర కుమార్, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి రాజ్యసభకు ఎన్నికయ్యారు.

కొంకణా సేన్‌కి 'గొల్లపూడి శ్రీనివాస్ పురస్కారం'

గొల్లపూడి శ్రీనివాస్ అవార్డుకు 'ఎ డెత్ ఇన్ ది గుంజ్' పేరుతో ఆంగ్ల, బెంగాలీ భాషల్లో చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకురాలు కొంకణా సేన్ ఎంపికయ్యారు.

అంతర్జాతీయం

సంతోష సూచి 2018

ఐక్యరాజ్యసమితి మార్చి 15న విడుదల చేసిన ప్రపంచ సంతోష సూచి - 2018లో భారత్ 133వ స్థానంలో నిలిచింది (గతేడాది స్థానం 128). ఆదాయం, ప్రజల ఆరోగ్య జీవనం, సామాజిక సామరస్యం, స్వేచ్ఛ, నమ్మకం, ఔదార్యం, తక్కువ అవినీతి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఐరాసకు చెందిన సుస్థిరాభివృద్ధి సాధన విభాగం ఈ నివేదికను తయారు చేసింది. 156 దేశాలకు ర్యాంకులను కేటాయించింది. ఈ సూచికలో ఫిన్లాండ్ అగ్రస్థానంలో నిలువగా, తూర్పు ఆఫ్రికాలోని బురుండి చివరి స్థానం దక్కించుకుంది. నార్వే, డెన్మార్క్, ఐస్‌లాండ్, స్విట్జర్లాండ్ వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నాయి. బురిండి (156), సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ (155), దక్షిణ సూడాన్ (154) చివరి స్థానాలను దక్కించుకున్నాయి. పాక్ (75), చైనా (86), భూటాన్ (97), నేపాల్ (101), బంగ్లాదేశ్ (115), శ్రీలంక (116) మన కంటే మెరుగైన స్థానాల్లో ఉన్నాయి.

హైపర్‌సోనిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించిన రష్యా



ధ్వని కంటే 10 రెట్లు ఎక్కువ వేగంతో దూసుకువెళ్లగలిగే కింఝాల్ (డాగర్) క్షిపణిని మిగ్ - 31 హైపర్‌సోనిక్ క్షిపణిని రష్యా మార్చి 11న విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణిని మిగ్ - 31 సూపర్‌సోనిక్ జెట్ నుంచి ప్రయోగించారు. అత్యాధునిక ఆయుధాల సమీకరణలో భాగంగా ఈ ప్రయోగాన్ని చేపట్టారు. కింఝాల్ క్షిపణిని తీసుకుపోయే మిగ్ - 31 జెట్‌లను ఆధునికీకరించే పని కూడా పూర్తయినట్లు రష్యా ఈ సందర్భంగా తెలిపింది.

చైనా అధ్యక్షుడిగా మళ్లీ జిన్‌పింగ్



చైనా అధ్యక్షుడిగా జీ జిన్‌పింగ్ మార్చి 17న రెండోసారి ఎన్నికయ్యారు. ఓ వ్యక్తి అధ్యక్షుడిగా రెండు కంటే ఎక్కువ సార్లు పనిచేయకూడదంటూ ఉన్న పరిమితిని ఎత్తివేసే రాజ్యాంగ సవరణకు ఆ దేశ పార్లమెంటు మార్చి 11న ఆమోదం తెలిపింది. తదుపరి కొద్ది రోజులకే జిన్‌పింగ్ తిరిగి అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. చైనా సైన్యాన్ని శాసించే అత్యంత శక్తిమంతమైన సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ) అధినేతగా కూడా జిన్‌పింగ్, ఉపాధ్యక్షుడిగా వాంగ్ కిషాన్, ప్రధానిగా లీకెకియాంగ్ ఎన్నికయ్యారు. క్షిపణి రంగ నిపుణుడు లెఫ్టినెంట్ జనరల్ వై ఫెంఘేను రక్షణ శాఖ మంత్రిగా, అత్యున్నత దౌత్య పదవి స్టేట్ కౌన్సిలర్‌గా విదేశాంగ మంత్రి వాంగ్ యిను నియమించారు. భారత్‌తో సరిహద్దు వివాదంలో చైనా ప్రతినిధిగా చర్చలకు వాంగ్ యి నాయకత్వం వహించనున్నారు.

రష్యా అధ్యక్షుడిగా పుతిన్



రష్యా అధ్యక్షుడిగా వ్లాదమీర్ పుతిన్ వరుసగా నాలుగోసారి ఎన్నికయ్యారు. ఆయన మరో ఆరేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. 1952లో లెనిన్‌గ్రాడ్‌లో జన్మించిన పుతిన్ సెయింట్ పీటర్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం చదువుకున్నారు. 1975లో కేజీబీలో ఇంటెలిజెన్స్ అధికారిగా చేరి లెఫ్టినెంట్ కల్నల్ స్థాయికి ఎదిగారు. రాజకీయాలపై ఆసక్తితో 1991లో ఉద్యోగానికి రాజీనామా చేశారు. యునైటెడ్ రష్యా పార్టీ నేత పుతిన్‌కు ప్రధానిగా తొలి అవకాశం అధ్యక్షుడు బోరిస్ ఎలిత్సిన్ ఇచ్చారు. 1999లో అప్పటి ప్రధాని సెర్జీ స్టెపాషిన్‌ను బర్తరఫ్ చేసి పుతిన్‌ను ప్రధానమంత్రిగా ప్రమోట్ చేశారు. అదే ఏడాది డిసెంబర్‌లో రాజీనామా చేసిన ఎలిత్సిన్ తాత్కాలిక అధ్యక్షునిగా పుతిన్‌ను నియమించారు. 2000 అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ విజయం సాధించారు. 2004 రెండోసారి అధ్యక్ష పదవికి ఎన్నికయ్యారు. 2008లో ప్రధానిగా నియమితులయ్యారు. 2011లో అధ్యక్ష పదవీ కాలాన్ని నాలుగు నుంచి ఆరేళ్లకు పెంచారు. ఈ చట్ట సవరణ చేశాక 2012లో పుతిన్ మూడోసారి అధ్యక్ష పదవికి పోటీచేసి గెలిచారు. తాజా విజయంతో పుతిన్, జోసెఫ్ స్టాలిన్ తర్వాత రష్యాను ఎక్కువ కాలం పాలించిన నేతగా చరిత్రలో స్థానం సంపాదించారు.

మయన్మార్ అధ్యక్షుడి రాజీనామా

మయన్మార్ అధ్యక్షుడు హితిన్ క్యా రాజీనామా చేశారు. ఈ విషయాన్ని ఆ దేశ అధ్యక్ష కార్యాలయం మార్చి 21న వెల్లడించింది. మయన్మార్ రాజ్యాంగం ప్రకారం.. అధ్యక్షుడు రాజీనామా చేస్తే ఉపాధ్యక్షుడు అధ్యక్ష బాధ్యతలు చేపడతారు. అప్పటి నుంచి ఏడు రోజుల్లోగా పార్లమెంట్ కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటుంది. అప్పటివరకు ప్రస్తుతం ఉపాధ్యక్షుడిగా ఉన్న మింట్ స్వే అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. 2016లో జరిగిన ఎన్నికల్లో అంగ్‌సాన్ సూకీ సారథ్యంలోని నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసీ పార్టీ విజయం సాధించింది. అప్పుడు అంగ్‌సాన్ సూకీనే అధ్యక్షురాలు అవుతుందని అందరూ భావించారు. కానీ ఆ దేశ రాజ్యాంగం ప్రకారం.. విదేశీయుడిని పెళ్లి చేసుకున్న కారణంగా ఆమె అధ్యక్ష పదవికి దూరమయ్యారు. ఆమె స్థానంలో హితేన్‌ను అధ్యక్షుడిగా నియమించారు.

బ్రెజిల్‌లో ప్రపంచ నీటి సదస్సు

బ్రెజిల్‌లోని బ్రెజీలియాలో మార్చి 18 నుంచి 23 వరకు '8వ వరల్డ్ వాటర్ ఫోరమ్' సదస్సు జరిగింది. దీని నినాదం 'నీటిని పంచుకుందాం'. 15 దేశాధినేతలు, 300 మంది మేయర్లు, వందలాది మంది నిపుణులు, దాదాపు 40 వేల మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సులో 'ప్రపంచ నీటి అభివృద్ధి - 2018' పేరుతో ఐక్యరాజ్యసమితి రూపొందించిన నివేదికపై ప్రధానంగా చర్చించారు. ఏటా ఒక నెలలో 360 కోట్ల మంది ప్రజలకు నీరు లభించడం లేదని ఆ నివేదికలో ప్రస్తావించారు. ఇది ప్రపంచ జనాభాలో దాదాపుగా సగం కావడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. 2050 నాటికి ఈ సంఖ్య 570 కోట్లకు చేరుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

కొత్త బ్లాక్‌హోల్స్‌కు స్టీఫెన్ హాకింగ్ పేరు

రష్యన్ వ్యోమగాములు ఓ కొత్త బ్లాక్ హోల్ (కృష్ణ బిలం)ను కనుగొన్నారు. తన జీవితమంతా అంతరిక్ష పరిశోధనలకు కేటాయించిన ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ పేరును బ్లాక్ హోల్‌కు పెట్టారు. కొత్తగా కనిపెట్టిన బ్లాక్ హోల్ ఓఫికస్ నక్షత్రాలు కూటమిలో ఉన్నట్లు కనుగొన్నారు. మాస్కో స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కొంతకాలంగా నక్షత్రాల కూటమిలో గామా కిరణాల పేలుళ్లను (జీఆర్‌బీ) పరిశీలిస్తున్నారు. నక్షత్రం కూలిపోవటం వల్లే పేలుడు సంభవించిందని, దాని స్థానంలో బ్లాక్ హోల్ ఏర్పడటానికి పరిస్థితులు దారితీశాయని వెల్లడించారు. ఈ శక్తిమంతమైన పేలుళ్లను స్పెయిన్ దేశంలోని టెనెరిఫ్ ఐలాండ్‌లో ఏర్పాటు చేసిన మాస్టర్ - ఐఏసీ రోబోటిక్ టెలిస్కోప్ బంధించింది.

రామచంద్రారెడ్డి ఉప్పుల



డిగ్రీకి ఉత్తమం... గురుకుల కాలేజీలు

ఇంటర్మీడియెట్ తరవాత డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకునే వారికి మంచి అవకాశం... రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు (ఆర్‌డీసీ). ఉత్తమ ఫ్యాకల్టీ, చక్కని సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందుకోవడానికి వారధిగా నిలుస్తున్నాయి ఈ రెసిడెన్షియల్ కాలేజీలు. 2018-19 విద్యా సంవత్సరానికి ఈ కాలేజీల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. వివరాలు..

ప్రవేశం కల్పిస్తున్న కాలేజీలు

సిల్వర్ జూబ్లీ కాలేజ్ కర్నూలు: ఈ కాలేజీలో కో-ఎడ్యుకేషన్ విధానం అందుబాటులో ఉంటుంది. డిగ్రీలో ఆఫర్ చేస్తున్న గ్రూపులు:

- బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్), సీట్లు: 40 (తెలుగు + ఇంగ్లిష్ మీడియం).
- బీకామ్ (జనరల్) సీట్లు: 20
- బీఎస్సీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) సీట్లు: 30
- బీఎస్సీ (బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ) సీట్లు: 20
- బీకామ్ కంప్యూటర్స్ సీట్లు: 20
- బీఎస్సీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్) సీట్లు: 40
- బీఎస్సీ (మ్యాథ్స్, ఫిజిక్స్, వెబ్‌టెక్నాలజీ) సీట్లు: 20
- బీఎస్సీ (బోటనీ, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ) సీట్లు: 20
- బీఎస్సీ (బోటనీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ) సీట్లు: 20
- బీఎస్సీ (బోటనీ, హార్టికల్చర్, కెమిస్ట్రీ) సీట్లు: 20
- వెబ్‌సైట్: www.sjgckurnool.in

ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ - నాగార్జునసాగర్: ఇందులో బాలురకు మాత్రమే ప్రవేశం కల్పిస్తారు. ఆఫర్ చేస్తున్న గ్రూపులు:

- బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్) సీట్లు: 40
- బీకామ్ (జనరల్) సీట్లు: 40
- బీఎస్సీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) సీట్లు: 36
- బీఎస్సీ (మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్) సీట్లు: 36
- బీఎస్సీ (మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్) సీట్లు: 36 (ఎంఈసీ వారి కోసం)

రాత పరీక్షతో

రాత పరీక్ష (ఏపీఆర్‌డీసీసెట్) ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ఎంచుకున్న గ్రూప్‌ను బట్టి రాత పరీక్ష వేర్వేరుగా ఉంటుంది. సమాధానాలను గుర్తించడానికి 150 నిమిషాల సమయం ఉంటుంది. రాత పరీక్షలో ఇంగ్లిష్ సబ్జెక్ట్ అందరికీ కామన్‌గా ఉంటుంది. ఎంచుకున్న గ్రూపు ఆధారంగా మూడు సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 150 మార్కులు ఉంటాయి. ఇందులో ఇంగ్లిష్‌కు 30 మార్కులు, సబ్జెక్ట్‌లకు 40 మార్కుల చొప్పున 120 మార్కులు కేటాయించారు. ఈ క్రమంలో బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్) గ్రూపును ఎంచుకునే వారికి ఇంగ్లిష్, ఎకనామిక్స్, సివిక్స్, హిస్టరీలో పరీక్ష ఉంటుంది. బీకామ్ జనరల్ / కంప్యూటర్స్ వారికి ఇంగ్లిష్, ఎకనామిక్స్, కామర్స్ - 1, 2 అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. బీఎస్సీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ / కంప్యూటర్ సైన్స్ / వెబ్ టెక్నాలజీ) గ్రూప్ వారికి ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలపై ప్రశ్నలు అడుగుతారు. బీఎస్సీ (బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ / మైక్రోబయాలజీ / హార్టికల్చర్) గ్రూప్ విద్యార్థులకు ఇంగ్లిష్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు వస్తాయి.

- **అర్హత:** తెలంగాణ / ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి 2018లో మొదటి ప్రయత్నంలోనే 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ పూర్తి చేసి ఉండాలి. గతంలో పూర్తి చేసినవారు అనర్హులు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 10, 2018.
- పరీక్ష తేదీ: మే 10, 2018.
- పరీక్ష కేంద్రాలు: తెలంగాణ విద్యార్థులకు హైదరాబాద్‌లో, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు ఆయా జిల్లా కేంద్రాల్లో పరీక్షను నిర్వహిస్తారు.
- వెబ్‌సైట్: http://aprjdc.apcfss.in

సీట్ల కేటాయింపు: ఆంధ్రా యూనివర్సిటీ (శ్రీకాకుళం, కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి), ఉస్మానియా యూనివర్సిటీ (నల్లగొండ, ఖమ్మం, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, మెదక్), శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీల (నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం) పరిధి ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. ఇందుకు 42:36:22 నిష్పత్తిని అనుసరిస్తారు.

జాబ్ కార్నర్

ఎన్‌సీఈఆర్‌టీ

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ - కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **35**
- ఉద్యోగాలవారీ ఖాళీలు: టీవీ ప్రొడ్యూసర్ 6, అసిస్టెంట్ ఇంజనీర్ 5, స్క్రిప్ట్ రైటర్ 1, కెమేరామన్ 3, ఇంజనీరింగ్ అసిస్టెంట్ 1, ఆడియో రేడియో ప్రొడ్యూసర్ 1, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ 1, టెక్నీషియన్ 7, ఫ్లోర్ అసిస్టెంట్ 2, ఫిల్మ్ అసిస్టెంట్ 2, ఫొటోగ్రాఫర్ 1, ఎలక్ట్రీషియన్ 1, లైట్‌మన్ 1, డార్క్ రూం అసిస్టెంట్ 1, కార్పెంటర్ 1, ఫిల్మ్ జాయినర్ 1
- అర్హత: పీజీ (మీడియా / విజువల్ / పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ / ఎడ్యుకేషన్/ సైకాలజీ / సోషియాలజీ / హ్యూమానిటీస్ / చైల్డ్ డెవలప్‌మెంట్ / సోషల్ వర్క్ / ఆంత్రపాలజీ) / బీఈ / ఇంటర్ / పదోతరగతి / ఐటీఐ పూర్తిచేసి ఉండాలి.
- వయసు: 27 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 14
- వెబ్‌సైట్: http://ncert.nic.in



నల్లని కొంగలు బారులు.. బారులు..

ఇప్పటి వరకు మనం అనేకసార్లు కొంగలను చూసి ఉంటాం. మనం చూసిన కొంగలన్నీ తెల్లగానే ఉన్నాయి. కానీ, రంగారెడ్డి జిల్లాలో శనివారం నల్ల కొంగలు, తెల్ల కొంగల గుంపు చూపరులను ఆకట్టుకుంది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం నెక్నాంపూర్ చెరువులో ఒకేసారి కొన్ని వందల నల్ల, తెల్ల కొంగలు దర్శనమిచ్చాయి.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి

తెలంగాణ బ్యాంకు స్కాంలో సీబీఐ సోదాలకు అనుమతి

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అజీజ్‌నగర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులు, సిబ్బంది అంకెల గారడీతో కోట్ల రూపాయల గోల్‌మాల్‌కి పాల్పడినట్లు సీబీఐ గుర్తించింది. ప్రధాన నిందితుడు, క్యాషియర్ జయపాల్‌రెడ్డికి అయిదుగురు బ్రాంచి మేనేజర్లు సహకరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులను 10 మందిని నిందితులుగా సీబీఐ పేర్కొంది. ఎనిమిదేళ్లుగా సాగుతున్న గోల్‌మాల్ వ్యవహారం గత జనవరి 30న బయటపడింది. బ్యాంక్ రీజనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సీబీఐ అధికారులు ఫిబ్రవరిలో కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. 120 మంది రైతుల సేవింగ్స్ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి మొత్తం రూ.8.94 కోట్ల నగదు స్వాహా అయినట్లు గుర్తించారు. 2010 నుంచి 2018 వరకు క్యాషియర్‌గా ఉన్న జయపాల్‌రెడ్డి మొత్తం వ్యవహారం చక్కబెట్టినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. రైతుల ఖాతాల నుంచి పక్కదారి పట్టించిన నగదులో బ్యాంక్ మేనేజర్లకూ వాటా ఇచ్చినట్లు ఆధారాలు సేకరించింది. ఫోర్జరీ సంతకాలతో రైతుల ఖాతాల నుంచి నగదు విత్‌డ్రా చేయడం, నగదు తీసుకుని నకిలీ ఫిక్స్‌డ్ పత్రాలను రైతులకు అందజేయడం, లావాదేవీలను కంప్యూటర్‌లో నమోదు చేయక పోవడం, ఖాతాదారుడికి తెలియకుండా నెఫ్ట్, ఆర్టీజీఎస్ ద్వారా ఇతర ఖాతాలకు నగదు బదిలీ... వంటి పద్ధతుల్లో జయపాల్‌రెడ్డి డబ్బులను తీసుకున్నట్లు తేలింది. నిరక్షరాస్యులు కావడంతో రైతులు ఈ మోసాన్ని గుర్తించలేక పోయారు. ఇప్పటివరకు లభించిన ఆధారాల మేరకు నిందితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించేందుకు సీబీఐ అధికారులు కోర్టు అనుమతి పొందారు. నిందితులైన అధికారులు, సిబ్బంది, వారి బంధువులు, స్నేహితుల ఇళ్లపై వరుస దాడులకు రంగం సిద్ధం చేశారు.

స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు నిజమే

- ప్రభుత్వ మార్గదర్శకాలు బుట్టదాఖలు
- మెడికల్ సీట్లపై విచారణ కమిటీ నిర్ధారణ
- ప్రభుత్వానికి నివేదిక అందజేత
- బాధ్యులపై చర్యలు : పద్మారావు



హైదరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుతో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ(సాట్స్) ఆటలాడుకున్న వైనం నిర్ధారణ అయింది. స్పోర్ట్స్ కోటా సిఫారసులో తప్పులు జరిగిన మాట వాస్తవమేనని ప్రభుత్వం నియమించిన కమిటీ నిర్ధారించింది. ప్రభుత్వానికి కమిటీ అందించిన నివేదికలో ఈ విషయం స్పష్టం చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి 'సాట్స్' చేసిన సిఫారసులో అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో డిసెంబరు 7న 'వైద్య సీట్లలో తొండి ఆట' శీర్షికతో వచ్చిన కథనం నేపథ్యంలో ఈ అంశం రోజుకో మలుపు తిరుగుతోంది. కమిటీ నివేదిక ఇవ్వడంలో తాత్సారం చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సీఎం కార్యాలయం(సీఎంవో) కూడా తీవ్రంగా స్పందించింది. 'సాట్స్' ఆడిన ఆటలో స్పోర్ట్స్ కోటాలో సీట్లు కోల్పోయామంటూ కొందరు విద్యార్థులు సమర్పించిన వినతిపై స్పందించిన సీఎంవో ఈ విషయమై సీఎం తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలిపింది. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవడంతోపాటు భవిష్యత్తులో పారదర్శక విధానాన్ని పాటించేలా చూడాలని సీఎం ఆకాంక్షించినట్లు వెల్లడించింది. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ కూడా యువజన సర్వీసులు, సాంస్కృతిక శాఖ బుర్రా వెంకటేశంకు లేఖ రాశారు. క్రీడా పత్రాల ధ్రువీకరణలో 2015 జూన్‌లో జారీ చేసిన జీవో నెం.8ని అనుసరించలేదని, పైగా ఆ నియమావళికి విరుద్ధంగా 'సాట్స్' ఎండీ ఓ కమిటీని నియమించినట్లు తన దృష్టికి వచ్చిందని ఆయన లేఖలో పేర్కొన్నారు. క్రీడా కోటాలో ప్రవేశాలు పొందగోరే విద్యార్థులు సమర్పించిన పత్రాల పరిశీలనకు యువజన సర్వీసులు, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి సారథ్యంలో కమిటీని నియమిస్తూ ప్రభుత్వం జీవో నెం.8ని జారీ చేసింది. ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు క్రీడా కోటా ప్రాధాన్యతను నిర్దేశిస్తూ ఈ కమిటీ సిఫారసు చేయాలి. కానీ ప్రాధాన్యత జాబితాపై 'సాట్స్'లోని ఓ డిప్యూటీ డైరెక్టర్, కోచ్‌ల సంతకాలు మాత్రమే ఉన్నట్లు వెల్లడైంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వారి సిఫారసు చెల్లుబాటు కాదు. అయినా దాన్నే ప్రామాణికంగా తీసుకొని ప్రస్తుత విద్యాసంవత్సరంలో స్పోర్ట్స్ కోటా ప్రవేశాలు కల్పించారు. అయితే ఈ కమిటీ ఈ విషయాన్ని తన నివేదికలో ప్రస్తావించలేదని తెలుస్తోంది.

ఎంబీబీఎస్ అవకాశాన్ని కోల్పోయారు!

'సాట్స్' అక్రమాల వల్ల ఇవాంజెలిన్ అనే విద్యార్థిని ఎంబీబీఎస్ ప్రవేశ అవకాశాన్ని కోల్పోయారని కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం. ఆ అమ్మాయి విలువిద్యలో సీనియర్ నేషనల్స్‌లోనూ పాల్గొన్నారు. ఈ విషయాన్ని సంబంధిత సమాఖ్య కూడా ధ్రువీకరించింది. అయితే 'సాట్స్'లో పరిపాలన బలహీనంగా ఉండటంతో ఆ విద్యార్థినికి అన్యాయం జరిగిందని కమిటీ ముక్తాయించినట్లు తెలుస్తోంది. విలు విద్య అసోసియేషన్ నిర్లక్ష్యం కూడా ఓ కారణమంటూ వారిపైనా నెపాన్ని నెట్టింది. ఒక విద్యార్థికి 'సాట్స్' 25 మార్కులు ఇచ్చింది. దీంతో ఆ విద్యార్థి ప్రాధాన్యతాక్రమంలో ముందు నిలిచారు. కళ్లకు కనబడుతున్న తప్పుగా కమిటీ ఈ విషయాన్ని తేల్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న క్రీడలకు సాయ్(స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) ధ్రువీకరణ కావాలి. కానీ భరత్ అనే విద్యార్థి సంబంధిత సమాఖ్య పత్రాన్నే సమర్పించారని కమిటీ ప్రస్తావించింది. అయితే ఈ విద్యార్థి అంతర్జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి 'సాట్స్' రూ.3 లక్షలు కూడా విడుదల చేసింది. టోర్నీ కోసం అర్జెంటీనా వెళ్లి వచ్చేందుకూ సహకరించింది. అయినా 'సాట్స్' ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. పైగా జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు కూడా 'సాయ్' ధ్రువీకరణే కావాలని ప్రభుత్వ ఉత్తర్వు స్పష్టం చేస్తోంది. 'సాట్స్' భరత్ విషయంలో ఓ రకంగా.. మిగిలిన వారి విషయంలో మరో రకంగా వ్యవహరించిందన్న సంగతిని కమిటీ తేల్చలేక పోయినట్లు తెలుస్తోంది. కాగా, అంతకుముందు శాసనమండలి ప్రశ్నోత్తరాల సందర్భంగా స్పోర్ట్స్ కోటా మెడికల్ సీట్ల కేటాయింపులో అక్రమాలపై బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు ప్రశ్నకు క్రీడా మంత్రి పద్మారావు సమాధానమిచ్చారు. ఐఏఎస్ అధికారితో విచారణ జరుపుతున్నామని, నివేదిక రాగానే దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్పోర్ట్స్ అథారిటీలో కోచ్‌లకు జీతాలు పెంచే విషయం పరిశీలనలో ఉందన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న జిమ్నాస్ట్ అరుణారెడ్డి కోచ్‌కు త్వరలో రూ.25 లక్షలు ఇస్తామని వెల్లడించారు. అలాగే కాంట్రాక్టు కోచ్‌లను రెగ్యులర్ చేసే నిర్ణయం జరగలేదన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అడ్మినిస్ట్రేటర్‌గా రఘురామశర్మ



రఘురామ శర్మ

హైదరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమపరిషత్ అడ్మినిస్ట్రేటర్‌గా యు.రఘురామశర్మను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం గెయిల్‌లో భూసేకరణ విభాగం కాంపిటెం ట్ అథారిటీగా పనిచేస్తున్న ఆయన్ను పరిషత్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమిస్తున్నట్లు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారీ శనివారం జీవో జారీ చేశారు.

ఏప్రిల్ మొదటి వారంలో ఢిల్లీకి కేసీఆర్!

హైదరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సీఎం కేసీఆర్ ఏప్రిల్ మొదటి వారంలో ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉందని టీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. పార్లమెంటు సమావేశాలు ఏప్రిల్ 6 వరకు జరగాల్సి ఉంది. రాజ్యసభకు ఎన్నికైన ముగ్గురు టీఆర్ఎస్ సభ్యులు ఏప్రిల్ 4న సభలోనే ప్రమాణ స్వీకారం చేయాలని భావిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరవుతారు. ఢిల్లీలో వారం పాటు ఉండే సీఎం కేసీఆర్ ప్రధాని మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులను కలిసే అవకాశం ఉందని చెబుతున్నారు.

త్వరలో మోదీకేర్ లబ్ధిదారుల వివరాలు: ప్రీతి

హైదరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆయుష్మాన్ భారత్ పథకం కింద లబ్ధిదారుల వివరాలను కేంద్రం 3-4 రోజుల్లో రాష్ట్రానికి పంపనుంది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ప్రీతీసుదాన్ నుంచి సమాచారం అందింది. సామాజిక ఆర్థిక సర్వే ఆధారంగా లబ్ధిదారుల వివరాలుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలంగాణలో 60% మంది నిరుపేదలకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. తెలంగాణలో ఆరోగ్య పథకాల కింద 90%మందికి వైద్య సేవలు అందుతున్నాయని, ఇతర రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా నిలుస్తోందని ప్రశంసించినట్లు సమాచారం.

ఆర్టీసీకి రూ.95 కోట్లు

హైదరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఆర్టీసీకి రూ.95 కోట్ల మేరకు పరిపాలనా అనుమతులను మంజూరు చేస్తూ రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. 2017-18లో ఆర్టీసీ రుణాల కోసం రూ.334.71 కోట్లు కేటాయించిన ప్రభుత్వం రూ.170.91 కోట్లు విడుదల చేసింది. కాగా, కొత్త బస్సుల కొనుగోలుకు ఆర్టీసీకి కూడా ప్రభుత్వం రూ.35 కోట్లకు కూడా పరిపాలనా అనుమతి ఇచ్చింది.

స్వయం ఉపాధికి బీసీల నుంచి దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కోసం బీసీ నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ తెలిపింది. శనివారం ప్రారంభమైన ఈ ప్రక్రియ ఏప్రిల్ 24 వరకు కొనసాగనుంది. మంత్రి జోగురామన్న ఆదేశాల మేరకు అధికారులు ఈ చర్యలు చేపట్టారు. 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాలకు ఒకేసారి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. tsomms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాలకుల విధానాలను ఎండగడతాం: సీపీఎం



హైదరాబాద్/మంచాల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సీపీఎం జాతీయ మహాసభల విజయవంతం కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ప్రచారంలో బీజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్ ప్రజ్యావతిరేక విధానాలను ఎండగడతామని సీపీఎం రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మహాసభల పాటల సీడీని శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రాల హక్కుల గురించి మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల అధికారాలన్నింటినీ తన గుప్పెట్లో పెట్టుకున్నారని విమర్శించారు. పార్టీ మహాసభల ప్రచార బస్సు యాత్రను బీవీ రాఘవులు మంచాల మండలం ఆరుట్లలో ప్రారంభించారు.

నాగం ఆరోపణలు నిరాధారమైనవి: బీజేపీ

హైదరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అవినీతిపై పోరాడుతుంటే సహకరించడం లేదన్న నాగం జనార్ధన్‌రెడ్డి ఆరోపణలు నిరాధారమైనవని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు అన్నారు. ఆయన వ్యక్తిగత, రాజకీయ కారణాల వల్లే పార్టీకి రాజీనామా చేసినట్లు భావిస్తున్నామన్నారు. అవినీతిపై పోరులో కాంగ్రెస్‌కు ఎలాంటి నైతికత ఉందో నాగం అర్థం చేసుకోవాలన్నారు.

ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేయాలి: రేవంత్

హైదరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతోందని, అక్రమార్కులు సామాన్యుల ప్రాణాలు తీస్తున్నారని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై తాము మాట్లాడిన ప్రతిసారీ అధికార పార్టీ కాంగ్రెస్‌పై నోరు పారేసుకుంటోందని, విచారణ చేయిస్తామని చెప్పడంలేదన్నారు. ఈ మేరకు రేవంత్ శనివారం మంత్రి కేటీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, జిల్లా కేంద్రంలో కంట్రోల్ కమాండ్ సెంటర్లను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు.

1 నుంచి కాంగ్రెస్ రెండో విడత యాత్ర

హైదరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రెండో విడత ప్రజా చైతన్య బస్సుయాత్ర ఏప్రిల్ ఒకటి నుంచి 10వ తేదీ వరకు వరుసగా సాగనుంది. ఏప్రిల్ ఒకటిన రామగుండంలో సభ అనంతరం యాత్ర ప్రారంభమవుతుంది. 2న పెద్దపల్లిలో సభ జరుగుతుంది. 3న మంథని, భూపాలపల్లిలో, 4న ములుగు, పరకాలలో, 5న వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమలో, 6న వర్ధన్నపేట, నర్సంపేటలో, 7న స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తిలో, 8న డోర్నకల్, మహబూబాబాద్‌లో, 9న ఇల్లెందు, పినపాకలో, 10వ తేదీన భద్రాచలం, వెంకటాపూర్‌లలో బహిరంగ సభలు ఉంటాయని ఉత్తమ్ తెలిపారు.



సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఉద్యోగుల మహాసభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉద్యోగ సంఘ నేతలు

సకల ఉద్యోగుల మహాసభ నేడే

- సమస్యలు నాలుగేళ్లుగా పరిష్కారం కాలేదు
- టీఎన్‌జీవో అధ్యక్షుడు రవీందర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాంట్రిబ్యూటరీ పింఛను విధానం రద్దు సహా మరో ఎనిమిది ప్రధాన డిమాండ్ల సాధనకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు, పింఛనుదారులు ఆదివారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో 'సకల ఉద్యోగుల మహాసభ' నిర్వహించనున్నారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వానికి వినిపించేందుకు ఈ మహాసభ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, గజిటెడ్ అధికారులు, పింఛనుదారుల జేఏసీ నిర్ణయించింది. గత 8 ఏళ్లుగా బదిలీల్లేవు. ప్రభుత్వ కొలువుల్లో పెద్ద సంఖ్యలో ఖాళీలున్నాయి. ఈ నేపథ్యంలో, తక్షణమే పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, కుటుంబ పింఛను వర్తింపు, సీపీఎస్ విధానం రద్దు,'ఆర్డర్ టు సర్వ్'పై పని చేస్తున్న ఉద్యోగులకు శాశ్వత కేటాయింపులు, పదవీ విరమణ వయో పరిమితి '60 ఏళ్ల'కు పెంపు తదితర డిమాండ్లతో ఈ సభను నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారెం రవీందర్ రెడ్డి, ఇతర ఉద్యోగ సంఘాల నేతలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు."నాలుగేళ్లుగా రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామన్న హామీ అమలు కాలేదు. పీఆర్సీ కమిషన్ సిఫార్సులను సరిగా అమలు చేయడం లేదు. ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లు జారీ చేస్తున్నా.. నియామకాలు సక్రమంగా జరగడం లేదు" అని విమర్శించారు. "నాడు సకల జనుల సమ్మె విజయవంతమైందంటే.. అది ప్రభుత్వ ఉద్యోగుల వల్లే. ఉద్యమంలో కేసీఆర్ వెన్నంటి ఉన్నాం. ఇప్పుడు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం. ఏపీలో పని చేస్తున్న తెలంగాణ ఉద్యోగులను రాష్ట్రానికి తీసుకురావాలి" అని డిమాండ్ చేశారు. సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లామని, వాటిని పరిష్కరిస్తారన్న నమ్మకం ఉందన్నారు. ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని అన్ని సంఘాలకు పిలుపునిచ్చారు. తమ డిమాండ్లపై సర్కార్ స్పందించకపోతే ఏంచేయాలో సంఘాలతో చర్చించి నిర్ణయిస్తామన్నారు.

తుది దశకు ఉదయసముద్రం

- అప్రోచ్ కెనాల్, విద్యుత్తు టవర్లు పూర్తి
- ఏప్రిల్‌లో రెండు పంపుల డ్రై రన్‌కు ఏర్పాట్లు
- ఖరీఫ్‌లోగా 40చెరువులకు సాగునీరు
- ప్రాజెక్టు పనులపై మంత్రి హరీశ్ సమీక్ష



ఉదయసముద్రం ప్రాజెక్టు పనుల సమీక్షలో హరీశ్

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉదయసముద్రం ప్రాజెక్టు నిర్మాణం తుది దశకు చేరుకుంది. రెండు పంపుల్లో ఏప్రిల్ 5న ఒకటి, ఏప్రిల్ 25న మరో పంపు డ్రై రన్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా ఈ పనులను మరింత వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం శాసనమండలిలోని మినిస్టర్స్ చాంబర్స్‌లో ఉదయసముద్రం పనులను మంత్రి సమీక్షించారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు అందుబాటులోకి రానున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇందులో భాగమైన బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్ డెలివరీ పనులు పూర్తయ్యాయని, మూడున్నర కిలోమీటర్ల పొడవున్న కాలువ కట్ట పనుల్లో మిగిలిన పనులను రెండు నెలల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. కాగా ప్రాజెక్టుకు సంబంధించి 6.9 కిలోమీటర్ల అప్రోచ్ కెనాల్ పూర్తయిందని, రివిట్‌మెంట్ పనులు పూర్తికానున్నాయని ఏజెన్సీ ప్రతినిధులు చెప్పారు. 10.625 కిలోమీటర్ల టన్నెల్ పనుల్లో 222 మీటర్లు మినహా టన్నెల్ పనులన్నీ పూర్తయ్యాయన్నారు. మే చివరికల్లా 222 మీటర్ల టన్నెల్ పనులు పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. టన్నెల్ పనులు పూర్తయితేనే రిజర్వాయర్‌లో నీరు నింపేందుకు వీలవుతుందన్నారు. ఆ లోగా పంప్‌హౌజ్ పనులను వేగవంతం చేయాలని, ఖరీఫ్‌లోగా 40 చెరువులను నింపేలా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు ఈ ప్రాజెక్టు సాగునీరందించనుంది. నల్లగొండ, నార్కట్‌పల్లి, చిట్యాల, మునుగోడు, రామన్నపేట, శాలిగౌరారం, నకిరేకల్ మండలాల్లోని 107 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు తాగునీరు అందించనున్నారు.

ప్రతి రోజూ సమీక్ష..

ఉదయసముద్రం పూర్తయితే నల్లగొండ నియోజకవర్గంలో 24,468 ఎకరాలు, నకిరేకల్ నియోజకవర్గంలో 62,476 ఎకరాలు, మునుగోడులో 10,270 ఎకరాలు, తుంగతుర్తి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 2,784 ఎకరాలు సాగులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టులో 92 మీటర్ల లోతున సర్జ్‌పూల్ నిర్మాణం తుది దశలో ఉంది. కాగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తాగు, సాగునీటి పథకాల పురోగతిని హరీశ్‌రావు రోజూ వాట్సాప్‌లో సమీక్షిస్తూ యంత్రాంగానికి సూచనలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు కావాల్సిన 220 కె.వి.సబ్‌స్టేషన్ నిర్మాణం పనులు, 33 విద్యుత్తు టవర్ల ఎరక్షన్ పనులు పూర్తయ్యాయి. ఉదయసముద్రం ప్రాజెక్టు లెఫ్ట్ మెయిన్ కెనాల్ కింద 43 వేల ఎకరాలు, కుడి మెయిన్ కెనాల్ కింద 57 వేల ఎకరాలు సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎడమ మెయిన్ కెనాల్ కింద మొదటి డిస్ట్రిబ్యూటరీ ద్వారా 40 చెరువులను నింపడానికిగాను ఫీడర్ చానళ్ల పనులను కూడా ఏకకాలంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

ముసలమ్మ చావుకు 'అద్దె' కష్టం

- ఇంట్లో ప్రాణం పోతుందని గెంటేసిన యజమాని




కొన ఊపిరితో తులసమ్మ

సిరిసిల్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మానవత్వం మంట కలిసింది. తోటి మనిషి అని చూడకుండా కొన ఊపిరి ఉండగానే వృద్ధురాలిని ఇంట్లో నుంచి గెంటేశాడు యజమాని. ప్రాణాలు పోయేవరకైనా ఇంటి ముందు టెంటు వేసుకుని ఉంటామని కాళ్లావేళ్లా పడినా కనికరించలేదు. చేసేదేం లేక.. ఊపిరి ఉండగానే వృద్ధురాలిని శ్మశానానికి తీసుకెళ్లి చావుకోసం ఎదురు చూసిన అమానవీయ ఘటన శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. సిరిసిల్లకు చెందిన గుంటుక తులసమ్మ (90) కూతురు శోభతో అద్దె ఇంట్లో ఉంటోంది. తులసమ్మ ఆరోగ్యం విషమించడంతో కడసారి చూపుకోసం శనివారం బంధువులందరూ వచ్చారు. ఇది గమనించిన ఇంటి యజమాని వృద్ధురాలు తన ఇంట్లో చనిపోతుందని, కొన ఊపిరి ఉండగానే బయటకు గెంటేశాడు. ఆమె కూతుళ్లు బతిమిలాడినా వినలేదు. చేసేదేమీ లేక శ్మశాన వాటిక వద్ద టెంట్ వేసుకుని ప్రాణం ఎప్పుడు పోతుందా అని దుఃఖంతో ఎదురు చూస్తూ కూర్చున్నారు. ఈ విషయాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి మీడియా తీసుకెళ్లింది. దీంతో ఆయన తక్షణమే స్పందించి తులసమ్మను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఇంటి యజమానికి కౌన్సెలింగ్ ఇచ్చి వారిని ఇంట్లోకి రానిచ్చే విధంగా ఒప్పించారు.

చోళ-చాళుక్యుల శిల్పకళ ఉట్టిపడాలి

- చోళ-చాళుక్యుల శిల్పకళ ఉట్టిపడాలి
- ఆధ్యాత్మిక నగరం అన్న భావన కలగాలి
- వేములవాడ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- వీటీడీఏ సమీక్షలో మంత్రి కేటీఆర్




వేములవాడ పట్టణ అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): 'వేములవాడలోకి ప్రవేశించగానే చోళ-చాళుక్యుల శిల్పకళ ఉట్టిపడాలి. ఆధ్యాత్మిక నగరంలోని వచ్చామన్న భావన కలగాలి. ఆ దిశగా పట్టణాన్ని అభివృద్ధి చేయాలి' అని మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో వేములవాడ దేవస్థాన అభివృద్ధి అథారిటీ(వీటీడీఏ) సమీక్ష సమావేశాన్ని మంత్రి నిర్వహించారు. ఒక విజన్‌తో పట్టణాభివృద్ధికి ప్రణాళిక రచించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. పట్టణ పరిసర ప్రాంతాలను, గ్రామాలను అథారిటీ పరిధిలో చేర్చి అభివృద్ధి చేయాలని సూచించారు. మాస్టర్ ప్లాన్‌లో ఐదేళ్లు, పదేళ్లు, 25ఏళ్లకు అందుకోవాల్సిన లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. భవిష్యత్తులో జరగాల్సిన అభివృద్ధి, జనాభా, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతులు కల్పించేలా ప్రణాళికలు ఉండాలని చెప్పారు. దేవాలయ డిజైన్‌లను సీఎం కేసీఆర్ పరిశీలిస్తారన్నారు. పట్టణంలో చేపట్టే భవనాలు, వంతెనలు, రహదారుల నిర్మాణంలో చోళ-చాళుక్య శిల్పకళ ఉట్టిపడేలా, సర్వాంగ సుందరంగా ఉండాలన్నారు. పారిశుధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పచ్చదనానికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. గుడి చెరువులోకి మురికి నీరు రాకుండా ఎస్‌టీపీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న బస్టాండ్ నుంచి దేవాలయం వరకు కేబుల్ కార్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలన్నారు. పట్టణంలో భక్తుల సౌకర్యార్థం ఉచితంగా బస్సులు(సాధ్యమైతే ఎలక్ట్రిక్ బస్సులు) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీటీడీఏ అభివృద్ధి పనులను స్వయంగా తానే పర్యవేక్షిస్తానని చెప్పారు. త్వరలో వేములవాడలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తానన్నారు. కాగా, ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక నిధులతోనే పట్టణంలో పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ మంత్రికి చెప్పారు. అగ్నిమాపక కేంద్రం, నాంపల్లి గుట్ట అభివృద్ధి, శ్మశాన వాటిక పనుల కోసం రూ.43కోట్ల అంచనాలతో కూడిన ప్రతిపాదనలను మంత్రికి అందజేశారు.

డప్పు-చెప్పు పింఛన్‌కు సర్కారు సుముఖం

- ఎమ్మెల్యే వేముల వీరేశం



యాతాకుల భాస్కర్

హైదరాబాద్/రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దళిత డప్పు-చెప్పు వృత్తిదారులకు పింఛన్ ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలోనే సీఎం కేసీఆర్ పింఛన్‌పై ప్రకటన చేసే అవకాశం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సీఎం సమాలోచన చేస్తున్నారని ఎమ్మెల్యేలు వీరేశం, రసమయి బాలకిషన్ అన్నారు. శనివారం ఇక్కడ టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో డప్పు, చెప్పు వృత్తిదారులకు పెన్షన్ సాధించి మాదిగ జాతికి అందిస్తామని టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.



★ శ్రీ సీతారామ కల్యాణం.. జగదానంద కారకం

పరంజ్యోతి

శ్రీరామ రామ రామేతి రమేరామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే

అంటూ ఆ పరమేశ్వరుడే పార్వతీదేవికి శ్రీరామనామ మహాత్మ్యం గురించి చెప్పాడు. అంతటి మహాపురుషుడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణ స్వరూపుడు అయిన శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మీస్వరూపిణియైన సీతాదేవిని వివాహమాడిన సుందరఘట్టాన్ని వాల్మీకి మహర్షి తన కావ్యంలో పరమ రమణీయంగా వర్ణించడమే కాక భారతీయ సంస్కృతిలోని షోడశ సంస్కారాల్లో ప్రధానమైన వైవాహిక సంస్కారాన్ని దాని పవిత్రతను సందర్భానుసారంగా విపులంగా చెప్పాడు. అంతటితో తనివితీరక మరో సందర్భంలో.. అనసూయాదేవికి సీతమ్మవారు చెప్పే నెపంతో రెండోసారి కూడా చెప్పాడు. యుగాలు మారినా తరాలు మారినా ఇవాళ్టికీ వాడవాడలా ప్రజలు సీతారామకల్యాణాలు జరుపుకొంటూ తమ భక్తినేగాక, ఆ దంపతులపై అనురాగాన్ని ప్రదర్శించుకుంటూనే ఉన్నారు. వైదిక వివాహ జీవితం భారతీయ ధార్మిక జీవితానికి పునాది. దాంపత్య జీవితాన్ని గడపబోయే దంపతుల్లో ప్రేమ ముఖ్యం. ఆ ప్రేమ జనించే విధంలోనే శ్రీరాముని ప్రేమాధిక్యాన్ని చెబుతూ 'దారా పితృకృతాః' అనడంలో.. పెద్దలు మన శ్రేయస్సు కోరి నిర్ణయించిన వివాహం ద్వారా మన జీవితంలోకి వచ్చిన భార్య యెడల భర్త అమిత ప్రేమ కలిగి ఉండాలని సూచించాడు మహర్షి. దివ్యమైన దాంపత్యానికి ప్రతీకలుగా నిలిచిన సీతారాముల కల్యాణ వర్ణన లోకానికి ఆహ్లాదాన్ని లిగించే ఘట్టం. మానవ సంబంధాలకు ప్రేమ, వివాహం, ప్రధాన భూమికలై నిలవాలన్న వాల్మీకి మహర్షి అంతరంగం ఆవిష్కరింపబడిన శ్రీ సీతారామ కల్యాణ ఘట్టం జగదానంద కారకం అనడంలో ఏ సందేహం లేదు.



-గన్నమరాజు గిరిజామనోహరబాబు

పసివాళ్లు పాపం

(మూడో పేజీ తరువాయి)

కన్నాడు. అనుమానం అనే పెనుభూతం పట్టడంతో.. ఆమెను, ఆమె తల్లిని, తన రక్తం పంచుకుని పుట్టిన పాపనూ దారుణంగా హత్యచేశాడు. ఇది హైదరాబాద్‌లో ఇటీవలే సంచలనం సృష్టించిన ఘటన. భర్తను కాదని తనతో వచ్చిన అమ్మాయిని గర్భిణిని చేసి, 8 నెలల గర్భంతో ఉన్న ఆమెను ముక్కలుగా నరికాడొకడు! వివాహేతరసంబంధానికి అడ్డుగా ఉన్నాడని కన్నబిడ్డ ఉసురు తీసిందో మహాతల్లి!! ఇలా ఒకటా రెండా.. గత ఐదారు నెలల కాలంలో తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి ఎన్నో కేసులు వెలుగులోకి వచ్చాయి. వస్తున్నాయి. వివాహేతర సంబంధాలు పరిచిన అమానవీయతకు, మంటగలుస్తున్న మానవత్వానికి నిదర్శనాలీ దారుణాలు, హత్యలు. కానీ, ఆ సమస్య అక్కడితోనే ముగిసిపోవట్లేదు. పర్యవసానాలు, తదుపరి పరిణామాలు బాధాకరంగా ఉంటున్నాయి.

చిన్నారుల వ్యధ..

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన నాగర్‌కర్నూలు కేసునే తీసుకుంటే బాధిత చిన్నారుల్లో ఒకరికి ఆరేళ్లు, మరొకరికి నాలుగేళ్లు. తల్లి జైల్లో ఉందని తెలుసు. జరిగిందేంటో కూడా సరిగ్గా అర్థం చేసుకోలేని వయసు. ఏం పాపం చేశారని వారికా శిక్ష? ఇలాంటి తల్లిదండ్రుల వల్ల దుర్భర స్థితిని అనుభవిస్తున్న పిల్లలు ఎందరో. కొందరి దుస్థితిని చూస్తే కఠినహృదయులకైనా కడుపు తరుక్కుపోతుంది. ఉదాహరణకు.. ఏపీలోని ప్రకాశం జిల్లా వేటపాలేనికి చెందిన ఒక మహిళ వివాహేతర సంబంధం పెట్టుకుని ప్రియుడిపై మోజుతో భర్తను చంపేసింది. తండ్రి హత్యకు గురై, తల్లి జైలుకు వెళ్లడంతో వారి ఇద్దరు కుమార్తెల సంరక్షణ బాధ్యత చూసేందుకు బంధువులెవ్వరూ ముందుకు రాలేదు. దీంతో పోలీసులు 10 సంవత్సరాలున్న పెద్ద కుమార్తె, 8 సంవత్సరాలున్న చిన్నకూతురిని ఒంగోలులోని బాలల సంరక్షణాలయంలో చేర్చారు. అనంతరం పది నెలలకు తల్లి బెయిల్‌పై విడుదలై వేటపాలెం చేరుకుంది. అయితే ఆమెకు బంధువులు కూడా ఆశ్రయం ఇవ్వలేదు. దీంతో మస్తాపానికి గురై 2015 మే 21న రామన్నపేట వద్ద స్ట్రయిట్ కట్ కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆమె కుమార్తెలిద్దరూ అనాథలుగా మిగిలారు. ఒంగోలులోని బాలల సంరక్షణాలయంలోనే ఉంటున్నారు.



6 శాతానికి పైగా..	దేశవ్యాప్తంగా జరుగుతున్న హత్యల్లో 6 శాతానికి పైగా హత్యలు వివాహేతర సంబంధాలు, ప్రేమబంధాల కారణంగా జరుగుతున్నాయని జాతీయ నేర విభాగం అధ్యయనాల్లో తేలింది.



దేశవ్యాప్తంగా వివాహేతరసంబంధాల కారణంగా జరుగుతున్న హత్యల సంఖ్య ఆధారంగా రూపొందించిన జాబితాలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంటే, తెలంగాణ 4వ స్థానంలో ఉంది. దేశంలోనే అత్యధికంగా మహారాష్ట్రలో ఇలాంటి హత్యలు జరుగుతున్నాయి.

ఏపీలో కోస్తా జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇలాంటి హత్యలు పెరిగిపోతున్నాయని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

'నాయనమ్మా.. అమ్మా, నాన్నా కావాలి..' అంటూ బెంగపెట్టుకుని దిగులుగా పడుకుంటారు మనవలు. 'వస్తారు నాన్నా.. వస్తారు' అంటూ ఉబికివస్తున్న కన్నీటిని ఉగ్గబట్టుకుంటూ చెబుతుందా వృద్ధురాలు. కోడలిని చంపిన కొడుకు జైల్లో ఉన్నాడని.. అమ్మ ఇంక జీవితంలో ఎప్పటికీ కనిపించదని, నాన్న జైల్లో ఉన్నాడని.. ముక్కుపచ్చలారని పిల్లలకు ఎలా చెప్పాలో, చెప్పినా వారికి అర్థమవుతుందో కాదో తెలియక తల్లడిల్లిపోయే వృద్ధురాలి వ్యధ ఇది.

పచ్చటి సంసారాల్లో వివాహేతర సంబంధాల విషపు నీడ విలయతాండవం చేస్తోంది. హత్యలు, ఆత్మహత్యలకు దారితీసి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తోంది. మునుపెన్నడూ లేనంతగా ఈ తరహా నేరాల సంఖ్య ఆందోళనకరస్థాయిలో పెరిగిపోతోంది. విషాదమేంటంటే.. తల్లో తండ్రో వేస్తున్న తప్పటడుగుల కారణంగా చివరకు చిన్నారులు బలైపోతున్నారు. తమ తప్పేమీ లేకపోయినా బాధితులుగా, అనాథలుగా, అభాగ్యులుగా మిగులుతున్నారు. అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యల పంచనో.. బంధువుల ఇంటికో చేరి భారంగా బతుకుతున్నారు!!

పిల్లల కోసం..

▸▸ భార్యను ఖననం చేసిన కొద్ది గంటలకే భర్త బలవన్మరణం

వివాహేతర సంబంధాలతో భాగస్వామిని చంపేస్తున్నారు కొందరు. పిల్లల ఉసురు తీస్తున్నారు మరికొందరు. కానీ, పిల్లలు కలగలేదని భార్య ఆత్మహత్య చేసుకుంటే.. ఆమెపై వల్లమాలిన అభిమానంతో భర్త కూడా తనువు చాలించాడు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ ఘటన జరిగింది. పాత పాలమూరుకు చెందిన రవి (27) కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. రెండేళ్ల కిందట రజితతో పెళ్లయింది. పిల్లలు కలగలేదు. ఆ దిగులుతో రజిత ఈనెల 22న ఆత్మహత్య చేసుకుంది. రవి తీవ్ర మనోవేదనకు గురై.. తెల్లవారుజామున ఉరేసుకున్నాడు.

అనుమానాలూ పెడుతున్న చిచ్చు..

కొన్ని కేసుల్లో అయితే.. నిజంగా వివాహేతర సంబంధం లేకపోయినా భార్య మీద అనుమానంతో ఆమెను కడతేర్చి జైలుకెళ్లినవారున్నారు. భర్త అనుమానిస్తుండడంతో మనస్తాపం చెంది పాలు తాగే పసిపాపలతో సహా ఆత్మహత్య చేసుకునే మహిళలు, కోపంతో భర్తను చంపేసి జైలుపాలైన భార్యలు ఉన్నారు. సందర్భమేదైనా.. పిల్లలే బాధితులవుతున్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో మద్యానికి బానిసైన ఒక భర్త భార్యపై అనుమానంతో వేధించసాగాడు. భార్య.. ఒకదశలో తట్టుకోలేక అతడి గొంతుకు కండువాతో ఉరి బిగించి చంపేసింది. ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు. పెద్ద పిల్ల కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా.. చిన్నపిల్ల పేగు సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతోంది. ఇద్దరూ అమ్మమ్మ, తాతయ్యల ఇంటికి చేరారు. వారి అమ్మమ్మ కూడా కిడ్నీ వ్యాధి బాధితురాలే. వారి తాతకేమో.. ఇంతమందికి వైద్యం చేయించే స్థోమత లేదు. ఇప్పుడా చిన్నారుల పరిస్థితి ఏమిటి? ఇలాంటిదే మరో ఉదాహరణ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఒక వ్యక్తి సైన్యంలో పనిచేస్తున్నాడు. భార్య పనిచేసే చోట తోటి ఉద్యోగితో సంబంధం పెట్టుకుందని అనుమానించి.. భార్యను, ఆమె తోటి ఉద్యోగిని, ఆ ఉద్యోగి భార్యను కూడా కాల్చిచంపేశాడు. రెండు కుటుంబాల్లోని పిల్లలు అనాథలయ్యారు. కొన్నికేసుల్లో వృద్ధులు అనాథలవుతున్నారు.చిత్తూరు జిల్లా మదనపల్లెకు చెందిన ఓ వ్యక్తిని ఆయన భార్య ప్రియుడితో కలిసి హత్యచేసింది. ఆ జంటకు పిల్ల ల్లేరు. కానీ, అతడి తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో తీరని శోకం మిగిలింది. ఒక్కగానొక్క కొడుకు కోడలి ఘాతుకానికి బలవడంతో.. ఆవులను మేపుకొంటూ బతుకువేట సాగిస్తున్నారు.

పెళ్లి పందిరి కిందే..

భార్య.. బంధువులతో కలిసి భర్తనే హత్య చేసిన ఘటన నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండలం మల్లోనిచెర్వుతండాలో శనివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన కోడెల పరశురాములు (42) శుక్రవారంరాత్రి ఇంటి ముందు పందిరి కింద మంచంపై పడుకున్నాడు. ఆ సమయంలో భార్య తిరుపతమ్మ,తన చెల్లెలు రేణుక, వరసకు మరిది అయిన నాగులుతో కలిసి భర్త తలపై కర్రతో బాదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. తాగుడుకు బానిసైన పరశురాములు భార్యతో గొడవ పడేవాడు. పరశురాములు 15రోజుల క్రితమే కూతురికి వివాహం జరిపించాడు. ఆ పెళ్లి పందిరి కిందే హత్య జరగడం కలచివేసింది.

నభయం.. నలజ్జ..!

ఈ సమస్యలన్నింటికీ కారణమేమిటి? అంటే.. "'కామాతురాణాం నభయం.. నలజ్జ' ..విపరీతమైన కామంతో ఉన్నవారికి భయం, సిగ్గు ఉండవని పెద్దలు ఎప్పుడో చెప్పారు. వివాహేతర సంబంధాలు, వాటి కారణంగా జరిగే హత్యలకు ప్రధాన కారణం ఇదే." అంటున్నారు సామాజిక నిపుణులు. "అంతులేని కోరిక ఒకవైపు.. జీవిత భాగస్వామి ఆదరణ లేకపోవడం వారి వల్ల లైంగికవాంఛలు తీరకపోవడం మరోవైపు.. పక్కచూపులకు కారణమవుతాయి. గతంలో వివాహేతర సంబంధాలు గుట్టుముట్టుగా సాగేవి. పెద్దలు, కుటుంబసభ్యుల నుంచి, ఊరివారి నుంచి వ్యతిరేకత ఎదురైతే సదరు సంబంధాలుకు స్వస్తి చెప్పేవారు. కానీ, క్రమేపీ పరిస్థితి మారింది. 'నేను, నా సుఖం ప్రధానం. నా ఇష్టం వచ్చినట్లు నడుచుకుంటా'ననే విశృంఖల ధోరణి పెచ్చుమీరడం.. కోరుకున్నదాన్ని ఎలాగైనా దక్కించుకోవాలనే మనస్తత్వం పెరగడం వివాహేతర సంబంధాలు హత్యలకు కారణమవుతున్నాయి" అని వారు విశ్లేషిస్తున్నారు. జీవిత భాగస్వామి ఆశలను, ఆకాంక్షలను పట్టించుకుని.. వారితో భావాలను పంచుకోవడం, ఎప్పటికప్పుడు ప్రేమను వ్యక్తీకరించడం వంటివాటివల్ల వివాహేతర సంబంధాలకు అడ్డుకట్ట పడుతుందని సూచిస్తున్నారు. లేనిపక్షంలో పర్యవసానాలు ఇలాగే ఉంటాయని.. చేయని తప్పునకు తదుపరి తరాలు బలవుతాయని, కనీసం వారికోసమైనా భార్యాభర్తలు సఖ్యంగా ఉండాలని సూచిస్తున్నారు.



సమాజం పట్ల భయమేదీ?

పూర్వం వ్యక్తుల్లో కుటుంబం పట్ల నిబద్ధత వుండేది. సమాజం అంటే భయభక్తులు ఉండేవి. ఇప్పుడు అవి లోపించాయి. పూర్వం కూడా వివాహేతర సంబంధాలు వుండేవి. అయితే అందుకోసం హత్యలు చేసుకునే పరిస్థితి రావడానికి ప్రధాన కారణాలు.. విలువల లేమి, మానవ సంబంధాల్లో గాఢత లోపించడం, సమాజం పట్ల గౌరవం సన్నగిల్లడం.

- ప్రొఫెసర్ ఎస్.వి.సుధాకర్, మాజీ వీసీ, సామాజిక శాస్త్రవేత్త, విశాఖపట్నం

కౌన్సెలింగ్‌తో సత్ప్రవర్తన

సంతృప్తి లేని జీవితం.. టీవీలు, సినిమాల ప్రభావం వివాహేతర సంబంధాలను ప్రేరేపిస్తోంది. కుటుంబ నేపథ్యం సక్రమంగా లేకున్నా, వారు పెరుగుతున్న పరిసరాల ప్రభావం కూడా మనిషి నడవడికలో ప్రభావం చూపుతోంది. ఉన్నదాంట్లో తృప్తి పడే భావన ప్రతి ఒకరిలో ఏర్పడినప్పుడు ఇలాంటి సమస్యలు తగ్గుతాయి. - లక్ష్మణ్, సైకాలజిస్టు



అగ్నిని జ్వలింపజేస్తున్న దృశ్యం

భద్రాద్రికి కల్యాణ శోభ

భద్రాచలం, మార్చి, 24: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి కల్యాణ గడియలు సమీపిస్తున్నాయి. సోమవారం స్వామివారి కల్యాణం మిథిలా స్టేడియం కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. ఆదివారం రాత్రి వైకుంఠ ద్వారం వద్ద శ్రీ సీతారామచంద్రస్వామి ఎదుర్కోలు ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో దేవాదాయ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కమిషనర్ శివశంకర్ పాల్గొంటారు. నవమిని పురస్కరించుకొని భద్రాద్రిని అంగరంగ వైభవంగా సిద్ధం చేస్తున్నారు. నవమి టికెట్ల విక్రయాలను ఇప్పటికే ప్రారంభించారు. ఎదుర్కోలు, శ్రీరామనవమి, మహాపట్టాభిషేకాన్ని పురస్కరించుకొని స్వామి వార్లను తీసుకెళ్లే మార్గంలో దేవస్థానం, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో ట్రయల్ నిర్వహించారు. సీఎం కేసీఆర్ దంపతులు కల్యాణ మహోత్సవానికి హాజరై రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు స్వామి వారికి సమర్పించనున్నారు. 27న పట్టాభిషేకానికి గవర్నర్ నరసింహన్ దంపతులు హాజరవుతారు. కాగా, సీతారామ చంద్రస్వామి తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన ధ్వజారోహణం నేత్రపర్వంగా సాగింది. ఇదిలా ఉంటే భద్రాచలం శ్రీసీతారాములుకు సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానం తరపున పట్టువస్త్రాలను సమర్పించనున్నట్టు దేవస్థానం జేఈవో శ్రీనివాసరాజు తెలిపారు.



చిన్నయ్యాచారి రూపొందించిన కళాఖండం

గసగసాల గింజపై విగ్రహాలు!

ఎలమంచిలి రూరల్/ఎల్‌ఎన్ పేట, మార్చి 24: ఏపీలోని విశాఖపట్నం జిల్లా ఎలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన హస్తకళాకారుడు శ్రీశైలపు చిన్నయ్యాచారి గసగసాల గింజపై తాటి పేడులో ఉండే ముళ్లను ఉపయోగించి సూక్ష్మరూపంలో సీతారామ లక్ష్మణులు, హనుమంతుని మూర్తులను రూపొందించారు. అదేవిధంగా.. నల్లమద్ది కర్రను ఉపయోగించి 15 మిల్లీ మీటర్ల సైజులో గాలిలో చేయి చాచి ఎగురుతున్న విధంగా మరో హనుమంతుని మూర్తిని రూపొందించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని శ్రీకాకుళం జిల్లా ఎల్‌ఎన్ పేటకు చెందిన సైకతశిల్పి తరుణిప్రసాద్ మిశ్రో.. వంశధార నదీతీరంలో శ్రీరాముని ముఖాకృతితో కూడిన సైకత శిల్పాన్ని రూపొందించారు.

వేములవాడలో నేడు సీతారాముల కల్యాణం

వేములవాడ, మార్చి 24: వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రం రంగురంగుల విద్యుద్దీపకాంతులతో వెలిగిపోతోంది! ఆలయ ఆవరణలో ఎక్కడ చూసినా షామియానాలు, చలువ పందిళ్లే! ఇదంతా సీతారాముల కల్యాణ మహోత్సవం కోసం అక్కడ జరుగుతున్న ఏర్పాట్లు! శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఆదివారం రాజన్న సన్నిధిలో జానకిరాముల కల్యాణం వైభవోపేతంగా జరుగనుంది. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు. సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరపడానికి వీలుగా సకల ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి దూస రాజేశ్వర్ వెల్లడించారు.



విద్యుద్దీప కాంతుల్లో వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రం

మల్లన్న గుట్టల్లో రామాలయం

▸▸ యాదాద్రి సమీపంలో వెలుగుచూసిన అద్భుతం

యాదాద్రి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అక్కడన్నీ రాళ్లూ గుట్టలు.. చెట్లూ పుట్టలు! దట్టమైన పొదల మధ్య చిన్న గుడిలాంటి ఓ కట్టడం! లోపలికి వెళ్లిచూస్తే.. పెద్ద పలకలాంటి శిలపై చెక్కివున్న సీతాసమేత రామచంద్రుడి రూపం! ఆ పరిసరాల్లో ఇంకా ఎన్నో శిల్పాలు.. రాములోరి పాదాలు..ఆంజనేయస్వామి విగ్రహం ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా యాదాద్రి క్షేత్రానికి సమీపంలోని సైదాపురం మల్లన్నగుట్టల్లో 15 రోజుల క్రితం బయల్పడిందీ రామాలయం! ఇక్కడి శాసనాలు, లిపి ఆధారంగా ఈ ఆలయం 16వ శతాబ్దానికి చెందినదిగా పురాతత్వ నిపుణులు భావిస్తున్నారు. ఆ రకంగా 17వ శతాబ్దంలో నిర్మితమైన భద్రాద్రి క్షేత్రంకన్నా ఈ ఆలయం పురాతనమైనదని విశ్లేషిస్తున్నారు. ఇక్కడి సీతారాముల రూపురేఖలు అచ్చంగా భద్రాద్రి సీతారాముల శిల్పాన్ని పోలి ఉన్నాయి.

ఇలా బయటపడింది...

యాదాద్రి- కీసర ఆలయ ప్రధాన మార్గం సమీపంలో సైదాపురం మల్లన్నగుట్టలున్నాయి. బయటనుంచి చూస్తే బండరాళ్లు మాత్రమే కనిపిస్తాయి. 15రోజుల క్రితం సైదాపురం గ్రామానికి చెందిన పశువుల కాపరి పల్లెపాటి మల్లేశ్ తప్పిపోయిన తన పశువులను వెదుకుతూ ఆ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ బండరాళ్ల మధ్య అతడికి



వెలుగుచూసిన పురాతన రామాలయ ప్రాంతం ఇదే

చిన్న గుడిలాంటి కట్టడం కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా.. సీతాసమేత రాముని విగ్రహం కనిపించింది. అతడిచ్చిన సమాచారంతో గ్రామస్తులంతా కలిసి అక్కడికి వెళ్లారు. పొదలు, చెట్లను తొలగించి పూజలు చేయడం ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాల్లో ప్రచారం కావడంతో ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. రాముడి గుడి లోపల పానవట్టం కూడా ఉంది. ఈ దేవాలయానికి రక్షణగా ప్రకృతిసిద్ధంగా రాతి గుండ్లు ఉన్నాయి. లయానికి 100 అడుగుల దూరంలో రాములవారి పాదాలు చెక్కి ఉన్నాయి.

లోకం తీరు



ఆయన ఫాలోవర్లే.. హామీలు అమలు చేయలేదని..


ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	40.0	23.0
నల్లగొండ	39.8	24.6
హైదరాబాద్	39.2	21.3
ఆదిలాబాద్	39.1	24.3
వరంగల్	38.5	21.0

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 75వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 15గంటలు, దివ్యదర్శనానికి 3గంటల సమయం పడుతోంది. సోమవారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో ఆదివారం లాటరీ ద్వారా జారీచేసే సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25, విశేషపూజ:125టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.comలో సంప్రదించాలి.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



అంతిమ దశలో నక్సలిజం

దేశంలో నక్సలిజం అంతిమ దశకు చేరుకుంది. గతంలో భద్రతా సిబ్బంది, ప్రజలు ఎక్కువగా ప్రాణాలు కోల్పోయేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. మావోయిస్టుల మరణాల రేటు ఎక్కువ ఉంది. పేదలు, గిరిజనుల అభివృద్ధికి నక్సల్స్ వ్యతిరేకులని ప్రజలకు అర్థమైంది. - కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్



భారత్ మా సోదరుడే కానీ..

భారత్ మా సోదరుడే కానీ చైనా ఎన్నాళ్లకో దొరికిన బంధువు. కొత్త ప్రాజెక్టుల విషయంలో భారత్ ఆందోళన చెందుతున్నప్పటికీ మా దేశం మాత్రం చైనాతో కలిసి పనిచేస్తుంది. చైనా మాకు సాయం చేసేందుకు ఎప్పుడూ ముందుంటుంది. చైనాతో బంధాన్ని వదులుకునే ప్రసక్తే లేదు.

- చైనాలో మాల్దీవుల రాయబారి మహమ్మద్ ఫైజల్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.76.65	పాత ధర 68.66
కొత్త ధర రూ.76.83	కొత్త ధర 68.91
పెరుగుదల 18 పైసలు	పెరుగుదల 25 పైసలు



పళ్లు ఊడితే హృద్రోగాల ముప్పు!

బోస్టన్, మార్చి 24: మధ్య వయసులో పళ్లు ఊడితే హృదయ సంబంధ వ్యాధులు వస్తాయి. అమెరికాలోని టులానే యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ శాస్త్రవేత్తలు చెబుతున్న మాట ఇదీ. 45-69 ఏళ్ల మధ్య వయస్కుల్లో స్వల్ప వ్యవధిలో 2 లేదా అంతకంటే ఎక్కువ పళ్లు ఊడిపోతే హృద్రోగాలు వచ్చే ముప్పు ఎక్కువగా ఉన్నట్లు తమ పరిశోధనల్లో తేలిందని తెలిపారు.

కాలేయ కేన్సర్‌కు 'ప్రొటీన్' చెక్

బెర్న్, మార్చి 24: 'హిస్టిడిన్ ఫాస్ఫేటేస్ ఎల్‌హెచ్‌పీపీ'.. కాలేయ కేన్సర్ భరతం పట్టే ప్రొటీన్. స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌వర్సిటీ శాస్త్రవేత్తలు దీన్ని కనుగొన్నారు. ఆరోగ్యకర, కేన్సర్ సోకిన కణజాలాల్లో దాదాపు 4వేల ప్రొటీన్లను పరీక్షించగా కేన్సర్ సోకిన కణజాలంలో ఈ ప్రొటీన్ లేదని గుర్తించారు. కాలేయ కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించేందుకు ఈ ప్రొటీన్ ఉపయోగపడుతుందని, బయోమార్కర్‌గానూ పనిచేస్తుందని పరిశోధకులు తెలిపారు. ఎలుకల్లో పరీక్షించగా కేన్సర్ తగ్గుముఖం పట్టిందని వెల్లడించారు.

అనాథలు ఎంసెట్‌కు అర్హులు కాదా?

» దరఖాస్తులో కనిపించని ఆప్షన్.. స్వీకరించని వెబ్‌సైట్

» బీసీ-ఏలో చేర్చి 4 ఏళ్లు.. అందని కుల ధ్రువీకరణ పత్రం

» ఏప్రిల్4తో ముగియనున్న గడువు

హైదరాబాద్, మార్చి24 (ఆంధ్రజ్యోతి): మధులిక, మహాలక్ష్మి అనాథలు! ఓ అనాథాశ్రమంలో ఉంటూ ఇంటర్ చదువుతున్నారు. శుక్రవారం ఎంసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో ప్రయత్నించగా సాధ్యపడలేదు. కారణం.. అనాథ విద్యార్థులకోసం ప్రత్యేకంగా దరఖాస్తులో ఆప్షన్ లేకపోవడమే! ఎంసెట్ దరఖాస్తుకు గడువు సమీపిస్తుండంతో ఈ బాలికల మాదిరిగానే వేలాది మంది అనాథలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తమ పరిస్థితి ఏమిటో తెలియక కొందరు 'ఆంధ్రజ్యోతి'ని సంప్రదించారు. ఎంసెట్ దరఖాస్తుల్లో సామాజిక వర్గం ఆప్షన్‌ను నింపడం తప్పనిసరి. అనాథలను బీసీ-ఏలో చేరుస్తూ ప్రభుత్వం 2015లోనే నిర్ణయం తీసుకుంది. అయితే, ఇప్పటివరకూ వారికి కులధ్రువీకరణ పత్రాలను అధికారులు జారీ చేయలేదు. కుల ధ్రువీకరణ పత్రం కోసం తహసీల్దార్ కార్యాలయాలకు వెళితే.. తమకు ఇంకా జీవో రాలేదని అధికారులు చెబుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 4తో ఎంసెట్ దరఖాస్తుకు గడువు ముగియనున్న నేపథ్యంలో తమ పరిస్థితి ఏమిటని అనాథలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వేగంగా స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

గురుకుల మ్యాథ్స్ టీజీటీ అభ్యర్థుల ఎంపిక

» 805 మందితో జాబితా విడుదల

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యాలయాల్లో 805 ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (గణితం) పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తూ టీఎస్‌పీఎస్సీ శనివారం జాబితా విడుదల చేసింది. సాంఘిక, గిరిజన, మైనారిటీ, మహాత్మ జ్యోతిబా ఫూలే (బీసీ) గురుకుల విద్యాలయాల్లో 840 పోస్టుల కోసం ఇంతకుముందే 1:2 చొప్పున అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా వీరిలో 805 మందిని సాధారణ కేటగిరిలో, 35 మందిని దివ్యాంగుల కోటాలో ఎంపిక చేశారు. దివ్యాంగుల కోటాలో ఎంపికైన 35 మంది జాబితాను వైద్య పరీక్షల అనంతరం వెల్లడించనున్నారు. అలాగే, క్రైమ్ కానిస్టేబుల్ పోస్టులకునూ దేహదారుఢ్య, వైద్య పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల ఫలితాలను టీఎస్‌పీఎస్సీ శనివారం విడుదల చేసింది. ఈ నెల 28వ తేదీన నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపింది. అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గ్రేడ్-2లో రెండో విడత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈ నెల 28, 29వ తేదీల్లో మాసబ్‌ట్యాంక్‌లోని సాంకేతిక భవన్‌లో జరుగుతుందని టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది.

తిరుపతిరావు కమిటీ గడువు పొడిగింపు

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నిర్ధారణ కోసం ఏర్పాటుచేసిన తిరుపతిరావు కమిటీ గడువును మరో మూడు నెలలపాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే మూడు నెలల క్రితమే కమిటీ తన ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఏటా 10శాతం ఫీజు పెంచుకునే వెసులుబాటు కల్పించాలని అందులో సూచించింది. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కమిటీ ప్రతిపాదనలను పేరెంట్స్ అసోసియేషన్ వ్యతిరేకించింది. అయితే.. కమిటీ నివేదికపై నిర్ణయం తీసుకునేంతవరకు 2017-18 విద్యాసంవత్సరంలో వసూలు చేసిన ఫీజులనే 2018-19 విద్యాసంవత్సరంలోనూ వసూలు చేయాలని, ఫీజులు పెంచొద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

జేహెచ్‌ఎస్ కొనసాగుతుంది

» ఆరోగ్యశ్రీలో కలిపే ప్రసక్తి లేదు

» వెల్‌నెస్ సెంటర్లలో మందుల కొరత రానివ్వం

» జర్నలిస్టులకు ఆరోగ్య మంత్రి లక్ష్మారెడ్డి భరోసా



హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు/జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆరోగ్యశ్రీ పథకంలో విలీనం చేయబోమని ఆరోగ్య మంత్రి లక్ష్మారెడ్డి పునరుద్ఘాటించారు. శనివారం ఇక్కడ అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఈహెచ్‌ఎస్/జెహెచ్‌ఎస్ యథాతథంగా కొనసాగుతాయని చెప్పారు. ఈ పథకం బాధ్యతలు నిమ్స్ డైరెక్టర్‌కు అప్పగించటం తాత్కాలికమేనని, త్వరలోనే పూర్తిస్థాయి సీఈఓను నియమిస్తామని ప్రకటించారు. ఈ పథకం కోసం గోపీనాథ్ అధికారిని ప్రత్యేక ఈవోగా నియమించామని తెలిపారు. ఉద్యోగులు/జర్నలిస్టులకు ఏమైనా సమస్యలు ఉంటే, ఆయనను 78938-24242 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని చెప్పారు. ఉద్యోగులు/జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేస్తామని, సేవలను విస్తరిస్తామని చెప్పారు. ఇప్పటికే ఉన్న నాలుగు వెల్‌నెస్ సెంటర్లకు తోడు, కొత్తగా మరో నాలుగు వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. పరిపాలనా పరమైన కారణాలతోనే ఈహెచ్‌ఎస్/జేహెచ్‌ఎస్ సీఈఓ కె.పద్మను అక్కడి నుంచి బదిలీ చేసినట్లు మంత్రి చెప్పారు. ఈహెచ్‌ఎస్‌కు త్వరలో ప్రభుత్వం రూ.300 కోట్లు విడుదల చేస్తుందని, ఈ కారణంతోనే ఆమెను అక్కడి నుంచి తప్పించారని జరిగిన ప్రచారాన్ని మంత్రి ఖండించారు. మందుల కొనుగోళ్లలో నిబంధనలు పాటించ లేదని తమ దృష్టికి వచ్చిందని, పూర్తి సమాచారం అందాల్సి ఉందని చెప్పారు. పద్మ సీఈఓగా ఉన్నప్పుడు బాగా పని చేసినట్లయితే, వెల్‌నెస్ సెంటర్లలో మందుల కొరత ఉండొద్దు కదా అని వ్యాఖ్యానించారు. మందుల కొరత సమస్యకు 3-4 రోజుల్లో పరిష్కారం చూపుతామన్నారు.

ఆరోగ్యశ్రీలో చేర్చితే ఆందోళనలు

జేహెచ్‌ఎస్‌ను ఆరోగ్య శ్రీ పథకంలో చేర్చాలన్న యోచనను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని జర్నలిస్టు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. లేదంటే, రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. టీయూడబ్ల్యూజే సలహాదారుడు కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకం కింద రూ.360 కోట్లు ఇప్పటిదాకా ఖర్చు పెడితే అందులో జర్నలిస్టుల వాటా కేవలం 1.74 లక్షలు మాత్రమేనన్నారు. ఇది ప్రభుత్వానికి ఆర్థిక భారం కాదని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ఏ ఆస్పత్రులలో కూడా ఆదరించడంలేదని, కొన్ని వ్యాధులు పథకంలో లేవని ప్రస్తావించారు. మరోవైపు టీయూడబ్ల్యూజే నేతలు అసెంబ్లీలో మంత్రి కేటీఆర్‌తో సమావేశమయ్యారు. నాన్ అక్రిడేటెడ్ జర్నలిస్టులకు కూడా హెల్త్‌కార్డులు ఇచ్చే జీవోను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను పరిష్కరించాలని కేటీఆర్ అధికారులను ఆదేశించారు. ఏబీఎన్ విలేకరి కరీం భార్య వైద్య ఖర్చుల నిమిత్తం రూ.12 లక్షలు మంజూరు చేయాలని నేతలు కోరగా, కేటీఆర్ సానుకూలంగా స్పందించారు.

గ్రూపు-1లో డాక్టర్ లక్ష్మయ్య స్టడీ సర్కిల్ అభ్యర్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), మార్చి 24: ఏపీపీఎస్సీ గ్రూపు-1 ఫలితాల్లో డాక్టర్ లక్ష్మయ్య స్టడీ సర్కిల్ అభ్యర్థులు 38 మందికిపైగా ఉత్తీర్ణులయ్యారని సంస్థ చైర్మన్ పీవీ లక్ష్మయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూపు-1లో 22 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులను చైర్మన్ లక్ష్మయ్య, డైరెక్టర్ పి.పద్మజరాణి అభినందించారు. కాగా, లక్ష్మయ్య స్టడీ సర్కిల్, హిందూ సివిల్ సర్వీసెస్ అస్పిరెంట్స్ ఫోరం సౌజన్యంతో ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో సివిల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు లక్ష్మయ్య తెలిపారు.

లేగదూడపై లైంగిక దాడి!

» ముగ్గురు జార్ఖండ్ వాసుల అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 24: ఆ ముగ్గురూ చివరకు పశువును కూడా వదిలిపెట్టలేదు. జార్ఖండ్‌కు చెందిన ఒక యువకుడు, ఇద్దరు బాలురు ఒక లేగదూడపై ప్రకృతి విరుద్ధంగా లైంగిక చర్యకు పాల్పడ్డారు. కరీంనగర్ జిల్లా నాగులమల్యాలకు చెందిన రైతు తన పొలం వద్ద లేగదూడను కట్టివేసి ఉంచాడు. శుక్రవారం రాత్రి బినోద్ మారాండి(24), మరో ఇద్దరు బాలురు ఆ లేగదూడపై లైంగికదాడి చేశారు. ఈ ఘటనను గమనించిన యజమాని స్థానికుల సహకారంతో నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం వారిని రిమాండ్‌కు తరలించారు.

అది పేపర్ లీక్ కాదు.. మాల్‌ప్రాక్టీస్

» 25మందిపై క్రిమినల్ కేసులు..బాధ్యులపై కఠిన చర్యలు

» 'పది' పరీక్షల ఘటనలపై విద్యాశాఖ డైరెక్టర్ స్పష్టీకరణ

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో జరుగుతున్న ఘటనలు పేపర్ లీక్ కాదని, మాల్‌ప్రాక్టీస్ అని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ స్పష్టంచేశారు. ఈ ఘటనల్లో ఇప్పటికే 25 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. 29 మంది ఇన్విజిలేటర్లను, ఆరుగురు ప్రధాన పర్యవేక్షకులను, ముగ్గురు డిపార్ట్‌మెంటల్ అధికారులను విధుల నుంచి తొలగించినట్లు శనివారం ఆయన మీడియాకు తెలిపారు. మాల్‌ప్రాక్టీస్‌లో 18 మంది ప్రభుత్వ టీచర్లు, 11 మంది ఇతరులు ఉన్నట్లు వివరించారు. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే సర్వీస్ నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. పరీక్షల అనంతరం ఈ అంశంపై విచారణ కమిటీని నియమించి, నివేదికను హైకోర్టుకు నివేదిస్తామన్నారు. మాల్‌ప్రాక్టీస్ జరిగిన పాఠశాలల గుర్తింపును రద్దుచేసే దిశగా ఆలోచిస్తున్నామని తెలిపారు.

'పది' మూల్యాంకనం బహిష్కరణ

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 2 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనాన్ని బహిష్కరిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రకటించారు. సమస్యలు పరిష్కారమయ్యే దాకా మూల్యాంకనానికి హాజరుకాలేమని తేల్చిచెప్పారు. సమస్యలపై ఉమ్మడిగా పోరాడేందుకు 54 ఉపాధ్యాయ సంఘాలు.. జాయింట్ కౌన్సిల్ ఆఫ్ టీచర్స్ యూనియన్ (జేసీటీయూ)గా ఏర్పడ్డాయి. పీఆర్‌టీయూ అధ్యక్షుడు సరోత్తంరెడ్డి, ఎస్‌టీయూ అధ్యక్షుడు భుజంగరావు, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి అధ్యక్షతన శనివారం సంఘాల నేతలు సమావేశమై జేసీటీయూను ఏర్పాటు చేశారు. 9 తీర్మానాలను ఆమోదించారు.

ఫైనల్ ఎంబీబీఎస్ పార్ట్-2 ఫలితాలు విడుదల

విజయవాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఫైనల్ ఎంబీబీఎస్ పార్ట్-2 ఫలితాలను విడుదల చేసింది. ఈనెల 28వ తేదీ నుంచి కంపల్సరీ రొటేటరీ ఇంటర్న్‌షిప్ ప్రారంభమవుతుందని పరీక్షల కంట్రోలర్ డాక్టర్ భీమేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డబుల్ వాల్యూయేషన్ నిర్వహించినందున మార్కులను స్క్రూటినీ చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. మార్కుల రీటోటలింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.2000 చెల్లించి ఏప్రిల్ 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

మునిసిపాలిటీలుగా 21 నగర పంచాయతీలు

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 21 నగర పంచాయతీలను మునిసిపాలిటీలుగా మారనున్నాయి. ఈ మేరకు మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, సిద్దిపేట, మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలు కార్పొరేషన్లుగా మారనున్నాయి. మునిసిపాలిటీలుగా మారనున్న పంచాయతీలు... 1.బడంగ్‌పేట, 2.పెద్దఅంబర్‌పేట, 3.నర్సంపేట, 4.సత్తుపల్లి, 5.గజ్వేల్, 6.వేములవాడ, 7.కల్వకుర్తి, 8.ఇబ్రహీంపట్నం, 9.హుజూర్‌నగర్, 10. జమ్మికుంట, 11.నాగర్‌కర్నూల్, 12.పరకాల, 13.హుజూరాబాద్, 14.మధిర, 15.హుస్నాబాద్, 16.బాదేపల్లి, 17.అచ్చంపేట, 18.ఐజ, 19.దేవరకొండ, 20.కొల్లాపూర్, 21. ఆంథోల్-జోగిపేట ఉన్నాయి.

తెలుగులో 20 మార్కులకే పాస్

(మూడో పేజీ తరువాయి)

పాఠశాలల్లో 6వ తరగతిలో మొదట అమలు చేయనున్నారు. ప్రతి ఏడాది క్రమంగా అన్ని తరగతులకు అమలు చేస్తారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, కేంబ్రిడ్జి సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలల్లో 1-5వ తరగతి వరకు ద్విభాష సూత్రం అమల్లో ఉంది. వీరికి తెలుగు, ఇంగ్లిషు తప్పనిసరి చేయనున్నారు. ఎవరైనా విద్యార్థి తన మాతృభాషను నేర్చుకోవాలంటే దానిని ఆప్షనల్‌గా తీసుకోవాల్సి ఉంటుంది. 6 నుంచి 8 తరగతుల్లో త్రిభాష సూత్రం అమల్లో ఉంది. దీంతో ఇక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా తెలుగును అమలు చేయవచ్చు. 9-10 తరగతుల్లో ద్విభాష సూత్రం అమల్లో ఉంది కాబట్టి తెలుగు, ఇంగ్లిషును తప్పనిసరి చేయనున్నారు. 'రాష్ట్రంలో తెలుగు భాష నిర్లక్ష్యానికి గురవుతోంది. అందుకే తెలుగును తప్పనిసరి చేయాలని నిర్ణయించాం'అని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెడుతూ చెప్పారు.

- రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఇంటర్నేషనల్ స్కూళ్లకూ ఈ చట్టం వర్తిస్తుంది. 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగును నిర్బంధ పాఠ్యాంశంగా బోధించాల్సి ఉంటుంది.
- వచ్చే విద్యా సంవత్సరం ప్రాథమిక స్థాయిలో 1వ తరగతి నుంచి, ఉన్నత పాఠశాల్లో 6వ తరగతి నుంచి తెలుగు తప్పనిసరి చేయాల్సి ఉంటుంది.

కొత్తగా 119 బీసీ గురుకులాలు


(మూడో పేజీ తరువాయి)

సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటికే 142 గురుకులాలు పని చేస్తున్నాయి. అందులో 69 బాలుర, 73 బాలికల పాఠశాలలు, ఒక డిగ్రీ కాలేజీ, 19 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. తాజాగా, ప్రభుత్వం మరో 119 గురుకులాలను ప్రారంభించనుంది. సీఎం ప్రకటన చేశాక వచ్చే విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు. మొదటి సంవత్సరంలో 5, 6, 7 తరగతుల్లో ప్రవేశాలు ప్రారంభించనున్నారు. ఒక్కో తరగతిలో రెండు సెక్షన్లు, సెక్షన్‌కు 40 మంది చొప్పున 28,560 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. కొత్తగా ప్రారంభించనున్న ఒక్కో గురుకులానికి రూ.1.69 కోట్లు ఖర్చు కానుంది. మరోవైపు 4వేల బోధన, బోధనేతర పోస్టులు మంజూరు చేసే అవకాశం ఉంది. శనివారమే సభలో కొత్త గురుకులాలపై సీఎం ప్రకటన చేస్తారని బీసీ సంక్షేమ శాఖ అధికారులు భావించారు. కానీ, ప్రకటన వెలువడలేదు. దీనిపై ఆదివారం లేదా మంగళవారం సభలో ప్రకటించే అవకాశం ఉందని సంక్షేమశాఖ వర్గాలు తెలిపాయి.

ఇండియా బుల్స్ ఆస్తుల్లో బ్లాక్‌స్టోన్‌కు వాటా

ముంబై : భారత రియల్టీ మార్కెట్లో మరో భారీ డీల్ చోటు చేసుకుంది. ముంబైలోని రెండు కమర్షియల్ ఆస్తుల్లో 50 శాతం వాటాను అమెరికాకు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ బ్లాక్‌స్టోన్‌కు విక్రయించాలని ఇండియా బుల్స్ రియల్ ఎస్టేట్ (ఐబిఆర్ఇఎల్) నిర్ణయించింది. ఈ డీల్ విలువ రూ.4,750 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ మేరకు బ్లాక్‌స్టోన్‌తో స్పష్టమైన ఒప్పందం కుదిరినట్టు ఐబిఆర్ఇఎల్ తెలిపింది. ఈ నెలాఖరుకల్లా ఈ డీల్ పూర్తవుతుందని భావిస్తున్నారు. ఈ లావాదేవీ ద్వారా లభించే నిధులను కంపెనీ, అనుబంధ సంస్థల అప్పులు తీర్చేందుకు ఉపయోగించనున్నట్టు ఐబిఆర్ఇఎల్ తెలిపింది.

అప్పు పుట్టడం లేదు..



▸▸ చిన్న, మధ్య తరహా సంస్థలకు చుక్కలు చూపిస్తున్న బ్యాంకులు

▸▸ బడా కార్పొరేట్ సంస్థలకే చకచకా రుణాలు.. పిఎన్‌బి స్కామ్‌తో అతిజాగ్రత్త

బ్యాంకుల అతి జాగ్రత్త చిన్న వ్యాపార సంస్థల ప్రాణాలమీదకు తెస్తోంది. వ్యాపార రుణాల మంజూరు విషయంలో బ్యాంకుల నాన్చుడు ధోరణితో వ్యాపార, పారిశ్రామిక సంస్థలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఏటా ఆర్థిక సంవత్సరం ఆఖరులో వ్యాపార, పారిశ్రామిక సంస్థలకు నగదు అవసరాలు తీవ్రంగా ఉంటాయి. బ్యాంకులకు కూడా ఇదే ముమ్మర కాలం. అత్యంత కీలకమైన ఈ సమయంలోనే బ్యాంకులు రుణ వితరణ విషయంలో వ్యాపార, పారిశ్రామిక సంస్థలకు చుక్కలు చూపిస్తున్నాయి. బడా కార్పొరేట్ సంస్థల విషయంలో ఇబ్బందులు పెద్దగా లేకున్నా చిన్న, మధ్య తరహా సంస్థల పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది.

ఎందుకిలా?

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)లో స్కామ్ తర్వాత బ్యాంకు మోసాలకు చెక్ పెట్టేందుకు భారత రిజర్వు బ్యాంక్ (ఆర్‌బిఐ), కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు శ్రీకారం చుట్టడం, బ్యాంకులను రుణ మంజూరు విషయంలో ఆచితూచి వ్యవహరించాల్సిందిగా ఆదేశించడంతో పరపతి పంపిణీ వ్యవస్థ తీవ్రమైన కుదుపునకు గురైంది. బ్యాంకులు పరపతి వితరణను ఒక్కసారిగా కట్టుదిట్టం చేశాయి. వరుసగా బయటకొస్తున్న ఇతర రుణాల ఎగవేత కుంభకోణాలు కూడా బ్యాంకులను వణికిస్తున్నాయి. దాంతో కొత్త రుణాల మంజూరు విషయంలో నిర్ణయాలు తీసుకోవడానికి వెనకంజవేస్తున్నాయి.

90 రోజులకే..

రుణం తీసుకున్న సంస్థలు ప్రతి నెలా వాయిదాల్లో అసలు, వడ్డీ కలిపి బ్యాంకులకు చెల్లిస్తుంటాయి. ఈ చెల్లింపుల్లో క్రమం తప్పితే సదరు రుణాన్ని మొండిపద్దుగా బ్యాంకులు పరిగణిస్తాయి. 90 రోజులుగా అంటే గత మూడు నెలలుగా వసూలు కాని రుణాలన్నీ మొండిపద్దుల జాబితాలో చేరిపోతాయి. ఒక రుణ ఖాతా మొండిపద్దుగా మారితే అది బ్యాంకులపై ఒత్తిడి తీవ్రంగా పెరుగుతుంది. మొండిపద్దులకు వ్యతిరేకంగా కేటాయింపులు పెంచాల్సి ఉంటుంది. దీనివల్ల లిక్విడిటీ తగ్గుతుంది. చట్ట ప్రకారం బకాయిల వసూలుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వ్యాపార సంస్థకూ ఇబ్బందులుంటాయి. నిర్వహణ మూలధన (వర్కింగ్ క్యాపిటల్) అవసరాలకు అప్పు పుట్టే అవకాశం ఉండదు. బ్యాంకులు బ్లాక్‌లిస్ట్ చేస్తాయి. పరపతి తలుపులన్నీ మూసుకుపోతాయి. వ్యాపారం ఒక్కసారిగా కుప్పకూలుతుంది. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు, 90 రోజుల వరకు రుణ బకాయిలు చెల్లించకుంటే మర్నాడే రుణ ఖాతాలను మొండిపద్దుల జాబితాలో చేరుస్తున్నారు. దీని వల్ల సజావుగా సాగే వ్యాపారాలు కూడా సంక్షోభంలో పడే ప్రమాదం ఏర్పడింది. వ్యాపారంలో క్యాష్ ఫ్లో ఇబ్బందులు అనివార్యంగా ఉంటాయి. ఏ వ్యాపారమైనా ఒక చెయిన్‌లో భాగంగా ఉంటుంది. చెయిన్‌లో ఎక్కడ లింక్ తప్పినా తాత్కాలిక ఇబ్బందులు ఉంటాయి. దీనిని గుర్తించి వెసులుబాట్లు కల్పించకపోతే మోసగాళ్ళు, చట్టానికి కట్టుబడి వ్యాపారాలు చేసేవాళ్లను ఒకేగాటన కట్టివేసినట్టవుతుందని వ్యాపార సంఘాలు ఆందోళనవ్యక్తం చేస్తున్నాయి.

అసలే మార్చి నెల

సాధారణంగా ఆర్థిక సంవత్సరం ఆఖరు నెలలో అంటే మార్చిలో ఆర్థిక కార్యకలాపాలు పతాకస్థాయిలో ఉంటాయి. కార్పొరేట్ సంస్థలకు నగదు అవసరాలు భారీగా ఉంటాయి. వ్యాపారం పెంచుకోవడానికి ఇదే సరైన సమయం అని తెలిసినప్పటికీ బ్యాంకులు చొరవ చూపించడం లేదు. బ్యాంకులు మాత్రమే కాదు, ఆడిటర్లు కూడా లెక్కలను తేల్చకుండా నిదానంగా వ్యవహరిస్తున్నారని వ్యాపార సంస్థలు అంటున్నాయి.

కరెక్ట్ టైమ్‌లో...

భారత్ ఎగుమతి దిగుమతుల వ్యాపారం 50 లక్షల కోట్ల రూపాయలపైబడి ఉంటుంది. ఈ బిజినెస్‌లో క్రెడిట్ అత్యంత కీలకం. ట్రేడ్ క్రెడిట్, ఎల్‌సిలు, ఎల్ఒయుల విషయంలో బ్యాంకులు పూర్తిగా వెనక్కి తగ్గాయి. ఆర్‌బిఐ ఎల్ఒయులను నిలిపివేయాల్సిందిగా ఆదేశించింది. ఈ దెబ్బతో అధిక వడ్డీ రేట్లతో రుణాలను సమీకరించాల్సి వస్తోందని ఇంపెక్స్ వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిఎన్‌బి స్కామ్ పూర్వమున్న వడ్డీ రేట్లతో పోలిస్తే ఇప్పుడు 0.5-1 శాతం వరకు ఎక్కువ వడ్డీ రేటు చెల్లించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

బ్యాంకర్లలో భయం...

పిఎన్‌బి స్కామ్ తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలు బ్యాంకర్లలో భయాన్ని పుట్టిస్తున్నాయని సీనియర్ బ్యాంక్ అధికారి ఒకరు చెప్పారు. పిఎన్‌బి స్కామ్‌ను ప్రభుత్వం, రెగ్యులేటరీ సంస్థలు హ్యాండిల్ చేసిన విధానం దీనిపై మీడియాలో అడ్డగోలుగా వస్తున్న వార్తలతో యావత్ బ్యాంకింగ్ వ్యవస్థ విశ్వసనీయత దెబ్బతిన్నదని ఆయన అన్నారు. భయం కారణంగా బ్యాంకర్లు పరపతి పంపిణీ విషయంలో నిదానంగా వ్యవహరిస్తున్నట్టు ఆయన వివరించారు. ప్రభుత్వం, రెగ్యులేటరీ సంస్థల వైఖరి వల్ల కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్న చందంగా పరిస్థితి తయారైందని వ్యాఖ్యానించారు.

- హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్)

బిజినెస్‌కే శిక్ష ఇది..

నిజానికి కొన్ని త్రైమాసికాలపాటు మందగమనంలో ఉన్న ఆర్థిక రంగం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నది. ఎగుమతులు పెరుగుతున్నాయి. పారిశ్రామిక ఉత్పత్తుల రంగంలోనూ ఊర్ధ్వగమనం ఉంది. ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్లలోనూ కదలిక మొదలైంది. వడ్డీ రేట్లను తగ్గించడం ద్వారా ప్రభుత్వం వాతావరణాన్ని మరింత ఉత్తేజితం చేస్తుందని వాణిజ్య, పారిశ్రామిక రంగాలు ఆశించాయి. రేట్ల తగ్గింపు పక్కనబెట్టి ఇప్పుడు రుణాల మంజూరులోనే ప్రభుత్వరంగ బ్యాంకులు చుక్కలుచూపిస్తున్నాయి. రాజకీయ పలుకుబడి, సంబంధాల కారణంగా బడా కార్పొరేట్ సంస్థలు తమ రుణ అవసరాలను ఇబ్బందులు లేకుండా తీర్చుకుంటున్నాయి. చిన్న, మధ్య తరహా సంస్థలకు మాత్రం అలాంటి వెసులుబాటు లేకుండాపోయింది. మోసగాళ్లు, స్కామ్‌స్టర్స్‌కు పగ్గాలు వేయాల్సిందే, వారిని శిక్షించాల్సిందే.. అయితే ఆ పేరుతో నిజాయితీగా దశాబ్దాలుగా వ్యాపారం చేస్తున్న సంస్థలను కూడా ఇబ్బందులపాలు చేయడం ఏం న్యాయమని పారిశ్రామికరంగం ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.

టీవీ ప్యానెల్ విడిభాగాలపై సుంకం సగానికి తగ్గింపు

న్యూఢిల్లీ: ఎల్‌సిడి, ఎల్ఇడి టీవీ ప్యానెళ్ల తయారీలో ఉపయోగించే ఓపెన్ సెల్స్‌పై దిగుమతి సుంకాన్ని 5 శాతానికి తగ్గిస్తూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సిబిఇసి) నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటివరకు 10 శాతంగా ఉన్న సుంకాన్ని సగానికి తగ్గించారు. ఎల్‌సిడి, ఎల్ఇడి టీవీ ప్యానెళ్ల దిగుమతిపై సుంకాన్ని 7.5 శాతం నుంచి 15 శాతానికి పెంచుతున్నట్లు ఈసారి బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించింది. ఈ నేపథ్యంలో దేశీయంగా ఎల్‌సిడి, ఎల్ఇడి టీవీ ప్యానెళ్ల తయారీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.



రిలయన్స్ డిజిటల్ రూ.2 కోట్ల బహుమతులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎలక్ట్రానిక్స్ రిటైల్ సంస్థ రిలయన్స్ డిజిటల్ ఇటీవల నిర్వహించిన లక్కీ డ్రా పోటీలో విజేతలుగా నిలిచిన వారికి రెండు కోట్ల రూపాయల విలువైన బహుమతులను అందజేసింది. శనివారం సికింద్రాబాద్‌లోని మారేడ్‌పల్లిలో ఉన్న రిలయన్స్ డిజిటల్ స్టోర్‌లో జరిగిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. గ్రాండ్ ప్రైజ్ కింద మారుతి సియాజ్ కారును నగరానికి చెందిన ప్రణయ్ పొందారు. బంగారు నాణాలు, ఎల్ఇడి టీవీలు, జూసర్ మిక్సర్ గ్రైండర్లు వంటి బహుమతులను ఇతర విజేతలకు వివిధ పట్టణాల్లో అందజేశారు. గత ఏడాది నవంబరు 27వ తేదీ నుంచి ఈ ఏడాది జనవరి 1వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని రిలయన్స్ డిజిటల్, మైజియో స్టోర్లలో ఈ లక్కీ డ్రా పోటీని నిర్వహించారు. ఇందులో 55వేలకు పైగా కస్టమర్లు పాల్గొన్నారు.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,920	31,570	31,820	31,470	31,050
క్రితం ముగింపు	31,760	---	31,820	31,450	30,860
22 క్యారెట్లు	29,560	29,300	29,270	29,210	29,570
క్రితం ముగింపు	29,410	---	29,270	29,120	29,390
వెండి (కిలో)	39,600	40,000	39,500	39,600	41,600
క్రితం ముగింపు	39,500	---	39,500	39,600	41,600

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.60 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	300.00	చిత్తూరు	348.00
వరంగల్	302.00	చెన్నై	355.00
విజయవాడ	310.00	నమక్కల్	345.00
గోదావరి	310.00	బెంగళూరు	355.00
విశాఖపట్నం	315.00	ముంబై	340.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	62.00	విజయవాడ	63.00
కరీంనగర్	63.00	గుంటూరు	63.00
వరంగల్	62.00	ఒంగోలు	65.00
మహబూబ్‌నగర్	62.00	చిత్తూరు	71.00
కర్నూలు	62.00	నెల్లూరు	71.00
విశాఖపట్నం	67.00	అనంతపురం	64.00
గోదావరి	63.00		

మరింత వ్యవధి కావాలి

దక్కన్ క్రానికల్ కేసులో ఎన్‌సిఎల్‌టికి ఐఆర్‌పి దరఖాస్తు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (డిసిహెచ్ఎల్)కు వ్యతిరేకంగా రుణ సంస్థలు దాఖలు చేసిన కేసులో దివాలా నిర్ణయ ప్రక్రియను (ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రొసీడింగ్స్)ను పర్యవేక్షించేందుకు నియమితులైన ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రొఫెషనల్ (ఐఆర్‌పి) తన పని పూర్తి చేసేందుకు మరింత గడువు కావాలని కోరుతూ ఎన్‌సిఎల్‌టికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ కేసులో ముఖ్య ఫిర్యాదిగా ఉన్న కెనరాబ్యాంక్ కూడా ఐఆర్‌పిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మమతా బినానీ విజ్ఞప్తిని సమర్థించింది. బ్యాంకు తరపున సీనియర్ న్యాయవాది దీపక్ భట్టాచార్జీ ఎన్‌సిఎల్‌టికి తమ వాదనలు వినిపించారు. గతంలో శ్రేయి ఇన్‌ఫ్రా దాఖలు చేసిన పిటిషన్‌పై దివాలా తీర్మాన అమలు ప్రక్రియపై ఎన్‌సిఎల్‌టి స్టే ఇచ్చిన విషయాన్ని న్యాయవాది గుర్తుచేశారు. ఈ స్టే కారణంగా దివాలా తీర్మాన అమలు ప్రక్రియలో 89 రోజుల జాప్యం జరిగిందని ఆయన తెలిపారు. ఐఆర్‌పి తన పనిపూర్తి చేసేందుకు ఆమె కోరిన విధంగా మరింత వ్యవధిని ఇవ్వాలని ఆయన కోరారు. ఐఆర్‌పిని నెల రోజుల క్రితమే నియమించినకారణంగా కూడా మరింత వ్యవధి అవసరమవుతుందని భట్టాచార్జీ చెప్పారు. దక్కన్ క్రానికల్ హోల్డింగ్స్‌కు వ్యతిరేకంగా రుణసంస్థలు పెట్టుకున్న దివాలా అభ్యర్థనను ఆమోదించిన తర్వాత ట్రైబ్యునల్ ఇంటెరిమ్ రిజొల్యూషన్ ప్రొఫెషనల్‌ను నియమించడంతోపాటు 180 రోజుల మారటోరియం కూడా జారీ చేసింది. ఈ మారటోరియంను ఆ తర్వాత మరో 90 రోజులు పొడిగించారు. ఈ 90 రోజుల గడువు కూడా ఏప్రిల్ 14తో పూర్తి అవుతుంది. ఎన్‌సిఎల్‌టి మారటోరియంను పెంచని పక్షంలో కంపెనీ లిక్విడేషన్‌కు వెళ్లాల్సి వస్తుంది. మారటోరియం సమయంలో కంపెనీకి, కంపెనీ ప్రమోటర్లకు వ్యతిరేకంగా నడుస్తున్న కేసులన్నీ నిలిపివేయాల్సి ఉంటుంది. ఆటంకాలు లేకుండా ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ ఒక కొలిక్కి తెచ్చేందుకు వీలుగా మారటోరియం విధిస్తారు. ఐఆర్‌పిగా బాధ్యతలను స్వీకరించిన తర్వాత తన పనిలో సాధించిన పురోగతిని కూడా మమతా బినానీ ఎన్‌సిఎల్‌టికి తన దరఖాస్తులో వివరించింది. డిసిహెచ్ఎల్‌ను కొనుగోలు చేసేందుకు కొన్ని కంపెనీలు ముందుకు వచ్చాయని తాను ఆ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు వెల్లడించారు.

ఇల్లు వేలాన్ని ఆపండి...

హైదరాబాద్ రాజ్‌భవన్ రోడ్‌లోని తమ పూర్వీకుల బంగ్లాను వేలం వేయకుండా ఇండియాబుల్స్ హౌజింగ్ ఫైనాన్స్‌ను నిరోధించాలని కోరుతూ డిసిహెచ్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ టి వినాయక్ రవి రెడ్డి ఎన్‌సిఎల్‌టి ఎదుట పిటిషన్‌దాఖలు చేశారు. డిసిహెచ్ఎల్ ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రొసీడింగ్స్‌కు సంబంధించి మారటోరియం ఉన్న సమయంలో ఇండియాబుల్స్ తమ ఇంటిని వేలం వేసేందుకు ప్రయత్నిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇండియాబుల్స్ హౌజింగ్ ఫైనాన్స్‌కు దక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ 93 కోట్ల రూపాయలు బకాయి పడింది. చెల్లింపుల్లో విఫలం కావడంతో తాకట్టు ఆస్తుల విక్రయానికి ఉపక్రమించింది. న్యాయపోరాటం తర్వాత సుప్రీం కోర్టు నుంచి అనుమతి కూడా తెచ్చుకున్నప్పటికీ ఈలోపు కేసు ఎన్‌సిఎల్‌టిని చేరింది.



నీరవ్ మోదీ నివాసాల్లో రూ.26 కోట్ల ఆభరణాల స్వాధీనం

▸▸ డైమండ్ వాచ్ ఖరీదు రూ.1.4 కోట్లు

▸▸ డైమండ్ రింగ్ విలువ రూ.10 కోట్లు

ముంబై/న్యూఢిల్లీ: వజ్రాభరణాల వ్యాపారులు నీరవ్ మోదీ, అతడి దగ్గరి బంధువు మెహుల్ చోక్సీల నివాసాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ గత మూడు రోజులుగా ముంబై వర్లి ప్రాంతంలోని వీరి నివాసాల్లో జరిపిన సోదాల్లో మరో రూ.26 కోట్ల విలువైన ఆస్తులు బయట పడ్డాయి. ఇందులో పురాతన నగల విలువే రూ.15 కోట్ల వరకు ఉంటుందని అంచనా. దాదాపు రూ.1.4 కోట్ల విలువైన డైమండ్ వాచ్ కూడా ఈ సోదాల్లో బయటపడింది. ఇంకా ఎంఎఫ్ హుస్సేన్, అమ్రితా షేర్-గిల్, కెకె హెబ్బార్ వంటి ప్రముఖ చిత్రకారుల కుంచె నుంచి వెలువడిన రూ.10 కోట్ల విలువైన పెయింటింగ్స్‌నూ ఇడి, సిబిఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వజ్రాభరణాల్లో రూ.10 కోట్ల విలువైన ఒక డైమండ్ రింగ్ కూడా ఉన్నట్టు సమాచారం. దీంతో ఇప్పటి వరకు నీరవ్ మోదీ నివాసాలు, వ్యాపార సంస్థల నుంచి స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ రూ.7,664 కోట్లకు చేరింది. అయితే ఇవన్నీ కలిపినా నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు టోపి పెట్టిన రూ.13,000 కోట్లకు సరిపోవు. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న వీరిని భారత్ రప్పించేందుకు ఇడి, సిబిఐ ఇంటర్‌పోల్ సాయం కోరాయి.

నాగార్జున ఆయిల్‌పై బిపిసిఎల్ నజర్!



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నాగార్జున ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఒసిఎల్) కొనుగోలు కోసం ప్రభుత్వ రంగ రిటైల్ చమురు సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) బిడ్ దాఖలు చేసింది. ఎన్ఒసిఎల్‌కు సంబంధించి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) నియమించిన కమిటీ ఆఫ్ క్రెడిటార్స్ (సిఒసి).. బిపిసిఎల్ బిడ్‌ను ఆమోదించింది. బిపిసిఎల్‌తో పాటు సిటాక్స్ వెంచర్స్ కూడా ఎన్ఒసిఎల్ కోసం పోటీపడినప్పటికీ బిపిసిఎల్ మాత్రమే 10 కోట్ల రూపాయల సెక్యూరిటీ బిడ్‌ను సమర్పించింది. యుకెకు చెందిన సిటాక్స్ వెంచర్స్‌ను ఎస్‌జి శ్రీనివాస్ ప్రమోట్ చేశారు. ఎన్ఒసిఎల్ పునరుద్ధరణకు సంబంధించి నిధులను సమీకరించేందుకు సిటాక్స్ కొంతకాలంగా ప్రయత్నిస్తూ వస్తోంది. కాగా ఎన్ఒసిఎల్ కొనుగోలుకు సంబంధించి బిపిసిఎల్.. బ్యాంకర్లకు ప్రజెంటేషన్‌ను కూడా సమర్పించింది. ఈ సందర్భంగా ఎన్ఒసిఎల్‌ను పూర్తిగా కొనుగోలు చేయబోమని తెలిపింది. పూర్తిగా కొనుగోలు చేయలేకపోవటానికి ఎన్ఒసిఎల్, బూట్ కంపెనీ (హైదరాబాద్‌కు చెందినవి)ల మధ్య కుదుర్చుకున్న పలు ఒప్పందాలే ఇందుకు కారణమని పేర్కొంది. చెన్నైలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)లో రిజొల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పి), ఎన్ఒసిఎల్‌కు వ్యతిరేకంగా బూట్ కంపెనీల్లో ఒకటైన ఎస్ఇడబ్ల్యు ఇప్పటికే పిటిషన్‌ను దాఖలు చేసిందని బిపిసిఎల్ తెలిపింది. మరోవైపు మరికొన్ని పిటిషన్లు కూడా ఈ మధ్యనే దాఖలయ్యాయని పేర్కొంది. ఎన్ఒసిఎల్‌ను పూర్తిగా టేకోవర్ చేయాలంటే ముందు ఈ కేసులను బిపిసిఎల్ సెటిల్ చేసుకోవాల్సి ఉంటుంది.

చమురు, గ్యాస్ విభాగం కోసమే..

ఎన్ఒసిఎల్ చేపట్టిన 60 లక్షల టన్నుల సామర్థ్యం గల రిఫైనరీ ప్రాజెక్టుకు కాలం చెల్లిందని, ఈ ప్రాజెక్టు పట్ల తమకు అంతగా ఆసక్తి లేదని సిఒసికి బిపిసిఎల్ వెల్లడించింది. కేవలం చమురు, గ్యాస్ రంగానికి సంబంధించిన ప్రాజెక్టులను అమలు చేసేందుకే దీన్ని కొనుగోలు చేయాలనుకుంటున్నట్టు తెలిపింది. మరోవైపు ఎన్ఒసిఎల్ ప్రాజెక్టులో నాగార్జున ఆయిల్ వాటా కేవలం 500 ఎకరాలు మాత్రమేనని, మిగిలిన భూమి సిప్‌కోట్ చేతిలో ఉంది.

లాంకో ఇన్‌ఫ్రా రేసులో ఏడు కంపెనీలు

హైదరాబాద్: లాంకో ఇన్‌ఫ్రాటెక్‌ను కొనుగోలు చేసేందుకు ఏడు కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంకరప్టసీ కోడ్ కింద భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) గుర్తించిన 12 మొండి బకాయిల ఆస్తుల్లో లాంకో ఇన్‌ఫ్రాటెక్ ఒకటి. విద్యుత్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు లాంకో హోల్డింగ్ కంపెనీగా ఉంది. కంపెనీ రుణ భారం దాదాపు 45,000 కోట్ల రూపాయలుగా ఉంది. అప్పుల భారం అధికంగా ఉన్నప్పటికీ లాంకోను కొనుగోలు చేసేందుకు యుఎస్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఇంజిన్ క్యాపిటల్, ఎనర్జీ సంస్థ పెన్ ఎనర్జీ, ఒడిశాకు చెందిన మైనింగ్ సంస్థ త్రివేణి ఎర్త్‌మూవర్స్, బెంగళూరుకు చెందిన దివ్యశ్రీ డెవలపర్స్, కళ్యాణి డెవలపర్స్, సోలార్‌లాండ్ చైనా, క్యూబ్ హైవేస్ ఉన్నాయి. ఈ కంపెనీలు దాఖలు చేసిన బిడ్లను క్రెడిటార్స్ కమిటీ ఈ నెలాఖరు కల్లా ఆమోదించవచ్చని అంచనా.

కనిష్క్ గోల్డ్ ప్రమోటర్లపై ఇడి కేసు

న్యూఢిల్లీ : బ్యాంకులకు 824 కోట్ల రూపాయల మేర ఎగవేసిన కనిష్క్ గోల్డ్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసింది. ఈ సంస్థ ప్రమోటర్లు, మరికొందరిపై ఇప్పటికే సిబిఐ చీటింగ్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. భారీ రుణాల ఎగవేతలో మనీలాండరింగ్ కూడా జరిగినట్టు ఇడి భావిస్తోంది. ప్రమోటర్ డైరెక్టర్లు భూపేష్ కుమార్ జైన్ ఆయన భార్య నీతా జైన్‌తోపాటు చార్టర్డ్ అకౌంటెంట్లు తేజ్‌రాజ్ అచ్చా, అజయ్‌కుమార్ జైన్, సుమిత్ కేడియాపై కూడా పిఎంఎల్ఎ కేసులు నమోదు చేశారు. ఎస్‌బిఐ సారథ్యంలోని బ్యాంకుల కన్సార్షియం నుంచి 824 కోట్ల రూపాయల మేర రుణాలు తీసుకున్న కనిష్క్ గోల్డ్ ఇందుకు సంబంధించి పూచీగా పెట్టిన ఆస్తుల విలువ 156 కోట్ల రూపాయలు మాత్రమే ఉన్నట్టు ఎస్‌బిఐ వెల్లడించింది. ఇదిలా ఉండగా తన 10 ఎకరాల భూమిని కొనుగోలు చేస్తామని చెప్పి డాక్యుమెంట్లను తీసుకున్న భూపేష్ జైన్ వాటిని బ్యాంకులో తాకట్టు పెట్టి 42 కోట్ల రూపాయల రుణం తీసుకొని తనను మోసం చేశారని పుహళేంది అనే వ్యాపారి చెన్నై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కార్తి చిదంబరానికి మరింత ఊరట

ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసులో వచ్చే నెల 16 వరకు నో అరెస్ట్.. రక్షణ కల్పించిన ఢిల్లీ కోర్టు



న్యూఢిల్లీ: మాజీ ఆర్థిక మంత్రి పి చిదంబరం తనయుడు కార్తి చిదంబరానికి ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఢిల్లీ హైకోర్టు నుంచి బెయిల్ పొందిన మరుసటి రోజే మరింత ఊరట లభించింది. ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసులో వచ్చే నెల 16 వరకు కార్తీ చిదంబరాన్ని అరెస్ట్ చేయకుండా సిటీ కోర్టు ఆయనకు రక్షణ కల్పించింది. ఈ కేసుకు సంబంధించి కార్తీ యాంటిసిపేటరీ బెయిల్ దరఖాస్తుపై స్పందించేందుకు దర్యాప్తు ఏజెన్సీలు సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మూడు వారాల గడువు కోరాయి. ఈ నేపథ్యంలో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఒపి సైనీ కార్తికి ఊరట కల్పించారు.

దేశం విడిచి వెళ్లవద్దని ఆదేశాలు

కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని కార్తీ చిదంబరాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. అలాగే దర్యాప్తు ఏజెన్సీ కోరినప్పుడల్లా విచారణకు ప్రత్యక్షంగా హాజరుకావాలని నిర్దేశించింది. ఈ కేసు విచారణ సందర్భంగా కోర్టు ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కార్తి తల్లిదండ్రులు చిదంబరం, నళిని చిదంబరం ఆ సమయంలో కోర్టులో ఉన్నారు. ప్రముఖ న్యాయవాదులు కపిల్ సిబల్, గోపాల సుబ్రమణ్యం, సల్మాన్ ఖుర్షీద్, మోహిత్ మాథుర్ కార్తి తరఫున వాదించారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఎట్టకేలకు బెయిల్ పొందిన కార్తి.. ఆ తర్వాత కొద్ది గంటలకే ఎయిర్‌సెల్- మ్యాక్సిస్ కేసులో తనను అరెస్ట్ చేయకుండా రక్షణ కోరుతూ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో సిబిఐ 2011లో, ఇడి 2012లో కేసులు నమోదు చేశాయి.

ఓపెన్ టెండర్లతోనే విద్యుత్తు కొనుగోలు

కరెంట్ బిల్లులను పెంచబోం: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ టెండర్ల ద్వారానే విద్యుత్తును కొనుగోలు చేస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు. మరికొంత కాలం కొనుగోళ్లు కొనసాగుతాయని, 2024 నాటికి రాష్ట్రం మిగులు విద్యుత్తు సాధిస్తుందని వెల్లడించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ విద్యుత్తు బిల్లులను పెంచబోమని స్పష్టం చేశారు. శాసనసభలో శనివారం ప్రశ్నోత్తరాల సందర్భంగా విద్యుత్తు అంశంపై బీజేపీ సభ్యులు జి.కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రైవేటు సంస్థలతో పోలిస్తే ఎన్టీపీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలకే ఎక్కువ ధర చెల్లిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 48,487 మిలియన్ యూనిట్ల విద్యుత్తును కొనుగోలు చేశామని, ఇందుకోసం రూ.20,585 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. లో ఓల్టేజి సమస్య లేకుండా అన్ని చర్యల్ని తీసుకుంటున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాలకు 24 గంటల విద్యుత్తును అందిస్తున్నామని తెలిపారు.

• 193 బ్రిడ్జి కమ్ చెక్ డ్యాంల నిర్మాణం: తుమ్మల



రాష్ట్రంలో 193 బ్రిడ్జి కమ్ చెక్ డ్యాంలను నిర్మిస్తున్నట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెప్పారు. శాసన సభలో సభ్యుడు చల్లా ధర్మారెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ బ్రిడ్జి కమ్ చెక్‌డ్యాంల నిర్మాణంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. బ్రిడ్జి కమ్ చెక్ డ్యాంల నిర్మాణానికి రూ.647 కోట్ల వ్యయం అవుతుందని పేర్కొన్నారు.

• దేవరకద్రలో విద్యా సంస్థల ఏర్పాటు: కడియం



దేవరకద్ర నియోజకవర్గంలో పలు విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు ఉప ముఖ్యమంత్రి కడియం చెప్పారు. సభ్యుడు ఆళ్ల వెంకటేశ్వరరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ సీసీ కుంట వద్ద ప్రభుత్వ జూనియర్ కాలేజీ, దేవరకద్రలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

• ప్రమాదాల నివారణకు చర్యలు: మహేందర్‌రెడ్డి



రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రవాణా శాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి తెలిపారు. సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ, నిబంధనలను ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ బస్సులపై 9,439 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. 8 గంటల కంటే ఎక్కువ సమయం డ్రైవింగ్ చేసిన 118 మందిపై కేసులు పెట్టినట్లు వివరించారు.

• గిరిజన రిజర్వేషన్‌పై దోబూచులాట: జీవన్‌రెడ్డి

గిరిజన రిజర్వేషన్ బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై నెపం నెడుతూ దోబూచులాడుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఆయన శనివారం మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. కేసీఆర్ శిఖండి పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి టీఆర్ఎస్ మద్దతు తెలపాలన్నారు. పార్లమెంట్‌లో టీఆర్ఎస్ ఎంపీలు ప్లకార్డులను స్పీకర్ మొహం మీద పెట్టి నిరసన తెలపడం రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘించడమే అన్నారు.



అసెంబ్లీ కమిటీ హాల్లో కేటీఆర్‌ను సన్మానిస్తున్న నేత కార్మిక సంఘాల ప్రతినిధులు

పక్కా కార్యాచరణతో పారిశ్రామికీకరణ

- టీఎస్-ఐపాస్ కింద 3000 పరిశ్రమలు ప్రారంభం
- భీమా సిమెంట్, బిల్ట్‌లను పునరుద్ధరిస్తాం
- 4 రకాల విప్లవాలు సాధిస్తాం: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికీకరణ విషయంలో పక్కా కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు చెప్పారు. పారిశ్రామికీకరణపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలిపారు. పరిశ్రమలు, గనులు, ఐటీ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల పద్దులపై శనివారం శాసనసభలో సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి సుదీర్ఘంగా, సవివరంగా స్పష్టతనిచ్చారు. బీజేపీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వ్యాఖ్యలను ఎత్తిచూపుతూ సమాధానమిచ్చారు. ప్రైవేటు రంగంలోనూ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో 'టీఎస్-ఐపాస్'ను రూపొందించినట్లు తెలిపారు. "ఇప్పటివరకు 10,195 పరిశ్రమలకు రూ.1658.96కోట్ల రాయితీలిచ్చాం. టీ-ప్రైడ్ ద్వారా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకూ చేయూతనిస్తున్నాం. 8994 దళితుల పరిశ్రమలకు రూ.542 కోట్లు, 7976 ఎస్టీల పరిశ్రమలకు రూ.363 కోట్ల రాయితీలిచ్చాం" అని వివరించారు. "త్వరలో సిర్పూర్ పేపర్ మిల్లు ప్రారంభం కాబోతోంది. నల్గొండలోని భీమా సిమెంట్ ఫ్యాక్టరీని పునరుద్ధరించనున్నాం. వరంగల్‌లోని బిల్ట్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నాం" అని చెప్పారు.చిన్న, సూక్ష్మ పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)ను ఆదుకోవడానికి 'ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్' పేర సంస్కరణలు చేపడుతున్నామన్నారు.

అడ్డుకోవడం సమంజసమా?

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన టీఎస్-ఐపాస్ కింద ఇప్పటివరకు 6,200 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని, ఇప్పటికే 3000కు పైగా పరిశ్రమలు ప్రారంభమయ్యాయని కేటీఆర్ చెప్పారు. "హైదరాబాద్ బల్క్ డ్రగ్, లైఫ్ సైన్సెస్, ఫార్మాస్యుటికల్స్‌కు కేంద్రం. కాలుష్యం కారణంగా ముచ్చర్ల ఫార్మాసిటీని ఏర్పాటు చేయొద్దంటూ బీజేపీ సభ్యులు అడ్డుకుంటున్నారు. కాలుష్యం పేరిట అభివృద్ధిని అడ్డుకోవడం సమంజసమా?" అని ప్రశ్నించారు. "జాతీయ ఐటీ వృద్ధి రేటు 9% ఉంటే.. రాష్ట్ర ఐటీ వృద్ధి రేటు 14%గా ఉంది. ఐటీఐఆర్‌కు కేంద్రం నిధులిస్తామంటే తీసుకోవడం లేదని సభ్యులు విమర్శిస్తున్నారు. దీనికి రూ.3,650 కోట్లు ఇస్తామని కేంద్రం చెప్పింది. కానీ.. 3650 పైసలు కూడా ఇవ్వలేదు" అని కేటీఆర్ వివరించారు.

గనుల ద్వారా ఆదాయాన్ని గతంలో కంటే రెట్టింపు చేశామని కేటీఆర్ అన్నారు. గతంలో అన్ని రకాల మైనింగ్ ద్వారా రూ.1968 కోట్ల రాబడి వస్తే... తెలంగాణ ఏర్పడ్డాక నాలుగేళ్లలో రూ.3700 ఆదాయం వచ్చిందన్నారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని దళిత పారిశ్రామికవేత్తలకు రూ.150 కోట్ల రాయితీలను అందిస్తామన్నారు. అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, వివేకానంద్ తదితరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ.. నగరంలో వ్యూహాత్మక రోడ్డు అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాగా చేనేత రుణాలను మాఫీ చేసినందుకు మంత్రి కేటీఆర్‌కు పలువురు చేనేత కార్మికులు, ఆ రంగానికి చెందిన నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన్ను శాలువాతో సన్మానించి, మొమెంటో ఇచ్చారు.

కేంద్రం నయా పైసా ఇవ్వలేదు

నీతి ఆయోగ్ సిఫారసులను పట్టించుకోలేదు: ఈటల



హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్లు, మిషన్ భగీరథకు రూ.19వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫారసు చేసినా.. కేంద్రం నయా పైసా ఇవ్వలేదని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. 15వ ఆర్థిక సంఘానికి ఇప్పటి వరకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని తెలిపారు. ఆర్థిక సాయం కోసం ప్రతిపాదనలతో పాటు ఇతర విషయాలతో మెమోరండం సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. శనివారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. 14వ ఆర్థిక సంఘానికి రాష్ట్రం తరపున ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా విభిన్న పద్ధతిలో నివేదికలిచ్చామని తెలిపారు. కానీ కేంద్ర ఆర్థిక మంత్రి ఎందుకో పట్టించుకోలేదన్నారు.



రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన జోగినిపల్లి సంతోష్ కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న ఎంపీ బాల్క సుమన్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

అసైన్డ్ గొడవలకు చెల్లు!

కొన్నవారికే భూముల క్రమబద్ధీకరణ.. కొనుగోలుదారు పేదలైతేనే అవకాశం

- రీఅసైన్ చట్టానికి శాసనసభ ఆమోదం
- అన్ని పాఠశాలల్లో తెలుగు తప్పనిసరి
- డాక్టర్లకు ఏడాది నిర్బంధ సేవ ఎత్తివేత
- డీజీపీల నియామక అధికారం రాష్ట్రానిదే
- ఆరు కీలక బిల్లులకు అసెంబ్లీ ఓకే

హైదరాబాద్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కీలకమైన అసైన్డ్ భూముల చట్ట సవరణ, నిర్బంధ తెలుగు బోధన బిల్లు సహా మొత్తం ఆరు బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. అరింటినీ శాసనసభ శనివారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఆక్రమణలో ఉన్న అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణకు వీలుగా అసైన్డ్ భూముల సవరణ చట్టాన్ని తెచ్చారు. 2017 డిసెంబరు 31 నాటికి అసైన్డ్ భూములను కొనుగోలు చేసిన వారికి ఈ చట్టం వర్తిస్తుంది. చట్టం కింద ఆయా భూములను స్వాధీనం చేసుకొని, రీ అసైన్(వారికే మళ్లీ కట్టబెట్టడం) చేస్తారు. రికార్డుల శుద్ధీకరణలో తెలంగాణలో 22.5 లక్షల ఎకరాల అసైన్డ్ స్థలాలున్నాయని గుర్తించారు. ఇందులో 20 లక్షల ఎకరాలు ఒరిజనల్ అసైనీల చేతుల్లో ఉన్నాయి. మరో రెండున్నర లక్షల ఎకరాలు కొనుగోలు చేసిన వారి చేతుల్లో ఉన్నాయి. వీరి సంఖ్య 84,706గా గుర్తించారు. రెవెన్యూ శాఖ గుర్తించిన వారితో పాటు తాజాగా భూములు కొనుగోలు చేసినట్లు ఆధారాలు చూపించిన వారికీ క్రమబద్ధీకరణ ఫలాలు అందనున్నాయి. అసైన్డ్ ఆక్రమణలకు చట్టబద్ధత కల్పిస్తే రికార్డు అంతా క్లియర్‌గా ఉంటుందనే అభిప్రాయంతో రెవెన్యూ శాఖ ఉంది. సవరణ చట్టం మార్చి 5 నుంచి అమల్లోకి వస్తుంది. 2007 జనవరి 29 దాకా ఆక్రమణలో ఉన్నవారికే పాత అసైన్డ్ చట్టం వర్తిస్తోంది. తాజా చట్టంతో 2017 డిసెంబరు 31 నాటికి ఆక్రమణలో ఉన్నవారికి మేలు జరుగనుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల చేతుల్లో అసైన్డ్ భూములుంటే వారికే రీ అసైన్ చేయాలి. గిరిజనేతరుల చేతుల్లో ఉంటే ఎల్‌టీఆర్ వర్తింపచేయాలి. జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ ఈ భూములను రీ అసైన్ చేయనుంది. అసైన్డ్ క్రమబద్ధీకరణకు భూపరిమితి, ఆదాయ పరిమితులు విధించి, పేదలకే క్రమబద్ధీకరణ అవకాశం ఇస్తారు. రీఅసైన్ భూములను చట్టబద్ధంగా లీజ్‌కు ఇచ్చుకోవచ్చు. ఇది రియల్ ఎస్టేట్‌లో పలు తలనొప్పులకు పరిష్కారం ఇస్తుంది.



ఏడాది నిర్బంధం లేదు

ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏడాది నిర్బంధ సేవను ఎత్తేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. తెలంగాణ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులు నిర్బంధంగా గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వాసుపత్రుల్లో పని చేయాలి. లేకపోతే వారు చదివిన డాక్టర్ డిగ్రీకి విలువ ఉండదు. ప్రాక్టీస్ చేసుకునే అవకాశం ఉండదు. 2016 ఏప్రిల్ 30న జీవో 28 ద్వారా ఎంబీబీఎస్ విద్యార్థులకు మినహాయింపునిచ్చారు. పీజీ విద్యార్థులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కచ్చితంగా పని చేయాలన్న నిబంధన కారణంగా సర్కారుపై ఏటా రూ.82 కోట్ల భారం పడుతోంది. వారికి అంత వెచ్చించే బదులు శాశ్వత ప్రాతిపదికనే వైద్యులను నియమించుకోవాలన్న యోచనకు సర్కారు వచ్చింది. సరిపడ వైద్యులు అందుబాటులో ఉండటంతో నిర్బంధ సేవను రద్దు చేస్తూ చట్టం తెచ్చారు.

డీజీపీ నియామక అధికారం రాష్ట్రానిదే

డీజీపీ నియామక అధికారం పూర్తిగా రాష్ట్రానికే ఉండేలా చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు డీజీపీ నియామకానికి సంబంధించి కేంద్రం జోక్యం ఉండేది. డీజీపీ నియామక అధికారం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికే ఉండేలా చట్ట సవరణ చేస్తూ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశ పెట్టిన బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. డీజీపీ నియామకం ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జరిగేది. చట్ట సవరణ తర్వాత ఇకపై రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా డీజీపీని నియమించనుంది.

న్యాయవాదుల సంక్షేమ నిధి బిల్లుకూ..

న్యాయవాదులు, న్యాయవాదుల క్లర్కుల సంక్షేమ నిధికి ఇప్పటివరకు అమలులో ఉన్న రూ.50 వెల్ఫేర్ ఫండ్ స్టాంప్‌లను రూ.100కు పెంచుతూ రెండు చట్టాలను సవరించారు. సవరణ బిల్లులకు తెలంగాణ శాసనసభ, మండలి ఆమోద ముద్ర వేశాయి.

అసైన్డ్ బదలాయింపు చెల్లదు: టీడీపీ

అసైన్డ్ చట్ట సవరణ బిల్లును టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వ్యతిరేకించారు. ఈ బిల్లుకు 2007లోనే సవరణ తెచ్చారని, అది చెల్లదంటూ బొజ్జా తారకం కోర్టుకూ వెళ్లారన్నారు. విధి విధానాలపై స్పష్టత లేకుండా బిల్లు ఎలా పెడతారని ప్రశ్నించారు. హైదరాబాద్, రంగారెడ్డిల్లో అత్యంత విలువైన అసైన్డ్ భూములను రియల్ వ్యాపారులు కొన్నారని, వాటినీ రెగ్యులరైజ్ చేస్తారా? అని ప్రశ్నించారు. అన్యాక్రాంతమైన భూములు ధనవంతుల వద్ద ఉంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని, పేద వర్గాలకైతే వెట్ ల్యాండ్ గరిష్ఠంగా 2.5 ఎకరాలు, డ్రై ల్యాండ్ 5 ఎకరాల వరకూ రెగ్యులరైజ్ చేస్తామని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ చెప్పారు. 2007 అసైన్డ్ చట్టంపై కోర్టులో ఎటువంటి కేసులూ పెండింగ్‌లో లేవన్నారు.

పంచాయతీరాజ్ చట్టం సిద్ధం...

తండాలు, గూడేలకు పంచాయతీలుగా గుర్తింపు, స్థానిక సంస్థల ఎన్నికల విధానం కోసం ఉద్దేశించిన నూతన పంచాయతీరాజ్ చట్టానికి సంబంధించిన బిల్లు సిద్ధమైందని ఆ శాఖ మంత్రి జూపల్లి తెలిపారు.

స్పీకర్, మండలి చైర్మన్‌ను కలిసిన రాజ్యసభ ఎంపీలు

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ తరపున రాజ్యసభకు ఎన్నికైన ఎంపీలు జోగినిపల్లి సంతోష్ కుమార్, బండా ప్రకాష్ ముదిరాజ్, బడుగుల లింగయ్య యాదవ్‌లు అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి, శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, పలువురు ఎమ్మెల్యేలను కలిసి.. తమను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కాలనీల్లో ఆలయాల నిర్మాణానికి 10 లక్షలు

లీజుకు గిరిజన ప్రాంత ఆలయాల భూములు: ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నోటిఫైడ్ గిరిజన ప్రాంతాల్లోనూ ఆలయాల భూములున్నాయని, వాటిని లీజుకివ్వడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని ఆలోచిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. దేవాదాయ పద్దుపై శనివారం శాసన సభలో ఆయన వివరణ ఇచ్చారు. ఖమ్మం జిల్లా గిరిజన ప్రాంతాల్లోని భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నామని, వీలు కాని పక్షంలో లీజుకు ఇవ్వడం ద్వారా ఆదాయం సమకూర్చుకుంటామన్నారు. భూ రికార్డుల నవీకరణ, శుద్ధీకరణలో దేవాదాయ శాఖకు 87,230 ఎకరాల భూములున్నట్లు తేలిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 6,500 మంది అర్చకులను గుర్తించామని, వారిలో 4,770 మందికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వేతనాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

హరితహారంలో 81 కోట్ల మొక్కలు నాటాం: జోగు

హరిత హారం పథకం కింద రాష్ట్రంలో 81 కోట్ల మొక్కలు నాటామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి జోగు రామన్న చెప్పారు. శాసనసభలో అటవీ, పర్యావరణ శాఖ పద్దుపై ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లా, నియోజకవర్గంలో పండ్ల మొక్కలను నాటుతున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 కోట్ల మొక్కలకు జియో ట్యాగింగ్ చేశామన్నారు. రాష్ట్రంలో మొక్కల సర్వైవల్ రేటు 70 శాతంగా ఉందని వివరించారు.

భవిష్యత్తులో మేం అధికారంలోకి: కిషన్‌రెడ్డి



కలలు కనకండి: హోంమంత్రి నాయిని

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తులో తాము అధికారంలోకి వస్తామని, టీఆర్ఎస్ ప్రతిపక్ష స్థానంలో కూర్చుంటుందంటూ సభలో బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు మాటల యుద్ధానికి దారి తీసింది. హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి స్పందిస్తూ కలలు కనొద్దని, ఇప్పుడున్న ఐదు సీట్లు కూడా గెలవబోరంటూ ఘాటుగా సమాధానం చెప్పారు. తొలుత కిషన్‌రెడ్డి మాట్లాడుతూ "టీఆర్ఎస్ వచ్చిన తర్వాతే అభివృద్ధి జరిగినట్లు, అంతకుముందు ఏమీ జరగనట్లు మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో మేం అధికారంలో లేము. భవిష్యత్తులో అధికారంలోకి వస్తాం. అప్పుడు మీరు ప్రతిపక్షంలో కూర్చుని మాట్లాడండి" అని వ్యాఖ్యానించారు. వడ్డించిన విస్తరి వద్ద వచ్చి కూర్చున్నారని, మంత్రికి ప్రస్తుతం వెనుక, ముందు, ఇరువైపులా కూర్చున్నవారే గతంలోని ప్రభుత్వాల్లో ఉన్నారంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ ధనిక రాష్ట్రమని, ప్రతిదానికీ కేంద్రాన్ని దోషిగా చూపాల్సిన అవసరం లేదన్నారు. నాయిని మాట్లాడుతూ 'బీజేపీ అధికారంలోకి వచ్చే సమస్యే లేదు. ఎందుకు కలలు కంటరు. ఇప్పుడున్న ఐదు సీట్లు కూడా గెలవరు' అని మండిపడ్డారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ 'కిషన్‌రెడ్డి.. గతంలో మోదీతో కూడా కలిసి పనిచేశారు. మీకున్న పలుకుబడితో విభజన హామీలను ఎందుకు అమలు చేయించట్లేదు?' అని అడిగారు.

ఇదీ టీఆర్ఎస్ ఘనత

60 ఏళ్లలో 21 లక్షల ఎకరాలకు నీరిచ్చిన కాంగ్రెస్.. నాలుగేళ్లలోనే 22 లక్షల ఎకరాలకు నీరిస్తున్న టీఆర్ఎస్

ఈ ఏడాదిలోనే కాళేశ్వరం ఫలితాలు ప్రజలకు: హరీశ్

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): "60 ఏళ్లలో కాంగ్రెస్ పాలకులు సుమారు 21 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించారు. కానీ, టీఆర్ఎస్ మూడున్నరేళ్ల పాలనలోనే 12 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాం. ఈ ఏడాది చివరికి మరో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నాం" అని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుల పనుల పురోగతిపై స్వల్ప వ్యవధి చర్చ సందర్భంగా శనివారం శాసన మండలిలో సభ్యులు లేవనెత్తిన సందేహాలకు ఆయన సమాధానం ఇచ్చారు. "కాంగ్రెస్ పాలకులు కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టారు. ఎలాంటి పనులు చేయించకుండానే వందల కోట్ల నిధులను మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద ఖర్చు చేశారు. కానీ, సీఎం కేసీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరించి మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుని కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చేపట్టారు. దీని నిర్మాణంతో 18.25 లక్షల ఎకరాలకు కాల్వలు, సొరంగాలు, ఎత్తిపోతలు, రిజర్వాయర్ల ద్వారా నీటిని అందించనున్నామని, మరో 18.82 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నాం" అని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో మొత్తం 37.08 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా 30 వేల ఎకరాలు, అప్పర్ మానేరు ద్వారా 86,150 ఎకరాలు, కొండపోచమ్మ రిజర్వాయరు ద్వారా 6 లక్షల ఎకరాలు, అనికల్- చిట్యాల ప్యాకేజీ ద్వారా 2.43 లక్షల ఎకరాలు, మల్లన్నసాగర్ నుంచి సింగూరు రిజర్వాయర్ ప్యాకేజీ ద్వారా 2.80 లక్షల ఎకరాలు, భూపాలపల్లి చెరువు, దిల్వాపూర్, నిర్మల్, మధోల్ ప్రాంతాల్లో మరో 5.90 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందన్నారు. ఈ ఏడాదిలోనే కాళేశ్వరం ఫలితాలను ప్రజలకు అందించేందుకు రాత్రింబవళ్లు పనులు చేస్తున్నామన్నారు. ఎస్సారెస్పీ ఆయకట్టులో ఇప్పటి వరకు 6 లక్షల ఎకరాలకు మించి పారలేదని, కానీ, 9.68 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలన్నది తమ లక్ష్యమని చెప్పారు.



సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తే తమకు పుట్టగతులు ఉండవని భావించిన కాంగ్రెస్ నేతలు భూసేకరణ, పర్యావరణ అనుమతులు రాకుండా వివాదాలు సృష్టించి పనులను అడ్డుకుంటున్నారని, కేసుల మీద కేసులు వేయిస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. భూ సేకరణ ముందుకు సాగకుండా చనిపోయిన రైతుల పేరును ఫోర్జరీ చేసి కోర్టులో కేసులు వేయించారని ఆరోపించారు.

కాళేశ్వరానికి 3 కన్సార్షియాల సాయం

ప్రాజెక్టు పనుల కోసం వివిధ బ్యాంకుల నుంచి రూ.20,950 కోట్లను రుణంగా తీసుకున్నట్టు హరీశ్ తెలిపారు. ఇందులో ఆంధ్రాబ్యాంక్ కన్సార్షియం రూ.7,400 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కన్సార్షియం రూ.11,400 కోట్లు; విజయ బ్యాంక్ కన్సార్షియం నుంచి రూ.2,150 కోట్లు తీసుకున్నామని తెలిపారు. దీనికితోడు, సబ్ స్టేషన్లు, ఎలక్ట్రో మెకానికల్ పనుల ఫైనాన్స్ కోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.12,067 కోట్లు సమకూర్చడానికి అంగీకరించినట్టు వివరించారు.

రైతు ఆత్మహత్యలు తగ్గాయి

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ పాలకులే కారణమని మంత్రి హరీశ్ రావు విమర్శించారు. "ప్రాజెక్టులు నిర్మిస్తే రైతుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన కొనసాగిస్తుండడంతో రైతుల్లో భవిష్యత్తుపై భరోసా పెరిగింది. దీంతో, ఆత్మహత్యల సంఖ్య తగ్గింది" అని వివరించారు. బీజేపీ అధికారంలో ఉన్న మహారాష్ట్రలో రైతు ఆత్మహత్యలు 130 శాతం పెరిగితే, కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో 32 శాతం పెరిగాయని, కానీ, ప్రాజెక్టుల నిర్మాణంతో ఆత్మవిశ్వాసం కల్పించడం ద్వారా తెలంగాణలో రైతు ఆత్మహత్యలు 52 శాతం తగ్గాయని వివరించారు.

90 చెరువులపై ట్యాంక్‌బండ్‌లు: హరీశ్

రాష్ట్రంలోని 90 నియోజకవర్గ కేంద్రాల్లో ప్రధాన చెరువుల సుందరీకరణ చేపట్టామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లోని చెరువులు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నాయని, అయినా 20 చెరువులను రూ.217 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్‌లుగా మారుస్తున్నామని చెప్పారు. రూ.94 కోట్లతో మరో 63 చెరువుల సుందరీకరణ చేపట్టామన్నారు. రాచకొండ ఎత్తిపోతల పథకానికి ఈనెల 20న జీవో జారీ చేశామని, 4 నెలల్లో సర్వే పూర్తవుతుందని చెప్పారు. ఈ పథకం పూర్తయితే యాదాద్రి, రంగారెడ్డి జిల్లాల్లో సాగు నీరు, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు అందుతుందన్నారు.

మద్యం తాగితే.. ఇంట్లో పడుకోండి!

- వాహనాలు నడిపి.. ప్రాణాలు తీయొద్దు
- మరో 14 వేల పోలీసు నియామకాలు
- అసెంబ్లీలో హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి



హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): "తాగితే.. ఇంట్లో పడుకోండి. అంతేగానీ.. రోడ్లపై బండి నడిపి.. ఇతరుల ప్రాణాలు తీయొద్దు" అని రాష్ట్ర హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. అవసరమైతే బార్‌ల యజమానులే తాగిన వారిని ఇంటికి చేర్చేలా వాహనాలు సమకూరుస్తారని పేర్కొన్నారు. శాసనసభలో శనివారం హోం, కార్మిక, దేవాదాయ, అడవులు-పర్యావరణం, పరిశ్రమలు, సమాచార సాంకేతిక, కమ్యూనికేషన్లు, పర్యాటక, కళలు, సాంస్కృతిక శాఖల పద్దులపై చర్చలో నాయిని మాట్లాడారు. రాష్ట్రంలో మరో 14 వేల పోలీసు నియామకాలను త్వరలో చేపట్టనున్నట్లు, షీ టీమ్‌లను పెంచనున్నట్లు తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, దీంతో 31 జిల్లాలను అనుసంధానం చేస్తామని పేర్కొన్నారు. వ్యక్తుల నేరాల చిట్టా విప్పే పరికరాలు తెచ్చామన్నారు. మొబిలిటీ, శాంతిభద్రతల కోసం పెట్రోలింగ్ వాహనాలను వాడుతున్నామని, వీటి శబ్దం వింటేనే గూండాలు, రౌడీలకు గుబులు పుడుతోందని హోంమంత్రి తెలిపారు. సీసీ కెమెరాలతో నేరాలు తగ్గాయని, దొంగలు పట్టుబడుతున్నారన్నారని, ఇతర రాష్ట్రాల దొంగలూ రావట్లేదని చెప్పారు.

ఐదు రోజుల్లోనే పాస్‌పోర్టు వెరిఫికేషన్

పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌ను ఐదు రోజుల్లోనే పూర్తి చేస్తున్నామని చెప్పారు. శాంతిభద్రతలను పరిరక్షిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, పెట్టుబడులు కూడా వస్తాయని హోంమంత్రి పేర్కొన్నారు. పోలీసులు హైదరాబాద్‌ను సేఫ్ సిటీగా మార్చారని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీ కేసులు నమోదు చేశామన్నారు. సీఎం కేసీఆర్ పేర్కొన్న ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికి అనుగుణంగానే పనిచేస్తున్నామని చెప్పారు. పోలీసులకు బాడీ కెమెరాలు అమర్చడం ద్వారా పారదర్శకత పెంచామన్నారు. జైళ్లలోనూ సంస్కరణలు తెచ్చామని, ఖైదీలకు ఉపాధి కల్పిస్తున్నామని నాయిని వివరించారు. రాష్ట్రంలో అక్రమ జంతు వధశాలలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కానిస్టేబుళ్ల పదోన్నతులపై కోర్టులో కేసు ఉందని, అది వెకేట్ కాగానే వారికి న్యాయం చేసే ప్రయత్నం చేస్తామన్నారు.



ఆస్పత్రిలో 'అపోలో' చైర్మన్

గుండె రక్తనాళాల్లో బ్లాక్ గుర్తింపు

స్టంట్ అమరిక.. నేడు డిశ్చార్జ్

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆసుపత్రుల చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి(84) గుండెనొప్పితో స్థానిక థౌజండ్‌లైట్స్ ప్రాంతంలో ఉన్న తన ఆసుపత్రిలో చేరారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఆయనకు గుండెనొప్పి రావడంతో కుటుంబీకులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పరీక్షల అనంతరం గుండె రక్తనాళాల్లో ఒక బ్లాక్ ఉన్నట్లు గుర్తించిన వై.విజయచంద్రారెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం యాంజియోప్లాస్టీ చేసి స్టంట్‌ను అమర్చింది. ప్రస్తుతం కోలుకున్న ఆయన ఆదివారం డిశ్చార్జ్ అయ్యే అవకాశముందని అపోలో వర్గాలు తెలిపాయి.

లాలూకు జైలు మరో 14 ఏళ్లు!

- నాలుగో దాణా కేసులో రెండు వేర్వేరు శిక్షలు
- రూ.60 లక్షల జరిమానా ..సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు



రాంచీ, మార్చి 24: పశువుల దాణా కుంభకోణం నాలుగో కేసులోనూ లాలూ ప్రసాద్‌కు జైలు శిక్ష పడింది. 1990ల్లో డుమ్కా కోశాగారం నుంచి అక్రమంగా రూ.3.13 కోట్ల నగదు విత్‌డ్రా చేసిన కేసులో ఆయనకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం 14 ఏళ్ల జైలు శిక్ష, రూ.60 లక్షల జరిమానా విధించినట్లు న్యాయవాది రాకేశ్ ప్రసాద్ తెలిపారు. లాలూకు ఇప్పటివరకు మూడున్నరేళ్లు, ఐదేళ్ల చొప్పున శిక్షలు విధించగా.. ఈ సారి ఏకంగా 14 ఏళ్ల శిక్ష పడడం గమనార్హం. న్యాయమూర్తి శివపాల్ సింగ్ శనివారం వేర్వేరు సెక్షన్ల కింద రెండు తీర్పుల్లో లాలూకు ఏడేళ్ల చొప్పున శిక్ష, రూ.30 లక్షల చొప్పున జరిమానా విధించినట్లు వెల్లడించారు. రెండు శిక్షలు ఒకదాని వెంట ఒకటి అమలు చేయాలని న్యాయమూర్తి ఆదేశించినట్లు తెలిపారు. రూ.60 లక్షల జరిమానా చెల్లించలేకపోతే మరో రెండేళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఇదే కేసులో పశుసంవర్ధక శాఖ మాజీ రీజినల్ డైరెక్టర్ ఓపీ దివాకర్‌కు కూడా 14 ఏళ్ల జైలు, రూ.60 లక్షల జరిమానా విధించారు. విశ్రాంత ఐఏఎస్ ఫూల్‌చంద్ సింగ్‌తో పాటు మరో తొమ్మిది మంది ఉద్యోగులకు ఏడేళ్ల జైలు, రూ.30లక్షల చొప్పున జరిమానా విధించినట్లు న్యాయవాది వెల్లడించారు. ఏడుగురు దాణా సరఫరాదారులకు మూడున్నరేళ్ల జైలు, రూ.15 లక్షల చొప్పున జరిమానా విధించారు. దాణ కుంభకోణంలో రెండు కేసుకు సంబంధించిన శిక్షలో భాగంగా లాలూ ప్రస్తుతం బిర్సా ముండా జైల్లో ఉన్నారు. ఛాతీలో నొప్పిగా ఉండడంతో ఆయన్ను రాంచీలోని రాజేంద్ర ఆస్పత్రిలో చేర్పించారు. ఆయనపై ఐదో కేసు పెండింగ్‌లో ఉండడం గమనార్హం.

నాన్న ప్రాణాలకు ముప్పు: తేజస్వి

ఆయన అత్యంత భద్రమైన జైల్లో ఉన్నారు: సుశీల్

లాలూకు విధించిన భారీ శిక్షపై ఆర్జేడీ, బీజేపీలు పరస్పర విమర్శలకు దిగాయి. సీబీఐ విచారణను రాజకీయంగా ప్రభావితం చేశారని ఆర్జేడీ విమర్శించగా.. చట్టం తన పని తాను చేసుకుపోతుందని బీజేపీ పేర్కొంది. 'బీజేపీ నియంతృత్వ పోకడను అడ్డుకొనేందుకు దేశంలోని ఇతర పార్టీలను ఏకం చేసేందుకు ప్రయత్నించినప్పుడే మా నాన్న ప్రాణాలకు ముప్పు ఉంటుందని అంచనా వేశాం. పైకోర్టుల్లో ఆయనకు న్యాయం జరుగుతుంది. ఆయనపై కుట్ర పన్నినవారికి బిహార్ ప్రజలే బుద్ధి చెబుతారు' అని లాలూ కుమారుడు, బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ విలేకర్లతో చెప్పారు. ఈ వ్యాఖ్యలపై బిహార్ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత సుశీల్‌కుమార్ మోదీ ఘాటుగా స్పందించారు. "చట్టం తన పని తాను చేసుకుపోతుంది. దాణా కుంభకోణం కేసుల్లో ఇదేమీ మొదటి తీర్పు కాదు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిందే" అని స్పష్టం చేశారు. ఇక లాలూ ప్రాణాలకొచ్చిన ముప్పేమీ లేదని, అత్యంత భద్రమైన జైల్లో హాయిగా ఉంటున్నారన్నారు.

దేశం కోసం ప్రాణత్యాగం

- బందీగా వెళ్లి ప్రాణాలు కోల్పోయిన కల్నల్
- ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుల్ మెక్రాన్ సంతాపం



ట్రెబేస్ (ఫ్రాన్స్), మార్చి 24: ఉగ్రవాది చెరలో ఉన్న బందీలను విడిపించేందుకు తన ప్రాణాలను సైతం లెక్కచేయలేదు ఫ్రాన్స్‌కు చెందిన కల్నల్ అర్నాడ్ బెల్‌ట్రామ్. ఓ మహిళ ప్రాణాలు కాపాడేందుకు తాను బందీగా వెళ్లి ఉగ్రవాది చేతిలో ప్రాణాలు కోల్పోయారు. ఫ్రాన్స్‌లో శుక్రవారం ఓ సూపర్‌మార్కెట్‌లో చొరబడిన ఐఎస్ ఉగ్రవాది పలువురిని బందీలుగా చేసుకుని విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. మరో మహిళను బందీగా చేసుకునేందుకు ప్రయత్నించగా కల్నల్ అర్నాడ్.. తన గన్ అక్కడే వదిలి ఆమెకు బదులుగా బందీగా వెళ్లాడు. ఆ సమ యంలో తన ఫోన్‌ను ఆన్ చేసి లోపల ఏం జరుగుతుందనే విషయాన్ని పోలీసులకు తెలిసేలా చేశాడు. దాని ఆధారంగానే ఉగ్రవాదిని పోలీసులు మట్టుబెట్టారు. అయితే.. ఉగ్రవాది కాల్పులు జరపడంతో తీవ్ర గాయాలపాలైన ఆయన ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఉగ్రదాడిలో మరణించిన వారి సంఖ్య నాలుగుకు చేరింది. దేశం కోసం నిస్వార్థమైన సేవలందించిన కల్నల్‌ను ఆ దేశ ప్రజలందరూ నిజమైన హీరో అని ప్రశంసిస్తున్నారు. 'దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కల్నల్ అర్నాడ్ ధైర్యసాహసాలను దేశం ఎన్నటికీ మరచిపోదు. నిజమైన హీరోగా ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతారు' అని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుల్ మెక్రాన్ కొనియాడారు.

ఎస్పీ-బీఎస్పీ సఖ్యత చెదరదు

- చిచ్చు పెట్టేందుకు బీజేపీ ఎత్తులు
- బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి
- క్రాస్ ఓటేసిన ఎమ్మెల్యే సస్పెన్షన్
- జయాబచ్చన్ విజయోత్సవం రద్దు
- బీఎస్పీకి సంఘీభావంగా ఎస్పీ నిర్ణయం



లఖ్‌నవు, మార్చి 24: రాజ్యసభ ఎన్నికల్లో ఓటమి బీఎస్పీ-ఎస్పీ అవగాహనపై ప్రభావం చూపదని బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ఇరు పార్టీల మధ్య చిచ్చుపెట్టడానికి బీజేపీ ఎత్తులు వేసిందని చెప్పారు. బీజేపీకి ఓటు వేసిన బీఎస్పీ ఎమ్మెల్యే అనిల్ సింగ్‌ను ఆమె సస్పెండ్ చేశారు. సమాజ్‌వాది అభ్యర్థి జయా బచ్చన్ విజయోత్సవాన్ని పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ రద్దు చేస్తూ.. బీఎస్పీకి సంఘీభావం తెలిపిన కొద్దిసేపటికి మాయావతి ప్రకటన వెలువడడం విశేషం. మిత్రపక్ష అభ్యర్థి ఓటమి చవిచూసిన సందర్భంలో తాము వేడుకలు నిర్వహించడం భావ్యం కాదని ఆయన భావించారు. రాజ్యసభకు ఓ దళితుడిని ఎన్నిక కాకుండా బీజేపీ కుట్ర పన్నిందని ఆయన ట్విటర్‌లో ఆరోపించారు. కాగా, రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ ఆదేశాలకు వ్యతిరేకంగా బీజేపీకి ఓటు వేసిన ఆర్ఎల్‌డీ, నిషాద్ పార్టీ ఎమ్మెల్యేలు ఇద్దరిపై వేటు పడింది. వీరిద్దరూ ఆ పార్టీలకు ఏకైక ఎమ్మెల్యేలు కావడం విశేషం.

అదొక గొప్ప మానవ విషాదం!

- 'మానవ అక్రమ రవాణా' తీరుపై సీజేఐ ఆవేదన

న్యూఢిల్లీ, మార్చి 24: మానవ అక్రమ రవాణా అనేది గొప్ప మానవ విషాదమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా అన్నారు. మనుషులను ఎత్తుకుపోయి అమ్మివేస్తున్న కేసులు ఇటీవలి కాలంలో బాగా పెరిగిపోయాయన్న ఆయన, ఇదొక అపాయకర దశకు చేరుకొందని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మానవ అక్రమ రవాణా అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొన్నారు. 'సార్క్-లా' (న్యాయ వ్యవహారాల్లో దక్షిణాసియా ప్రాంతీయ సహకార సమాఖ్య), జస్టిస్ అండ్ కేర్ అనే స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. యువతరం ముందుకొస్తేనే సమాజంలోని ఏ సమస్య అయినా పరిష్కారం అవుతుందని ఈ సందర్భంగా జస్టిస్ దీపక్ మిశ్రా అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నేపాల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి సపనా ప్రధాన్ మల్లా, ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గీతా మిట్టల్, అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, జస్టిస్ అండ్ కేర్ న్యాయ వ్యవహారాల అధిపతి అడ్రియన్ ఫిలిప్స్ పాల్గొన్నారు.

12 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం

కిరోసిన్ పోసి నిప్పంటించిన దుండగులు

నాగాన్, మార్చి 24: అస్సాంలో దారుణం జరిగింది. పన్నెండేళ్ల మైనర్ బాలికపై ఐదుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆపై కిరోసిన్ పోసి నిప్పంటించారు. ఈ ఘటన నాగాన్ జిల్లాలోని ధానియాభేటి లాలుంగ్ గాన్‌లో జరిగింది. ఐదో తరగతి చదువుతున్న బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లోకి చొరబడిన దుండగులు సాముహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం కిరోసిన్ పోసి నిప్పంటించ డంతో తీవ్రగాయాల పాలైన బాలిక చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది.

సీబీఎస్ఈలో వ్యాయామం తప్పనిసరి

న్యూఢిల్లీ, మార్చి 24: వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని స్కూళ్లలో ఒక పిరియడ్‌ను వ్యాయామానికి కేటాయించాలంటూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల శారీరక, మానసిక, భావోద్వేగ, సామాజిక, ఆధ్యాత్మిక స్థితిగతుల సమతౌల్యానికి ఇది దోహదపడుతుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. తొమ్మిది నుంచి పన్నెండు తరగతుల విద్యార్థులకు తప్పనిసరిగా 'వ్యాయామం - ఆరోగ్యం' పిరియడ్ ఉండాలని సూచించింది.

సర్వశిక్ష అభియాన్‌లో టీచర్ల కొరత

న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్ కింద వివిధ రాష్ట్రాల్లో భర్తీ చేయాల్సిన ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మానవ వనరుల శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫారసు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో భారీగా ఖాళీలు ఉన్నాయని కమిటీ గుర్తించింది. రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ పథకం కింద ఏపీలో 96 మంది ప్రధానోపాధ్యాయులు, 5,992 మంది ఉపాధ్యాయులు ఉండాల్సింది.. ప్రస్తుతం ఒక ప్రధానోపాధ్యాయుడు, 1,858మంది ఉపాధ్యాయులే ఉన్నారని కమిటీ తెలిపింది. తెలంగాణలో 8 మంది హెడ్‌మాస్టర్లకుగాను ఏడుగురు, 4,167మంది టీచర్ల స్థానంలో కేవలం 1,511 మంది మాత్రమే ఉన్నారని పేర్కొంది. మధ్యాహ్న భోజన పథకానికి ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీన్ చానల్ స్కీం వ్యవస్థకు కితాబునిచ్చింది.

కాంగ్రెస్‌తో సీపీఎం దోస్తీ?

బీజేపీని ఓడించడమే లక్ష్యం!

'ప్రజా ఫ్రంట్'లతో ఫలితం లేదు

ఇతర పార్టీలతో జత కట్టాలన్న కరత్



న్యూఢిల్లీ, మార్చి 24: దేశంలో బీజేపీ ప్రబల శక్తిగా ఎదుగుతుండడంతో ఇతర పార్టీలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది! ఈ పరిస్థితుల్లో సీపీఎం వైఖరి కూడా మారుతోంది! తాజాగా ఆ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ కూడా తన వైఖరి మార్చుకున్నారు! రాబోయే ఎన్నికల్లో బీజేపీని గద్దె దించేందుకు అవసరమైతే కాంగ్రెస్ పార్టీతో దోస్తీకి సిద్ధమని స్పష్టం చేశారు. పార్టీ అనుబంధ పత్రిక 'పీపుల్స్ డెమొక్రసీ'లో రాసిన సంపాదకీయం 'ఉత్తరప్రదేశ్ సూచికలో' ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. 'బీజేపీని ఓడించగలిగే సత్తా ఉన్న ప్రాంతీయ పార్టీలకూ మా మద్దతు ఉంటుంది. బీజేపీని గద్దె దించేందుకు కాంగ్రెస్‌కు తిరిగి మద్దతిస్తాం' అని పేర్కొన్నారు. బీజేపీ వ్యతిరేక శక్తులను కూడగట్టాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. 'వామపక్షాలు బలహీనపడ్డ త్రిపుర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ వ్యతిరేక పార్టీలతో కలిసి పనిచేస్తాం. డీఎంకే, ఆర్జేడీ వంటి పార్టీలు ఇప్పటికే కాంగ్రెస్‌తో ఉన్నాయి. మిగతా ప్రాంతీయ పార్టీల్లో ఒక స్పష్టత రావాల్సి ఉంది. అలాంటి పార్టీలను బీజేపీకి వ్యతిరేకంగా ఒక్కతాటిపైకి తీసుకురావాల్సిన అవసరముంది' అని వివరించారు. బీజేపీని ఎలా ఎదుర్కోవాలనే పాఠాన్ని యూపీ ఉప ఎన్నికలు నేర్పించాయన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిపాదించిన 'ప్రజా ఫ్రంట్', ఇతర మూడో కూటములతో ఎలాంటి ప్రయోజనం లేదని కరత్ స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్‌తో పొత్తును తీవ్రంగా వ్యతిరేకించిన ఈయన ఇప్పుడిలా మాట్లాడడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మరోవైపు కేరళ సీపీఎం కార్యదర్శి బాలకృష్ణన్ కూడా బీజేపీని ఓడించడానికి కాంగ్రెస్‌కు ఓటేసేందుకూ సిద్ధమని ప్రకటించడం గమనార్హం.

అవిశ్వాస తీర్మానానికి సై

తాడోపేడో తేల్చుకోవాలని కేంద్రం నిర్ణయం

- అమిత్‌షా సంకేతాలు.. అన్నాడిఎంకే, టీఆర్ఎస్‌లకు హామీ
- బీజేపీ కార్యాలయంలో పార్లమెంటరీ పార్టీ సమావేశం
- పార్లమెంట్ ప్రతిష్టంభనపై ఎంపీల ఆందోళన
- పథకాలపై చర్చకు కాంగ్రెస్ భయపడుతోంది: అమిత్ షా



న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు మంగళవారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో రాజకీయ పరిణామాలు వేగవంతం కానున్నాయి. తెలుగుదేశం, వైసీపీతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూడా అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇవ్వడంతో ప్రభుత్వం ఇక వెనుకాడకూడదని నిర్ణయించుకుంది. అవిశ్వాస తీర్మానానికి ప్రభుత్వం భయపడుతుందనే సంకేతాలు రావడంతో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించింది. బీజేపీ కార్యాలయంలో జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశానికి బీజేపీ ఎంపీలంతా హాజరు కావడం, ఇష్టాగోష్ఠి చర్చలో చాలా మంది పార్లమెంట్ ప్రతిష్టంభనపై ఆందోళన వ్యక్తం చేయడంతో అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవాలనే అధిష్టానం నిర్ణయానికి వచ్చింది. అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగకుండా తామే అన్నాడీఎంకే, టీఆర్ఎస్‌లను పురికొల్పుతున్నామనే విమర్శలు రావడం కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. 'మనకు పూర్తి మెజారిటీ ఉంది. అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనేందుకు మనమెందుకు భయపడాలి' అని పలువురు ఎంపీలు అభిప్రాయపడ్డట్లు సమాచారం. దీంతో అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. పార్లమెంట్ సమావేశాలు జరిగిన వెంటనే అన్నాడిఎంకే, టీఆర్ ఎస్‌లకు నిర్దిష్టమైన హామీ ఇవ్వవచ్చునని కూడా తెలుస్తోంది. పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం తేవాల్సిందిగా శనివారం అస్సాంలోని గువహటిలో ఒక ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తూ బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా సవాలు విసరడమే మారిన బీజేపీ వైఖరిని సూచిస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు. కాగా, పార్లమెంట్ ఉభయ సభలు సజావుగా సాగకుండా ప్రతిపక్షాలు అడ్డుకోవడంపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా విరుచుకుపడ్డారు. బీజేపీపై రోజురోజుకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని ఆరోపించారు. అందుకే ఒక్క నిమిషం కూడా సభ జరగకుండా విపక్షాలు సభను అడ్డుకుంటున్నాయన్నారు. గువహటిలో జరిగిన బూత్‌స్థాయి ఇన్‌చార్జిల సమావేశంలో పాల్గొన్న అమిత్ షా విపక్షాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వంపై లోక్‌సభలో పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో కొత్తగా తీసుకొచ్చిన హెల్త్‌స్కీం, రైతులకు మద్దతు ధర వంటి కీలక పథకాలపై సభలో బీజేపీ చర్చించాలని భావిస్తోందని తెలిపారు. కానీ ఈ రెండు పథకాలపై చర్చించేందుకు కాంగ్రెస్ భయపడి సభను అడ్డుకుంటోందని ఆరోపించారు. పార్లమెంట్‌లో చర్చ జరగకపోయినా వాటిని ప్రజల్లోకి తీసుకెళ్తామని అమిత్ షా స్పష్టం చేశారు. కాగా ఈశాన్య రాష్ట్రాల్లోని 25 లోక్‌సభ స్థానాలకు కనీసం 21 స్థానాలను కైవసం చేసుకోవాలని అమిత్ షా లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా పార్టీ కార్యకర్తలు, నేతలు కృషిచేయాలని దిశా నిర్దేశం చేశారు.

ఐఐటీకి భరోసా ఏదీ?

(మూడోపేజీ తరువాయి...)

నుంచి గానీ ఎలాంటి ఆర్థిక సాయం అందడం లేదు. అబ్బాయిల చదువులకు ఫీజులు కట్టేందుకు ఆ తల్లిదండ్రులు ఉన్న ఆ కొద్దిపాటి భూమినీ అమ్ముకున్నారు. అయినా ఫీజు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీకాంత్, ప్రశాంత్ మాత్రమే కాదు.. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీటు సాధిస్తున్న వేలమంది తెలంగాణ విద్యార్థులది ఇదే దైన్యం! మరోవైపు రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరిన విద్యార్థులకు మాత్రం ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందిస్తోంది. మెరిట్ పరంగా రాష్ట్రంలోని టాప్ ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరే విద్యార్థులతో పోల్చితే.. ఐఐటీ, ఎన్ఐటీల్లో చేరే విద్యార్థుల స్థాయి ఎంతో ఎక్కువ! అయితే, ఇక్కడి ఇంజనీరింగ్ కాలేజీలో సీటు సాధించిన విద్యార్థులు రీయింబర్స్‌మెంట్‌తో ప్రయోజనం పొందుతుండగా.. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు మాత్రం తీవ్ర నిరాశే ఎదురవుతోంది. దీంతో ప్రతిష్ఠాత్మక జేఈఈలో ఉత్తమ ర్యాంకులు సాధించడమే తాము చేసిన తప్పా? అని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఐఐటీల్లో ఏడాదికి ట్యూషన్ ఫీజు రూ.2లక్షలుగా, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో వార్షిక ట్యూషన్ ఫీజు రూ. 1.25లక్షలుగా ఉంది. ఏటా తెలంగాణ నుంచి ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీటు సాధించే విద్యార్థుల సంఖ్య 3500 వరకు ఉంటోంది. ఈ విద్యార్థుల్లో 50-60 శాతం మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారేనని అంచనా. ఈ నేపథ్యంలో ఇంత భారీ మొత్తం ఫీజు చెల్లించలేక విద్యార్థుల తల్లి దండ్రులు నానా అవస్థలు పడుతున్నారు. రాష్ట్రంలోని సీబీఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో ఫీజు రూ. 1,13,500గా ఉంది. ఇక్కడ చేరిన విద్యార్థులకు ప్రభుత్వం పూర్తి ఫీజును రీయింబర్స్‌మెంట్ రూపంలో ఇస్తోంది. ఇతర టాప్ కాలేజీల్లో సుమారుగా రూ. 80వేల నుంచి రూ.లక్ష వరకు ఫీజు ఉంది. వీటిలో చేరిన విద్యార్థుల్లో 10వేల లోపు ర్యాంకు వారికి పూర్తి ఫీజును అందిస్తోంది. దీంతో దేశవ్యాప్త ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించడం ద్వారా ఐఐటీ, ఎన్ఐటీల్లో సీటు సాధిస్తే.. తమకు ప్రభుత్వం నుంచి పైసా సాయం అందడం లేదని ఆ విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కూడా ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో తెలంగాణ నుంచి ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీల్లో సీటు సాధించిన విద్యార్థులకు అయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరించాలని, ఇక్కడ ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరిన విద్యార్థులకు ఇచ్చినట్టుగానే వారికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ట్యూషన్ ఫీజే రూ.8 లక్షలు

2016-17 విద్యా సంవత్సరంలో తెలంగాణ నుంచి 3447 మంది విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీలో ప్రవేశం పొందారు. వీరిలో ఐఐటీల్లో చేరినవారు 904 మంది, ఎన్ఐటీ, ఐఐఐటీల్లో చేరినవారు 2543 మంది ఉన్నారు. నాలుగేళ్ల ట్యూషన్ ఫీజుకు ఐఐటీల్లో రూ.8 లక్షలు, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో రూ. 6లక్షలు చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వాల నుంచి ఎలాంటి సాయం దక్కకపోవడంతో ఫీజు కట్టే స్థోమత లేని తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలకు వచ్చిన గొప్ప అవకాశాన్ని వదులుకోలేక అప్పులు చేసి ఫీజులు కడుతున్నారు.

మమ్మల్ని ఆదుకోండయ్యా

"నాకు ఇద్దరు కొడుకులు. ప్రశాంత్ ఐఐటీ-గాంధీనగర్‌లో, శ్రీకాంత్ ఐఐఐటీ-గువహటిలో చదువుతున్నారు. ఇద్దరూ గొప్ప చదువులు చదువుతున్నందుకు సంతోషంగానే ఉన్నా.. ఫీజులు చెల్లించేందుకే నానా ఇబ్బందులు పడుతున్నాం. ఇద్దరికీ ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్ అందడం లేదు. పిల్లల చదువుకోసం ఉన్న భూమినంతా అమ్మేశాను. అయినా ఫీజు చెల్లించేందుకు అప్పులు చేయాల్సి వస్తోంది. మాలాంటి వారి విషయంలో ప్రభుత్వం దయతో స్పందించాలి. బీటెక్ విద్యార్థులకు ఇస్తున్నట్టుగానే ఐఐటీ, ట్రిపుల్ ఐటీలో చదివే విద్యార్థులకు కూడా ఫీజులను సర్కారే చెల్లించాలని వేడుకుంటున్నాం"

-ధర్మయ్య. శ్రీకాంత్, ప్రశాంత్‌ల తండ్రి, నల్లగొండ

భయం వేస్తోంది

"మా అబ్బాయి ఇంటర్ పూర్తిచేశాడు. జేఈఈకి సిద్ధమవుతున్నాడు. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ఎక్కడోచోట సీటు సాధిస్తాడనే నమ్మకం ఉంది. అయితే, అక్కడ ఫీజులను ఊహించుకుంటేనే భయం వేస్తోంది. అంతంత ఫీజులను ఎలా చెల్లించాలనేదానిపై ఇప్పటి నుంచే ఆలోచిస్తున్నాను. అబ్బాయి సీటు సాధించినా.. చేర్పిస్తానని గట్టిగా చెప్పలేను. ఈ విషయంలో మాలాంటి వాళ్లకు ప్రభుత్వం అండగా ఉంటే బాగుంటుంది"

-మల్లేశం, విద్యార్థి తండ్రి





ప్రపంచవ్యాప్తంగా శనివారం ఎర్త్‌అవర్ పాటించారు. పర్యావరణ మార్పులపై చైతన్యం తీసుకొచ్చేందుకు 2007లో ఈ కార్యక్రమాన్ని ఆరంభించారు. ఇందులో భాగంగా రాత్రి గంటపాటు లైట్లు ఆర్పివేశారు. ఎర్త్‌అవర్ సందర్భంగా అంధకారంలో ఉన్న ఆస్ట్రేలియాలోని సిడ్నీ హార్బర్, ఒపెరా హౌస్‌ను ఇక్కడ చూడొచ్చు.

నోట్ల రద్దుకు 500 రోజులు

నేటికీ తీరని ఇబ్బందులు

- బ్యాంకింగ్ రంగంపైనా ప్రభావం
- ఇదో మతిమాలిన పథకం: రాహుల్

న్యూఢిల్లీ, మార్చి 24: నరేంద్ర మోదీ పెద్ద నోట్ల రద్దు పథకం తెచ్చి శనివారానికి 500 రోజులు..నవంబరు 8, 2016.... దేశ ప్రజలంతా ఎవరి పనుల్లో వాళ్లున్న టైములో ఆకస్మికంగా బాంబు పేల్చారు ప్రధాని నరేంద్ర మోదీ. అప్పటి వరకూ చెలామణీలో ఉన్న రూ 500, 1000 నోట్లను రాత్రికి రాత్రే రద్దు చేసేస్తున్నామన్నారు. ఫలితం... ప్రజల వద్ద పెద్ద నోట్ల రూపేణా ఉన్న నగదు చిత్తు కాగితాల్లా మారిపోయింది. రూ 100, రూ 50 నోట్లు మాత్రమే చెల్లుతాయని ప్రకటించడంతో వాటి కోసం జనం ఎగబడ్డారు. ఆ రాత్రే ఏటీఎంలన్నీ ఖాళీ.. ఆ తరువాత దేశ ప్రజలు సుమారు రెండు నెలల పాటు ఎడతెగని కష్టాలు పడ్డారు. ఎర్రటి ఎండలో గంటల తరబడి ఏటీఎంల వద్ద బారులు తీరిన ప్రజల దృశ్యాలు సర్వసాధారణమయ్యాయి. బ్యాంకుల్లో నుంచి పెద్ద మొత్తాలు విత్ డ్రా చేయలేని పరిస్థితి. రోజుకో కఠిన నిబంధనతో అన్నింటినీ కట్టిపడేయడంతో ప్రజల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.నల్లధనం అరికట్టడానికే ఇది తెచ్చామని తొలి రెండు రోజులూ చెప్పిన ప్రభుత్వం తరువాత మాట మార్చి దాని తో పాటు నగదు రహిత సమాజాన్ని నిర్మించడానికి డిజిటల్ లావాదేవీలు ప్రోత్సహించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు నమ్మబలికింది. కానీ సామాన్యులకు అది అశనిపాతమే అయింది. చివరకు రూ 2000 నోట్లు, రూ 500 నోట్లు దశల వారీగా తెచ్చి కొంత పరిస్థితిని మెరుగుపరిచినా ఇప్పటికీ దాని దుష్ప్రభావాలు కనిపిస్తూనే ఉన్నాయి. బ్యాంకుల విశ్వసనీయత కూడా దెబ్బతింది. ఇప్పటికే ఏటీఎంల వద్ద నో కేష్ బోర్డులు వేలాడుతూనే ఉన్నాయి. ఏతా వాతా- నోట్ల రద్దు నిర్ణయం దేశ ఆర్థిక రంగానికి ఓ పెద్ద మచ్చలా మిగిలిపోయింది.

నమో డిజాస్టర్: కాంగ్రెస్

నోట్ల రద్దు జరిగి 500 రోజులైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్ ద్వారా మరోసారి విమర్శల వర్షం కురిపించింది. "ఇది దేశ చరిత్రలోనే ఓ అతిపెద్ద విపత్తు. ఒక వ్యక్తికి వచ్చిన మతిమాలిన ఆలోచన. ఈ డెమో డిజాస్టర్ వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోయారు" అని తీవ్రంగా వ్యాఖ్యానించింది. అటు కర్ణాటకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రాహుల్ గాంధీ కూడా - భారత ఆర్థిక రంగానికి నోట్ల రద్దు, జీఎస్టీ ఎనలేని చేటు చేశాయని, ఉపాధి కల్పనను కూడా దెబ్బతీశాయని అన్నారు. "భారత్‌లాంటి సువిశాల దేశంలో కోట్లమంది ప్రజలను ప్రభావితం చేసే నిర్ణయాలను నలుగురితో సంప్రదించి తీసుకోవాలి. కానీ ఇది ఆర్బీఐ గవర్నర్‌కు, ఆర్థిక శాఖలోని పెద్దలకూ ముఖ్యులకూ కూడా తెలీకుండా జరిగింది. ఫలితంగా ఎంతో హాని జరిగింది. ఎవరు దీనికి బాధ్యులు... మోదీ తప్ప" అని పేర్కొన్నారు.



నోట్ల రద్దు డేటా

2016 నవంబరు 4న చలామణీలో ఉన్న కరెన్సీ	రూ 17.97 లక్షల కోట్లు
నవంబరు 16న రద్దు చేసిన పెద్ద నోట్ల విలువ	రూ 15.44 లక్షల కోట్లు
2017 ఏప్రిల్ నాటికి బ్యాంకుల్లో జమ అయిన ఈ నోట్ల విలువ	రూ 15.28 లక్షల కోట్లు
మొత్తం రద్దు చేసిన నోట్లలో వీటి శాతం	98.96 శాతం
కొత్త నోట్ల ప్రింటింగ్ కు అయిన ఖర్చు	రూ 7, 965 కోట్లు
తిరిగి బ్యాంకులకు, వ్యవస్థకు చేరని రూ 1000 నోట్లు	రూ 8900 కోట్లు
2017లో అనుమానాస్పద లావాదేవీలు	రూ 4, 73, 000
కొత్తగా ముద్రించిన రూ 2000 నోట్ల విలువ	రూ 8.4 లక్షల కోట్లు
కొత్తగా ముద్రించిన రూ 500 నోట్ల విలువ	రూ 16 లక్షల కోట్లు
కొత్తగా తెచ్చిన నోట్లు	రూ 200,
కొత్త రూపంలో తెచ్చిన నోట్లు	రూ 50, రూ 10

అహో సాహా!

20 బంతుల్లోనే 102



ఇరవై బంతుల్లోనే సెంచరీ కొట్టడం సాధ్యమా..? అలా చేయాలంటే సగటున ప్రతీ బంతికి ఐదు పరుగులు రాబట్టాలి..! ఎదుర్కొన్న బంతినల్లా ఫోర్‌గానో.. సిక్సర్‌గానో మలచాలి..! అంటే ఒకరకంగా అద్భుతమే జరగాలి..! టీమిండియా ఆటగాడు వృద్ధిమాన్ సాహా నిజంగానే ఆ అద్భుతాన్ని ఆవిష్కరించాడు..! నభూతో న భవిష్యత్ అన్న రీతిలో ఆడుతూ అసాధ్యం అనుకున్న దాన్ని సుసాధ్యం చేశాడు..! 20 బంతుల్లోనే వంద కాదు ఏకంగా 102 పరుగులు కొట్టేసి ఔరా అనిపించాడు..! బంతి పడిందే ఆలస్యం.. బౌండ్రీలైనే దాని లక్ష్యం అన్నట్టుగా బ్యాటింగ్ చేశాడు..! కోల్‌కతా కాళీఘాట్ మైదానంలో జరిగిన స్థానిక టీ-20 మ్యాచ్‌లో ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోశాడు..! 14 సిక్సర్లు, 4 ఫోర్లు, 2 సింగిల్స్.. ఒకే ఓవర్లో 6 సిక్సర్లు.. 510 స్ట్రయిక్ రేట్... ఇలా సాగింది అతని విధ్వంసం..! అధికార మ్యాచ్ అయితే టీ-20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీగా రికార్డు నమోదయ్యేది..! అయినా.. సాహా అసమాన ఇన్నింగ్స్ చరిత్రలో నిలిచిపోతుంది..!

- 14 సిక్సర్లతో వృద్ధిమాన్ ఊచకోత
- జేసీ ముఖర్జీ ట్రోఫీలో విధ్వంసం

కోల్‌కతా: వృద్ధిమాన్ సాహాను ఇకపై టెస్టు బ్యాట్స్‌మన్ అనేందుకు ఒకటికి రెండు సార్లు ఆలోచించాలేమో. ఎందుకంటే ఐపీఎల్ ఆరంభానికి ముందు తనలోని మరో కోణాన్ని బయపెట్టాడు సాహా. టెస్టులే కాదు పరిమిత ఓవర్లలోనూ పంజా విసరగలన నిరూపించాడు. ఓపిగ్గా ఆడడమే కాదు.. అవసరమైతే బంతిని నిర్దాక్షిణ్యంగా వేటాడే వేటగాడు తనలో ఉన్నాడని ఒక్క ఇన్నింగ్స్‌తో చాటి చెప్పాడు. కోల్‌కతాలో జరుగుతున్న జేసీ ముఖర్జీ ట్రోఫీ ఇంటర్-క్లబ్ టీ-20 టోర్నమెంట్ ఆ అద్భుత ఇన్నింగ్స్‌కు వేదిక అయింది. ఈ టోర్నీలో మోహన్ బగన్ తరపున బరిలోకి దిగిన సాహా.. శనివా రం బెంగాల్ నాగ్‌పూర్ రైల్వేస్ (బీఎన్‌ఆర్) జట్టుపై విశ్వరూపం చూపించాడు. 20 బంతుల్లో అజేయంగా 102 పరుగులు చేసి ఔరా అనిపించాడు. అందులో 14 బంతులను సిక్సర్లుగా మలిచాడు. మిగతా ఆరు బంతుల్లో నాలుగు ఫోర్లు కొట్టి.. రెండు సింగిల్స్ తీశాడు. బౌండ్రీల రూపంలోనే వంద పరుగులు రావడం విశేషం. అంతేనా ఏడో ఓవర్లో మీడియం పేసర్ అమన్ ప్రసాద్ బౌలింగ్‌లో ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు బాదేశాడు. ఒక వైడ్ సహా అమన్ ఆ ఓవర్లో 37 పరుగులు ఇచ్చుకోవడం గమనార్హం. చివరి బంతికి సిక్సర్ ద్వారా సాహా సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వృద్ధిమాన్ ధాటికి బగన్ జట్టు బీఎన్‌ఆర్ టీమ్‌పై పది వికెట్ల తేడాతో విజయం సాధించింది. ప్రత్యర్థి నిర్దేశించిన 152 పరుగుల లక్ష్యాన్ని ఏడు ఓవర్లలోనే ఒక్క వికెట్ కోల్పోకుండా ఛేదించింది. సాహాకు జతగా మరో ఓపెనర్ శుభమొయ్ దాస్ (22 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 43 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. సాహా ఖాతా తెరిచింది సింగిల్‌తోనే అయినా.. తర్వాత బౌండ్రీలే లక్ష్యంగా బ్యాటింగ్ చేశాడు. అలా తొలి 12 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న అతను.. మరో ఎనిమిది బంతుల్లోనే శతకాన్ని అందుకున్నాడు. ఇది అధికారిక టోర్నీ అయితే ఈ సెంచరీ టీ-20ల్లో వేగవంతమైన శతకంగా నిలిచిపోయేది. టీ-20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ క్రిస్ గేల్ పేరిట ఉన్నది. ఐపీఎల్‌లో అతను 30 బంతుల్లోనే సెంచరీ కొట్టాడు. అంతర్జాతీయ టీ-20ల్లో రోహిత్ శర్మ, డేవిడ్ మిల్లర్ 35 బంతుల్లో వేగవంతమైన సెంచరీలు చేశారు. కాగా, సాహా బ్యాటింగ్‌కు బలైన బీఎన్‌ఆర్ జట్టు అనామకమైనదేమీ కాదు. నాణ్యమైన ఫస్ట్ డివిజన్ క్లాస్ టీమ్స్‌లో ఒకటిగా పేరొందింది. ఇక, ఈ కాళీఘాట్ మైదానం కూడా కోల్‌కతాలో విశాలమైన మైదానాల్లో ఒకటి కావడం విశేషం. అందువల్ల సాహా ఇన్నింగ్స్ గాలివాటం అనుకోవడానికి లేదు. ఈ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరపున బరిలోకి దిగనున్న వృద్ధిమాన్ తాజా ఇన్నింగ్స్‌పై ఆనందం వ్యక్తం చేశాడు. 'తొలి బంతి నుంచే ఎదురుదాడికి దిగాలని అనుకున్నా. బంతిని బలంగా బాదా. ఇది రికార్డు అవుతుందో కాదో నాకు తెలియదు. ప్రస్తుతం వచ్చే ఐపీఎల్‌పైనే దృష్టి పెట్టా. ఆ టోర్నీ కోసం వివిధ రకాల షాట్లను ఆడేందుకు ప్రయత్నిస్తున్నా. అవి ఈ మ్యాచ్‌లో ఫలితం చూపాయ'ని సాహా చెప్పుకొచ్చాడు.



మను మళ్లీ మెరిసె

జూనియర్ వరల్డ్‌కప్‌లో రెండు స్వర్ణాలు

సిడ్నీ: భారత షూటింగ్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్న యువ షూటర్ మను భాకర్ అంతర్జాతీయ వేదికపై మరోసారి మెప్పించింది. ఈ నెల ఆరంభంలో ప్రపంచ షూటింగ్ వరల్డ్‌కప్ సిరీస్‌లో రెండు స్వర్ణాలతో వెలుగులోకి వచ్చిన 16 ఏళ్ల మను ఇప్పుడు జూనియర్ వరల్డ్‌కప్‌లోనూ తన గోల్డెన్ షూట్‌తో మెప్పిస్తోంది. ఈ మెగా టోర్నీలో మను రెండు పసిడి పతకాలు సాధించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌తో పాటు టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ గురితో అదరగొట్టింది. అలాగే, పురుషుల 10 మీటర్ల పిస్టల్‌లో గౌరవ్ రాణా రజతం, అన్మోల్ జైన్ కాంస్యం గెలుచుకోగా.. ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అమన్ అలీ ఎలాహి-మనీషా ఖేర్ ద్వయం భారత్‌కు రజతం అందించింది. చిన్న వయసులో అద్భుత ఆటతీరుతో దూసుకెళ్తున్న మను భాకర్ శనివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో 235.9 స్కోరుతో పోడియం ఫినిష్ చేసి బంగారు పతకం నెగ్గింది. థాయ్‌లాండ్ షూటర్ కన్యకోర్న్ హిరున్‌ఫొయెయ్ (234.9)కు రజతం దక్కింది. చైనాకు చెందిన లు కైమన్ 214.2 స్కోరుతో కాంస్యం నెగ్గింది. ఆ తర్వాత టీమ్ ఈవెంట్‌లో దేవాన్షి రాణా, మహిమా అగర్వాల్‌తో కలిసి మను అగ్రస్థానంతో స్వర్ణం కైవసం చేసుకుంది. చైనా జట్టు రజతం, థాయ్‌లాండ్ టీమ్ కాంస్యం గెలిచాయి. ఇక, పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో గౌరవ్ రాణా 233.9 స్కోరుతో రజతం గెలుచుకోగా.. అన్మోల్ 215.1తో కాంస్యం నెగ్గాడు. చైనాకు చెందిన జెయావో వాంగ్ వరల్డ్ జూనియర్ రికార్డు స్కోరు 242.5తో స్వర్ణం పట్టేశాడు. ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో అలీ అమన్-మనీషా కీర్ జంట రతజం నెగ్గింది. వర్షంతో ఇబ్బంది కలిగిన ఈ ఈవెంట్‌లో భారత జోడీ 50కి 34 స్కోరుతో రెండో స్థానంలో నిలువగా.. ఇటలీ ద్వయం టియో పెట్రోని-ఎరిసా సెసా 38 పాయింట్లతో స్వర్ణం సాధించింది. ప్రస్తుతం ఈ టోర్నీలో భారత్ 5 స్వర్ణాలు సహా 12 పతకాలతో రెండో స్థానంలో నిలిచింది.



కామన్వెల్త్ పతాకధారి సింధు!

న్యూఢిల్లీ: కామన్వెల్త్ క్రీడల ప్రారంభ వేడుకల మార్చ్‌పాస్ట్‌లో భారత మువ్వన్నెల పతాకాన్ని చేబూనే అదృష్టం బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు దక్కనుంది. ఈ మేరకు ఆరంభ వేడుకల్లో పాల్గొనే భారత జట్టును సింధు ముందుండి నడిపించనున్నట్లు ఐవోఏ అధికారులు తెలిపారు. గత మూడు కామన్వెల్త్ క్రీడల్లో మార్చ్‌పాస్ట్ పతాకధారి అవకాశాలను షూటర్లే దక్కించుకున్నారు. 2006లో ప్రస్తుత కేంద్ర క్రీడా మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్, 2010లో అభినవ్ బింద్రా, 2014లో విజయ్‌కుమార్ పతాకధారులుగా వ్యవహరించారు. త్వరలోనే సింధు పేరును ఐవోఏ ప్రకటించనున్నట్లు తెలిసింది.

రేసులో ఫేస్‌బుక్, గూగుల్

3న బీసీసీఐ డిజిటల్ హక్కుల వేలం

ముంబై: భారత క్రికెట్ జట్టు ఆడే మ్యాచ్‌ల డిజిటల్ హక్కులకు భారీ పోటీ నెలకొంది. ఈమేరకు వచ్చే ఐదేళ్లపాటు బీసీసీఐతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రఖ్యాత సోషల్ నెట్‌వర్క్ సైట్ ఫేస్‌బుక్‌తో పాటు సెర్చింజన్ గూగుల్ కూడా పోటీలో ఉన్నాయి. వీటితోపాటు జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్, హాట్‌స్టార్, యప్ టీవీ, సోనీ టీవీ కూడా బరిలో ఉన్నాయి. ఈనెల 27న జరగాల్సిన ఈ-వేలాన్ని ఇటీవలే బీసీసీఐ వచ్చేనెల 3కు వాయిదా వేసింది. ఏప్రిల్ 2018 నుంచి మార్చి 2023 వరకు బిడ్డింగ్ గెలిచిన కంపెనీ మూడు రకాల హక్కులు కలిగి ఉంటుంది. గ్లోబల్ టీవీ రైట్స్‌తో పాటు భారత ఉపఖండ డిజిటల్ హక్కుల ప్యాకేజి, గ్లోబల్ కన్సాలిడేటెడ్ హక్కుల ప్యాకేజి ఇందులో ఉంటాయి. 2017లో ఫేస్‌బుక్ రూ.3,900 కోట్లతో డిజిటల్ హక్కుల కోసం పోటీపడ్డా స్టార్ ఇండియా (రూ.16,347 కోట్లు) హక్కులను దక్కించుకుంది.


ఐపీఎల్ ఆరంభోత్సవంలో రణ్‌వీర్, పరిణీతి!



న్యూఢిల్లీ: బాలీవుడ్ స్టార్లు రణ్‌వీర్ సింగ్, పరిణీతి చోప్రా, వరుణ్ ధావన్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఐపీఎల్ ఆరంభ వేడుకల్లో మెరవనున్నారు. ఏప్రిల్ 7న ముంబై-చెన్నై మధ్య తొలి మ్యాచ్‌కు ముందు వాంఖడే స్టేడియంలో జరిగే వేడుకల్లో బాలీవుడ్ స్టార్లు ప్రదర్శన ఇవ్వనున్నారని సమాచారం. పలువురు భారత మాజీ క్రికెటర్లను కూడా ఆహ్వానిస్తున్నారని తెలుస్తోంది. అయితే, ఆరుగురు కెప్టెన్లు గైర్హాజరవనున్న నేపథ్యంలో ఆరంభ పోరులో తలపడే ముంబై-చెన్నై కెప్టెన్లు రోహిత్, ధోనీ మాత్రమే వేడుకల్లో కనిపించనున్నారు.

కౌంటీల్లో కోహ్లీ

- సర్రే తరపున బరిలోకి..
- ఆఫ్ఘాన్‌తో టెస్టుకు దూరం



న్యూఢిల్లీ: ప్రపంచ అత్యుత్తమ క్రికెటర్లలో ఒకడిగా పేరున్న భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ తొలిసారిగా కౌంటీల్లో ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. ఐపీఎల్ ముగిసిన అనంతరం అతడు సర్రే తరపున ఆడనున్నాడు. భారత జట్టు ఆగస్టు, సెప్టెంబరులో ఐదు టెస్టుల కోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. అయితే రికార్డుల రారాజుగా పేరు తెచ్చుకున్న కోహ్లీకి ఇంగ్లండ్‌లో మాత్రం పేలవ రికార్డే ఉంది. 2004లో పర్యటించినప్పుడు తన ఆట తీరుతో విమర్శలు ఎదుర్కొన్నాడు. ఆడిన ఐదు టెస్టుల్లో కనీసం ఒక్క అర్ధ సెంచరీ సాధించలేకపోయాడు. మరోసారి అలాంటి అవమానం ఎదురు కాకూడదనే ముందుగానే అక్కడి పరిస్థితుల కు అలవాటు పడేందుకు కౌంటీల్లో ఆడాలని నిర్ణయించుకున్నాడు. ఈకారణంగా జూన్ 14 నుంచి ఆఫ్ఘానిస్థాన్‌తో జరిగే ఏకైక టెస్టుకు కోహ్లీ దూరం కానున్నాడు. 'విరాట్ కోహ్లీ జూన్‌లో జరిగే డివిజన్ వన్ కౌంటీ మ్యాచ్‌ల్లో సర్రే తరపున ఆడతాడు. ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్‌పై అతడు దృష్టి పెట్టేందుకు బీసీసీఐ అనుమతించింది. అలాగే పుజారా (యార్క్‌షైర్), ఇషాంత్ (ససెక్స్), అశ్విన్ (వార్విక్‌షైర్) కూడా కౌంటీల్లో ఆడనున్నారు. దీంతో ఆఫ్ఘాన్‌తో టెస్టుకు కోహ్లీ దూరమవుతాడు' అని సీవోఏ చీఫ్ వినోద్ రాయ్ తెలిపారు. దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌కు ముందుగా వెళ్లకుండా విమర్శల పాలైన నేపథ్యంలో ఈసారి బీసీసీఐ తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. జూన్ 9న కోహ్లీ కౌంటీ సీజన్ ప్రారంభం కానుంది.

టెస్టు స్పెషలిస్టులు జూన్‌లోనే ఇంగ్లండ్‌కు: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌ను దృష్టిలో ఉంచుకొని.. టీమిండియా టెస్టు స్పెషలిస్టులను కొన్ని నెలల ముందే అక్కడికి పంపించనున్నారు. మురళీ విజయ్, అజింక్యా రహానె సహా టెస్టు స్పెషలిస్టు ఆటగాళ్లంతా జూన్‌కల్లా ఇంగ్లండ్‌లో ఉంటారని వినోద్ రాయ్ తెలిపారు. ఆ సమయంలో కౌంటీలతో పాటు ఇంగ్లండ్ లయన్స్-ఎ జట్టుతో ఫస్ట్‌క్లాస్ క్రికెట్ మ్యాచ్‌ల్లో తలపడే భారత్-ఎ జట్టు తరపున బరిలోకి దిగుతారని చెప్పారు.

పంకజ్‌దే ఆసియా టైటిల్



యాంగాన్ (మయన్మార్): భారత స్టార్ క్యూయిస్ట్ పంకజ్ అడ్వాణీ ఆసియా బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. ఫైనల్లో పంకజ్ 6-1తో భారత్‌కే చెందిన భాస్కర్‌ను ఓడించి మరోసారి విజేతగా నిలిచాడు. దీంతో ఒకే సీజన్‌లో ఆసియా టైటిల్‌తో పాటు వరల్డ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి భారత ఆటగాడిగా పంకజ్ రికార్డు సృష్టించాడు. ఇక మహిళల ఆసియా స్నూకర్ టైటిల్‌ను భారత్‌కే చెందిన అమీ కమాని గెలుచుకుంది. ఫైనల్లో అమీ 3-0తో థాయ్‌లాండ్‌కు చెందిన సిరిపపోర్న్ నువాన్‌తఖమ్జాన్‌పై గెలిచింది.

కివీస్ టెస్టుకు మూడో రోజూ వర్షమే..

ఉ. 6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్ -1లో

ఆక్లాండ్: న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టు మూడో రోజుకు కూడా వర్షం ఆటంకం కలిగించింది. శనివారం 17 బంతుల ఆట మాత్రమే సాధ్యంకాగా, కివీస్ తమ ఓవర్‌నైట్ స్కోరుకు నాలుగు పరుగులు మాత్రమే జత చేసింది. భారీగా కురుస్తున్న వర్షం తెరిపినిచ్చే అవకాశం కనిపించకపోవడంతో అంపైర్లు మూడో రోజు ఆటను రద్దు చేశారు. ప్రస్తుతం న్యూజిలాండ్ 95 ఓవర్లలో నాలుగు వికెట్లకు 233 పరుగులు చేయగా ప్రత్యర్థిపై 175 పరుగుల ఆధిక్యంలో ఉంది. తమ తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 58 పరుగులకే కుప్పకూలిన విషయం తెలిసిదే. రెండో రోజు శుక్రవారం కూడా వర్షం కారణంగా 23.1 ఓవర్ల ఆట మాత్రమే ఆడగలిగారు.



అదరగొడతారా!



గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌లో 220 మందికిపైగా భారత క్రీడాకారులు బరిలోకి దిగుతున్నా.. ప్రధానంగా అందరి దృష్టి నిలిచింది ఇద్దరిపైనే.. వారిలో ఒకరు మేటి రెజ్లర్ సుశీల్‌కుమార్ మరొకరు బాక్సింగ్ క్వీన్ మేరీ కోమ్. కెరీర్‌లో ఎన్నో అపురూప విజయాలు సొంతం చేసుకున్న వీరు వయసు మీద పడుతున్న తరుణంలో ఎలాంటి ప్రదర్శన చేస్తారోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

సుశీల్ తిరుగులేని 'పట్టు'

దేశ రెజ్లింగ్ క్రీడపై 34 ఏళ్ల సుశీల్‌ది చెరగని ముద్ర. ఒలింపిక్స్, ఆసియా, కామన్వెల్త్ క్రీడలు, ఆసియా, కామన్వెల్త్ చాంపియన్‌షిప్స్‌లలో సుశీల్ పతకాలు సొంతం చేసుకోవడం అతడి 'పట్టు'దలకు నిదర్శనం. అదేసమయంలో వివాదాలూ అతడి వెన్నంటే ఉన్నాయి. గత నవంబరులో జాతీయ చాంపియన్‌షిప్స్‌లో ప్రత్యర్థులు ముగ్గురు క్వార్టర్స్, సెమీస్, ఫైనల్లో సుశీల్‌కు వాకోవర్ ఇవ్వడంతో స్వర్ణ పతకం గెలుచుకోవడం విమర్శలకు తావిచ్చింది. ఇక గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ క్రీడల సెలెక్షన్ ట్రయల్స్‌లో ప్రత్యర్థి రాణాతో జరిగిన గొడవా పతాక శీర్షికలకెక్కింది. రెండేళ్ల క్రితం 2016 రియో ఒలింపిక్స్‌లో భారత జట్టులో చోటుకోసం సుశీల్-నర్సింగ్ యాదవ్ మధ్య చోటుచేసుకున్న జగడం దేశ క్రీడారంగాన్ని ఓ కుదుపు కుదిపింది. ఈ వివాదాలన్నీ ఎలా ఉన్నా.. 2010 ఢిల్లీ కామన్వెల్త్ క్రీడల్లో 66 కిలోల ఫ్రీస్టయిల్‌లో, గ్లాస్గో గేమ్స్‌లో 74 కేజీల ఫ్రీస్టయిల్‌లోనూ స్వర్ణాలను కైవసం చేసుకున్నాడు. ఈసారి 'హ్యాట్రిక్' కొట్టాలని ఉవ్విళ్లూరుతున్నాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కాంస్యం, 2012 లండన్ గేమ్స్‌లో రజతం నెగ్గి తద్వారా ఒలింపిక్స్‌లో వ్యక్తిగత విభాగంలో రెండు పతకాలు సాధించిన తొలి భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు.

మేరీని ఊరిస్తున్న మెడల్

ఆమె ఇష్టపడిన క్రీడ ఆషామాషీదేం కాదు. ప్రత్యర్థి పంచ్‌లను సరిగ్గా ఎదుర్కోలేకపోతే గాయాలపాలవడం ఖాయం. అలాంటి అంశంలో కెరీర్‌ను ఎంచుకోవడమేకాదు.. ప్రపంచ మహిళా బాక్సింగ్‌లో తనకంటూ ఓ పేజీని సగర్వంగా లిఖించుకుంది మేరీకోమ్. తల్లైన తర్వాత మళ్లీ రింగ్‌లో అడుగుపెట్టి ఏకంగా వరల్డ్ టైటిల్ నెగ్గడం మేరీకోమ్‌కు తప్ప మరెవరికీ సాధ్యం కాదనడంలో అతిశయోక్తి లేదు. అంతేకాదు.. 35 ఏళ్ల వయస్సులోనూ యువ బాక్సర్‌వలే గోల్డ్‌కోస్ట్‌లో స్వర్ణం కోసం తహతహలాడుతోంది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యం, ఐదేసి ప్రపంచ, ఆసియా టైటిళ్లు, ఆసియా క్రీడల్లో రెండు పతకాలు (స్వర్ణ, కాంస్యాలు).. ప్రపంచ బాక్సింగ్‌లోని అన్ని పతకాలను తన ఖాతాలో వేసుకున్న ఆమెను కామన్వెల్త్ మెడల్ ఒక్కటే ఊరిస్తోంది గత గ్లాస్గో గేమ్స్‌లోనే మహిళా బాక్సింగ్‌ను ప్రవేశపెట్టగా అప్పుడు మేరీకోమ్ క్వాలిఫై కాలేకపోయింది. 2016 రియో ఒలింపిక్స్‌కు అర్హత సాధించకపోవడంతో మేరీకోమ్ కెరీర్ ముగిసిందని అంతా అంచనాకు వచ్చేశారు. కానీ ఏడాది విరామం తర్వాత పునరాగమనం చేసి 2017 ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం కొల్లగొట్టి తనలో చేవ తగ్గలేదని చాటింది. ఆ చాంపియన్‌షిప్‌లో మేరీకది ఆరో పతకం (ఐదు స్వర్ణం, ఒక రజతం) కావడం విశేషం. అందుకే.. 'మేరీ కోమ్ పని అయిపోయిందని ఎప్పుడూ చెప్పలేం' అని అంటారు 'ఒలింపిక్స్ గోల్డ్ క్వెస్ట్' సీఈవో విరేన్ రస్కినా. గోల్డ్‌కోస్ట్‌లోనూ సత్తా చాటి ఆ ఒక్క కామన్వెల్త్ పతకాన్ని ఆమె సొంతం చేసుకుంటుందేమో చూడాలి.

పరాజయాలకు బ్రేక్ వేయాలని..!

- నేడు ఇంగ్లండ్‌తో భారత మహిళల టీ-20

ఉ. 10 నుంచి స్టార్‌స్పోర్ట్స్-1లో..

ముంబై: టీ20 ముక్కోణపు సిరీస్‌లో బోణీ చేయాలని భారత మహిళల జట్టు తహతహలాడుతోంది. తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో చిత్తుగా ఓడిన టీమిండియా.. ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌లో నెగ్గి వరుస ఓటములకు బ్రేక్ వేయాలనుకుంటోంది. భారత్ రాత మారాలంటే మాత్రం అన్ని విభాగాల్లోనూ అద్భుత ప్రదర్శన చేయాల్సిన అవసరం ఉంది. మిడిలార్డర్, లోయర్ ఆర్డర్ వరుసగా విఫలమవుతుండడం జట్టు మేనేజ్‌మెంట్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. బ్యాటింగ్ పిచ్‌పై అనుభవజ్ఞులైన మిథాలీ, హర్మన్‌ప్రీత్, వేదా కృష్ణమూర్తి చెలరేగాలి. యువ ప్లేయర్ జెమీమా రోడ్రిగ్స్ సత్తాకు తగ్గ ప్రదర్శన చేయాలి. జులన్ రాకతో బౌలింగ్ విభాగం కొంత బలపడినా.. ఆమెకు మిగతా బౌలర్లు సహకరించాల్సిన అవసరముంది. ఈ మ్యాచ్‌లో గనక భారత్ ఓడితే ఫైనల్ అవకాశాలు సంక్లిష్టమవుతాయి.

భారీ ఆధిక్యంలో దక్షిణాఫ్రికా

మధ్యాహ్నం 2 గం. నుంచి సోనీ సిక్స్‌లో

ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులో దక్షిణాఫ్రికా భారీ ఆధిక్యం దిశగా దూసుకెళుతోంది.ఓపెనర్ మార్‌క్రమ్ (84), డివిల్లీర్స్ (51 బ్యాటింగ్) అర్ధసెంచరీలతో రాణించగా శనివారం మూడోరోజు తమ రెం డో ఇన్నింగ్స్‌లో 72 ఓవర్లలో 5 వికెట్లకు 238 రన్స్ చేసింది. దీంతో ప్రస్తుతం ప్రొటీస్ 294 పరుగుల ఆధిక్యంలో ఉంది. చివర్లో వెలుతురు లేమి కారణంగా ఆట కాస్త ముందుగానే ముగిసింది. క్రీజులో డివిల్లీర్స్‌తో పాటు డికాక్ (29 బ్యాటింగ్) ఉన్నాడు. అంతకుముందు ఆసీస్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 69.5 ఓవర్లలో 255 పరుగులకు ముగించింది.

బాన్‌క్రాఫ్ట్.. బాల్ ట్యాంపరింగ్





కేప్‌టైన్: దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మూడో టెస్టులో తాజాగా బాల్ ట్యాంపరింగ్ వివాదం రాజుకుంది. ఈ వివాదానికి ఆసీస్ ఓపెనర్ బాన్‌క్రాఫ్ట్ కారకుడయ్యాడు. మూడో రోజు ఆటలో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ కొనసాగుతుండగా తన ప్యాంటు జేబులో నుంచి పసుపు రంగు వస్తువుతో బంతిపై రుద్దడం వీడియో ఫుటేజిలో కనిపించింది. అయితే టీవీల్లో చూసిన ఆసీస్ టీమ్ మేనేజ్‌మెంట్ డగౌట్‌లో కూర్చున్న హ్యాండ్స్‌కోంబ్‌కు వాకీటాకీతో సమాచారం ఇచ్చింది. అతడు బాన్‌క్రాఫ్ట్‌కు విషయం అందేలా చూడడంతో తను ఆ వస్తువును ప్యాకెట్‌లో నుంచి తీసి గార్డులోకి తోశాడు. అయితే బాల్ ట్యాంపరింగ్‌పై ఫీల్డ్ అంపైర్లకు ఫిర్యాదు రావడంతో బాన్‌క్రాఫ్ట్‌ను పిలిచి వివరణ కోరారు. కానీ అతడు తన జేబులో నుంచి సన్‌గ్లాసెస్ కవర్‌ను చూపించడంతో అంపైర్లు ఆటను కొనసాగించారు. కానీ అతడి చర్యలన్నీ వీడియోలో రికార్డయ్యాయి. ఈ క్లిప్‌ను స్టెయిన్ ట్విటర్‌లో షేర్ చేశాడు.

మేం ట్యాంపరింగ్ చేసింది నిజమే..

మాకు ఈ విషయం ముందే తెలుసు. లంచ్ బ్రేక్‌లో ట్యాంపరింగ్ గురించి మాట్లాడుకున్నాం. మ్యాచ్‌లో అవకాశాలు మెరుగుపరుచుకునేందుకు అదే సరైన దారిగా భావించాం. కానీ ఇది క్రీడాస్ఫూర్తికి విరుద్ధం. ఇందులో కోచ్‌ల పాత్ర ఏమీ లేదు. ఈ చర్యతో నా చిత్తశుద్ధితో పాటు ఆసీస్ జట్టు ప్రతిష్ఠ కూడా అభాసుపాలైంది. భవిష్యత్‌లో మాత్రం ఇలా జరగదు. **- స్మిత్**

భూమివైపు వేగంగా 'తియాంగాంగ్-1'

మరో వారంలో కూలనున్న చైనా స్పేస్ స్టేషన్

సముద్రంలో కూల్చేస్తామంటున్న శాస్త్రవేత్తలు

బీజింగ్, మార్చి 24: వారం పదిరోజుల్లో భూమికి భారీ ముప్పు పొంచి ఉందా? గతి తప్పిన చైనా అంతరిక్ష కేంద్రం 'తియాంగాంగ్-1' భూమిని ఢీకొట్టనుందా? దీని శకలాల వల్ల ప్రాణనష్టం ఉంటుందా? ఇప్పుడు శాస్త్రవేత్తలను తొలుస్తున్న ప్రశ్నలివి!! ఈ అంతరిక్ష కేంద్రం శకలాలు భూమివైపు దూసుకు వచ్చేలోపే విచ్ఛిన్నమవుతాయని చైనా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలా జరుగకపోయినా సముద్రంలో కూల్చేస్తామని భరోసా ఇస్తున్నారు. తియాంగాంగ్-1లోని హైడ్రోజిన్ ఇంధనం వల్ల కొంత ప్రాణనష్టం జరుగవచ్చు.

చైనా తన తొలి అంతరిక్ష కేంద్రం తియాంగాంగ్-1ను 2011లో ప్రయోగించింది. 8,618 కిలోల బరువుండే దీన్ని 'హెవెన్లీ ప్యాలెస్'గా పిలుస్తారు. ఐదేళ్ల పాటు ఇది అద్భుతంగా పనిచేసింది. ఇందులోకి వ్యోమగాములను కూడా పంపించారు. 2016 నుంచి సాంకేతిక సమస్యలతో ఈ స్పేస్ స్టేషన్‌కు భూమితో సంబంధాలు తెగిపోయాయి. రెండేళ్ల క్రితమే ఇది భూమిని ఢీకొట్టవచ్చని వార్తలు వచ్చినా.. శాస్త్రవేత్తలు నియంత్రిస్తూ వచ్చారు. ప్రస్తుతం అది నియంత్రణ గతి తప్పడంతో.. ఈ నెల చివరివారంలో, లేదా ఏప్రిల్ మొదటివారంలో కూలిపోతుందని యురోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ) అంచనా వేసింది.

ఎక్కడ కూలుతుంది?

తియాంగాంగ్-1 శకలాలు ఉత్తరానికి 43డిగ్రీలు, దక్షిణానికి 43డిగ్రీల మధ్య (స్పెయిన్, టర్కీ, ఇండియా, ఇటలీ, అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో) భూమిని ఢీకొంటాయని యురోపియన్ స్పేస్ ఏజెన్సీ అంచనా వేసింది. ఇప్పటివరకు గ్రహశకలాల వల్ల పెద్దగా ప్రాణనష్టం జరిగిన దాఖలాలు లేవని శాస్త్రవేత్తలు గుర్తుచేస్తున్నారు.



అధికారంలోకి వస్తే ఒకే శ్లాబు

జీఎస్‌టీ 28 శాతం పన్నును రద్దుచేస్తాం: రాహుల్

జేడీఎస్‌కు ఏడుగురు ఎమ్మెల్యేల రాజీనామా

నేడు కాంగ్రెస్‌లో చేరిక

చామరాజ్‌నగర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా ఒకే శ్లాబు ఉన్న జీఎస్టీని అమలు చేస్తామని, 28 శాతం జీఎస్టీని రద్దు చేస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. సమాజంలో లింగభేదం, పేదలు, శ్రీమంతులు అనే హెచ్చుతగ్గులు అనాదిగా వస్తున్నవేనని అన్నారు. భారత రాజ్యాంగంపై బీజేపీ దాడి చేస్తోందని ఆరోపించారు. కర్ణాటక పర్యటనలో భాగంగా ఆయన శనివారం చామరాజ్‌నగర్‌లో చాముండేశ్వరి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం జరిగిన ర్యాలీలో ప్రసంగించారు. అంతకుముందు మైసూరు మహారాణి కళాశాలలో ఆయన మాట్లాడుతూ స్విస్ బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నవారి వివరాలు కేంద్రం దగ్గర ఉన్నా.. వాటిని బయటపెట్టడానికి విముఖత చూపుతోందన్నారు. మండ్య జిల్లా మాళవల్లిలో రాహుల్ మాట్లాడుతూ మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడకు చెందిన జనతా దళ్ సెక్యులర్ (జేడీఎస్) పై తీవ్ర విమర్శలు చేశారు. జేడీఎస్ అంటే జనతా దళ్ సంఘ్ పరివార్ అని, బీజేపీకి అది బీ టీమ్‌గా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాగా, జేడీ(ఎస్)కు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు శనివారం తమ శాసనసభ్యత్వాలకు రాజీనామా చేశారు. దీంతో, శాసనసభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ ఆ పార్టీ అధినేత హెచ్‌డీ దేవెగౌడకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది. ఈ ఏడుగురు ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదించినట్లు స్పీకర్ ప్రకటించారు. వీరు ఆదివారం మైసూరులో రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. వచ్చే ఎన్నికల్లో వీరికి కాంగ్రెస్ టికెట్లు ఖరారైనట్లు సమాచారం.



మైసూరులోని చాముండేశ్వరి ఆలయంలో రాహుల్‌గాంధీ పూజలు

ఎన్‌సీసీ గురించి తెలియదు: రాహుల్

నెటిజన్ల ఆగ్రహం

మైసూరు కళాశాలలో విద్యార్థినులతో మాట్లాడేటప్పుడు నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) గురించి ఓ విద్యార్థిని రాహుల్‌ను ప్రశ్నించింది. ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ పాసైనవారికి మీరెలాంటి ప్రయోజనాలు కల్పిస్తారని అడిగింది. 'ఎన్‌సీసీ గురించి నాకు ఎక్కువ తెలియదు. అందుచేత సమాధానం చెప్పలేను' అని ఆయన బదులిచ్చారు. దీనిపై ట్విటర్‌లో నెటిజన్లు మండిపడ్డారు.

టెక్నాలజీ వాడండి

విపక్షాల అబద్ధాలు ఎండగట్టండి

ప్రజలకు చేరువవ్వండి..

బీజేపీ ఎంపీలకు మోదీ ఉద్బోధ



న్యూఢిల్లీ, మార్చి 24: బీజేపీ ఎంపీలంతా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకుని తమ తమ నియోజకవర్గాల్లో ప్రజలకు చేరువ కావాలని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్బోధించారు. కొత్తగా నిర్మించిన బీజేపీ ప్రధాన కార్యాలయంలో తమ పార్టీ ఎంపీలనుద్దేశించి ఆయన శనివారం నాడు ప్రసంగించారు. 'విపక్షాలు మనపై విమర్శలు గుప్పిస్తూ- ప్రభుత్వ పథకాలపై లేనిపోని అబద్ధాలు కల్పించి చెబుతున్నాయి. నిజాలేంటో ప్రజలకు చెప్పండి. బడ్జెట్‌లో ప్రకటించిన పథకాల వల్ల జరిగే మేలును విస్తృతంగా ప్రచారం చేయండి" అని మోదీ పిలుపునిచ్చారు. "విపక్షాలను ఎండగట్టండి.. వారి అభూత కల్పనలు వివరించండి. మీ ప్రచారం బూత్ స్థాయి దాకా అంటూ మారుమూల పల్లెలకు కూడా విస్తరించాలి. ప్రజలను కలుసుకోడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించండి. మీ నుంచి వారికి అనునిత్యం కాంటాక్ట్ ఉండాలి" అని మోదీ విజ్ఞప్తి చేశారు. 'ఎప్పటికప్పుడు మీరు కూడా పరస్పరం సమాచారాన్ని షేర్ చేసుకోండి. కేంద్ర స్థాయిలో నిర్ణయాలను తెలుసుకుంటూ ప్రజలకు చేరవేయండి. మీ అభిప్రాయాలను కూడా పంచుకోండి. టెక్నాలజీ వాడడం ద్వారా విపక్షాల అబద్ధాలను సుళువుగా తిప్పికొట్టవచ్చు" అని ఆయన పేర్కొన్నట్లు మానవ వనరుల శాఖ సహాయమంత్రి ప్రకాశ్ జవదేకర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అన్ని కీలక శాఖల మంత్రులూ తమ తమ శాఖల్లో చేపట్టిన కొత్త కీలక పథకాల సమాచారాన్ని ఎంపీలకు విశదీకరించి చెప్పారు. ప్రతీ జిల్లాల్లోనూ పార్టీ ఆఫీసుల నిర్మాణం జరగాలని మోదీ సూచించారు. నాయకుల నివాసాల నుంచి కాకుండా ప్రజల మధ్య నున్న కార్యాలయాల నుంచి కార్యకలాపాలు నిర్వహించాలని అంటూ పరోక్షంగా కాంగ్రెస్‌నుద్దేశించి అన్నారు. "పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన నెలకొంది. ఇక ప్రజల్లోకి మీరు వెళ్లడమే మేలు. ఏం జరిగింది, ఏం జరుగుతోందో చెప్పండి. విపక్షాల బండారం బయటపెట్టండి. ప్రజలతో మమేకం కండి. బీజేపీ సిద్ధాంతాలు, మోదీ నాయకత్వం ద్వారానే ఎన్నికల్లో విజయం సాధ్యమవుతోంది" అని అమిత్ షా పేర్కొన్నారు.

రాజ్యసభలో పెరిగిన బీజేపీ బలం

కాంగ్రెస్‌కు 4 సీట్లు తగ్గుదల.. ఇక బిల్లుల ఆమోదానికి అడ్డు లేనట్లే!

న్యూఢిల్లీ, మార్చి 24: రాజ్యసభకు మరో 11 మంది బీజేపీ సభ్యులు ఎన్నిక కావడంతో- పెద్దల సభలో ఆ పార్టీ బలం 58 నుంచి 69 కి పెరిగింది. అదే సమయంలో కాంగ్రెస్ బలం 54 నుంచి 50కి తగ్గింది. రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 245 కాగా.. మెజారిటీ రావాలంటే 123 మంది సభ్యులుండాలి. బీజేపీ ఈ సంఖ్యకు చాలా దూరంగా ఉంది. ఆ పార్టీకి చెందిన మిత్రపక్షాలు తెలుగుదేశం, శివసేన ప్రస్తుతం దూరంగా ఉన్నాయి. అయినా బీజేపీ కాస్త ఆధిపత్యంలో ఉన్నట్లే. తాజా పెరుగుదల వల్ల బీజేపీ -కీలక బిల్లుల ఆమోదం విషయంలో రాజ్యసభలో మరిక ఇబ్బందులు పడకపోవచ్చు. ఇన్నేళ్లూ లోక్‌సభలో మెజారిటీ వల్ల అక్కడ పాసైన బిల్లులు రాజ్యసభకు వచ్చే సరికి స్తంభించిపోయేవి. వివిధ కారణాలతో విపక్షం ఏకతాటిపై నిలిచి వాటిని అడ్డుకొనేది. ఇపుడిక ఆ బాధ బీజేపీకి తొలగినట్లే. ప్రాంతీయ పార్టీలైన అన్నాడీఎంకే, టీఆర్ఎస్‌లు మూడేసి సీట్లు సాధించడం, వైఎస్ఆర్ కాంగ్రెస్, బీజేడీ లాంటి పార్టీల బలం కూడ కాస్త పెరగడంతో ఆ పార్టీ ఇక చక్రం తిప్పడానికి వీలవుతుంది. ఈ పార్టీల నుంచి మద్దతు సాధించగలమన్న విశ్వాసాన్ని బీజేపీ వ్యక్తపరుస్తోంది. వరుసగా అనేక రాష్ట్రాల్లో గెలుస్తూ రావడం వల్ల రాజ్యసభలో తన సభ్యుల సంఖ్యను బీజేపీ పెంచుకోగలిగింది.

'నమో' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ

ఎన్‌సీసీ కేడెట్లకు ఆదేశాలు

13 లక్షల మందికి సందేశాలు.. వ్యతిరేకిస్తున్న కేడెట్లు

న్యూఢిల్లీ, మార్చి 23: జాతీయ కేడెట్ దళం (ఎన్‌సీసీ) సభ్యులంతా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యాప్ 'నమో'ను తమ స్మార్ట్‌ఫోన్లలో వినియోగించాలంటూ వెలువడిన ఆదేశాలు వివాదాలకు దారితీశాయి. త్వరలో కేడెట్లతో మమేకం అవ్వాలని మోదీ నిర్ణయించిన నేపథ్యంలో.. వారి ఫోన్ నంబర్లు, ఈమెయిల్ ఐడీలు సేకరించాలంటూ ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ బీఎస్ సహ్రావత్ అన్ని రాష్ట్రాల్లోని విభాగాలకు ఆదేశాలిచ్చారు. దీంతో 15 లక్షల మంది కేడెట్లలో 13 లక్షల మంది నంబర్లను అధికారులు సేకరించి, కేంద్రానికి పంపారు. వీరంతా ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై పలువురు కేడెట్లు, విపక్షాల నాయకులు మండిపడుతున్నారు. ఒక ప్రైవేట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమని అధికారికంగా ఎలా ఆదేశిస్తారని పలువురు కేడెట్లు ట్విటర్ వేదికగా 'డిలీట్‌నమోయాప్' ట్యాగ్‌తో విమర్శలు గుప్పించారు. అధికారి యాప్ 'పీఎంఓ'కు బదులు 'నమో'ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఒత్తిడి తేవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అటు కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైవీర్ శేర్గిల్ మీడియాతో మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో డేటా తస్కరణకే ఈ చర్య అంటూ విమర్శించారు.

మోదీ యాప్‌తో ఇదీ ప్రమాదం!

ప్రజల వ్యక్తిగత వివరాలు అమెరికన్ సంస్థకు

సమ్మతి లేకుండానే వెళుతోందంటూ ఫ్రాన్స్ నిపుణుడి వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 24: కేంబ్రిడ్జ్ అనలిటికా డేటా స్కామ్ ఓ పక్క ప్రకంపనలు రేపుతున్న దశలో- అలాంటిదే మరో వ్యవహారం ఇపుడు భారత రాజకీయ రంగాన్ని తాకింది. ప్రజల (యూజర్ల) వ్యక్తిగత సమాచారాన్ని నరేంద్ర మోదీ ఆండ్రాయిడ్ యాప్ ఓ మూడో వ్యక్తికి చేరవేస్తోందంటూ ఫ్రాన్స్‌కు చెందిన ఓ సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు సంచలనాత్మక వివరాల్ని వెల్లడించారు. 'నమో యాప్ పేరిట ప్రాచుర్యం పొందిన ఈ యాప్‌ను మీరు ఇన్‌స్టాల్ చేసుకొంటే మీ వ్యక్తిగత వివరాలన్నీ 'క్లెవర్ ట్యాప్' అనే అమెరికా కంపెనీకి వెళతాయి' అని ఇలియట్ ఏల్డర్సన్ అనే నిపుణుడు శనివారం నాడు ట్విట్టర్ ద్వారా బయటపెట్టారు. యూజర్ల సమ్మతి లేకుండానే ఆటోమేటిక్‌గా ఇది క్లెవర్ ట్యాప్‌కు చెందిన డొమైన్ అయిన "ఇన్ డాట్ డబ్ల్యుజెడ్ఆర్‌కేటీ డాట్ కామ్ " కి చేరుతోందని చెప్పారు. ఒక్క యాప్ సమాచారం మాత్రమే కాదు.. ప్రజల పేరు, వారు స్త్రీలా పురుషులా, ఫోటోలు, ఈమెయిల్, పర్సనల్ నెంబర్లు కూడా ఆ డొమైన్‌కు (http://in.wzrkt.com,&#8221) వెళుతున్నాయి" అని వివరించారు. వీటితో పాటు ఆపరేటింగ్ సిస్టమ్, నెట్‌వర్క్ లాంటి డివైస్ వివరాలు కూడా వెళుతున్నాయని తెలిపారు. 'ఈ డొమైన్ ఓ పెద్ద ఫ్రాడ్ లింకు. వ్యక్తిగత వివరాల సేకరణకు, పాస్‌వర్డ్‌లు, క్రెడిట్ కార్డుల నంబర్ల సేకరణకు గాను అందరికీ దొంగపద్ధతుల్లో మోసపూరితంగా ఈమెయిల్స్ పంపుతూంటుందని జీ డేటా అనే సంస్థ తెలిపింది. అయితే క్లెవర్ ట్యాప్‌ను మాత్రం గోడాడీ నిర్వహిస్తుంటుంది. కానీ ఆ విషయం ఎవరికీ తెలియదు" అని ఏల్డర్సన్ వివరించారు. క్లెవర్ ట్యాప్ అనేది ఓ ఆధునిక యాప్ నిర్వహణా వేదిక. యూజర్లను గుర్తించి డెవలపర్స్‌ను అభివృద్ధి చేసేందుకు మార్కెటింగ్ నిపుణులకు ఇది సాయపడుతుంది అని ఆయన తెలిపారు. అయితే- డబ్ల్యుజెడ్ఆర్‌కేటీ డాట్‌కామ్ కు వెళ్లిన యూజర్ల సమాచారాన్ని క్లెవర్‌ట్యాప్ పేరిట ఎందుకు పదిలపరుస్తున్నారన్నది ప్రశ్నార్థకమని, ఆందోళనకరమని ఆయన అన్నారు.



త్రిపుర అసెంబ్లీలో తొలిసారిగా జాతీయగీతం

అగర్తలా, మార్చి 24: త్రిపుర అసెంబ్లీలో తొలిసారిగా జాతీయగీతాన్ని వినిపించారు. కొత్తగా ఎన్నికైన సభ శుక్రవారం మొదటిసారి సమావేశమైంది. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ రతన్ చక్రవర్తి స్పీకర్ ఎన్నిక నిర్వహించడానికి సంసిద్ధులయ్యారు. ఈ సందర్భంగా జాతీయగీతాన్ని వినిపించడంతో గౌరవసూచకంగా మంత్రులు, సభ్యులు, అధికారులు, పాత్రికేయులు, సందర్శకులు లేచి నిలబడ్డారు. ఈ అంశంపై అసెంబ్లీ అధికారులు విపక్షాన్ని సంప్రదించకపోవడంపై సీపీఎం సభ్యుడు బాదల్ చౌదురి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ జాతీయ గీతాన్ని వినిపించేందుకు ప్రయత్నిస్తామని అసెంబ్లీ కార్యదర్శి బి.మజుందార్ తెలిపారు. దేశంలోని ఇతర అసెంబ్లీల్లో వినిపిసున్నారో లేదో తనకు తెలియదని చెప్పారు.

కేరళ 'ఐఎస్' కేసులో మహిళకు ఏడేళ్ల జైలు

రూ.25వేల జరిమానా: ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు

కొచ్చి, మార్చి 24: ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)లో చేరేలా కేరళ యువతను ప్రేరేపించిన కేసులో యాస్మీన్ మొహమ్మద్ జాహిద్ (30) అనే మహిళకు ఎర్నాకుళంలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. దీంతో పాటు రూ.25వేల జరిమానా చెల్లించాలనీ ఆదేశించింది. ఐఎస్‌ఎలో చురుగ్గా పని చేస్తున్న అబ్దుల్ రషీద్ అబ్దుల్లా... యాస్మీన్‌తో కలిసి కేరళలోని కాసర్‌గోడ్, ఇతర ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, ఐఎస్‌లో చేరేలా యువతను ప్రేరేపించేవాడు. ఐఎస్‌లో పని చేసేందుకు ముందుకొచ్చిన యువతను, వారి కుటుంబాలతో సహా భారత్ నుంచి వెళ్లిపోవడానికి రంగం సిద్ధం చేశాడు. ఆ తర్వాత అతడు అఫ్ఘానిస్థాన్ వెళ్లాడు. ఐఎస్ అధీనంలోని అక్కడి ప్రాంతంలో ఆ సంస్థ తరపున పని చేస్తూ.. నిధులు సేకరించి, వాటిని యాస్మీన్‌కు పంపాడు. బిహార్‌కు చెందిన యాస్మీన్.. ఈ నిధులను ఐఎస్‌ఎలో రిక్రూట్‌మెంట్లకు వెచ్చించేది. ఈ క్రమంలో రషీద్‌ను కలుసుకొనేందుకు అఫ్ఘాన్ వెళ్తుండగా.. 2016 జూలై 30న ఢిల్లీ విమానాశ్రయంలో అరెస్టు అయ్యింది. ఈ ఉదంతంపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) 2016 ఆగస్టు 24న కేసు నమోదు చేసింది. ఇందులో మొత్తం 15 మంది నిందితులు. అబ్దుల్ రషీద్ అబ్దుల్లా ప్రధాన నిందితునిగా, యాస్మీన్ రెండో ముద్దాయిగా ఎన్ఐఏ గతేడాది చార్జిషీటు దాఖలు చేసింది. చట్టవిరుద్ధ కార్యకలాపాల(నివారణ) చట్టం, ఐపీసీలోని పలు సెక్షన్ల కింది అభియోగాలు నమోదు చేశారు. 2015 నుంచే కేరళలో ఐఎస్ తన కార్యక్రమాలు నిర్వహిస్తోందని దర్యాప్తులో తేలింది. కేసు విచారణలో యాస్మీన్ దోషిగా తేలడంతో ఎన్ఐఏ కోర్టు జైలు శిక్ష విధించింది.

ఆధార్ డేటా లీక్.. లేదు లేదు!

ఖాతాదారుల వివరాలు బహిర్గతం

- **థర్డ్ పార్టీ 'ఏపీఐ' ద్వారా యాక్సెస్**
- **లోపాలను గుర్తించిన సెక్యూరిటీ రీసెర్చర్**
- **డేటా పదిలమేనంటూ యూఐడీఏఐ వెల్లడి**



న్యూఢిల్లీ, మార్చి 24: ఆధార్ డేటా లీక్ అయ్యే అవకాశమే లేదని యూనిక్ ఐడెంటిటీ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) పదేపదే చెబుతున్నా.. ఖాతాదారుల వ్యక్తిగత వివరాలకు భద్రత లేదంటూ సెక్యూరిటీ రీసెర్చర్లు ఆధారాలతో సహా నిరూపిస్తున్నారు. ఢిల్లీకి చెందిన కరణ్ సైనీ అనే సెక్యూరిటీ రీసెర్చర్.. ఒక ప్రభుత్వ రంగ సంస్థ వినియోగిస్తున్న ఏపీఐ (అప్లికేషన్ ప్రోగ్రాం ఇంటర్‌ఫేస్) ద్వారా ఆధార్ డేటా లీక్ అవుతోందని హెచ్చరించాడు. ఈ మేరకు జెడ్‌డీనెట్ అనే సంస్థ ఒక నివేదికను విడుదల చేసింది. యూఐడీఏఐ మాత్రం.. తమ సర్వర్ల ద్వారా ఆధార్ లీక్ అవ్వలేదంటూ ప్రకటన విడుదల చేసింది.

ఎలా లీకైంది?

థర్డ్ పార్టీ సంస్థలు ఆధార్ అథెంటికేషన్ ద్వారా తమ సేవలను వినియోగదారులకు అందించేందుకు యూఐడీఏఐ వాటికి ఏపీఐ సౌకర్యం కల్పించింది. దీని ద్వారానే టెలికాం సంస్థలు ఒక్క వేలిముద్రతో వినియోదారుడి ఆధార్ డేటాను యాక్సెస్ చేసి, సిమ్‌కార్డులు జారీ చేస్తున్నాయి. ఈ తరహాలోనే బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీలు, ఇతర సంస్థలు వినియోగదారుల ఖాతాలతో ఆధార్ వివరాలను సీడ్ చేస్తున్నాయి. ఇలా ఓ కేంద్ర ప్రభుత్వ సంస్థ వినియోగించే ఏపీఐలో లొసుగులున్నాయని, దాని ద్వారానే అందరి ఆధార్ డేటాను సులభంగా తస్కరించవచ్చని కరణ్ సైనీ గుర్తించాడు. భద్రతాపరమైన కారణాల దృష్ట్యా.. ఆ కేంద్ర ప్రభుత్వ సంస్థ వివరాలను బహిర్గతం చేయలేదు. 'వాస్తవానికి ఏపీఐ వినియోగానికి పరిధులు ఉంటాయి. కానీ, సదరు కేంద్ర ప్రభుత్వ సంస్థ ఏపీఐ ద్వారా ఒక కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ ప్రొటోకాల్ (ఐపీ) అడ్రస్ నుంచి అపరిమిత యాక్సెస్ ఉంది. నిమిషంలో కొన్ని వేలమంది ఆధార్ డేటాను తస్కరించవచ్చు. ఆధార్ డేటాను చేరాలంటే.. ఆధార్ నంబరుతో పాటు.. కొన్ని సెక్యూరిటీ ప్రశ్నలను దాటాల్సి ఉంటుంది. ఇందులో పుట్టిన రోజు వివరాలు, పిన్‌కోడ్ వంటివి ఉంటాయి. పైగా.. మూడంచెల భద్రతలో భాగంగా ఖాతాదారుడి ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఆ కేంద్ర ప్రభుత్వ సంస్థ ఏపీఐ ద్వారా ఆధార్ వివరాలు సేకరించేందుకు ఇవేమీ అవసరం లేదు' అని జెడ్‌డీనెట్ తెలిపింది. నెలరోజులుగా కరణ్ చేస్తున్న హెచ్చరికల్ని యూఐడీఏఐ పట్టించుకోలేదని, దీంతో తమను సంప్రదించాడని పేర్కొంది. కాగా.. ఆధార్ లీకేజీకి తమ సర్వర్లతో ఎలాంటి సంబంధం లేదని యూఐడీఏఐ శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. 'కేవలం ఒక ఏపీఐ ద్వారా డేటాలీక్ జరిగిందని జెడ్‌డీనెట్, ఓ సెక్యూరిటీ రీసెర్చర్ చెబుతున్నారు. మా ద్వారా ఎలాంటి లీకేజీ జరగలేదు' అని వివరించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.





ఫొటోలు: యం.గోపీకృష్ణ

**బిజీ బిజీగా భారీ సినిమాలు... ఖాళీ దొరికితే క్విక్‌గా యాడ్ షూట్‌లు...
నిత్యం చదువుతూ అప్‌డేట్‌లు... అసిస్టెంట్లకు ప్రేమగా ప్రోత్సాహాలు...
స్టార్లతో ఎప్పటికప్పుడు ములాఖత్‌లు... తీరిక దొరికితే ఫ్యామిలీతో పదనిసలు...
24 ఫ్రేమ్స్... 24 యాంగిల్స్ అన్నట్టు సాగుతోంది రత్నవేలు జీవితం.
ఎదుటనిలిచిన దృశ్యం ఎలాంటిదైనా కెమెరా కన్నుతో చిలిపిగా కన్నుగీటే
ప్రముఖ ఛాయాగ్రాహకుడు రత్నవేలు 'నవ్య'తో పంచుకున్న విశేషాలు...**

వేగాన్ని పట్టుకొంటేనే విజయం!

'రంగస్థలం' ఎలా మొదలైంది?

★ 'నేనొక్కడినే', 'నాన్నకు ప్రేమతో' చిత్రాలు పూర్తయ్యాక ఒక రోజు నేను సుకుమార్ కలిసి కూర్చున్నాం. 'నా దగ్గర రెండు స్క్రిప్ట్‌లున్నాయి. వాటిలో ఏది మొదలుపెడదాం? ఒకటి సిటీ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. ఒకటి విలేజ్ బ్యాక్‌డ్రాప్' అని అన్నారు. నేను వెంటనే 'నువ్వు విలేజ్ నుంచి వచ్చావు. ఆ ఫ్లేవర్‌తో సినిమా చేస్తే బావుంటుంది' అని చెప్పా. అలా మాటల్లోనే పీరియాడిక్ సినిమా చేద్దామనే ఆలోచన వచ్చింది. రామ్‌చరణ్‌తో సినిమా చేయాలని నేను కూడా ఎప్పటి నుంచో అనుకుంటూ ఉన్నా. 'రంగస్థలం'తో అది కుదిరింది.

స్క్రిప్ట్ డిస్కషన్స్‌లో కూర్చున్నారా?

★ కూర్చున్నాను. కాకపోతే రోజూ కాదు.. ఒక వెర్షన్ పూర్తయ్యాక సుక్కుతో డిస్కస్ చేసేవాడిని. అలాగన్నమాట.

కెమెరామేన్ స్క్రిప్ట్ డిస్కషన్‌లో కూర్చోవడం వల్ల కలిగే లాభాలేంటి?

★ లాభనష్టాల కోసం కాదు. మొదటి నుంచీ ఒక సినిమాతో జర్నీ చేస్తే చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

మీరు సినిమాలకు 'కెమెరా స్క్రిప్ట్' అని ప్రత్యేకంగా రాస్తారట కదా?

★ నేను రాసుకుంటానని ఎవరు చెప్పారు? (నవ్వుతూ) నిజమే. అది రెగ్యులర్ స్క్రిప్ట్‌కి భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు 'రంగస్థలం' చిత్రాన్నే తీసుకోండి.. ఈ తరహా సినిమాల షూటింగ్ పూర్తయ్యాక డీశాట్ చేస్తారు. (డీ శాట్ అంటే కలర్‌ని తగ్గిస్తారన్న మాట). అది చాలా తేలిక. అయినా నాకు నచ్చలేదు. అందుకే నాకు నచ్చిన టోన్ కోసం రీసెర్చ్ చేశాను. కాస్ట్యూమ్స్ నుంచి ఆర్ట్ డైరక్టర్స్ వరకు అందరితోనూ కూర్చున్నా. కలర్ల గురించి డిస్కస్ చేశా. 'బ్రైట్ గ్రీన్స్, బ్రైట్ బ్లూస్, పర్పుల్ వంటివాటిని అసలు వాడవద్దు. ఫ్లోరల్ డిజైన్స్ ఉండాలి...' అని వివరిస్తూ మూడ్ బోర్డ్ చేశాను. అంతే... ఆటోమేటిగ్గా అన్నీ ఓ పద్ధతిలో అమరాయి. సినిమాలో నాణ్యత కనిపించాలంటే అందరూ కలిసి ఆలోచించాలి. స్క్రిప్ట్ డిస్కషన్స్‌లో కూర్చోవడం వల్ల సినిమా మరింత లోతుగా అర్థమవుతుంది.

ఇవన్నీ.. డైరక్టర్ చెప్తే ఓకే! కెమెరామేన్ చెప్తే వాళ్లు ఇగో ఫీల్ కారా?

★ ఇగో క్లాషస్ రావడానికి అవకాశాలు లేవండీ. ఎందుకంటే ఇది మా ఒక్క ఇంట్లో పెళ్లి కాదు. అందరి చేతులు కలిస్తేనే సినిమా. ఆ స్పృహ అందరిలోనూ ఉంటుంది. అంతెందుకు... సమంతకు మేకప్ టెస్ట్ చేసినప్పుడు కాస్త బ్రౌన్ మిక్స్ చేసిన మేకప్ వేసి ట్యాన్ లుక్ తీసుకొద్దాం అని అన్నాను. సమంత కూడా ఏమీ అనకుండా చేసింది. తీరా మానిటర్‌లో చూసుకున్నాక ఫిదా అయిపోయింది. 'సార్.. సూపర్‌గా ఉంది. మీరు ఏం చెప్తే అదే చేద్దాం' అనేసింది. ఇందాక మీరన్నట్టు మొదట మనం చెప్పిన విషయాన్ని అవతలివాళ్లు ఇగో ఫీలయినప్పటికీ రిజల్ట్ చూశాక ఖుషీ అవుతారన్నమాట.

'రంగస్థలం' కోసం మొదట చాలా కష్టపడ్డారట కదా?

★ నేను పెరిగిందంతా సిటీలోనే అయినప్పటికీ, చిన్నప్పుడు విలేజ్‌లకు వెళ్లిన జ్ఞాపకాలున్నాయి. వాటిని గుర్తు చేసుకుంటూ లొకేషన్లు వెతికాను. సుకుమార్ పెరిగిందంతా పల్లెటూరిలోనే! సో అతనికి మరింత అవగాహన ఉంది. ఇద్దరం కలిసి ఉభయగోదావరులను మూడు, నాలుగు సార్లు గాలించేశాం. ఎందుకంటే సినిమాలు మొదలైనప్పటి నుంచీ గోదావరిని తెరమీద చూస్తూనే ఉన్నాం. ఈ సినిమాలో గోదావరిని కొత్తగా చూపించాలి? ఎలా? ఈ మైండ్‌సెట్‌తోనే తిరిగాం. అప్పుడు రస్టిక్ బ్యూటీని యాడ్ చేయాలనిపించింది. ఒక వైపు నీళ్లు, మరోవైపు కాస్త ఎండీ ఎండనట్టున్న రంగులు.. ఆ రస్టిక్ బ్యూటీని మనం ఇంతవరకు తెరమీద ఎప్పుడూ చూడలేదు. 'రంగస్థలం' చిత్రానికి అదే పెద్ద ఎసెట్ అయింది. దాన్ని తెరమీదకు తీసుకురావడం కాస్త కష్టమే.. అయినా చేశాను. చూసిన ప్రతి ఒక్కరూ మెచ్చుకుంటున్నారు. ఈ సినిమాలో నా ఫొటోగ్రఫీని పాపికొండలు ఏరియాకు అంకితం చేస్తున్నాను. ప్రాజెక్ట్ మూలంగా త్వరలో పాపికొండలు ప్రాంతం నీట మునిగిపోతుందికదా.. అందుకోసం అంకితం చేస్తున్నానన్నమాట.

అసలు మీరు... ఇంత పెద్ద జర్నీని ఊహించారా?

★ (నవ్వు). లేదండీ. ఇటీవల 'రోబో', 'నేనొక్కడినే..'లో మోడ్రన్ ఫొటోగ్రఫీ చేశాను. సినిమాకో మూడ్ ఉంటుంది. ఆ మూడ్‌ని క్యారీ చేసుకుంటూ వెళ్తున్నాను.

మీ పనితీరులో మీకు బాగా నచ్చిన అంశాలేంటి?

★ నా ముందున్నవాళ్లో, సమకాలీకులో చేసిన ప్రయోగాలను నేను రిపీట్ చేయను. పదేళ్ల ముందు నేను చేసిన సినిమాను చూసి 'ఏం బాగా చేయలేదురా' అని నాతో నేనే అనుకుంటా. అప్పుడే గ్రోత్ ఉంటుంది. 'ఆర్య'ను ఇప్పుడు చూస్తే అది మంచి ఫొటోగ్రఫీ కాదని అనిపిస్తుంది. 'వారణం ఆయిరం' (తెలుగులో 'సూర్య సన్నాఫ్ కృష్ణన్') సినిమాను చూసినప్పుడు కాలేజీల్లో యూత్ అందరూ 'ఫొటోగ్రఫీ ది బెస్ట్' అని మెచ్చుకున్నారు. అప్పటిదాకా సూర్యని చూసిన వాళ్లందరూ అంత బాగా అంతకు ముందు ఎప్పుడూ సూర్య కనిపించలేదని చెప్పారు. నిజానికి 'అది గుడ్ ఫొటోగ్రఫీ. మంచి ఫొటోగ్రఫీ కదా.. అని ఇప్పుడు దాన్నే రిపీట్ చేస్తే నాకే బోర్ కొడుతుంది. అందుకే చేయను. ఆ మధ్య చేసిన '1-నేనొక్కడినే' చూసిన వాళ్లందరూ, ఇంకో లెవల్ ఫొటోగ్రఫీ కదా...' అని మెచ్చుకున్నారు. 'బ్రహ్మోత్సవం' స్టాండర్డ్స్ కంప్లీట్‌గా వేరన్నమాట. 'కుమారి 21ఎఫ్' లైట్లు కూడా లేకుండా చేసిన ఫొటోగ్రఫీ. తాజాగా 'రంగస్థలం'లో చాలా వరకు సింగిల్ షాట్స్‌కే వెళ్లాను. లెంగ్తీ సింగిల్ షాట్స్ చేయడం చాలా కష్టమన్నమాట. అయినా చేశాం. మేం చేసిన ప్రతి షాట్ మూడు నిమిషాలకు తగ్గకుండా ఉన్నట్టుంటుంది. ఇది సినిమా చూశాక అర్థమవుతుంది. ఉత్తరాదిన సంజయల్‌లీలా భన్సాలీ ఈ తరహాలో షూట్ చేస్తారు. అయితే వాళ్లు ఉదయాన్నే వచ్చి పొజిషన్ మార్క్ చేసుకుని, ఆ తర్వాత హాఫ్ డే దాని మీద వర్కవుట్ చేస్తారు. 'రంగస్థలం' అలా చేసిన సినిమా కాదు.



సుకుమార్‌తో...

14 ఏళ్ల ప్రయాణం మాది

'ఆర్య' (2004) నుంచి కలిసే పని చేస్తున్నాం. చాలా స్ట్రాంగ్ ఫ్రెండ్‌షిప్ మాది. సుకుమార్ స్క్రీన్‌ప్లే, స్క్రిప్ట్ అంటే నాకు ఇష్టం. నా పనితీరు అంటే ఆయనకు గౌరవం. దిల్‌రాజు 'ఆర్య' స్క్రిప్ట్ ఓకే చేసిన తర్వాత 'ఏం కావాలి చెప్పు' అని అడిగితే 'నాకు రత్నవేలును ఇవ్వండి చాలు' అని అన్నాడట సుక్కు (సుకుమార్). అంతకు ముందు ఆయనకు నాతో పరిచయం లేదు. నేను చేసిన 'సేతు', 'నంద' చిత్రాలతోనే పరిచయం. నా పనితీరు నచ్చి అప్రోచ్ అయ్యారు. ఇప్పటికీ మా బంధం సాగుతూనే ఉంది.



'రోబో'లో రజనీకాంత్

ఫాస్టెస్ట్ కెమెరామేన్ కావాలన్నది కావాలని తీసుకున్న నిర్ణయమా?

★ లేదండీ! అనుభవం మీద వేగం వస్తుంది. కేవలం వేగం మీద దృష్టి పెడితే నాణ్యత ఉండదు. నా కెమెరా ఎంత వేగంగా ఉంటుందో, అంతకు రెట్టింపు నాణ్యతగానూ ఉంటుంది. ప్రపంచమే పరుగులు తీస్తోంది. కెమెరా కూల్‌గా ఉంటానంటే ఎలా? ఇప్పుడు టెస్ట్ మ్యాచ్‌లు దాటి 20-20 మ్యాచ్‌లు వచ్చేశాయిగా! ఎవరైనా ఆ వేగాన్ని పట్టుకోగలిగినప్పుడే విజయవంతమైన మార్గంలో ఉన్నట్టు!

అంత వేగంగా ఉండాలంటే.. ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలిగా?

★ నిస్సందేహంగా. అప్‌డేట్ కావాలంటే చదవాలి. చదవడాన్ని మించిన బ్రహ్మాస్త్రం లేనే లేదు. నేను ప్రతిరోజూ అరగంట నుంచి గంటసేపయినా చదువుతాను. పాతికేళ్లుగా 'అమెరికన్ సినిమాటోగ్రాఫర్' అనే మంత్లీ చదువుతున్నా. సినిమాటోగ్రాఫర్స్ ఫోరమ్స్‌లో ఉన్నాను. నిజ జీవితంలోనూ ప్రతి అంశాన్నీ గమనిస్తుంటా. నిన్నటి లేటెస్ట్ డెవలప్‌మెంట్‌ను నేను ఇవాళ మీతో పంచుకోగలను. పేరున్న సినిమాటోగ్రాఫర్‌గా అది నా కర్తవ్యం. డిజిటల్ వచ్చిన కొత్తల్లో అంతకు ముందున్న 90 శాతం సినిమాటోగ్రాఫర్లు కనుమరుగయ్యారు. అందుకు కారణం అప్‌డేట్ కాకపోవడమే! ఎందుకంటే అంతకు ముందున్న వర్క్ ఫ్లో వేరు. ప్రాసెసింగ్ వేరు. నెగిటివ్‌లో చేసేటప్పుడు ఓవర్ ఎక్స్‌పోజర్ చేయొచ్చు. కానీ డిజిటల్‌లో అండర్ ఎక్స్‌పోజర్ ఉంటుంది. పూర్తిగా నెగిటివ్‌లో చేయడం వేరు, డిజిటల్ వేరు. నేను కూడా ఫిల్మ్(నెగటివ్) బ్యాక్‌గ్రౌండ్ నుంచే వచ్చాను. నెగటివ్ వాసన ఇంకా నా మనసులో పదిలంగా ఉంది.

డిజిటల్ వచ్చిన కొత్తల్లో.. చాలా మంది దాన్ని అపోజ్ చేశారుగా!

★ అందులో నేను లేను కానీ, అపోజ్ చేయడానికి చాలా కారణాలున్నాయి. నెగటివ్‌లో షూట్ చేసేటప్పుడు ఒక మ్యాజిక్ ఉండేది. షూట్ చేసిన నెగటివ్‌లో ఏం ఉందో తెలియాలంటే అప్పట్లో వారం రోజులు ఆగాల్సి వచ్చేది. అందులో థ్రిల్ ఉండేది. కానీ ఇప్పుడు ఎప్పటిదప్పుడే కాబట్టి పెద్దగా థ్రిల్ ఉండదు. కానీ ఇందులో ఉండే సదుపాయాలు ఇందులోనూ ఉన్నాయనుకోండి. ఇంకో విషయం ఏంటంటే.. డిజిజల్‌ని కేవలం చిన్న సినిమాలకే వాడుతారనే అపోహ చాన్నాళ్లు ఉండేది. '1- నేనొక్కడినే'లో డిజిటల్ వాడుదామని అంటే మహేశ్‌బాబుగారు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నేను విడమరిచి చెబితే ఆశ్చర్యపోయారు. ఆ సినిమా తర్వాత ఇప్పుడు దాదాపు 80 శాతం పెద్ద చిత్రాలన్నీ డిజిటల్‌లోనే జరుగుతున్నాయి.

ఎక్కువ సవాలు ఎదుర్కొని తీసిన సినిమా ఉందా?

★ కన్నడలో 'గాలిపట' అనే సినిమా చేసినప్పుడు చాలా థ్రిల్ ఫీలయ్యా. సినిమా అంతా మాన్‌సూన్ రెయిన్‌లోనే చేశాం. మూడున్నర నెలల పాటు కెమెరా చుట్టూ వర్షం పడుతుండగా లోలోపల అటవీ ప్రాంతంలో చేసిన షూటింగ్‌ని మర్చిపోలేను.

మీ గురువు మిమ్మల్ని మెచ్చుకున్నారా?

★ నా గురువు రాజీవ్ మీనన్‌గారు ఏం చేసినా గ్లాసీ, బ్యూటీఫుల్ విజువల్స్ ఉంటాయి. ఆయన దగ్గర 'బొంబాయి' సినిమాతో పాటు, 50 కమర్షియల్స్‌కు పనిచేశా. ఆ తర్వాత నేను కెమెరామేన్‌గా తమిళంలో 'నందా', 'సేతు' చేశా. వాటిని చూసి 'నా కెమెరా స్టైల్‌ను నువ్వు కాపీ కొట్టలేదు. నేను ఆనందించే విషయం అదే' అని అన్నారు.

• డా. చల్లా భాగ్యలక్ష్మి

అందుకే... 'సైరా' ఒప్పుకొన్నా!

'సైరా' టీమ్‌లో మీ పేరు ఎలా చేరింది?

చిరంజీవిగారితో 'ఖైదీ నంబర్ 150' చేశాక ఆయన 'సైరా'కు నన్నే చేయమన్నారు. సరేనన్నాను. మేం సరే అనుకున్న సమయానికి 'రంగస్థలం' 2017 జనవరిలో మొదలయి, జులైకి పూర్తి అవుతుందన్నది లెక్కన్న మాట. కానీ రంగస్థలం నాలుగు నెలలు లేటయి ఏప్రిల్‌లో మొదలైంది. ఎప్పటికి పూర్తి చేస్తామోననే విషయంపై అప్పటికి స్పష్టత లేదు. నేను ఏ సినిమాకైనా సరే వర్క్ చేయడానికి ముందు కాస్త ప్రిపేర్ అవుతాను. 'సైరా'కి అంత సమయం ఉండదనిపించి మధ్యలో వెళ్లి, 'నేను చేయలేను సార్' అని అన్నా. వెంటనే వాళ్లు మరొకరి పేరును అనౌన్స్ చేశారు.

ముందు రవివర్మ పేరు ఉంది. తర్వాతే మీరు యాడ్ అయినట్టున్నారుగా?


మరొకరు ఒక్క రోజు పనిచేసినా సరే.. ఆ చిత్రాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నేను టేకప్ చేయను. 'సైరా' విషయంలో ఇంకో కెమెరామేన్ షూటింగ్ ఏమీ చేయలేదు. అందుకే నేను ప్రాజెక్ట్ చేయడానికి అంగీకరించా. గతంలో 'దశావతారం' సినిమాకు కూడా మరో ఛాయాగ్రాహకుడు రెండు, మూడు రోజులు పనిచేశారు. ఆ తర్వాత కమల్‌హాసన్‌గారు నన్ను పిలిచి ప్రాజెక్ట్ చేయమన్నారు. 'సారీ సార్! ఇంకొకరు మొదలుపెట్టింది నేను చేయను' అని సున్నితంగా తిరస్కరించా. 'సైరా' టీమ్ మొత్తం నా కోసం వెయిట్‌చేశారు. నన్ను గౌరవించి చిత్రీకరణ మొదలుపెట్టలేదు. అందుకే ఒప్పుకొన్నా.

మీరేమో ఒక్కొక్క సినిమానే చేస్తారు.. అది లేటవుతున్నకొద్దీ ఫ్రస్ట్రేషన్ ఉంటుందా?

మనుషులం కదా! కచ్చితంగా ఉంటుంది!! కాకపోతే దాన్ని ఎక్స్‌ట్రా బ్యాగేజ్ అనుకుని ఎప్పటికప్పుడూ తీసిపారేస్తూ ఉండాలి. అందుకు మన మైండ్‌సెట్ చాలా కీలకం. మానసికంగా దృఢంగా ఉన్నప్పుడు ఇలాంటి వాటి నుంచి అవలీలగా బయటపడగలం.

'సైరా' కోసం రిసెర్చ్ చేశారా?

'సైరా' కోసం చాలా రిసెర్చ్ చేశాం. మూడ్, కాస్ట్యూమ్స్, లొకేషన్స్... చాలా రీసెర్చ్ చేశాం. దీపావళి పండుగను మనం ఈ కాలంలో ఇలా జరుపుకొంటున్నాం. అప్పట్లో టపాస్‌లు కూడా లేవు కదా.. మరి వాళ్లు ఎలా జరుపుకొనేవారు? అలాంటి విషయాలను చాలా సూక్ష్మంగా తెలుసుకునే ప్రయత్నం చేశాం. అదే సమయంలో సినిమాలో గ్లాసీనెస్ కూడా ఉండేలా ప్లాన్ చేసుకున్నాం. పెద్ద బడ్జెట్‌లో చాలా హై రేంజ్‌లో తీస్తున్న సినిమా కాబట్టి ప్రతి విషయంలోనూ జాగ్రత్త తీసుకోవాల్సిందే!



'ఆర్య'లో అల్లు అర్జున్



'1-నేనొక్కడినే'లో మహేశ్‌బాబు

ఫోన్ తిప్పి... యాంగిల్ అంటే ఎలా?

ఐఫోన్లలో సినిమాలు తీసేస్తున్నారు. మీరేం అనుకుంటున్నారు?

తీయొచ్చు. అందులో తప్పు లేదు. కానీ అవన్నీ తాత్కాలికమే. ఫోన్‌ని ఇష్టం వచ్చినట్టు తిప్పి, దాన్నే యాంగిల్‌గా భ్రమ పడితే ఎలా? నికార్సయిన షాట్ తీయాల్సి వచ్చినప్పుడు కదా అసలు టాలెంట్ బయటపడేది. కాబట్టి నేను అలాంటి వాటిని పట్టించుకోను.

మీ లాంటి కెమెరామేన్లు లోకల్ వాళ్లని అసిస్టెంట్లుగా వద్దంటున్నారట కదా?

నా దగ్గర అలాంటిదేమీ లేదండీ. ఎప్పుడూ ఇద్దరిని లోకల్ వాళ్లని ఎంపిక చేసుకుంటాను. నాకు భాషతో పనిలేదండీ. లోకల్ వాళ్లు కూడా ఎదగాలన్నదే నా కోరిక కూడా. ఇప్పటికి నా దగ్గర పనిచేసిన 11 మంది కెమెరామేన్లుగా స్థిరపడ్డారు. ఎవరినీ రెండేళ్ల కన్నా ఎక్కువగా ఉంచను. చదువుకున్నవారినే ఎంపిక చేసుకుంటా. మొహమాటానికి పోయి చదువుకోని వారిని తీసుకుంటే, వాళ్లు మిగిలిన వాళ్లకన్నా వెనకబడుతారు. అది నాకు నచ్చదు. మినిమమ్ విజువల్ కమ్యూనికేసన్, మాస్ కమ్యూనికేషన్, ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చదివిన వారినే ప్రిఫర్ చేసుకుంటాను.



ఆ ఒంటరితనం భరించలేకే...

సినిమా నేపథ్యం లేని ఫ్యామిలీ నుంచి వచ్చి కెమెరామేన్ ఎలా కావాలనుకున్నారు?

ఏ నిజమే. మా కుటుంబానికి సినిమాలతో ఎలాంటి సంబంధం లేదు. మా నాన్న చెన్నైలో డాక్టర్. మా అన్న బీటెక్, ఎంబీఏ, మరో సిస్టర్ డాక్టర్, ఇంకో సిస్టర్ అడ్వకేట్. నేను ఆఖరి అబ్బాయిని. ప్లస్ టూ చదువుతున్నప్పుడే సినిమాల్లోకి వెళ్తానన్నాను. ఇంజనీరింగ్ చదవమన్నారు. కుదరదని ఫిజిక్స్ చదివా. అంతలోనే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో సీటు వచ్చింది. అక్కడ కోర్సు పూర్తి చేశాక రాజీవ్‌మీనన్ గారి దగ్గర పనిచేశా. వెంటనే 'సేతు' సినిమా వచ్చింది.

ఇండస్ట్రీలో అబ్బాయికి పిల్లను ఇవ్వడానికి ఎవరూ పెద్దగా ఇష్టపడరు. మరి మీకెలా ఇచ్చారు?

మా ఫ్యామిలీకి సమాజంలో చాలా మంచి పేరు ఉంది. నా తొలి సినిమా 'సేతు' గురించి అందరికీ బాగా తెలుసు. అప్పటికే రెండో సినిమా 'నందా' చేస్తున్నా. కమర్షియల్స్ కూడా చేసి బాగా పేరు తెచ్చుకున్నా. దాంతో అవతలివారికి కూడా నమ్మకం వచ్చింది. బీటెక్ చదివిన అమ్మాయిని నాకు ఇచ్చి పెళ్లి చేశారు. మా వదిన తరపు చుట్టాలమ్మాయి నా భార్య. పెళ్లి చూపులకు కూడా నేను వెళ్లలేదు. అసలు ఆ సమయంలో నాకు ప్రేమ, పెళ్లి ఇలాంటి ఆలోచనలే లేవు. మా అమ్మ పట్టుబట్టి నా పెళ్లి చేసింది. మా ఆవిడ చాలా గొప్పది. నా పనికి ప్లస్ అవుతుందే తప్ప, ఏ రోజూ మైనస్ కాదు. నేను సెట్‌లో ఉన్నప్పుడు అసలు ఫోన్లు కూడా మాట్లాడను. సాయంత్రం ప్యాకప్ తర్వాతే మాట్లాడుతుంటా. అన్నీ అర్థం చేసుకుంటుంది. నా ఆర్థిక వ్యవహారాలన్నీ తానే చూసుకుంటుంది. మా అమ్మను కూడా చాలా బాగా చూస్తుంది. ఇంటికి వచ్చిన వారికి గౌరవమర్యాదలు ఇవ్వడం, పిల్లలను పెంచడం అన్నీ తానే చేస్తుంది. మా అబ్బాయి చిన్నప్పటి నుంచి పెయింటింగ్స్ చాలా బాగా వేసేవాడు. వాడిని ఎంకరేజ్ చేసింది. 11 ఏళ్లకే వాడి పెయింటింగ్స్‌లో ఎగ్జిబిషన్ కూడా నిర్వహించాడు. మా అమ్మాయి మూడో తరగతి చదువుతోంది.

మీ పిల్లలు ఏమంటున్నారు?

మా అబ్బాయి కెమెరామేన్ అవుతానని కచ్చితంగా చెప్పేశాడు. ఇప్పుడు కూడా ఏవో చిన్న చిన్న షూట్ చేసి పంపుతాడు. వాడికి నా సినిమాలు పరిచయమే కానీ, వాడు పెరిగి పెద్దయ్యే క్రమంలో నాతో గడిపిన గంటలు చాలా తక్కువ. నేను నేర్పించింది ఇంకా తక్కువ. ఎందుకంటే నా సినిమాలతో నేను బిజీ. చదువుతో వాడు బిజీ. అప్పుడప్పుడూ ఐఫోన్‌లో విజువల్స్ షూట్ చేసి పంపుతుంటాడు. నా దగ్గర అసిస్టెంట్లుగా చేరిన రెండేళ్లకు మిగిలిన వాళ్లు నేర్చుకునేది తను ఇప్పుడే నేర్చుకున్నాడు.. ఎలా నేర్చుకున్నాడన్నది ఆశ్చర్యం.

ఇన్ని కోట్లు ఉన్నాయి.. ఇంత పేరు ఉంది. కావాల్సిన వాళ్లు పక్కన లేరనే బాధ ఉంటుంది కదా?

చాలా ఉంటుందండీ. నేను ప్రత్యేకంగా ఇళ్లు తీసుకోకుండా ఇలా హోటల్ రూమ్‌లో ఉండటానికి కారణం కూడా అదే. మా ఆవిడ ఇప్పటికే చాలా సార్లు చెప్పింది. 'హైదరాబాద్‌లో ఇల్లు కొనుక్కుని ఎవరినైనా కుక్‌ని పెట్టుకుని వండించుకుని తినండి..' అని! కానీ నేను అలా చేయకపోవడానికి ఓ కారణం ఉంది. ఇంట్లో నేను ఒక్కడినే ఉంటే ఆ ఒంటరితనం భరించడం చాలా కషం.

డైరక్షన్ చేయాలనే ఆశ ఇంకా రాలేదా?

(నవ్వుతూ).. ఎప్పుడో వచ్చేసింది. కానీ 'డైరక్షన్ ఎప్పుడైనా చేయొచ్చు. ఇప్పుడు 'సైరా' సినిమా చేయి' అని చిరంజీవిగారు చెప్పారు. ఆయన మాట మీద చేస్తున్నాను. నా దగ్గర బౌండ్ స్క్రిప్ట్లు సిద్ధంగా ఉన్నాయి. పెద్ద హీరోలు, నిర్మాతలూ సిద్ధంగా ఉన్నారు. సరైన సమయం చూసి వివరాలు ప్రకటిస్తాను.

అక్కడ ధనుష్... ఇక్కడ చరణ్!



'రంగస్థలం'లో రామ్‌చరణ్

చిరంజీవిగారి డిసిప్లిన్ చాలా వరకు చరణ్‌కి వచ్చింది. చరణ్ చాలా ఎంథూజియాస్టిక్ పర్సన్. మంచి షాట్ చూడగానే ఎగ్జయిట్ అవుతారు. సంతోషపడతారు. అందరితో ఎక్కువగా మాట్లాడరు. కానీ నాతో చాలా బాగా మాట్లాడుతారు. ఒక టెక్నీషియన్‌కి ఎలాంటి రెస్పెక్ట్ ఇవ్వాలో తెలిసిన హీరో. ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు నేను చరణ్‌తోనూ, సుకుతోనూ ఒకటే మాట చెప్పాను. అదేంటంటే.. 'చరణ్ నేచురల్ పెర్ఫార్మర్' అని! అసలు ఇన్నాళ్లూ ఆయన సినిమాల్లో అది ఎందుకో తెలియనేలేదు. కరెక్టయిన స్క్రిప్ట్, కరెక్టయిన కేరెక్టర్ కుదరకపోవడం వల్ల అది ఇప్పటిదాకా బయటపడలేదేమో! ఇప్పుడు 'రంగస్థలం' చూస్తే నేనన్న మాట సరైనదేనని మీరే చెబుతారు. నాకు ఎవరినీ ఊరికే పొగడాల్సిన అవసరం లేదు. నేను రజనీ సార్ నుంచి చిరంజీవి సార్ వరకు.. చాలా మంది టాప్ పీపుల్‌తో పనిచేశాను. హీరోలను ఇంప్రెస్ చేయడానికి నేనెప్పుడూ పొగడను. అలాంటి నేను చెప్తోన్న విషయం ఏంటంటే... తమిళ్‌లో ధనుష్ ఎలా నేచురల్‌గా నటిస్తారో, చరణ్ అంత నేచురల్‌గా నటిస్తారని!

చిరు... చరణ్‌ల మధ్య తేడా అదే!



రామ్‌చరణ్ సింగిల్ టేక్ ఆర్టిస్ట్. చాలా స్పాంటేనియస్ ఆర్టిస్ట్. రెండు, మూడు టేకుల తర్వాత ఆయన స్లో డౌన్ అవుతారు. ఫస్ట్ టూ అటెంప్ట్స్‌లో ఆయన బాగా నటిస్తారని సుకుతోనూ చెప్పా. ఎన్ని టేకులు తీసుకున్నా చిరంజీవి సార్ నుంచి కొత్త కొత్త పెర్ఫార్మెన్స్‌లు వస్తాయి. అది వారిద్దరికీ ఉన్న పెద్ద తేడా. పోలికలంటారా? చాలా ఉన్నాయి. కరెక్ట్ టైమ్‌కి వస్తారు. ప్రొఫెషలిజం ఉంటుంది. 'ఫుడ్ ఓకేనా? ఇంటి నుంచి పంపనా..' అని కేరింగ్‌గా ఉంటారు. వాళ్లిద్దరూ డ్యాన్స్‌లో మాస్టర్సే. పెద్దగా ప్రాక్టీస్ చేయరు. 'షాట్' అనగానే గొప్పగా చేసేస్తారంతే. ఇద్దరి మధ్యా ఉన్న ఒక పోలిక ఈ సినిమాలో తెర మీద కనిపిస్తుంది. ఓపెనింగ్ సాంగ్‌లో లిటిల్ బిట్ ఆఫ్ చిరంజీవి మూవ్‌మెంట్స్‌ని చరణ్ ట్రై చేశారు. అవి అభిమానులకు విందే.









శివన్... కాబోయే శ్రీవారేనా?



విఘ్నేష్ శివన్, నయనతార
లవ్ బర్డ్స్

ఎవరికి? నయనతారకు! శివన్ అంటే తమిళ దర్శకుడు విఘ్నేష్ శివన్! కొంత కాలంగా వీరిద్దరూ ప్రేమలో ఉన్నారనే సంగతి ప్రేక్షకులందరికీ తెలిసిన విషయమే. అయితే... నయనతార ఎప్పుడూ తన ప్రేమ గురించి మీడియా ముందు పెదవి విప్పలేదు. అప్పుడప్పుడూ విఘ్నేష్ శివనే సోషల్ మీడియాలో ఫొటోలు షేర్ చేస్తుంటారు. నయన్ మాత్రం మౌనంగానే ఉంటారు. అటువంటి ఆమె నోటి వెంట 'కాబోయే శ్రీవారు' అనే పదం వచ్చింది. అయితే... ఆ శ్రీవారు విఘ్నేష్ శివన్‌యేనా? కాదా? అనేది మాత్రం చెప్పలేదు. శుక్రవారం చెన్నైలో జరిగిన ఓ అవార్డుల కార్యక్రమంలో 'ఎక్సలెన్స్ ఇన్ ఎంటర్‌టైన్‌మెంట్' అవార్డు అందుకున్న నయనతార "నాకు ఎప్పుడూ మానసిక స్థైర్యాన్నిస్తున్న మా అమ్మ, నాన్న, సోదరుడు, 'ఫియాన్సే' (కాబోయే శ్రీవారు)కి థ్యాంక్స్" అని పేర్కొన్నారు. ఆమె 'ఫియాన్సే' అని ఎవరిని ఉద్దేశించి మాట్లాడారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనుకుంట! నిజంగా విఘ్నేష్ శివన్‌కి ఈ మాట పెద్ద బహుమతి కింద లెక్క. ప్రతి అవార్డు వేడుకల్లోనూ అతను థ్యాంక్స్ చెబుతుంటారు. తొలిసారి నయనతార చెప్పారు. సో... విఘ్నేష్ చాలా సంతోషంలో తేలుతున్నారేమో!

యంగ్ కపుల్

హుషారుగా చే'సామ్'




సమంత, నాగచైతన్య

'చే' ఫర్ చైతన్య... అక్కినేని నాగచైతన్య! 'సామ్' అంటే సమంత... చైతూ శ్రీమతి! ఇప్పుడు వీరిద్దరూ ఎక్కడున్నారో తెలుసా? అమెరికాలో! ఇంకా క్లారిటీగా చెప్పాలంటే మియామి బీచ్ ఏరియాలో! 'మహానటి'లో తన పాత్ర చిత్రీకరణ పూర్తి చేసిన వెంటనే శ్రీవారితో కలిసి సమంత మియామి వెళ్లారు. ఇద్దరూ అక్కడ ఎంజాయ్ చేస్తున్నారు. అంతే కాదు.. మియామిలో జరుగుతోన్న 'అల్ట్రా మ్యూజిక్ ఫెస్టివల్ - 2018'లో మ్యూజిక్ వింటూ హుషారుగా ఎంజాయ్ చేశారు. సింపుల్‌గా చెప్పాలంటే.. ఎలక్ట్రికల్ మ్యూజిక్ ఫెస్టివల్ అది! చై, సామ్... ఇద్దరికీ మ్యూజిక్ అంటే చాలా ఇష్టం. ఇలాంటి మ్యూజిక్ ఫెస్టివల్స్‌కి వెళ్లడం అంటే ఇంకా ఇష్టం! రెండేళ్ల క్రితం... పెళ్లికి ముందు... మిలాన్, ఇటలీలో జరిగిన 'టుమారోల్యాండ్' ఫెస్టివల్‌కీ వెళ్లారు. అప్పుడు వీరితో రానా, రకుల్, నితిన్, నీరజా కోన తదితరులున్నారు. ఈ ఫెస్టివల్‌కి తెలుగు సినిమా ప్రముఖులు ఎవరెవరె వెళ్లారో మరి? కొత్తగా పెళ్లయ్యింది కనుక చేసామ్ స్పెషల్ ట్రిప్ వేసుంటారు!

హాట్ న్యూస్

పెళ్లికి వేళాయరా!


సోనమ్ కపూర్


ఆనంద్ అహూజాతో..

అవును... బీటౌన్ ఫ్యాషన్ ఐకాన్, హిందీ నటుడు అనిల్ కపూర్ అందాల కూతురు సోనమ్ కపూర్ పెళ్లి ఘడియల దగ్గర పడ్డాయి! అవునా... పెళ్లి కొడుకు ఎవరో? అందరూ ఊహించిన అబ్బాయే... ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త ఆనంద్ ఆహూజా! కొంత కాలంగా చెట్టాపట్టాలేసుకుని విహార యాత్రల పేరుతో ఎంచక్కా విదేశాలు చుట్టేస్తున్న వీరిద్దరూ వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. మే 11, 12 తేదీల్లో... రెండు రోజుల పాటు హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి జరుగుతుంది. ఓహో... పెళ్లి ఎక్కడో? జెనీవా... స్విట్జర్లాండ్‌లో ఉందీ నగరం! డెస్టినేషన్ వెడ్డింగ్ అన్నమాట. అంటే 'సన్నాఫ్ సత్యమూర్తి'లో ఆదా శర్మ పెళ్లి జరుగుతుంది కదా... అలాగ! సంగీత్, మెహందీ కార్యక్రమాలనూ జెనీవాలో ప్లాన్ చేశారట! ఆల్రెడీ అనిల్ కపూర్ పెళ్లి పిలుపులు ప్రారంభించారు. సన్నిహితులు, శ్రేయోభిలాషులకు ఫోనులు చేసి ముందుగా చెబుతున్నారట. కపూర్ కుటుంబానికి హిందీ చిత్ర పరిశ్రమలో చాలామంది సన్నిహితులున్నారు. అందుకని, ఫ్లైట్ బుకింగ్స్ ఇప్పట్నుంచి చేయడం స్టార్ట్ చేశారని సమాచారం. పెళ్లికి వచ్చే అతిథుల కోసమే ప్రత్యేకంగా ఫ్లైట్స్ ఏర్పాటు చేసే పనిలో పడ్డారు. సోనమ్, ఆనంద్ ప్రేమ గురించి బీటౌన్‌లో ఎప్పటి నుంచో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే... చాలా రోజులు మౌనంగా ఉన్న సోనమ్, తండ్రి అనిల్ కపూర్ 60వ పుట్టినరోజు సందర్భంగా ప్రేమ విషయాన్ని పబ్లిగ్గా చెప్పారు.

స్వగతం


డైసీ ఇరానీ

అందుకే ఇప్పుడు పంచుకుంటున్నా..!

"జీవితకాలంలో నేను ఎదుర్కొన్న కష్టనష్టాలన్నీ నా ముగ్గురు పిల్లలు, నా చెల్లెళ్లు.. అందరికీ తెలుసు. నిజం ఎవరినీ చంపేయదు. అప్పుడెప్పుడో నా ఆరేళ్ల ప్రాయంలో జరిగిన లైంగిక వేధింపుల గురించి ఇప్పుడు మాట్లాడటం సెన్సేషన్ అవుతున్నా నాకేం ఇబ్బంది లేదు. విపరీతంగా ఫోన్లు వస్తూనే ఉన్నాయి. అయినా నేను వాటికి సమాధానాలు చెప్పనంతే" అని అంటున్నారు డైసీ ఇరానీ. బాలనటిగా దాదాపు 50 చిత్రాలకు పైగా నటించారామె. నాలుగేళ్ల ప్రాయంలో కెమెరా ముందు నిలుచున్న ఆమెకు రెండు వసంతాలు తిరక్కుండానే చేదు ఘటన ఎదురైంది. సంరక్షకుడు నాజర్ ఆమెకు ఆరేళ్లున్నప్పుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బయటికి పొక్కనిస్తే చంపేస్తానని బెల్టుతో కొట్టి మరీ బెదిరించాడు. అఘాయిత్యాలు అక్కడితో ఆగలేదు. 15 ఏళ్ల ప్రాయంలో కన్నతల్లి ఆమెను అందంగా ముస్తాబు చేసి ఓ నిర్మాత దగ్గరకు పంపింది. ఆ ఘటన డైసీను మొండి ఘటంలా మార్చేసింది. మానసికంగానూ కుంగదీసింది. పురుషుల పట్ల ఏహ్యభావాన్ని పెంచుకునేలా చేసింది. అప్పుడెప్పుడో జరిగిన ఆ చేదు అనుభవాలను ఆమె ఇప్పుడు ఎందుకు పంచుకుంటున్నట్టు...? టీవీ, సినిమా, ప్రకటన రంగాల్లో ఎందరో బాలబాలికలున్నారు. పరులను నమ్మి వారి తల్లిదండ్రులు నిర్లక్ష్యంగా ఉండకూడదు. కన్నబిడ్డలను తల్లిదండ్రులు కంటిపాపల్లా కాపాడుకోవాలన్నదే ఆమె ఉద్దేశం.


ఆరేళ్ల వయసులో డైసీ

అలాంటి సదుద్దేశంతో ఆమె చాలా విషయాలను పంచుకున్నారు. "బాల నటుల జీవితం నల్లేరుమీద నడక కాదు. చాలా వరకు చిన్నారులు పలు రకాల కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఎవరో కొందరిది తప్ప మిగిలిన వాళ్లందరిదీ ఇదే పరిస్థితే. ఆ విషయాన్ని నేను నా బాల్యంలోనే గ్రహించాను. అందుకే నా చెల్లెళ్లు హనీ, మేనకను కంటికి రెప్పలా కాపాడుకున్నాను. మా ముగ్గురికీ మా నాన్నంటే చాలా ఇష్టం. ప్రత్యేకమైన గౌరవం. ఆయన కూడా మమ్మల్ని చాలా బాగా చూసుకునేవారు. కాకపోతే హోటల్ బిజినెస్‌లో బిజీగా ఉండేవారు. మా అమ్మన్నా ఇష్టమే. కానీ ఆమెను నేను అసహ్యించుకున్న సందర్భాలూ ఉన్నాయి. మా హనీ 18 ఏళ్ల ప్రాయంలో స్క్రిప్ట్ రైటర్ జావేద్ అక్తర్‌ని వివాహం చేసుకుంది. ఫరా, జోయా ఆమె పిల్లలు. రెండో చెల్లెలు మేనక 19 ఏళ్ల ప్రాయంలో కమ్రాన్ ఖాన్‌ని వివాహం చేసుకుంది. ఫరా, షాజిద్ ఆమె పిల్లలు.

నా టీనేజ్‌లో ఉన్నప్పుడు ఓ నటుడిని, మరో దర్శకనిర్మాతను ప్రేమించా. ఆ నటుడు ఇంకో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. నిర్మాతకి అప్పటికే పిల్లలున్నారు. ఆ పిల్లలు నాకు చాలా సన్నిహితులు. చివరికి స్క్రిప్ట్ రైటర్, డైరక్టర్ కె.కె.శుక్లాను పెళ్లాడా. అప్పుడు నా వయసు 21. తను నాకు ప్రపోజ్ చేయకముందు నాకూ, నా బోయ్‌ఫ్రెండ్స్ మధ్య మధ్యవర్తిగా వ్యవహరించేవాడు. తర్వాత వాటి గురించి ప్రస్తావించి ఇబ్బందిపెట్టాలనుకున్నాడు. తన వివాహేతర సంబంధాల గురించి నాకు తెలుసని చెప్పినప్పుడు కంగుతిన్నాడు. ఆ సమయంలో ముఖం ఎక్కడ పెట్టుకోవాలో అతనికి అర్థం కాలేదు. అప్పుడే మా బంధం ఆగిపోయింది. ప్రస్తుతం నేను క్రైస్తవ మతాన్ని నమ్ముతున్నారు. న్యూ లైఫ్ ఫెలోషిప్ అసోసియేషన్‌లో చేరాను. ఆ మధ్య షారుఖ్‌ఖాన్ నటించిన 'హ్యాపీ న్యూ ఇయర్'లో నటించాను. అశోక్ కుమార్, రాజ్‌కపూర్, దిలీప్ కుమార్, దేవ్ ఆనంద్, వైజయంతీ మాలా, మీనాకుమారితో కలిసి నటించిన రోజులను అంత తేలిగ్గా మర్చిపోలేను. మీనా కుమారి నాకు చాలా ప్రత్యేకం. నన్ను తల్లిలాగా ఆదరించేది" అంటూ చెప్పుకొచ్చారు డైసీ. ఆమె కెరీర్‌లో 'నయా దౌర్', 'జగ్తే రహో', 'బూట్ పాలిష్', 'ధూల్ కా ఫూల్' తదితర చిత్రాలు అత్యంత కీలకమైనవి.

తెలుసా?

జయచిత్ర అసలు పేరేంటి?



జయత్రయం... జయప్రద, జయసుధ, జయచిత్ర.. 1980ల దశకంలో ప్రేక్షకుల్ని తమ అభినయంతో, అందచందాలతో ఆకట్టుకొన్నారు. వీళ్లలో జయచిత్ర ఆరేళ్ల వయసులోనే 'భక్త పోతన' చిత్రంతో బాలనటిగా పరిచయమయ్యారు. 'బేబి రోహిణి' ఆమె స్క్రీన్ నేమ్. వాళ్ల అమ్మ అమ్మాజీ (జయశ్రీ) కూడా కథానాయికే. ఎన్టీఆర్ సరసన 'దైవబలం' చిత్రంలో ఆమె నటించారు. అదే ఎన్టీఆర్ సరసన జయచిత్ర 'మా దైవం', 'బొబ్బిలి పులి' చిత్రాల్లో నటించడం గమనార్హం. ఎన్టీఆర్, ఏయన్నార్, కృష్ణ, శోభన్‌బాబు.. ఇలా అగ్రకథానాయకులందరి సరసన నటించి గుర్తింపు తెచ్చుకొన్న జయచిత్ర అసలు పేరు ఏమిటో తెలుసా?.. లక్ష్మీకృష్ణవేణి రోహిణి పార్వతీదేవి. శుక్రవారం కృష్ణజయంతి రోజున రోహిణి నక్షత్రంలో ఆమె జన్మించారు. శుక్రవారం శుభప్రదం కావడంతో ఆమె పేరులో మొదట 'లక్ష్మి' అనే పదం చేరింది. ఇక నక్షత్రం రోహిణి కావడంతో ఆ పదం కూడా పేరులోకి వచ్చింది. కృష్ణజయంతి రోజున పుట్టడంతో 'కృష్ణవేణి' పదమూ చేరింది. అమ్మాజీ కర్పగాంబాళ్ భక్తురాలు. అందుకే పేరులో 'పార్వతీదేవి' అని కూడా కలిపారు. అంత పెద్ద పేరు పలకడం కష్టం కనుక స్కూల్లో 'రోహిణి' అని పిలిచేవారు. రోహిణి అనే ఆమె పేరుని 'జయచిత్ర'గా మార్చింది తమిళ దర్శకుడు కె.ఎస్.గోపాలకృష్ణన్. 'రోహిణి అనే పేరు బాగా లేదమ్మా.. మార్చాలి' అన్నారట ఆయన ఓ రోజు. రోహిణి ఇంటికి వెళ్లిన కాసేపటికి గోపాలకృష్ణన్ ఫోన్ చేసి 'జయచిత్ర అనే పేరు చక్కగా ఉంటుందమ్మా.. జయ అంటేనే విజయం. అది పేరు ముందు ఉండటం శుభప్రదం. కొత్తదనంగా ఉంటుంది కదా' అన్నారు. అమ్మాజీ ఆ పేరు బాగుందనడంతో ఆ రోజు నుంచి రోహిణి 'జయచిత్ర'గా మారిపోయింది.

మహానుభావుడవేరా....

వైరల్

షూలో సెక్సీ ఫిగర్‌ని చూశావా?


లావణ్యా త్రిపాఠికి ఇన్‌స్టాగ్రామ్‌లో శనివారం ఓ శృంగార పురుషుడు తగిలాడు. అతగాడి అసలు పేరేంటో తెలీదు గానీ... ఇన్‌స్టాలో 'మిస్టర్ కూల్ క్రిష్ 99' అని పెట్టుకున్నాడు. సదరు క్రిష్ చేసిన కామెంట్ చదివిన తర్వాత లావణ్య మాత్రం కూల్‌గా ఉండలేకపోయారు. అందిరికీ తెలిసేలా కామెడీగా అతడి బాగోతాన్ని బయటపెట్టారు. అసలు వివరాల్లోకి వెళితే... శనివారం డెహ్రాడూన్ నుంచి ముంబయ్ వెళ్ళిన సమయంలో తాను వెసుకున్న కొత్త షూలు కనిపించేలా లావణ్యా త్రిపాఠి ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీ పోస్ట్ చేశారు. ఆ పోస్ట్‌కి 'సెక్సీ ఫిగర్' అని క్రిష్ రిప్లై ఇచ్చాడు. షూలో అతడికి ఫిగర్ ఎలా కనిపించిందో లావణ్యకు అర్థం కాలేదు. కాసేపటికి తేరుకుని "మహానుభావుడే... షూస్ లోంచి ఫిగర్ చూడగల గొప్పోడు! అతడికి నా శరీర కొలతలు తెలియాలంటే... నేను అతడి మీదకు నా షూస్ విసిరేస్తే చాలనుకుంట!" అని వ్యంగ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో వ్యాఖ్యానించారామె. అదదండీ సంగతి!


కామెంట్ చేసిన ఫొటో ఇదే!


లావణ్యా త్రిపాఠి







టీవీ దృశ్యం

కామెడీ కాదు సీరియస్ ఫైటింగ్!

ఇద్దరు కమెడియన్లు ఆన్‌స్క్రీన్‌లో గొడవపడితే పొట్ట చెక్కలే. అదే ఆఫ్‌స్క్రీన్‌లో తన్నుకుంటే అది కాస్త నవ్వులపాలవుతుంది. ప్రస్తుతం హిందీ బుల్లితెర స్టార్ కమెడియన్లు సునీల్‌గ్రోవర్- కపిల్‌శర్మల మధ్య గొడవ కూడా ఇలాంటిదే. వీధికెక్కారు. సోషల్‌మీడియాలో రచ్చరచ్చ చేశారు. కాంట్రవర్సీకి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయారు. గతేడాది 'కామెడీ నైట్స్ విత్ కపిల్' అనే షో సమయంలో వీరిద్దరి మధ్య జరిగిన గొడవ కపిల్ టీవీ కెరీర్ బ్రేక్ పడేలా చేసింది. 'ఫ్యామిలీ టైమ్ విత్ కపిల్‌శర్మ' అనే షో ద్వారా మరోసారి రీ ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలియగానే ఫ్యాన్స్ అందరూ ఉత్సాహపడ్డారు. సునీల్- కపిల్ శర్మల కాంబినేషన్‌ను ఊహించారు. మనస్పర్థలను పక్కనబెట్టి కలిసి ఇందులో ఈ ఇద్దరూ కలిసి మళ్లీ నవ్వులు పూయిస్తారని భావించారు. కానీ అనుకున్నది ఒకటి... అయినది ఒకటి....అన్న చందంగా పరిస్థితి రివర్స్ అయిపోయింది.

ట్విట్టర్‌లో వార్!

కపిల్ శర్మ తన కొత్త షో కోసం సునీల్ గ్రోవర్‌ను ఎంచుకోకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై నెటిజన్లు ప్రశ్నించడంతో క్లారిటీ ఇచ్చాడు సునీల్. అసలు తనను ఈ షో కోసం కపిల్ సంప్రతించనేలేదనీ ఓ అభిమానికి ట్విట్టర్‌లో బదులిచ్చాడు. దాంతో కపిల్ ఎంట్రీ ఇవ్వడంతో ట్విట్టర్‌లో వీరిద్దరి మధ్య వార్ షురూ అయింది." అతను ఓ అబద్ధాల కోరు. సునీల్ గ్రోవర్‌కు చాలా సార్లు ఫోన్ చేశాను. మాట్లాడాలని ప్రయత్నించాను. నేనే స్వయంగా తన ఇంటికి కూడా వెళ్లాను. కానీ అతను మాత్రం స్పందించలేదు. బిజీగా ఉన్నానంటూ తప్పించుకున్నాడు" అని ఫైర్ అయ్యాడు కపిల్. దీనికి స్పందించిన సునీల్- " మన మధ్య అప్పట్లో జరిగిన గొడవ తర్వాత నీతో నేరుగా మాట్లాడింది లేదు. ఈ షో (ఫ్యామిలీ టైమ్ విత్ కపిల్) గురించి అస్సలు కలవనేలేదు" అంటూ స్పష్టం చేశాడు సునీల్. అయితే తానో ఎమోషనల్ ఫూల్‌నంటూ కపిల్ మళ్లీ ట్వీట్ చేయడం... ఈ పరిణామాలన్నీ ఫ్యాన్స్ ఆశల మీద నీళ్లు చల్లేశాయి. ఈ షోలో వీరి కాంబినేషన్ ప్రస్తుతానికి లేనట్టే అన్న విషయం రూఢీ అయిపోయింది. ఇదిలా ఉంచితే, సోనీ ఛానెల్‌లో ఆదివారం తొలి ఎపిసోడ్ ప్రసారం కానుంది.


కపిల్‌శర్మ

గీతా నృత్యాలు ప్రత్యేకం!

డాన్స్ రియాల్టీ షోలకు టీవీల్లో భలే గిరాకీ ఉంటోంది. జాతీయ, ప్రాంతీయ చానళ్లలో ఇప్పటిదాకా వచ్చిన అన్ని డాన్స్ షోలకు రేటింగ్స్ బాగుంటున్నాయి. సోనీ టీవీలో చాలాకాలంగా ప్రసారమవుతున్న 'సూపర్ డాన్సర్' సూపర్‌హిట్ అన్నసంగతి తెలిసిందే. ఈ డాన్స్ షోకు నటి శిల్పాశెట్టి, దర్శకుడు అనురాగ్ బసు, డాన్స్ మాస్టర్ గీతాకపూర్‌లు జడ్జీలుగా వ్యవహరించారు. ఎట్టకేలకు ఈ డాన్స్ ఘట్టం అట్టహాసంగా శనివారం (24)తో ముగిసింది. సూపర్ డాన్సర్ 2 గ్రాండ్ ఫినాలేలో పాల్గొన్న అతిథుల విషయం వదిలేస్తే ఈ ఎపిసోడ్‌లో గీతాకపూర్ డాన్సులు హైలెట్‌గా నిలిచాయనడంలో సందేహం లేదు. మీనాకుమారి, సాధన, బబిత వంటి బాలీవుడ్ హీరోయిన్లకు బెంచ్‌మార్క్‌గా ఉన్న పాటలను ఎంచుకుని, వారిని అనుకరిస్తూ ఏడెనిమిది నిమిషాల పాటు (ఒక్కో హీరోయిన్‌కు ఒక్కో నిమిషం నిడివి) చేసిన నృత్యాలు ఆహుతులను అమితంగా ఆకట్టుకున్నాయి. 'ఈ డాన్సులు ఆయా హీరోయిన్లకు ఇస్తున్న ఘన నివాళి'గా గీతాకపూర్ పేర్కొన్నారు. ఈ సీజన్ కూడా హిట్ కావడంతో సీజన్ 3 కి అప్పుడే నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారట.


గీతాకపూర్

డైలీ సుడోకు - 140

					1	5		3
			5			1		
		5	3				2	8
			1		6			4
4		8				6		9
7			4		9			
8	5				2	7		
		7			5			
2		3	9					

ఎలా పూరించాలి?


ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

నిన్నటి సుడోకు- 139 సమాధానం

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]



అంజలి.. డోంట్ కేర్!

రేపోమాపో పెళ్లి చేసుకుని ఇల్లాలు కాబోతోంది అంజలి అని ఒకవైపు పుకార్లు షికారు చేస్తున్నాయి. మరోవైపు అంజలి మాత్రం వీటితో ఏమాత్రం ప్రమేయం లేనట్టు వరుసగా సినిమాలకు సంతకం చేసేస్తోంది. తమిళ్ నేర్చుకుని అక్కడే వరుస చిత్రాలు చేసి క్రేజ్ తెచ్చుకున్న తెలుగమ్మాయి అంజలి. ఆ మధ్య 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' తర్వాత తెలుగులోనూ బిజీ అయింది. 'బెలూన్'తో మరలా కోలీవుడ్‌కి వెళ్లి అక్కడ వరుస చిత్రాల్లో నటిస్తోంది. ప్రస్తుతం శశికుమార్‌కు జోడీగా 'నాడోడిగల్ 2'లో ఆడిపాడుతోంది. ఈ చిత్రం తర్వాత విజయ్‌సేతుపతి చిత్రంలో నటించడానికి అంగీకరించినట్టు సమాచారం. విజయ్ సేతుపతితో ఆమె ఇంతకు ముందే 'ఇరైవి'లో నటించింది. అందుకు పూర్తిగా డిఫరెంట్‌గా ఉండే పాత్రను ఇందులో చేస్తున్నారట. విజయ్‌సేతుపతి హీరోగా 'పన్నయారుం పద్మినియుం', 'సేతుపతి' చిత్రాలను తెరకెక్కించిన అరుణ్‌కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు.

లవ్లీ... పప్పీ!

చిన్నారి... ఆమె చేతిలో చిన్న పప్పీ... ఈ ఫొటో భలే ముద్దుగా, లవ్లీగా ఉంది కదూ! ఇంతకీ, అందులో ఉన్న చిన్నారి ఎవరో తెలుసా? మహేశ్‌బాబు మేనకోడలు. అదేనండీ... నటి, నిర్మాత, దర్శకురాలు మంజుల ఘట్టమనేని కూమార్తె జాన్వీ స్వరూప్. ఈ ఫొటోకి కూడా ఓ ప్రత్యేకత ఉంది. అదేంటంటే... శనివారం నేషనల్ పప్పీ డే. ఈ సందర్భంగా పురస్కరించుకుని మంజుల ఈ ఫొటోని సోషల్ మీడియాలో షేర్ చేశారు.


జాన్వీ స్వరూప్

కేన్స్‌లో ఇక నో సెల్ఫీ!



కన్నులపండువగా జరిగే కేన్స్ ఉత్సవాల్లో ఇకపై సెల్ఫీలు తీసుకునేవారు కనిపించరు. ఈ విషయాన్ని కేన్స్ చిత్రోత్సవాల నిర్వాహకుడు థెర్రీ ఫ్రెమాక్స్ ప్రకటించారు. కేన్స్ చిత్రోత్సవాల్లో ప్రేక్షకులు సెల్ఫీలు దిగేందుకు అనుమతించబోమని, రెడ్ కార్పెట్‌పై వీటిని నిషేధిస్తున్నామని ఆయన ప్రకటించారు. ఓ ఫ్రెంచ్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ "సెల్ఫీలు తీసుకునేవారి ఆనందాన్ని పాడుచేయాలన్నది మా ఉద్దేశం కాదు. కాకపోతే సెల్ఫీల కారణంగా రద్దీ ఏర్పడుతోంది. సందర్శకులు ఒక క్రమంలో కాకుండా, అడ్డదిడ్డంగా ఆగిపోతున్నారు. దీనివల్ల మిగిలిన వారు అసౌకర్యంగా ఫీలవుతున్నారు. మెట్ల దగ్గర ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంటోంది. అందుకే ఇలాంటి నిర్ణయం తీసుకున్నాం" అని చెప్పారు. ఇది కేవలం ప్రేక్షకులకేనా, తారలకు కూడా వర్తిస్తుందా? అనేది తెలియాల్సి ఉంది.





శివాని, అడివి శేష్, రాజమౌళి

హీరోయిన్‌గా రాజశేఖర్ కుమార్తె

తొలి సినిమాకు శ్రీకారం

సినీ తారల కుమార్తెలు కథానాయికలుగా వెండితెరపై మెరవడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. తెలుగు పరిశ్రమలో అది ఇంకాస్త ఎక్కువనే చెప్పాలి. ఈ మధ్యకాలంలో ఒకరిద్దరు కథానాయికలు సిల్వర్ స్ర్కీన్‌పై మెరిశారు. ఇప్పుడు జీవితా రాజశేఖర్ గారాలపట్టి శివానీ కథానాయికగా తళుక్కుమనబోతోంది. ఆమె కథానాయికగా నటించే చిత్రం శనివారం అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైంది. అడివి శేష్ కథానాయకుడు. చేతన్‌భగత్ రచించిన నవల ఆధారంగా హిందీలో '2 స్టేట్స్' సినిమా తీసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమాను తెలుగులో రీమేక్ చేస్తున్నారు. లక్ష్య ప్రొడక్షన్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై ఎం.ఎల్.వి.సత్యనారాయణ నిర్మిస్తున్నారు. వెంకట్ కుంచం దర్శకుడు. ముహూర్తపు సన్నివేశానికి రాజమౌళి క్లాప్ ఇచ్చారు. కృష్ణంరాజు కెమెరా స్విచ్ఛాన్ చేయగా కె.రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు.



నాన్న...ప్రేమతో!

నిర్మాత మాట్లాడుతూ "రొమాంటిక్ లవ్‌స్టోరీ ఇది. మూడు షెడ్యూల్స్‌లో షూటింగ్ పూర్తి చేస్తాం. మొదటి షెడ్యూల్‌ను ఏప్రిల్ 5 నుండి 19 వరకు హైదరాబాద్‌లో చేస్తాం. రెండవ షెడ్యూల్ కోల్‌కతాలో చేసి, మూడో షెడ్యూల్‌ను అమెరికాలో ప్లాన్ చేస్తున్నాం" అన్నారు. " కథతో పూర్తిగా జర్నీ చేశా. ఎప్పటి నుంచో ఇలాంటి కథలో నటించాలనుకుంటున్నా. ఈ సినిమాతో ఆ కోరిక తీరబోతుంది. శివానీతో నటించడం హ్యాపీగా ఉంది" అడివి శేష్ అని అన్నారు. "ఓ కథని అడాప్ట్ చేసుకుని సినిమా చేయడం అంత సులువు కాదు. '2 స్టేట్స్' స్ర్కిప్ట్‌పై చాలా వర్క్ చేశా. అనూప్ ఇప్పటికే మూడు అద్భుతమైన ట్యూన్స్ ఇచ్చారు. మంచి సినిమాగా తీర్చిదిద్దేందుకు అందరం కష్టపడతాం" అని దర్శకుడు తెలిపారు. "సవాల్ ఉన్న పాత్రను నేను పోషించగలనని నమ్మి దర్శకుడు నాకీ అవకాశం ఇచ్చారు. అనూప్ సంగీతం అంటే నాకు చాలా ఇష్టం. నా మొదటి సినిమాకు ఆయన సంగీత దర్శకుడు కావడం ఆనందంగా ఉంది" శివానీ చెప్పారు.

'దిల్'తో 'మెహబూబా'



ఆకాశ్

పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఆయన కుమారుడు ఆకాశ్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'మెహబూబా'. పూరీ కనెక్ట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నేహాశెట్టి కథానాయిక. మే 11న సినిమాను విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య జరిగే యుద్ధం నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతున్నట్లు ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ చూస్తే తెలుస్తోంది. ఇందులో ఆకాశ్ సైనికుడిగా కనిపించారు. పూరీ కనెక్ట్స్ బ్యానర్‌కు ప్రత్యేకమైన ఈ సినిమా.. విడుదలకు దిల్ రాజు భాగస్వామి కావడం, ఆయనతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందని పూరీ కనెక్ట్స్ కో-ఫౌండర్ ఛార్మికౌర్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. పూరి జగన్నాథ్- దిల్‌రాజు కలయికలో గతంలో విడుదలైన 'ఇడియట్', 'పోకిరి' చిత్రాలు బ్లాక్‌బస్టర్స్ అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్లో వస్తోన్న 'మెహబూబా'పై కూడా అంచనాలు పెరుగుతున్నాయని చార్మి అన్నారు.

పెళ్లిలో సస్పెన్స్...



సౌమ్య

నందు, సౌమ్య వేణుగోపాల్, పూజా రామచంద్రన్ కీలక పాత్రధారులుగా వరప్రసాద్ వరికూటి దర్శకత్వం వహించిన చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో'. ఎస్. శ్రీకాంత్‌రెడ్డి, రామ్మోహనరావు ఇప్పిలి నిర్మాతలు. చిత్రీకరణ, నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. వచ్చే నెల 6న సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శనివారం ఫిల్మ్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ "ఓ పెళ్లి నేపథ్యంలో సాగే సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. ఆద్యంతం ఉత్కంఠగా ఉంటుంది. కథ, స్ర్కీన్‌ప్లే, పాటలు సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి" అని తెలిపారు. వచ్చే నెల 6న సినిమాను విడుదల చేస్తున్నామని నిర్మాత చెప్పారు.

ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాలే చేస్తా

- ఉపేంద్ర మాధవ్



"కమర్షియల్ సినిమాలు తియ్యడం అంత ఈజీ కాదని తెలుసు. కమర్షియల్ సినిమాతోనే దర్శకుడిగా పరిచయం కావాలనుకున్నా. అందుకే 'ఎం.ఎల్.ఎ' కథని అన్ని హంగులతో తీర్చిదిద్ది కమర్షియల్ సినిమాగా మలిచా" అని దర్శకుడు ఉపేంద్ర మాధవ్ అన్నారు. కల్యాణ్‌రామ్, కాజల్ జంటగా ఆయన దర్శకత్వం వహించిన 'ఎం.ఎల్.ఎ' చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ "దర్శకుణ్ణి కావాలని పరిశ్రమలో అడుగుపెట్టా. ప్రియదర్శిని రామ్ దగ్గర రెండు చిత్రాలకు పనిచేశా. కొన్ని యాడ్స్ కూడా తీశా. తర్వాత శ్రీను వైట్ల దగ్గర, 'దూకుడు', 'ఆగడు', 'బ్రూస్‌లీ' చిత్రాలకు రైటర్‌గా పనిచేశా. 'పటాస్' టైమ్‌లో అనిల్ రావిపూడి వల్ల కల్యాణ్‌రామ్ పరిచయమయ్యారు. మంచి కథ ఉంటే సినిమా చేద్దామన్నారు. రెండేళ్ల తర్వాత కథ చెప్తే చేద్దామన్నారు. అదే 'ఎంఎల్ఏ' సినిమా. శ్రీనువైట్ల కూడా కథ విని మెచ్చుకున్నారు. ఇప్పుడు ప్రేక్షకులూ సినిమా బావుందని ప్రశంసిస్తున్నారు. సినిమాలో మలుపులు, డైలాగ్‌లు ఆకట్టుకుంటున్నాయి. పర్సనల్‌గా నాకు ఎంటర్‌టైన్‌మెంట్ కథలంటే ఇష్టం. తర్వాతి చిత్రాలు ఆ జోనర్‌లోనే ఉంటాయి" అని అన్నారు.

